www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ప్లాస్టిక్‌ను తాగేస్తున్నాం!

లీటరు బాటిల్ నీళ్లలో 2.4 లక్షల ప్లాస్టిక్ రేణువులు

తాగునీటిలో నానోప్లాస్టిక్స్‌పై తొలిసారిగా పరిశోధన

నీళ్ల ద్వారా సులువుగా రక్తంలోకి, అవయవాల్లోకి..

బాటిల్ నీళ్ల కన్నా నల్లా నీళ్లే నయం

2



బుధవారం | 10-1-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 266 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: చతుర్దశి రా. 8.12 తదుపరి అమావాస్య; నక్షత్రం: మూల రా. 7.41 తదుపరి పూర్వాషాఢ; వర్జ్యం: రా. 6.11-7.41, తె. 4.28-5.56; దుర్ముహూర్తం: మ. 12.01-12.45; అమృతఘడియలు: మ. 1.41-3.11; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.52; సూర్యాస్తమయం: 5.54 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



కలెక్టర్లు, ఎస్పీలతో సమావేశమైన కేంద్ర ఎన్నికల సంఘం బృందం

మాకంతా తెలుసు..

తట్టుకోలేమంటే ఇప్పుడే తప్పుకోండి

అలర్ట్‌గా ఉండాల్సిందే.. మరోసారి చెప్పం

ఏపీ గురించి తెలుసుకునే ఇక్కడకు వచ్చాం

ఇప్పుడు కాబట్టి మాటలతో సరిపెడుతున్నాం

షెడ్యూల్ వచ్చాక సీరియస్ యాక్షన్

కలెక్టర్లు, ఎస్పీలపై ఎన్నికల కమిషన్ ఆగ్రహం

బెజవాడ, తిరుపతి పోలీస్ బాస్‌లపై ఫైర్

పార్టీ యాటిట్యూడ్ ఉంటే వైదొలగాలని వార్నింగ్

తిరుపతి, చంద్రగిరిపై ఇన్ని ఫిర్యాదులా అని అసహనం

"ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలంటే అధికారులు అత్యంత సీరియస్‌గా ఉంటారు. ఏపీలో ఎన్‌ఫోర్స్‌మెంట్ పూర్తిగా ఎత్తిపోయింది. సరిగ్గా లేదు. మేం ఈ రాష్ట్రం గురించి అన్నీ తెలుసుకున్నాం. అందరి గురించీ మాకు తెలుసు. ఎన్నికలకు ముందు సమావేశం కాబట్టి మాటలతో చెబుతున్నాం. షెడ్యూల్ వచ్చాక మరింత సీరియస్ యాక్షన్ ఉంటుంది. మరోసారి చెప్పం. కలెక్టర్లు, ఎస్పీలు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలి"

- కేంద్ర ఎన్నికల కమిషన్

11

ఇన్ని అక్రమాలు ఏ రాష్ట్రంలోనైనా చూశారా?



ఎన్నికల కమిషన్‌ను ప్రశ్నించిన బాబు, పవన్

ఒక్క నియోజకవర్గంలోనే 33 వేల ఓటర్ల చేర్పు

టీచర్లను పక్కనపెట్టి మహిళా పోలీసులకా?

70 వేల మంది కార్యకర్తలపై తప్పుడు కేసులు

ధనుంజయ్‌రెడ్డి కనుసన్నల్లో రాష్ట్ర కమిషన్

ఎన్నికల అధికారి కుటుంబ రక్షణకు కేంద్ర సాయం

బాబు, పవన్ ఫిర్యాదు.. శ్రద్ధగా విన్న సీఈసీ టీమ్

ప్రజలకు నమ్మకం కలిగేలా ఎన్నికల నిర్వహణకు హామీ

జగన్ వ్యూహం బూమ'రాంగే'!

ఎన్నికలకు సచివాలయ ఉద్యోగులు అర్హులేనా?

టీచర్ల స్థానంలో వీరికి బాధ్యతలిచ్చే యోచన

మూడేళ్లు సర్వీసు ఉంటే బదిలీకి ఈసీ ఆదేశం

నాలుగేళ్లుగా చేస్తున్న మొత్తం సిబ్బంది బదిలీ ఎలా?

రాతి యుగం కావాలా.. స్వర్ణయుగమా?



ఆళ్లగడ్డ సభలో ప్రజలకు చంద్రబాబు అభివాదం

ప్రజలే తేల్చుకోవాలి: చంద్రబాబు

జగన్‌ది భస్మాసుర హస్తం

ఆస్తి అడిగిందని చెల్లిని తరిమేశాడు

అది చెప్పకుండా విపక్షాలు ఇంట్లో చిచ్చుపెట్టాయని దుష్ప్రచారం

మీ గొడవలకు ఇతరులపై పడి ఏడవడమా?

బాబాయిని చంపి నారాసుర రక్తచరిత్ర అంటూ నాపై అబద్ధపు రాతలు

వివేకా కేసులో అసలు నిందితులకు రక్ష

సీబీఐ అధికారులపై తప్పుడు కేసులు

వివేకా కుమార్తెపైనా కేసులు పెట్టించాడు

రేపో మాపో షర్మిల మీద కూడా

అన్ని వర్గాల ప్రజలనూ పీడిస్తున్నాడు

యువతను నిరుద్యోగులుగా మార్చేశాడు

ఆళ్లగడ్డ 'రా కదలిరా' సభలో బాబు ధ్వజం

జగన్‌ది భస్మాసుర మనస్తత్వం. అధికారం కట్టబెట్టిన జనం నెత్తిమీద చేయిపెట్టి నాశనం చేయాలని చూస్తున్నాడు.

అధికారంలోకి వస్తే ఏటా జాబ్ కేలెండర్, మెగా డీఎస్సీ ప్రకటిస్తానని, పరిశ్రమలు తీసుకొస్తానని జగన్ అబద్ధపు హామీలు ఇచ్చాడు.. అధికారంలోకి వచ్చాక ఒక్క హామీనైనా నెరవేర్చాడా?

- చంద్రబాబు

నంద్యాల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో రాష్ట్ర ప్రజలు తీవ్రంగా ఇబ్బందులపాలవుతున్నారని, రాక్షసులకు అధికారం ఇవ్వడం వల్లే రాష్ట్రానికి ఈ దుస్థితి దాపురించిందని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. జగన్ పాలన రాతియుగాన్ని గుర్తుకు తెస్తోందని ధ్వజమెత్తారు. వైసీపీ రాతియుగం పోయి స్వర్ణయుగం రావాలంటే టీడీపీ-జనసేన పాలన రావాలని.. రాష్ట్ర భవిష్యత్ బాగుండాలంటే ప్రజలంతా మూకుమ్మడిగా వైసీపీని తరిమేయాలని ప్రజలకు పిలుపిచ్చారు. 'రా.. కదలిరా!' పేరుతో నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో మంగళవారం మధ్యాహ్నం చంద్రబాబు భారీ బహిరంగ సభ

మిగతా 3వ పేజీలో...



భర్తతో పొసగక కొడుకు(4)తో కలిసి విడిగా ఉంటోందామె! కానీ.. వారానికోసారి కొడుకును చూసే హక్కును భర్తకు కోర్టు కల్పించడాన్ని తట్టుకోలేకపోయింది. తండ్రీకొడుకులను కలవనీయకూడదని భావించింది. అందుకు ఆమె ఎంచుకున్న మార్గం.. కన్నకొడుకును చంపేయడం!! కృత్రిమ మేధకు నైతిక విలువలు నేర్పేంత చదువు చదివి, ఒక స్టార్టప్‌కు సీఈవోగా ఉన్న ఓ మహాతల్లి చేసిన దారుణమిది! బిడ్డను కర్కశంగా చంపి, బ్యాగులో కుక్కి గోవా నుంచి బెంగళూరుకు బయల్దేరి.. దారిలోనే పోలీసులకు దొరికిపోయింది!!

2

తల్లే దెయ్యమైంది!

భర్తమీద కోపంతో నాలుగేళ్ల కొడుకు గొంతు కోసిన తల్లి

ఆపై చేయి కోసుకుని ఆత్మహత్య చేసుకునేందుకు యత్నం

గోవాలో ఘోరానికి పాల్పడ్డ బెంగళూరు స్టార్టప్ సీఈవో

బాలుడి మృతదేహాన్ని బ్యాగులో కుక్కి పారిపోయే యత్నం

హోటల్ గదిలో రక్తపు మరకలు చూసి సిబ్బంది అప్రమత్తం

పోలీసులు ఆమెకు ఫోన్ చేస్తే పొంతన లేని జవాబులు

కుమారుడు తన స్నేహితురాలి దగ్గర ఉన్నాడంటూ అబద్ధం

ఆమె ప్రయాణించే ట్యాక్సీ డ్రైవర్‌కు గోవా పోలీసుల ఫోన్

దగ్గర్లో ఏ పోలీస్‌స్టేషన్ ఉంటే అక్కడకు వెళ్లాలని ఆదేశం

వారి ఆదేశాల మేరకు చిత్రదుర్గ ఠాణాకు తీసుకెళ్లిన డ్రైవర్

లగేజ్‌ను తనిఖీ చేయగా బ్యాగులో కనపడ్డ మృతదేహం

ఆమె అరెస్టు.. గోవాకు తరలింపు.. 6 రోజుల పోలీస్ కస్టడీ

చివరిదాకా సాగదీత!

మలి జాబితా విడుదలకు వైసీపీలో జంకు.. పంచాయతీలపైనే దృష్టి

టికెట్లు రానివారు వేరే పార్టీలకు పోతారని భయం

ఎమ్మెల్యేలను పిలిచి బుజ్జగిస్తున్న జగన్

మచిలీపట్నం లోక్‌సభ బరిలో ఉండనని తెగేసి చెప్పిన పార్థసారథి

కలిసి పనిచేసుకోవాలని మల్లాది, వెలంపల్లికి ముఖ్యమంత్రి సూచన

ఎస్సీ ఎమ్మెల్యే పద్మావతిపై ఆగ్రహం

సోషల్ మీడియాలో ప్రతికూల వ్యాఖ్యలపై అభ్యంతరం

గొల్ల బాబూరావుకు రాజ్యసభ ఎర

చిత్తూరు ఎమ్మెల్యే శ్రీనివాసులుకూ

అసమ్మతి, తిరుగుబాట్లతో సతమతమవుతున్న సీఎం జగన్.. మూడో విడత అభ్యర్థుల జాబితా విడుదలకు సాహసించలేకపోతున్నారు. టికెట్లు రాని ఎమ్మెల్యేలు టీడీపీ, కాంగ్రెస్, జనసేనల్లోకి వెళ్తారేమోనన్న ఆందోళనే దీనికి కారణం. ఇన్నాళ్లూ చాలా మంది ఎమ్మెల్యేలను క్యాంపు ఆఫీసు ఛాయలకే రానివ్వలేదు. ఇప్పుడు ఫిరాయిస్తారేమోనన్న భయంతో కొందరిని తాడేపల్లి ప్యాలె్‌సకు పిలిపించి మరీ బుజ్జగించే ప్రయత్నం చేస్తున్నారు.



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఒకే దఫాలో ముందస్తుగా వైసీపీ అభ్యర్థులను ప్రకటించేసి.. ప్రచారపర్వంలో దూసుకెళ్లి.. ప్రతిపక్షాలకు అవకాశమే లేకుండా చేయాలనుకున్న సీఎం జగన్మోహన్‌రెడ్డి తాజా పరిణామాలతో డీలాపడ్డారు. టికెట్ దక్కని ఎమ్మెల్యేలు ధిక్కార స్వరం వినిపిస్తున్నారు. తిరుగుబాట్లకు సిద్ధమవుతున్నారు. కొందరు టీడీపీ, జనసేన, కాంగ్రెస్‌ల వైపు చూస్తున్నారు. ఈ వలసలను అడ్డుకోవడంపై జగన్ ఇప్పుడు దృష్టి సారించారు. జంపింగ్‌లను నివారించడానికి అభ్యర్థులపై కసరత్తును చివరిదాకా కొనసాగించాలని భావిస్తున్నట్లు తాజా పరిణామాలు సూచిస్తున్నాయి. ఇన్నాళ్లుగా తాడేపల్లి ప్యాలెస్ ఛాయలకే ఎమ్మెల్యేలను రానివ్వలేదు. అపాయింట్‌మెంట్ కోసం ఎదురుచూస్తున్నవారు ఎందరో. క్యాంపు కార్యాలయానికి వచ్చినా సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, సీఎంవో అధికారి ధనుంజయరెడ్డితో మాట్లాడి వెనుదిరగాల్సిందే. జగన్ దర్శనం దుర్లభమైపోయింది. 2-3 రోజుల వరకు

మిగతా 11వ పేజీలో...

పెద్దల సభకు యుద్ధం

ఏప్రిల్‌లో 3 రాజ్యసభ స్థానాలు ఖాళీ

మూడూ తమకే దక్కేలా వైసీపీ

ఒక్క సీటైనా దక్కించుకునేలా టీడీపీ

వ్యూహ ప్రతివ్యూహాల్లో ఉభయ పక్షాలు

11

రఘువీరాతో కాపు మంతనాలు

కాళ్లకు మొక్కి ఆశీర్వాదం తీసుకున్న రాయదుర్గం వైసీపీ ఎమ్మెల్యే

కాంగ్రెస్‌లో చేరే దిశగా అడుగులు



అరెస్టు చేసుకోండి

మంగళవారం నంద్యాల పోలీస్ స్టేషన్ ముందు భారీ సంఖ్యలో బైఠాయించిన అంగన్వాడీలు

అంగన్వాడీల జైల్‌భరో.. ఉద్రిక్తం

అండగా కార్మిక, ప్రజా సంఘాలు.. ఎస్మా ఎత్తేయాలంటూ నినాదాలు

రాష్ట్రవ్యాప్తంగా రోడ్డెక్కిన కార్యకర్తలు.. గంటల తరబడి రాస్తారోకోలు

ఎక్కడికక్కడ స్తంభించిన ట్రాఫిక్.. వేల మందిని అరెస్టు చేసిన పోలీసులు

పలుచోట్ల పోలీసులతో పెనుగులాట.. రాష్ట్రమంతటా ఉద్రిక్త పరిస్థితులు

భగ్గుమన్న బెజవాడ

ఆందోళనకు దిగిన ఉపాధ్యాయులు

ఎక్కడికక్కడ అడ్డుకుని అరెస్టు

చేతకాక.. కక్ష సాధింపు!

అంగన్వాడీల ఇళ్లకు నోటీసులు

వైసీపీ సానుభూతిపరులతో సమ్మె విచ్ఛిన్నానికి ప్రభుత్వ కుట్రలు?

12

వసూళ్లు మామూలుగా లేవుగా!

ఎమ్మెల్యే కాకముందు ఆయన పాతకారులో తిరిగేవారు. అలాంటిది గత నాలుగున్నరేళ్లలోనే రూ.100 కోట్ల వరకు సంపాదించినట్లు ఆయన అనుచరులే అంటున్నారు. రాయిరప్ప, కాలువ మట్టి, భూములు అన్నీ ఆయనకు 'ప్రసాదాలే'నని చెబుతున్నారు. అదెలాగంటే..


ఆయన నియోజకవర్గ పరిధిలోని దేవస్థానంలో కల్యాణాలు, వ్రతాలకు వ్రత పురోహితులను కమీషన్ ప్రాతిపదికపై నియమించారు. దేవస్థానానికి వచ్చే వ్రత టికెట్ ఆదాయంలో వీరికి కమీషన్ ఇస్తున్నారు. ఇలా దాదాపు 40 మందిని దేవస్థానం నియమించింది. ఒక్కొక్కరి నుంచి రూ.10 లక్షల వరకు వీరినుంచి ఎమ్మెల్యే వసూలు చేశారు. ప్రసాదం విభాగం, గార్డెన్, బస్సు కండెక్టర్లు, కేశఖండన, గోశాల తదితర విభాగాల్లో దేవస్థానం నియమించిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులనుంచి రూ.5 లక్షల చొప్పున ఆయన పిండేశారు.

రాష్ట్ర ఖజానా అప్పుల్లో కూరుకుపోవడంతో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో పోలవరం మట్టిని వేలం వేసి రూ.800 కోట్ల నిధులు ఖజానాకు సమకూర్చాలని అధికారంలోకి వచ్చిన కొత్తలో సీఎం జగన్ భావించారు. ఒక్క కాకినాడ జిల్లాలోని మట్టి ద్వారానే రూ.200 కోట్ల వరకు వస్తుందని అంచనా వేశారు. తీరా ఖజానాకు ఆదాయమేమోగానీ సదరు ఎమ్మెల్యే జేబుల్లోకి మాత్రం కోట్లలో డబ్బు చేరింది.

అవినీతి పర్వతం!

అమ్మో ఎమ్మెల్యే

రాయీ రప్ప, కాలువ మట్టి, భూములన్నీ ప్రసాదాలే



కాకినాడ జిల్లాలో ప్రతి పనికీ ఆ ఎమ్మెల్యే పిండుడే

నాలుగున్నరేళ్లలో 100 కోట్లపైగా అక్రమ సంపాదన

బంగారు గనిలా మారిన పోలవరం కాలువ మట్టి

పోర్టు, హార్బర్, నేవల్ బేస్‌కు వెళ్లే బండరాళ్లలో కమీషన్లు

క్వారీల నుంచి కమీషన్లు, లారీల నుంచి దండుడు

పేదల ఇళ్ల స్థలాల ముసుగులో 15 కోట్ల ఆర్జన

పేకాటరాయుళ్లకు డెన్‌లతో 2 చేతులా సంపాదన

పురోహితుల నుంచి పోస్ట్‌కు 10 లక్షల వసూలు

హైవే ముఠాలు, గుట్కారాయుళ్ల నుంచీ వసూలు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లాలో ఆ వైసీపీ ఎమ్మెల్యే అవినీతి.. పర్వతం అంత ఎత్తుకు ఎదిగింది. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన నియోజకవర్గాన్ని అవినీతిలో ఓ పట్టు పట్టారు. కనిపించిన కొండ దగ్గర నుంచి పోలవరం కాలువ మట్టి వరకు, హైవేపై దొంగ ఆయిల్, ఇనుము, తారు వ్యాపారం చేసే ముఠాల నుంచి గుట్కా వ్యాపారుల వరకు ఏదీ వదలకుండా జుర్రేశారు. పేదల ఇళ్ల స్థలాల పేరుతో

మిగతా 12వ పేజీలో...



ఇది ధర్మమేనా మంత్రివర్యా?

టైటిల్ చట్టంపై వివరణ పేరిట అసత్యాలు, అర్ధసత్యాలతో దాటవేత

చట్టం అమల్లో లేనప్పుడు శాశ్వత భూ హక్కు ఎలా కల్పిస్తున్నారు?

కొత్త పాస్‌పుస్తకాలు చిత్తు కాగితాలుగా మారినట్టేనా?

టైటిల్ చట్టం మహాద్భుతమే అయితే రాష్ట్రంలో న్యాయవాదుల పోరాటం దేనికి?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఏపీ భూ యజమాన్య హక్కు చట్టం(టైటిల్)-2023 అవసరం చాలా ఉందంటూనే వ్యవస్థలపై అనధికారికంగా మంత్రి ధర్మాన ప్రసాదరావు అభాండాలు మోపారు. చట్టం ఎంత ముఖ్యమైందో చెబుతూనే, దానిపై వస్తున్న అనేకానేక విమర్శలు, ఆందోళనలకు ఆయన సూటిగా బదులివ్వకుండా

మిగతా 2వ పేజీలో...

టైటిల్ చట్టాన్ని వెనక్కి తీసుకోం!

నీతి ఆయోగ్ ఇచ్చిన దాన్నే అనుసరించాం

రెవెన్యూ మంత్రి ధర్మాన వ్యాఖ్యలు

ప్లాస్టిక్‌ను తాగేస్తున్నాం!

లీటరు బాటిల్ నీళ్లలో 2.4 లక్షల ప్లాస్టిక్ రేణువులు



» కొత్త టెక్నాలజీతో గుర్తించిన శాస్త్రవేత్తలు

» బాటిల్ నీళ్ల కన్నా నల్లా నీళ్లే నయం

వాషింగ్టన్, జనవరి 9: ఒక లీటరు బాటిల్ నీళ్లలో సగటున 2,40,000 ప్లాస్టిక్ రేణువులు ఉంటున్నాయని శాస్త్రవేత్తలు ఓ తాజా పరిశోధనలో గుర్తించారు. ఇప్పటి వరకూ అంచనా వేసినదానికన్నా ఇది 100 రెట్లు ఎక్కువ. మనుష్యుల ఆరోగ్యంపై ఇది అత్యంత తీవ్ర ప్రభావం చూపించే అంశమని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. 'ప్రొసీడింగ్స్ ఆఫ్ ది నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్' జర్నల్‌లో ఈ పరిశోధన వివరాలు ప్రచురితమయ్యాయి. దీని ప్రకారం.. శాస్త్రవేత్తలు అమెరికాలోని మూడు ప్రముఖ కంపెనీలకు చెందిన 25 ఒక లీటరు నీళ్ల బాటిళ్లలో నానోప్లాస్టిక్స్ అవశేషాలపై అధ్యయనం జరిపారు. ఒక మైక్రోమీటరు కన్నా తక్కువ పొడవున్న (అంటే మనిషి వెంట్రుక మందంలో 70వ వంతు ఉన్న) ప్లాస్టిక్ కణాలను నానో ప్లాస్టిక్స్ అని అంటారు. అత్యంత సూక్ష్మంగా ఉండటం వల్ల ఇవి మనిషి కణాల్లోకి, రక్తంలోకి, ముఖ్యమైన అవయవాల్లోకి సులభంగా ప్రవేశించగలవు. గర్భంలో ఉన్న శిశువుల్లోకి కూడా ఇవి తల్లి ద్వారా వెళ్లే ప్రమాదం ఉంది. ప్లాస్టిక్ బాటిల్ నీళ్లలో నానోప్లాస్టిక్స్ ఉంటాయని శాస్త్రవేత్తలు చాలా కాలంగా అనుమానిస్తున్నా.. వాటిని గుర్తించే టెక్నాలజీ ఇప్పటి వరకూ అందుబాటులో లేదు. ఈ నేపథ్యంలో అమెరికాలోని కొలంబియా యూనివర్సిటీకి చెందిన నైక్సిన్ క్వియన్ సారథ్యంలో పరిశోధకుల బృందం.. డేటా ఆధారిత అల్గారిథమ్‌ను ఉపయోగించి ఒక కొత్త మైక్రోస్కోపీ టెక్నిక్‌ను అభివృద్ధిపరిచింది. దీనిద్వారా మూడు ప్రముఖ కంపెనీల (ఆ కంపెనీల పేర్లను శాస్త్రవేత్తలు వెల్లడించలేదు) నీళ్ల బాటిళ్లపై పరిశోధన చేయగా.. ఒక్కోదానిలో 1,10,000 నుంచి 3,70,000 సూక్ష్మ ప్లాస్టిక్ రేణువులు కనిపించాయి. వీటిలో 90 శాతం నానోప్లాస్టిక్‌లే.

ఏడు రకాల అవశేషాలపై పరిశోధన

నీళ్లలో ప్లాస్టిక్ కాలుష్యాన్ని నానో స్థాయిలో గుర్తించే విషయంలో ఇప్పటి వరకూ ఉన్న ఖాళీని తమ పరిశోధన భర్తీ చేసిందని నైక్సిన్ క్వియన్ తెలిపారు. పరిశోధనలో భాగంగా నైక్సిన్ బృందం.. పాలీ ఎథిలీన్ టెరెఫ్తలేట్ (పీఈటీ), పాలీ అమైడ్‌లతోపాటు మొత్తం ఏడు రకాల ప్లాస్టిక్ అవశేషాలపై దృష్టి పెట్టింది. పీఈటీతో ప్లాస్టిక్ బాటిళ్లను తయారు చేస్తారు.. కాగా నీళ్లను శుద్ధి చేసే ఫిల్టర్‌లో పాలీఅమైడ్ ఉంటుంది. అయితే, శాస్త్రవేత్తలు ఆ ఏడింటితోపాటు ఇంకా అనేక రకాల నానో ప్లాస్టిక్ రేణువుల్ని కూడా కనుగొన్నారు. 2022లో జరిగిన ఓ పరిశోధన ద్వారా.. నల్లా నీళ్లలో కన్నా బాటిల్ నీళ్లలో ప్లాస్టిక్ అవశేషాలు ఎక్కువ ఉన్నట్లు తేలింది. 2021లో జరిగిన ఓ పరిశోధన మరో ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించింది. బాటిల్ మూత తెరిచి మళ్లీ మూసిన ప్రతిసారీ ప్లాస్టిక్ రేణువులు నీళ్లలో పడతాయని తెలిపింది.

లోకం తీరు



జగన్ ఇక మాజీనే: కేఏ పాల్

» తాడేపల్లిలో సీఎంను కలిసేందుకు ప్రయత్నం

» పోలీసులు అనుమతించకపోవడంతో వెనక్కి

» జనసేన కార్యాలయానికీ వెళ్లిన కేఏ పాల్

అమరావతి (ఆంధ్రజ్యోతి), మంగళగిరి, జనవరి 9: ముఖ్యమంత్రి జగన్ ఎన్నికల తర్వాత మాజీ సీఎం అవుతారంటూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ వ్యాఖ్యానించారు. కేసీఆర్ పరిస్థితి త్వరలోనే జగన్‌కు రాబోతోందంటూ జోస్యం చెప్పారు. ముఖ్యమంత్రిని కలిసేందుకు తాడేపల్లికి వచ్చిన ఆయన్ను అపాయింట్మెంట్ లేకుండా అనుమతించబోమని సెక్యూరిటీ అడ్డుకున్నారు. గంటకుపైగా వేచి చూసినప్పటికీ స్పందన లేకపోవడంతో పాల్ వెనుదిరిగారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. 'ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా అడగ్గానే అపాయింట్మెంట్ ఇచ్చారు. రేవంత్ రెడ్డినీ కలిశాను. కానీ 80 సార్లు ప్రయత్నించినా ఇవ్వని కేసీఆర్ మాజీ అయ్యారు... నాకు అపాయింట్మెంట్ ఇవ్వని జగన్ కూడా అంతే...' అంటూ శపించారు. మరో రోజు విజయవాడలోనే ఉండి జగన్ అపాయింట్మెంట్ కోసం ఎదురు చూస్తానని, ఇస్తే కొన్ని ముఖ్య విషయాలు, రహస్యాలు ఆయనకు చెబుతానని అన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ 175 సీట్లు గెలుస్తుందో, లేదా 25 గెలుస్తుందో తనకు తెలియదని పాల్ అన్నారు.

నా ప్లాన్ వింటే పవన్ కల్యాణే సీఎం: తన వద్ద వున్న మాస్టర్ ప్లాన్ వింటే పవన్ కల్యాణ్ కచ్చితంగా సీఎం అవుతారని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ వ్యాఖ్యానించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను కలిసేందుకు మంగళవారం ఆయన గుంటూరు జిల్లా మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బందితో పాల్ మాట్లాడారు. 'పవన్ ఫ్యాన్స్ రోజూ నన్ను ఒత్తిడి చేస్తున్నారు. ఎలాగైనా పవన్ కల్యాణ్‌ను సీఎంని చేయాలని బతిమాలుతున్నారు. అందుకే ఆయనను కలిసేందుకు వచ్చాను' అన్నారు. అయితే పవన్ అందుబాటులో లేరని పాల్ వెనుదిరిగి వెళ్లిపోయారు.

లోకేశ్‌కు పంపిన నోటీసులు తిరిగొచ్చాయ్

» 'రెడ్‌బుక్' పిటిషన్‌పై సీఐడీ వెల్లడి

» కోర్టు ద్వారా పంపుతాం: న్యాయాధికారి

విజయవాడ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ యువనేత లోకేశ్ చేసిన రెడ్ బుక్ వ్యాఖ్యలకు సంబంధించి సీఐడీ దాఖ లు చేసిన పిటిషన్‌పై విజయవాడ ఏసీబీ కోర్టులో మంగళవారం విచారణ జరిగింది. ఈ పిటిషన్ కాపీలు తమకు అందలేదని లోకేశ్ తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. అయితే లోకేశ్‌కు నోటీసులు పంపామని.. ఆయన అందుబాటులో లేకపోవడంతో అవి తిరిగి వచ్చేశాయని సీఐడీ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. తర్వాత వాట్సాప్ ద్వారా నోటీసులు పంపామన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయాధికారి హిమబిందు... కోర్టు ద్వారా పంపుతామని చెప్పారు. తదుపరి విచారణను ఈనెల 23వ తేదీకి వాయిదా వేశారు.

టీడీపీ వెంట 60%పైగా ముస్లింలు: షరీఫ్

రాయదుర్గం, జనవరి 9: ఒక్క చాన్స్ పేరిట అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి వెంట ముస్లిం మైనార్టీలు లేరని, 60 శాతానికిపైగా ముస్లింలు తెలుగుదేశం వెంట ఉన్నారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, శాసన మండలి మాజీ అధ్యక్షుడు షరీఫ్ అన్నారు. అనంతపురం జిల్లా రాయదుర్గంలో మంగళవారం జరిగిన ముస్లిం ఆత్మీయ సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. 'రాష్ట్రంలో ఇప్పటికే 20 నియోజకవర్గాలకుపైగా తిరిగా. మరో 30 నియోజకవర్గాలు తిరుగుతాను. ముస్లింలలో వచ్చిన మార్పును చూస్తుంటే 2024 ఎన్నికల్లో 160 స్థానాలు టీడీపీ, జనసేన పార్టీలు గెలవడం ఖాయం. ముస్లిం మైనార్టీల నాలుగు శాతం రిజర్వేషన్లకు ఇప్పటికీ చట్టబద్ధత లేదు. టీడీపీతోనే అది సాధ్యం' అని షరీఫ్ తెలిపారు.

జూలై 7న నీట్- పీజీ 2024

న్యూఢిల్లీ, జనవరి 9: వైద్య విద్య పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష నీట్- పీజీ 2024ను జూలై 7న నిర్వహించనున్నట్లు నేషనల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ ప్రకటించింది. తొలుత మార్చి 3న ఈ పరీక్ష నిర్వహిస్తామని బోర్డు గతంలో తెలిపింది. అయితే జూలై 7కు పరీక్షను రీషెడ్యూల్ చేస్తున్నట్లు మంగళవారం వెల్లడించింది. పీజీ వైద్య విద్య నిబంధనలు-2023 ప్రకారం.. పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నీట్-పీజీ బదులుగా ప్రతిపాదించిన నేషనల్ ఎగ్జిట్ టెస్ట్ అమల్లోకి వచ్చేంత వరకు నీట్ పీజీ కొనసాగనుంది.

డీఆర్‌డీవో కొత్త రైఫిల్ 'ఉగ్రం'

» భారత సైన్యం కోసం రూపొందించిన సంస్థ

పుణె, జనవరి 9: భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ఓ కొత్త రైఫిల్‌ను రూపొందించింది. ఓ ప్రైవేటు సంస్థతో కలిసి పుణెలోని డీఆర్‌డీవో లేబొరేటరీ ఏఆర్‌డీఈలో రూపొందించిన ఈ రైఫిల్‌కు 'ఉగ్రం' అనే పేరు పెట్టింది. నాలుగు కిలోల కన్నా తక్కువ బరువు, 7.62/51 ఎంఎం నమూనాతో తయారు చేసిన ఉగ్రం రైఫిల్‌ను ఈ నెల 8న ఏఆర్‌డీఈ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎస్‌వీ గడే ఆవిష్కరించారు. అంతర్జాతీయ ప్రమాణాలకు ఏమాత్రం తీసిపోని విధంగా పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ఈ రైఫిల్‌ను రూపొందించినట్లు ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. భారత సైన్యంలోని పలువురు సీనియర్ అధికారులు, కేంద్ర హోంమంత్రి సమక్షంలో దీనిని పరీక్షించినట్లు చెప్పారు.

తల్లే దయ్యమైంది!

భర్తమీద కోపంతో నాలుగేళ్ల కొడుకు గొంతుకోసి చంపిన తల్లి

» గోవాలో ఘోరానికి పాల్పడ్డ బెంగళూరు స్టార్టప్ సీఈవో సుచనా సేథ్



బెంగళూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): 'తల్లే దయ్యమైతే బిడ్డకు ఉయ్యాల కట్టే చోటేది' అని సామెత! ఆ సామెతను నిజంచేస్తూ.. తన నాలుగేళ్ల కొడుకుపట్ల ఓ తల్లే దయ్యమైంది!! భర్త మీద కోపంతో ఆ పసివాణ్ని కిరాతకంగా తలపై కొట్టి, గొంతు కోసి చంపేసింది. తర్వాత తానూ చేయి కోసుకుని చనిపోవడానికి ప్రయత్నించింది. అంతలోనే ఏమైందో ఏమో బిడ్డ మృతదేహాన్ని బ్యాగులో కుక్కి. అక్కణ్నుంచీ పారిపోయే ప్రయత్నం చేసింది. ఇంత ఘోరానికి పాల్పడ్డ ఆ మహిళ పేరు.. సుచనా సేథ్ (39). 2021 సంవత్సరానికిగాను '100 బ్రిలియంట్ ఉమెన్ ఇన్ ఏఐ ఎథిక్స్'లో ఒకరిగా నిలిచిన సుచనాసేథ్ 'మైండ్‌ఫుల్ ఏఐ ల్యాబ్' అనే స్టార్టప్ స్థాపించి, దానికి సీఈవోగా వ్యవహరిస్తోంది. పోలీసులు తెలిపిన ప్రాథమిక సమాచారం ప్రకారం.. పశ్చిమబెంగాల్‌కు చెందిన సుచనా 2010లో కేరళకు చెందిన వెంకట్‌రామన్‌ను వివాహం చేసుకుంది. 2019లో వారికి ఒక అబ్బాయి పుట్టాడు. విభేదాలు రావడంతో ఆ దంపతులు 2020లో విడాకులకు దరఖాస్తు చేశారు. ప్రస్తుతం ఆమె తన కుమారుడితో కలిసి బెంగళూరులో ఉంటుండగా.. భర్త వెంకటరామన్ జకార్తా (ఇండోనేసియా)లో ఉంటున్నాడు. కాగా.. వారి విడాకుల కేసు విచారిస్తున్న కోర్టు.. ప్రతి శనివారం తన కుమారుణ్ని చూసుకుని, అతడితో గడిపే అవకాశాన్ని తండ్రికి కల్పించిందని, కానీ, భర్త మీద కోపంతో సుచనా ఆ తీర్పును ఎప్పుడూ గౌరవించలేదని సమాచారం. ఈ క్రమంలోనే.. నాలుగు రోజుల క్రితం (జనవరి 6న) కొడుకుతో సహా గోవాకు వచ్చి అక్కడ ఒక సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో దిగింది. ఏడో తేదీ అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో.. అక్కడ నిర్వహణ బాధ్యతలు చూసే సిబ్బందికి ఫోన్ చేసి తనకు బెంగళూరుకు వెళ్లడానికి ట్యాక్సీ ఏర్పాటు చేయాల్సిందిగా కోరింది. అంతదూరం ట్యాక్సీలో వెళ్లడానికి చాలా సమయం పడుతుందని.. పైగా, ట్యాక్సీ కన్నా విమానంలో వెళ్తేనే చవకని వారు చెప్పినా వినలేదు. దీంతో వారు ట్యాక్సీ బుక్ చేశారు. ముందురోజు తన నాలుగేళ్ల కుమారుడితో కలిసి వచ్చిన ఆ మహిళ.. అర్ధరాత్రి సమయంలో కొడుకు తన వెంట లేకుండా, బరువైన బ్యాగుతో బయటకు వెళ్లడం చూసి ఆ సర్వీస్ అపార్ట్‌మెంట్ సిబ్బందికి అనుమానం వచ్చింది. పైకెళ్లి ఆమె బస చేసిన ఫ్లాట్‌ను శుభ్రం చేస్తుండగా ఒక టవల్‌పై రక్తపు మరకలు కనిపించాయి. దీంతో వారు పోలీసులకు సమాచారమిచ్చారు. తమ వద్ద రికార్డుల్లో ఉన్న ఆమె ఫోన్ నంబర్ కూడా పోలీసులకు ఇచ్చారు. పోలీసులు వెంటనే ఆమెకు ఫోన్ చేసి.. రక్తపు మరకల గురించి, ఆమె కుమారుడి గురించి ప్రశ్నించారు. దీనికి ఆమె.. అవి తన నెలసరి తాలూకా రక్తపు మరకలు అని, తన కుమారుడు దక్షిణగోవాలోని తన స్నేహితురాలి ఇంట్లో ఉన్నాడని వారికి తెలిపింది. స్నేహితురాలి చిరునామా అడగ్గా నోటికొచ్చిన అడ్రస్ చెప్పింది. పోలీసుల విచారణలో అది తప్పని తేలింది. దీంతో పోలీసులు.. సుచనా ప్రయాణిస్తున్న ట్యాక్సీ డ్రైవర్ వివరాలు తెలుసుకుని, అతడికి ఫోన్ చేశారు. దగ్గర్లో ఏ పోలీస్ స్టేషన్ ఉంటే అక్కడికి వెళ్లాలని.. ఆమెకు అర్థంకాకుండా ఉండేందుకు కొంకణి భాషలో ఆదేశించారు. అప్పటికే కారు కర్ణాటకలోని చిత్రదుర్గ ప్రాంతానికి చేరుకుంది. డ్రైవర్ తన కారును నేరుగా స్థానిక పోలీస్‌స్టేషన్‌కు పోనిచ్చాడు. అక్కడ పోలీసులు ఆమె లగేజీని పరిశీలించగా.. లోపల కుక్కి ఉన్న బాలుడి మృతదేహం కనిపించింది. వెంటనే వారు ఆమెను అదుపులోకి తీసుకున్నారు.



సుచనాను అరెస్టు చేసి తీసుకువెళ్తున్న పోలీసులు

కర్ణాటక నుంచి గోవాకు తరలింపు..

గోవా పోలీసులు సోమవారం రాత్రికి చిత్రదుర్గకు చేరుకుని, ఆమెను ట్రాన్సిట్ వారంట్‌పై తమ రాష్ట్రానికి తీసుకువెళ్లి, కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం ఆమెను 6 రోజులపాటు పోలీసు కస్టడీకి ఇచ్చింది. బాలుడి మృతదేహానికి పోస్ట్‌మార్టం చేస్తే.. అతడిని ఎలా చంపింది? ఎప్పుడు చంపింది? తదితర వివరాలు వెల్లడవుతాయని గోవా పోలీసులు తెలిపారు. సుచనాసేథ్‌పై హత్య, సాక్ష్యాల ధ్వంసం కింద, గోవా బాలల చట్టం కింద కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. బాలుడి హత్య గురించి తండ్రి వెంకట్‌రామన్‌కు సమాచారం అందించినట్లు చెప్పారు. అలాగే, సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో టవల్‌పై కనిపించిన రక్తపు మరకలు ఆమె చెయ్యి కోసుకున్నప్పుడు పడ్డవేనని వెల్లడించారు. బాలుడి తలపై గాయం ఉందని, అతడి గొంతు కోసిన ఆనవాళ్లున్నాయని తెలిపారు. హోటల్ గదిలో గొంతు కోసి ఉంటే అక్కడ మరిన్ని రక్తపు జాడలు ఉండేవని.. ఆమెను ఇంటరాగేట్ చేస్తే పూర్తి వివరాలు తెలుస్తాయని వివరించారు.

అయోధ్యలో బాలరాముడి విగ్రహ ఊరేగింపు రద్దు

» 17న అయోధ్య నగరమంతటా ఊరేగించాలని తొలుత ట్రస్టు నిర్ణయం

» భక్తుల నియంత్రణ కష్టమన్న అధికారులు

అయోధ్య, జనవరి 9(ఆంధ్రజ్యోతి): అయోధ్యలోని రామాలయంలో ప్రతిష్ఠించనున్న బాలరాముడి విగ్రహాన్ని ఈ నెల 17న అయోధ్య నగరమంతటా ఊరేగించాలన్న నిర్ణయాన్ని రామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు ఉపసంహరించుకుంది. విగ్రహాన్ని దర్శించడానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తారని, వారిని నియంత్రించడం కష్టం అవుతుందని భద్రతాధికారులు ఆందోళన వ్యక్తం చేయడంతో ఈ నిర్ణయం తీసుకుంది. అయితే, అదే రోజున విగ్రహాన్ని 'రామజన్మభూమి' పరిసరాల్లో ఊరేగించనుంది. రాముడు వనవాసం నుంచి అయోధ్యకు చేరిన మార్గంగా రామాయణ ఇతిహాసంలో పేర్కొన్న దారిలో పలువురు ప్రముఖులు రామోత్సవ్ యాత్ర నిర్వహించనున్నారు. ఇది రామేశ్వరం నుంచి అయోధ్య వరకు ఐదు రాష్ట్రాల గుండా 4,500 కిలోమీటర్ల మేర నెలరోజుల పాటు జరుగుతుంది. ఇదిలా ఉండగా, అయోధ్యలో ఈ నెల 22న జరిగే రామ మందిర ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి మాజీ సీజేఐ ఎన్వీ రమణకు ఆహ్వానం అందింది. మంగళవారం, వీహెచ్‌పీ అంతర్జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆలోక్ కుమార్ ఈ మేరకు ఎన్వీరమణకు ఆహ్వాన పత్రం ఇచ్చారు.

అయోధ్య అపవిత్రమైనది: పన్నూన్

అయోధ్య రామాలయం అపవిత్రమైనదంటూ ఖలిస్థానీ ఉగ్రవాది పన్నూన్ మరోసారి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. రామమందిర ప్రాణ ప్రతిష్ఠను వ్యతిరేకించడంతో పాటు అడ్డుకోవల్సిందిగా ముస్లింలకు పిలుపునిచ్చారు. అమృత్‌సర్ నుంచి అయోధ్యకు వెళ్లే విమాన సర్వీసులను నిలిపివేయాలని, విమానాశ్రయాలను మూసివేయాలని డిమాండ్ చేస్తూ కొత్త వీడియోను విడుదల చేశారు.

సర్దార్ పటేల్ లేకుంటే లక్షదీవుల్లో పాక్ పాగా!

న్యూఢిల్లీ, జనవరి 9: ప్రధాని మోదీ పర్యటన, ఆ తర్వాత మాల్దీవుల మంత్రులు చేసిన వ్యాఖ్యలతో లక్షదీవులు మీడియా మీడియాలో తీవ్ర చర్చనీయాంశం అయ్యాయి. అయితే, లక్షదీవులు భారత్ పరం కావడంలో సర్దార్ పటేల్ కీలక పాత్ర పోషించారని చాలా మందికి తెలియదు. అంతేకాదు.. ఇద్దరు తమిళ సోదరులు వాటిని దేశంలో విలీనం చేశారు. 1947లో పాకిస్థాన్ ఏర్పడినప్పుడు.. దక్షిణాదిన ముస్లిం జనాభా 93% వరకు ఉన్న లక్షదీవులను మహ్మదాలీ జిన్నా తొలుత పట్టించుకోలేదు. కానీ ఆ తర్వాత ఆక్రమణకు ప్రయత్నించారు. లక్షదీవుల్లో పాక్ జెండాను ఎగురవేయాలని జిన్నా ఓ నౌకను కూడా పంపారు. ఇది తెలిసిన సర్దార్ పటేల్ క్షణం కూడా ఆలస్యం చేయకుండా.. తనకు బాగా తెలిసిన మొదలియార్ సోదరులను తక్షణమే ట్రావెన్కోర్ నుంచి జనంతో లక్షదీవులకు వెళ్లాలని ఆదేశించారు. వారు అక్కడకు వెళ్లి పాక్ నౌక రాకముందే త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ విషయాలను ప్రధాని మోదీ 2019లోనే తన 'మన్‌కీ బాత్' దీపావళి సంచికలో వెల్లడించారు. మొదలియార్ సోదరులు కర్నూలులో పుట్టడం విశేషం. వీరిలో ఆర్కాట్ రామస్వామి మొదలియార్ అప్పట్లో మైసూరు రాజసంస్థానం దివాన్‌గా పనిచేసేవారు. ఆయన సోదరుడు లక్ష్మణ్ మొదలియార్ డాక్టర్. మద్రాసు వర్సిటీ వీసీగా 20 ఏళ్లు పనిచేశారు. లక్షదీవుల్లో భారతీయ జెండా ఎగురవేశాక.. ఆ దీవుల అభివృద్ధిలో వ్యక్తిగత ఆసక్తి చూపాలని పటేల్ వీరిద్దరినీ కోరారు. ఈ ముగ్గురి వల్లే లక్షదీవులు ఇప్పుడు భారత పురోగతికి ఇతోధికంగా తోడ్పడుతున్నాయి.

ముయిజ్జు.. మీరు దిగిపోండి!

» మాల్దీవుల అధ్యక్షుడిపై అవిశ్వాసానికి ఆ దేశంలోని విపక్షాల ప్రయత్నం

» నష్టనివారణ చర్యల్లో ముయిజ్జు

» త్వరలో భారత్ పర్యటనకు సన్నాహాలు



న్యూఢిల్లీ/మాలె, జనవరి 9: భారత పర్యాటకం,ప్రధాని మోదీపై మాల్దీవుల మంత్రులు, ఓ ఎంపీ చేసిన కామెంట్లపై ఇప్పుడు ఆ దేశంలో రచ్చ జరుగుతోంది. అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జును దింపేయాలని విపక్ష ఎంపీలు డిమాండ్ చేస్తున్నారు. మాల్దీవ్స్‌కు భారత్ అనాది కాలం నుంచి మిత్రదేశమని.. అలాంటి దేశ ప్రధానిపై కామెంట్లు సరికాదని పర్యాటక సంఘాలు చెబుతున్నాయి. కొవిడ్-19 కాలంలో భారత్ చేసిన మేలును మరిచిపోయారా? అంటూ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. దీంతో మాల్దీవ్స్ అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు నష్టనివారణ చర్యలు చేపట్టారు. భారత్‌లో పర్యటించేందుకు ప్రయత్నాలను ప్రారంభించారు. భారత్‌తో ఉన్న సంబంధాలు ప్రమాదంలో పడేలా చేసిన మంత్రులను తొలగించడంతో సరిపోదని, అధ్యక్షుడు ముయిజ్జును గద్దె దించాలని విపక్ష మాల్దీవ్స్ డెమోక్రాటిక్ పార్టీ(ఎండీపీ) ఎంపీ అలీ అజీమ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్లమెంట్‌లో అధ్యక్షుడిపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెడతామని చెప్పారు. రక్షణ శాఖ మాజీ మంత్రి మారియా అహ్మద్ దీదీ కూడా అధికార పార్టీకి దూరదృష్టి లోపించిందని విమర్శించారు. మాల్దీవ్స్‌కు భారత్ 911 (ఎమర్జెన్సీ ఫోన్ నంబర్) లాంటిదని వ్యాఖ్యానించారు. మంత్రుల నోటి దురుసు మాల్దీవ్స్ ఆర్థికరంగంపై తీవ్ర దుష్ప్రభావాన్ని చూపుతుందని మాజీ మంత్రి అహ్మద్ మహ్లూఫ్ ఆందోళన వ్యక్తం చేశారు.

త్వరలో భారత్‌కు ముయిజ్జు

భారత్‌తో దౌత్యపరమైన ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో మాల్దీవ్స్ అధ్యక్షుడు ముయిజ్జు నష్ట నివారణ చర్యలు చేపట్టారు. విపక్ష ఎంపీలు, పర్యాటకరంగంపై ఆధారపడ్డ వారు విమర్శలు గుప్పిస్తుండడంతో.. ఈ నెలాఖరున, లేదంటే వచ్చేనెల ప్రథమార్థంలో భారత్‌లో పర్యటించేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు మాల్దీవ్స్ అధ్యక్షుడి కార్యాలయం భారత్‌ను కోరినట్లు మీడియా సంస్థలు కథనాలను ప్రసారం చేశాయి. ప్రస్తుతం ముయిజ్జు చైనా పర్యటనలో ఉన్నారు. నవంబరులో అధికార బాధ్యతలు చేపట్టిన ముయిజ్జు తుర్కియే, యూఏఈ, చైనాల్లో పర్యటించారు. చైనా పర్యటన సందర్భంగా ఆయన జిన్‌పింగ్‌తో భేటీ అయ్యారు. భారత్‌లో 'బ్యాన్ మాల్దీవ్స్' హ్యాష్‌ట్యాగ్ ట్రెండ్ అవుతున్న నేపథ్యంలో.. చైనా నుంచి ఎక్కువ సంఖ్యలో పర్యాటకులను పంపాలని కోరారు.

లక్షదీవుల్లో కొత్త ఎయిర్‌పోర్ట్!

లక్షదీవులను పర్యాటక ప్రాంతంగానే గాక సైనిక స్థావరంగానూ తీర్చిదిద్దే దిశగా మోదీ ప్రభుత్వం యోచిస్తోంది. మిలిటరీ, పౌర అవసరాల కోసం అక్కడ విమానాశ్రయాన్ని నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తోంది. అరేబియా సముద్రం, హిందూ మహాసముద్రంలో వ్యూహాత్మక స్థితిలో ఉన్న ఈ దీవుల్లో కీలకమైన మినీకాయ్ వద్ద ఎయిర్‌పోర్టును నిర్మించాలని తలపెట్టింది. యుద్ధవిమానాలతో పాటు వాణిజ్య విమానాలు కూడా ల్యాండయ్యేందుకు ఉమ్మడి విమానాశ్రయం నిర్మించాలన్నది ప్రణాళికగా ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఈ ప్రతిపాదనలను కేంద్రం తీవ్రంగా పరిశీలిస్తోందని తెలిపాయి. రెండు సముద్రాల్లో శత్రువుల కదలికలను పసిగట్టడానికి ఈ ఎయిర్‌పోర్టు ఉపకరిస్తుందని వెల్లడించాయి. వాస్తవానికి మినీకాయ్ దీవుల్లో ఎయిర్‌స్ట్రిప్‌ను అభివృద్ధి చేయాలని భారతీయ కోస్టు గార్డు మొదట ప్రతిపాదించింది. ప్రస్తుత ప్రతిపాదన ప్రకారం ఈ ఎయిర్‌పోర్టు కార్యకలాపాలను భారతీయ వైమానిక దళం (ఐఏఎఫ్) పర్యవేక్షిస్తుంది. ప్రస్తుతం ఈ దీవుల్లో అగట్టీలో మాత్రమే ఒక ఎయిర్‌స్ట్రిప్ ఉంది. అన్ని విమానాలూ ఇక్కడ ల్యాండయ్యే పరిస్థితి లేదు.

ఇది ధర్మమేనా మంత్రివర్యా?

(మొదటి పేజీ తరువాయి)

అసత్యాలు, అర్ధసత్యాలతో దాటవేత ధోరణిని ప్రదర్శించారు. కీలకమైన అంశాలను అసలు ప్రస్తావించనే లేదు. దీంతో ఆయన మాటలు విన్నవారికి 'ఇది ధర్మమేనా? మంత్రివర్యా' ఈ సందేహం రాకమానదు.

టైటిల్ చట్టం అమల్లోకి రాలేదని మంత్రి ధర్మాన ప్రకటించారు. ఇంకా నిబంధనలే ప్రకటించలేదన్నారు. అయితే, వాస్తవానికి ఈ చట్టం గత ఏడాది అక్టోబరు 31 నుంచే అమల్లోకి వచ్చినట్లుగా నవంబరు ఒకటో తేదీన జగన్ ప్రభుత్వం రహస్యంగా ఇచ్చిన జీఓ 512నే సజీవ సాక్ష్యం. ఆ జీఓ గురించి ధర్మానకు తెలియదా? లేక తెలిసే చెప్పకుండా దాటవేశారని అనుకోవాలా? టైటిల్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ, దాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ న్యాయవాద సంఘాలు, రైతు సంఘాల ప్రతినిధులు ఆందోళనలు చేస్తున్నారు. ఉద్యమం తారస్థాయికి చేరిన తర్వాతే టైటిల్ చట్టంలో కీలకమైన ఆంధ్రప్రదేశ్ భూమి సాధికారిక సంస్థ(ల్యాండ్ అథారిటీ)ని ఏర్పాటుచేస్తూ సర్కారు జీఓ 630 ఇటీవల ఇచ్చింది. మంత్రి ధర్మాన చెప్పినట్లు చట్టమే అమల్లోకి రాకపోతే ఈ జీఓ ఎందుకు జారీ చేసినట్లు? ఈ జీఓతో టైటిల్‌చట్టం గత ఏడాది అక్టోబరు 31నుంచే అమల్లో ఉన్నట్లు లెక్క. దీంతో భూ వివాదాలను జిల్లా కోర్టులు విచారణకు తీసుకోవడానికి వీల్లేకుండా పోయింది.

నిబంధనలు ఇవ్వకపోతే..

టైటిల్ చట్టం అమలుకు ఇంకా రూల్స్‌నే ఇవ్వలేదు కాబట్టి అది అమల్లో లేనట్లే అని మంత్రి పదేపదే చెప్పారు. పోనీ.. ఇదే నిజమనుకుంటే, శాశ్వత భూ హక్కు పేరిట కొత్తగా పాస్‌పుస్తకాలు ఎందుకు ఇస్తున్నట్లు? శాశ్వత హక్కు అంటే టైటిల్ ద్వారా వచ్చేదే అని మంత్రి సెలవిచ్చారు. అలాంటప్పుడు? చట్టం అమల్లో లేకుండా ఏ ప్రాతిపదికన జగన్ బొమ్మలేసి శాశ్వత భూహక్కు పత్రం ఇస్తున్నారు? తాజాగా మంత్రి చెప్పిన ప్రకారం, టైటిల్ చట్టం అమల్లో లేదు కాబట్టి జగన్ బొమ్మలున్న శాశ్వత భూమి హక్కు పత్రాలు చెల్లవనుకోవాలా? లేక పట్టాలను కేవలం కాగితాలుగా పరిగణించాలా? సివిల్ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల్లో 66 శాతం భూ వివాదాలతో ముడిపడినవే అని మంత్రి చెప్పారు. అందులో 93 శాతం రూ.లక్ష ఆదాయం ఉన్న పేదల భూముల కేసులే అని వివరించారు. సివిల్ కోర్టుల్లో కేసులు పెండింగ్‌లో ఉంటే, వాటిని కోర్టు పరిధి నుంచి తప్పించి రెవెన్యూ అధికారులకు ఇస్తారా? తహసీల్దార్, ఈనాం డిప్యూటీ తహసీల్దార్, ఆర్‌డీఓ, జాయింట్ కలెక్టర్, సెటిల్‌మెంట్ కమిషనర్, సర్వేకమిషనర్, సీసీఎల్ఏ, చివరకు రెవె న్యూ మంత్రి వద్ద కూడా క్వాజీ జ్యుడీషియరీ కోర్టులు నడుస్తున్నాయి. భూ వివాదాలపై విచారణలు చేస్తున్నారు. ఈ కోర్టుల పరిధిలో కూడా వేలాది కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. మరి రెండింటికీ తేడా ఏమిటి? అయితే, వీటికి సమాధానం ఇవ్వకుండా.. అన్నీ ముందుగానే ఊహిస్తే ఎలా అంటూ మంత్రి దాటవేశారు.

మీడియాకు సర్టిఫికెట్

భూముల సర్వే అద్భుతంగా జరుగుతోందని మంత్రి ధర్మాన అన్నారు. మీడియాకు సాంకేతికత గురించి తెలియదని సర్టిఫికెట్‌లు ఇచ్చారు. మంత్రి చెప్పాలనుకున్న టెక్నాలజీ మీడియాకు తెలియకపోవచ్చు. కానీ, భూముల సర్వేలో జరుగుతున్న వ్యవహారాలు మంత్రి కంటే మీడియాకే ఎక్కువ తెలుసు. నిత్యం రైతుల బాధలను వెలుగులోకి తీసుకొస్తున్నది మీడియానే. కార్స్ టెక్నాలజీ, రోవర్లు, డ్రోన్‌ల కొనుగోలు దగ్గరి నుంచి ఆఫీసులో కూర్చొని రికార్డుల తయారీ వరకు అనేక విషయాలను సవివరంగా బయటపెట్టింది. ఇక, టైటిల్ చట్టం అద్భుతం, అందరితో చర్చించాకే ముందడుగు వేశామని ధర్మాన పలుమార్లు చెప్పారు. అదే నిజమైతే, చట్టం చేసే సమయంలో ధర్మాన ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయన సోదరుడు కృష్ణదాస్ మంత్రిగా ఉన్నారు. మంత్రివర్గ విస్తరణ తర్వాతే ధర్మానకు రెవెన్యూ మంత్రి పదవి వచ్చింది. ఈ చట్టం తీసుకురావాలనుకున్నప్పుడు ఏ ఒక్కరితోనూ సంప్రదించలేదు. నీతి ఆయోగ్ ఇచ్చిన డ్రాఫ్ట్ ముసాయిదాను పట్టుకొని అదే సరైనదనుకున్నారు. ఆ నివేదికను కేంద్ర మంత్రివర్గం ఆమోదించనే లేదు. దాన్ని ఇక్కడకు తీసుకొచ్చి ఓ అధికారి తన కింద పనిచేసే ఇద్దరు సూపరింటెండెంట్‌లతో చట్టం ముసాయిదా బిల్లు తయారు చేయించారు. కనీసం న్యాయ శాఖ ఆమోదం కూడా తీసుకోకుండానే బిల్లును తీసుకొచ్చారు. అనంతరం, దేశంలో ఏపీనే ఫస్ట్ అంటూ సభలో బిల్లు ఆమోదించి రాష్ట్రపతి ఆమోదం కోసం పంపించారు. అయితే, రాష్ట్రపతి రెండుసార్లు ఆ బిల్లును తిరస్కరించారు. అప్పటికీ నిపుణులతో సంప్రదింపులు జరపకుండా నల్సార్‌లోని ఓ ప్రొఫెసర్‌తో చర్చలు జరిపారు. తెరవెనుక ఇంత జరిగితే, అందరితో చర్చించామని చెప్పడం, అవసరం వచ్చినప్పుడల్లా కేంద్రం, నీతి ఆయోగ్ ప్రస్తావన తీసుకురావడం దేనికి సంకేతం?

మంత్రిగారి కొత్త భాష్యం

చట్టం వండర్‌ఫుల్ అని న్యాయవాదులే అభినందిస్తున్నారని ధర్మాన కొత్త భాష్యం చెప్పారు. అదే నిజమైతే, ఏకంగా బార్ అసోసియేషన్‌లు ఎందుకు ఆందోళనలో ఉన్నట్లు? వారంతా చట్టం చదవకుండానే పోరాటంలోకి వచ్చారని మంత్రి చెప్పాలనుకున్నారా? ఈ ప్రశ్నకు సూటిగా సమాధానం చెప్పలేదు. చట్టాన్ని చదివిన వారు అభినందిస్తున్నారంటూ కొత్త భాష్యం చెప్పారు. సివిల్ కోర్టులు చట్టం అమలులో జోక్యం చేసుకోవద్దని చట్టంలో స్పష్టంగా ఉంది. అంటే, ఉద్దేశ పూర్వకంగానే సివిల్‌కోర్టుల ప్రమేయం వద్దని చెప్పడమే కదా అని నిపుణులు అంటున్నారు.

టైటిల్ చట్టాన్ని వెనక్కి తీసుకోం!

» నీతి ఆయోగ్ ఇచ్చిన దాన్నే అనుసరించాం: మంత్రి ధర్మాన

అమరావతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): న్యాయవాద వర్గాలు, రైతులు, భూయజమానులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ ఏపీ భూ యాజమాన్య హక్కు(టైటిల్) చట్టం-2023ను వెనక్కి తీసుకోబోమని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు స్పష్టం చేశారు. చట్టాన్ని చదవని కొందరే అన్యాయం జరిగిపోతోందని ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఇది దేశ ప్రయోజనాల కోసం తీసుకొచ్చిందని చెప్పారు. టైటిల్ చట్టం చదివిన అడ్వకేట్స్ ఇది వండర్‌ఫుల్(అద్భుతం)గా ఉందని ప్రభుత్వాన్ని అభినందిస్తున్నారని తెలిపారు. భూముల సర్వే పూర్తయ్యాక, రికార్డులను పక్కాగా రూపొందించాకే టైటిల్ చట్టం అమల్లోకి వస్తుందన్నారు. అయితే, ప్రస్తుతం ఈ చట్టం అమల్లో లేదని చెప్పారు. మంగళవారం సచివాలయంలో మంత్రి టైటిల్ చట్టంపై మీడియాకు వివరణ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తనకు తానుగా, సొంతంగా ఈ చట్టం తీసుకురాలేదని, కేంద్రం, నీతి ఆయోగ్ సూచనల మేరకే చట్టం చేశామన్నారు. అయితే, దేశంలో అందరికంటే ముందుగానే ఏపీ ఈ చట్టం తీసుకొచ్చిందని తెలిపారు. హైకోర్టులో రిట్స్, పిల్ దాఖలయ్యాయని, న్యాయస్థానం ఇచ్చే ఆదేశాలను పాటిస్తామని చెప్పారు. రెవెన్యూ రికార్డులకు గ్యారెంటీ లేకపోవడంతో దేశంలో భూ వివాదాలు పెరిగి పోతున్నాయన్నారు. సివిల్ కోర్టుల్లో 66 శాతం భూ వివాదాలకు సంబంధించిన కేసులే ఉన్నాయని, ఇందులోనూ 93 శాతం రూ.లక్ష వార్షికాదాయం ఉన్న నిరుపేదల భూమి కేసులే ఉన్నాయన్నారు. సుదీర్ఘ న్యాయ పోరాటంలో ధనవంతులే గెలుస్తున్నారని అన్నారు. 'పేదలు భూ వివాదాల పరిష్కారం కోసం ఇప్పటి వరకు రూ.27 వేల కోట్లు ఖర్చు పెట్టారు. కానీ, సుదీర్ఘ న్యాయపోరాటంలో ధనవంతులే గెలిచే పరిస్థితి ఉంది. ఎన్‌సీఆర్‌బీ నివేదిక ప్రకారం 14% హత్యలు, 60% నేరాలు భూ వివాదాల వల్లే జరుగుతున్నాయి. ఇలా ఇందులో అనేకానేక అంశాలున్నాయి' అని మంత్రి చెప్పారు. న్యాయవాదులు, ఇతరులు వ్యక్తం చేస్తున్న ఆందోళనలు, అభిప్రాయాలను ప్రభుత్వం గౌరవిస్తుందని తెలిపారు. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నాకే చట్టం అమలుకు రూల్స్ ఇస్తామని ధర్మాన చెప్పారు.


కర్నూలు జిల్లా పత్తికొండలో బొరుగులు, మిక్చర్ విక్రయిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న నిరుద్యోగులు

పల్లీలు అమ్ముకుంటున్న పట్టభద్రులు

- జాబ్ కేలెండర్ హామీ ఏమైంది జగన్?
- పత్తికొండలో బొరుగులు, మిక్చర్ అమ్ముతూ నిరసన

పత్తికొండ, జనవరి 9: ఎన్నికలకు ముందు కల్లబొల్లి హామీలిచ్చి అధికారం చేపట్టాక సీఎం జగన్ తమను నట్టేట ముంచేశాడని నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తంచేశారు. జగన్ హయాంలో పట్టభద్రులు పల్లీలు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. జాబ్ కేలెండర్ పేరుతో మోసం చేయడాన్ని నిరసిస్తూ కర్నూలు జిల్లా పత్తికొండ నాలుగు స్తంభాల కూడలిలో బొరుగులు, మిక్చర్ అమ్ముతూ మంగళవారం వినూత్నంగా నిరసన తెలిపారు. వీరికి న్యాయవాదులు, తెలుగు యువత నాయకులు మద్దతు పలికారు. డిగ్రీ సర్టిఫికెట్ల నకళ్లతో పొట్లాలు చేసి బొరుగులు, మిక్చర్, పల్లీలు అమ్ముతూ ప్రభుత్వం చేసిన మోసాన్ని ప్రజలకు నిరుద్యోగులు వివరించారు. 23వేల పోస్టులతో మెగా డీఎస్సీ విడుదల చేస్తామన్న హామీ ఏమైందని జగన్‌ను ప్రశ్నించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో 1,345 మంది నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారని ధ్వజమెత్తారు.

విట్‌లో 5వ అంతర్జాతీయ సదస్సు


వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయంలో ఐసీఏడీసీఎంఎల్-24పై 5వ అంతర్జాతీయ సదస్సులో ప్రతినిధులు

అమరావతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో అడ్వాన్సెస్ ఇన్ డిస్ట్రిబ్యూటెడ్ కంప్యూటింగ్, మెషిన్ లెర్నింగ్ (ఐసీఏడీసీఎంఎల్-24)పై 5వ అంతర్జాతీయ సదస్సును ఈనెల 5న ప్రారంభించి రెండు రోజుల పాటు నిర్వహించామని వీఐటీ-ఏపీ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ సదస్సులో వివిధ విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలకు చెందిన దాదాపు 200 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, రీసెర్చ్ స్కాలర్స్ పాల్గొని పరిశోధన పత్రాలను సమర్పించినట్టు పేర్కొంది. ముఖ్య అతిథిగా ఇంటెల్ టెక్నాలజీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో డైరెక్టర్ స్ట్రాటజీ సుమీత్ వర్మ హాజరై టెక్నాలజీ అభివృద్ధి, సాంకేతిక అంశాలపై సూచనలు చేసినట్టు తెలిపింది. వీసీ డాక్టర్ ఎస్.వి.కోటా రెడ్డి, డాక్టర్ ఉమాకాంత్ నందా, డాక్టర్ రవీంద్ర ధూలి, డాక్టర్ లఖన్ దేవ్ శర్మ, డాక్టర్ రోహిత్ లోరెంజో కూడా పాల్గొన్నారని వివరించింది.

11న సచివాలయంలో సంక్రాంతి సంబరాలు

అమరావతి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈ నెల 11న సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్టు ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.వెంకట్రామిరెడ్డి మంగళవారం తెలిపారు. సీఎస్ జవహర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొనే ఈ సంబరాలకు సచివాలయ ఉద్యోగుల కుటుంబాలు తరలి రావాలని కోరారు.

కోడి పందేలు ఆపండి

- హైకోర్టు తీర్పును అమలు చేయండి
- పోలీసులకు న్యాయస్థానం ఆదేశం

అమరావతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని, హైకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పునకు కట్టుబడి వ్యవహరించాలని పోలీసు ఉన్నతాధికారులను హైకోర్టు ఆదేశించింది. పందేల నిర్వహణకు అనుమతులు ఇవ్వడం లేదని, ధర్మాసనం గతంలో ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేస్తామని హోంశాఖ జీపీ చెప్పిన వివరాలను నమోదుచేసి, వ్యాజ్యాలను పరిష్కరించింది. ఈమేరకు న్యాయమూర్తి జస్టిస్ బీఎస్ భానుమతి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం వాడపల్లి, మద్దూరు, చందవరం, తోగువిన్న గ్రామాల్లో పండుగ సందర్భంగా కోడిపందేలు, జూదం, ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాలను నిలువరించేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ జి.వెంకటరత్నం, మరో ఇద్దరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అలాగే పశ్చిమగోదావరి జిల్లా వీరవాసవరం మండలం కొణితివాడ, ఉత్తరపాలెం తదితర గ్రామాల్లో కోడిపందేలు నిలువరించాలని మరో వ్యాజ్యం దాఖలైంది. సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు నిలువరించాలని మరికొందరు వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లు మంగళవారం విచారణకు రాగా కోడిపందేలు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని, ధర్మాసనం తీర్పునకు కట్టుబడి వ్యవహరించాలని న్యాయమూర్తి ఆదేశించారు.



కోడి పందేలకు ఆఫర్లు

- పోలీసు హెచ్చరికలున్నా బరులకు ఏర్పాట్లు
- నిర్వాహకుల నుంచి భారీగా వసూళ్లు

భీమవరం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కోడి పందేలకు పశ్చిమ గోదావరి పెట్టింది పేరు. ఈ ఏడాది పందెం రాయుళ్లను ఆకర్షించడానికి ఆఫర్‌లు ప్రకటిస్తున్నారు. గణపవరం పరిధిలో బుల్లెట్ ఆఫర్ చేస్తున్నారు. ఒక్కో పందేనికి రూ.3.20 లక్షలుగా నిర్ణయించారు. ఐదు పందేలు వేస్తారు. అందులో అత్యధికంగా పందేలను గెలిచిన వారికి బుల్లెట్‌ను బహూకరిస్తారు. జిల్లాలో కొందరు అధికార పార్టీ నేతలు బరులు ఏర్పాటు చేసేవారి నుంచి భారీగా వసూళ్లు చేస్తున్నారు. దీంతో కొందరు నిర్వాహకులు ఇతర జిల్లాలకు తరలిపోతున్నారు. తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన కొందరు రావులపాలెంలో బరులు వేసేందుకు సిద్ధమవుతున్నారు. అక్కడ ఐదు పందేల్లో అధికంగా గెలిచిన వారికి రూ.1.20 లక్షలు ఇచ్చేలా ప్రణాళిక చేశారు. పోలీసులు ఒక వైపు కోడి పందేలపై హెచ్చరికలు చేస్తున్నా సరే పందెం రాయుళ్లు బరులు సిద్ధం చేసుకునే పని మాత్రం వదలడ లేదు. చివరి దశలో ప్రభుత్వం అనుమతులు ఇస్తుందన్న భరోసాతోనే ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఏటా ఇదే తంతు సాగుతోంది. పందేలు, గుండాట, కోతాటలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవంటూ చివరి వరకు పోలీసులు చెప్పుకొస్తున్నారు. చివరకు పందెం రాయుళ్లు తమ పంతాన్ని నెగ్గించుకుంటున్నారు. భోగి నుంచి మూడు రోజులపాటు ప్రభుత్వం అనుమతి ఇస్తోంది.

రాతి యుగమే కావాలా.. స్వర్ణయుగమా?

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. సైకో రాష్ట్రాన్ని అన్ని విధాలుగా నాశనం చేస్తున్నాడని.. రద్దులు, గుద్దులు, నొక్కుడు, బొక్కుడు, కూల్చివేతలు, దాడులు, అక్రమ కేసులు తప్ప ఏమీ చేతకాదన్నారు. ప్రజావేదిక కూల్చడంతో విధ్వంస పాలనకు శ్రీకారం చుట్టాడని, దీనికి చరమగీతం పాడాలంటే వైసీపీని ఇంటికి సాగనంపాలని చెప్పారు. 'జగనన్న వదిలిన బాణం అంటూ షర్మిల ఉమ్మడి రాష్ట్రమంతా తిరిగింది. జగన్ సీఎం కావాలంటూ ప్రచారం చేసింది. ఇపుడేమైంది.. ఆస్తి అడిగిందని ఇంట్లో నుంచి తరిమేశాడు. అది చెప్పకుండా ప్రతిపక్షాలు తమ ఇంట్లో చిచ్చు పెట్టడానికి చూస్తున్నాయని డ్రామాలు మొదలుపెట్టాడు. మీ ఇంట్లో గొడవలకు ఇతరుల మీద పడి ఏడవడం ఏమిటో అర్థం కాదు.' అని విమర్శించారు. వివేకాను చంపి తనపై నిందలు వేశాడని జగన్‌పై విరుచుకుపడ్డారు. 'పైగా నారాసుర రక్తచరిత్ర అంటూ అబద్ధపు రాతలు రాయించారు. అసల నిందితులను కాపాడుతూ.. దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారులపై కేసులు పెట్టించారు. వివేకా కుమార్తె సునీతనూ కేసులతో వేధిస్తున్నారు. రేపో మాపో సొంత చెల్లెలు షర్మిలపై కేసు పెట్టినా ఆశ్చర్యం లేదు' అని వ్యాఖ్యానించారు. ఇంకా ఏమన్నారంటే..

తండ్రి మరణంపై రాజకీయం..

ఈ సైకో జగన్.. తండ్రి మరణాన్ని కూడా రాజకీయానికి వాడుకున్నాడు. తన తండ్రిని కుట్ర చేసి రిలయన్స్ వారే చంపించారంటూ రెచ్చగొట్టి రిలయన్స్ షాపులను ధ్వంసం చేయించారు. ఆ తర్వాత వారికి సంబంధించిన వ్యక్తికి రాజ్యసభ టికెట్ ఇచ్చారు. ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి వేధించడం అలవాటైపోయింది. డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీని ఊరేగింపుగా తీసుకొచ్చారు. వైసీపీ నాయకుల వేధింపులకు తట్టుకోలేక అబ్దుల్ సలాం కుటుంబం మొత్తం ఆత్మహత్యకు పాల్పడేలా చేశారు. ఇలా లెక్కకు మించి దారుణాలు చేస్తూ రాష్ట్రంలో రాతియుగం నాటి రోజులను గుర్తు చేస్తున్నారు. అధికారం నాకు కొత్త కాదు. 40 ఏళ్ల నుంచి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నా.. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేశా. కానీ జగన్ లాంటి పాలనను ఎప్పుడూ చేయలేదు. నా తపనంతా తెలుగుజాతి అభివృద్ధి కోసమే. వైసీపీని తరిమేసేందుకు 'రా.. కదలిరా' అంటూ సభలు నిర్వహిస్తున్నాను.

పెట్టుబడులు తరిమేశాడు..

కమీషన్ల కక్కుర్తితో పెట్టుబడులను తరిమేశాడు. ఈ ప్రభుత్వ వేధింపులు భరించలేక అమర్‌రాజా, జాకీ కంపెనీలు పారిపోయాయి. నేను రాష్ట్రానికి కియా, కార్బన్, డిక్సన్, అపోలోటైర్స్ వంటి కంపెనీలు తెచ్చా. 2019లో టీడీపీ గెలిచి ఉంటే కడప స్టీల్ ప్యాక్టరీ పూర్తయ్యేది. జగన్ ఒక్క పరిశ్రమ కూడా తీసుకురాలేదు. స్టీల్ ప్యాక్టరీకి రిబ్బన్ కట్ చేసి గాలికొదిలేశాడు. యువత భవిష్యత్‌కు నాదీ గ్యారెంటీ. రాయలసీమకు నీళ్లు తెచ్చి, మౌలిక సదుపాయాలు కల్పించి, యువతకు ఉద్యోగాలు వచ్చేలా చేస్తే రతనాల సీమగా మారుతుంది. జగన్ సీమకు చెందినవాడైనా ఈ ప్రాంతానికి తీరని అన్యాయం చేశాడు. ప్రాజెక్టులను నాశనం చేశాడు. అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు రిపేరు చేయలేని దద్దమ్మ ఈ ప్రభుత్వం. రాయలసీమకు టీడీపీ 10 లక్షల ఎకరాలకు డ్రిప్ ఇరిగేషన్ అందిస్తే, వైసీపీ ప్రభుత్వం 6 లక్షల ఎకరాలకు కుదించింది. టీడీపీ హయాంలో పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీటిని తరలించి శ్రీశైలంలో 120 టీఎంసీలను ఆదా చేశాం. ముచ్చుమర్రి, సిద్దాపురం, కులకుర్తి, గోరుకల్లు, పులికనుమ, అవుకు టన్నెల్‌ను పూర్తి చేశాం. నల్లమలలో ఒక టన్నెల్ ఏర్పాటు చేసి గోదావరి నీటిని బానకచర్ల రిజర్వాయర్‌కు ఆలోచన చేశాను. కానీ తర్వాత ఎన్నికలు వచ్చాయి. ఇప్పుడు టీడీపీ అధికారంలోకి వస్తే పట్టిసీమ, నల్లమల టన్నెల్ ద్వారా సీమకు 350 టీఎంసీల నీటిని తీసుకొస్తాం. సీమను ఉద్యానవనశాఖ హబ్‌గా మారుస్తాం. జగన్ రాష్ట్రాన్ని దోచుకుంటుంటే, నంద్యాల ఎమ్మెల్యేలు జిల్లాను దోచుకుంటున్నారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే బ్రిజేంద్రారెడ్డి అన్నం బదులు ఇసుక, ఎర్రమట్టి, రేషన్ బియ్యం బొక్కుతున్నారు. సండే ఎమ్మెల్యేగా పేరుబడిన నంద్యాల ఎమ్మెల్యే రవిచంద్రకిశోర్‌రెడ్డి నేషనల్ హైవేను అష్టవంకర్లు తిప్పి తన భూములకు రేట్లు పెంచుకున్నాడు. ఇక పిట్టకథల మంత్రి బుగ్గన పాత సినిమాల్లో నాగభూషణంలా మాట్లాడుతూ.. చేయాల్సిందంతా చేస్తున్నాడు. నందికొట్కూరు, కోడుమూరు ఎమ్మెల్యేలు ఆర్థర్, సుధాకర్ దళితులు కాబట్టి వారిని బలిపశువులను చేశారు.


నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ బహిరంగ సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు

అంగన్వాడీలకు న్యాయం చేస్తాం

అంగన్వాడీల జీతాలు పెంచమంటే ఎస్మా ప్రయోగించి ఉద్యోగాలు తొలగిస్తానని జగన్ బెదిరిస్తున్నాడు. టీడీపీ అధికారంలోకి వస్తే వారికి న్యాయం చేస్తాం. జగన్ బటన్ నొక్కి రూ.10 పంచుతూ రూ.100 నొక్కేస్తున్నాడు. టీడీపీ వస్తే రూ.15 పంచుతూ రూ.100 సంపాదించేందుకు చేయూతనిస్తా. భూముల పాసు పుస్తకాలపై జగన్ ఫొటో పెట్టుకోవాలని చూస్తున్నాడు.

చరిత్ర పునరావృతం కావాలి: బాబు

అమరావతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): నలభై ఒక్క ఏళ్ల క్రితం 1983లో ఇదే రోజు (జనవరి 9న) నందమూరి తారక రామారావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి, తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటారని టీడీపీ అధినేత చంద్రబాబు గుర్తు చేశారు. ఈమేరకు ఎన్టీఆర్ సీఎంగా ప్రమాణస్వీకారం చేస్తున్న నాటి చిత్రాన్ని మంగళవారం ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'దేశంలోనే మొదటిసారిగా ఎన్టీఆర్ సంక్షేమ పాలనకు శ్రీకారం చుట్టారు. మళ్లీ చరిత్ర పునరావృతం కావాలి. విధ్వంసకర పాలకుల పీడ నుంచి తెలుగు జాతి విముక్తిని పొంది, ప్రపంచంలోనే అత్యున్నత స్థానాన్ని అందుకోవాలి. ఎన్టీఆర్ స్ఫూర్తిగా ఆ మహోదయం కోసం ఉద్యమిద్దాం' అని చంద్రబాబు పిలుపునిచ్చారు.

విజయకీలాద్రిని సందర్శించిన జస్టిస్ శ్రీనివాస్


జస్టిస్ శ్రీనివాస్ దంపతులకు స్వామివారి శేషవస్త్రాలు అందిస్తున్న వెంకటాచార్యులు

తాడేపల్లి టౌన్, జనవరి 9: ఎంటీఎంసీ పరిధిలోని సీతానగరాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాస్ దంపతులు మంగళవారం సందర్శించారు. ధనుర్మాస మహోత్సవాల సందర్భంగా గోదా అమ్మవారికి సారె సమర్పించారు. అనంతరం విజయకీలాద్రి శ్రీనివాసునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆశ్రమ నిర్వాహకులు శ్రీమాన్ పురాణం వెంకటాచార్యులు, విజయకీలాద్రి అర్చకులు శ్రీనివాస ఆచార్యులు, జస్టిస్ శ్రీనివాస్ దంపతులకు ఆశీర్వచనం అందించారు.

టీటీడీకి రూ.30 లక్షల విలువైన నెయ్యి విరాళం

- అయోధ్యకు పంపే లడ్డూలకు వినియోగం

తిరుమల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): టీటీడీకి రూ.30 లక్షల విలువైన నెయ్యిని టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు సౌరభ్ విరాళంగా అందజేశారు. ఈ నెల 22వ తేదీన అయోధ్యలో జరగనున్న శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా భక్తులకు ఉచితంగా అందజేందుకు తిరుమల నుంచి లక్ష లడ్డూలను పంపాలని టీటీడీ నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బోర్డు సభ్యుడు సౌరభ్ ఆ లడ్డూల తయారీ నిమిత్తం రూ.30 లక్షల విలువైన నెయ్యిని మంగళవారం అధికారులకు అందజేశారు. కాగా 21వ తేదీకి లడ్డూలు అయోధ్యకు చేర్చేలా టీటీడీ ప్రణాళిక రూపొందించింది.


ప్రాణం తీసిన గుంతల రోడ్డు!

- టిప్పర్ కిందపడి యువకుడి మృతి

తాళ్లూరు, జనవరి 9: గుంతల రోడ్డు యువకుడి ప్రాణాలను బలితీసుకుంది. అధ్వానపు రోడ్డులో వెళ్తుండగా పక్కనున్న టిప్పర్ మీదికి వస్తుందన్న భయంతో పక్కకు వెళ్లబోయి దాని కిందనే పడి మృతిచెందాడు. ఈ ఘటన ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం తూర్పుగంగవరం-లింగాలపాడు నడుమ మంగళవారం చోటు చేసుకుంది. మండలంలోని బొట్లపాలేనికి చెందిన పగడాల కృష్ణ(24) స్నేహితుడితో కలిసి తాళ్లూరు బయలుదేరారు. ఆ దారిలోనే కంకర లోడుతో టిప్పర్ వెళ్తోంది. సుబ్బారెడ్డి బ్రిక్స్ వద్దకు వచ్చేసరికి ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంతలుగా ఉండటంతో ఒక్కసారిగా టిప్పర్‌ను పక్కకు తిప్పడంతో అది మీదకి వస్తుందన్న భయంతో కృష్ణ పక్కకు వెళ్లబోయాడు. వెనుక కూర్చున్న స్నేహితుడు పోలంరెడ్డి విష్ణువర్ధన్ దూకేయగా, బైకు టిప్పర్ కిందికి వెళ్లింది. కృష్ణ మీదకు టిప్పర్ వెనుకటైర్లు ఎక్కడంతో అతడి శరీరం ఛిద్రమైంది. విష్ణువర్ధన్ చిన్నగాయంతో బయటపడ్డాడు. గుంతల రోడ్డును అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుళ్లిన గుడ్లు.. పురుగు పట్టిన చిక్కీలు

- అంగన్వాడీ కేంద్రాల్లో పంపిణీ


నీటిలో తేలియాడుతున్న కుళ్లిపోయిన కోడి గుడ్లు, చిక్కీల్లో పురుగు

మడకశిర రూరల్ జనవరి 9: శ్రీసత్యసాయి జిల్లా మడకశిర ఎస్సీ కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం పంపిణీ చేసిన కోడి గుడ్లు కుళ్లిపోయాయి. చిక్కీలు పురుగు పట్టాయి. దీంతో మహిళలు వాటిని పడేశారు. అంగన్వాడీ కార్యకర్తలు సమ్మెలోకి వెళ్లడంతో నిర్వహణ బాధ్యత గ్రామ సచివాలయ సిబ్బందికి అప్పగించారు. అంగన్వాడీ కేంద్రాల్లో నిల్వ ఉన్న సరుకులను వారు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేస్తున్నారు. పౌష్టికాహారం పేరిట కుళ్లిపోయిన గుడ్లను, పురుగుపట్టిన చిక్కీలను ఇచ్చారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఉమ్మడి పోరాటమే శరణ్యం

- న్యాయసంహిత బిల్లు సెక్షన్-106పై ఏపీ లారీ యజమానుల సంఘం

విజయవాడ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): లారీ యజమానులు, డ్రైవర్ల సంఘాలు కలిసి సంయుక్తంగా ఒక గొడుగు కింద పనిచేస్తే తప్ప.. కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాడలేమని గుర్తించాలని రాష్ట్రంలోని డ్రైవర్ల సంఘాలకు ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల న్యాయసంహిత- 2023 బిల్లును తీసుకువచ్చే క్రమంలో సెక్షన్ 106లో తీసుకు వచ్చిన సవరణలు డ్రైవర్లకు గొడ్డలిపెట్టు వంటివని చెప్పారు. ఈ పరిస్థితులలో ఆలిండియా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ రంగంలోకి దిగి కేంద్ర ప్రభుత్వం దృష్టికి ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకువెళ్లిందని, ఆ తర్వాత ఈ ప్రతిపాదనను నిలుపుదల చేశామని కేంద్రం స్పష్టత ఇచ్చిందని తెలిపారు. ఈ క్రమంలో మన దగ్గర కొన్ని డ్రైవర్ల సంఘాలు ఈ నెల 9న, మరికొన్ని సంఘాలుఈ నెల 11న సమ్మె చేపడుతున్నట్టు ప్రకటించాయన్నారు. రాష్ట్రంలో ఉన్న వర్కర్స్ అసోసియేషన్ నాయకులు, డ్రైవర్ల అసోసియేషన్ నాయకులు ఫలితాలు వచ్చే విధంగా ఆలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు.

ధైర్యంగా ఉండండి..

- టీడీపీ అండగా ఉంటుంది: భువనేశ్వరి
- చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక మంత్రాలయం నియోజకవర్గంలో మృతి చెందిన టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ
- ఒక్కొక్కరికీ 3 లక్షల చొప్పున ముగ్గురికి సాయం


కర్నూలు జిల్లా పెద్దకడుబూరులో టీడీపీ కార్యకర్త గోపాల్ భార్య జయశీలమ్మకు రూ.3 లక్షల చెక్కు అందజేస్తున్న భువనేశ్వరి

కర్నూలు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): 'టీడీపీ అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టును మీ కుటుంబం జీర్ణించుకోలేకపోయింది. ఆ మనోవేదనతో ఓ సభ్యుడిని కోల్పోయారు. మీకు టీడీపీ, చంద్రబాబు ఎల్లప్పుడూ అండగా ఉంటారు. అధైర్యపడకండి' అని ఆయన సతీమణి నారా భువనేశ్వరి భరోసా ఇచ్చారు. నిజం గెలవాలి యాత్రలో భాగంగా మంగళవారం కర్నూలు జిల్లా మంత్రాలయం నియోజకవర్గంలో ఆమె పర్యటించారు. ఆ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి తిక్కారెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడుతో కలిసి చంద్రబాబు అరెస్టు సమయంలో తీవ్ర మనోవేదనకు లోనై పెద్దకడుబూరులో మృతి చెందిన టీడీపీ కార్యకర్త హెచ్ గోపాల్, కౌతాళం మండలం వల్లూరులో మృతి చెందిన ఈరమ్మ, మంత్రాలయంలోని రామచంద్రనగర్‌లో మృతి చెందిన టీడీపీ కార్యకర్త రాగమ్మ కుటుంబాలను ఆమె పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పేరు పేరున పలుకరించి ధైర్యంగా ఉండాలని కోరారు. రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వమేనని, చంద్రబాబు సీఎం అవుతారని, కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని, మీ కుటుంబ సభ్యులుగానే మమ్మల్ని భావించాలని ఆమె కోరారు. పిల్లలను బాగా చదివించాలని సూచించారు. రూ.3 లక్షల ఆర్థిక సహాయం చెక్కులను ప్రతి కుటుంబానికీ అందజేశారు. అనంతరం ఆదోనికి చేరుకొని రాత్రి బస చేశారు. కర్నూలు జిల్లాలో అడుగుపెట్టిన భువనేశ్వరికి ఎమ్మిగనూరు నియోజకవర్గం గోనెగండ్ల మండలం గాజులదిన్నె ప్రాజెక్టు వద్ద ఎమ్మిగనూరు ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి స్వాగతం పలికారు. కాగా బుధవారం ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ఆరుగురు టీడీపీ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించనున్నారు. భువనేశ్వరి వెంట టీడీపీ కోడుమూరు, ఆలూరు ఇన్‌చార్జ్‌లు ఆకెపోగు ప్రభాకర్, కోట్ల సుజాతమ్మ, ఆదోని మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, తెలుగురైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంతరెడ్డి పలువురు టీడీపీ నేతలు ఉన్నారు.

చెట్టు మీద పిట్టల్లా వైసీపీ ఎమ్మెల్యేలు: వర్ల

అమరావతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): చెట్టు మీద పిట్టలు ఎగిరిపోయినట్లు వైసీపీలో నుంచి ఎమ్మెల్యేలు లేచిపోతున్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ఎద్దేవా చేశారు. మంగళవారం స్థానిక టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'జగన్ తన పార్టీని ఒక ప్రైవేట్ లివిటెడ్ కంపెనీలా నడుపుతున్నారు. మళ్లీ జగన్ అధికారంలోకి రావడానికి ప్రజలు ససేమిరా ఇష్టపడటం లేదు. మార్చాల్సింది ఎమ్మెల్యేలను కాదు.. జగన్నే బదిలీ చేయాలి. 12 మంది దళిత శాసనసభ్యుల్ని బదిలీ చేయడం అవివేకం. జగన్ మాటలు నమ్మి అత్యుత్సాహంతో ఓట్లు వేసిన దళితుల్ని అడుగడుగునా అవమానిస్తున్నారు' అని వర్ల అన్నారు.

స్వల్ప కాలంలో భారీ సంస్కరణలు తెచ్చిన ఎన్టీఆర్: కంభంపాటి

అమరావతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ రాజకీయం కేవలం పుష్కర కాలం, అధికారంలో ఉన్నది ఆరున్నరేళ్లే అయినా.. ఆ స్వల్ప కాలంలోనే విప్లవాత్మకమైన సంస్కరణలు తెచ్చి చరిత్రనే తిరగరాయడం అద్భుతమని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కంభంపాటి రామ్మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ చారిత్రక పురుషుడని, మనుషుల్లో దేవుడిగా మారాడని అన్నారు. వందలాది సంస్కరణలు తెచ్చిన విప్లవ నాయకుడు ఎన్టీఆర్ అంటూ పలు ఉదాహరణలను పేర్కొన్నారు. ఆలాంటి నేత నభూతో నభవిష్యత్ అంటూ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసి 41 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా ఆయన్ను గుర్తు చేసుకున్నారు.

మంత్రులు లేకుండానే వైసీపీ బస్సు యాత్ర

- గుంతకల్లులో ఆలీ మాట్లాడుతుండగానే సభ ఖాళీ


అనంతపురం జిల్లా గుంతకల్లులో నిర్వహించిన వైసీపీ బస్సు యాత్ర సభలో మాట్లాడుతున్న సినీ నటుడు ఆలీ, వైసీపీ బస్సు యాత్ర సభలో ఖాళీ కుర్చీలు

గుంతకల్లు, జనవరి 9: వైసీపీ చేపడుతున్న సామాజిక సాధికార బస్సు యాత్రలకు స్పందన రావడం లేదు. అనంతపురం జిల్లా గుంతకల్లు నియోజకవర్గ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన బస్సు యాత్రకు జనం కరువయ్యారు. మంత్రులెవరూ రాకపోవడంతో ఇద్దరు ఎంపీలు, పార్టీ జిల్లా అధ్యక్షుడే పెద్దదిక్కయ్యారు. యాత్ర సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎంపీ నందిగం సురేశ్ మాట్లాడారు. జగన్ కాంగ్రెస్‌ను వీడిన తర్వాత ఆ పార్టీ తమకు ప్రత్యర్థి అని, అందులో చేరిన షర్మిల కూడా తమకు ప్రత్యర్థేనని అన్నారు. అనంతరం పాత గుంతకల్లులోని బీరప్ప ఆలయ సర్కిల్ వద్ద నుంచి బస్సు యాత్రను ప్రారంభించారు. సభ మధ్యాహ్నం 3 గంటలకు మొదలవుతుందని చెప్పినా, రెండున్నర గంటల ఆలస్యంగా ప్రారంభించారు. సభ కోసం పొదుపు సంఘాల మహిళలను బలవంతంగా రప్పించారు. అయినా సభ మొదలయ్యే సమయానికి కుర్చీలన్నీ ఖాళీగా కనిపించాయి. మిగిలిన కొందరైనా వెళ్లకుండా ఉంటారని మున్సిపల్ మెప్మా సిబ్బంది సభ చివరలో అడ్డుగా నిలబడ్డారు. దీంతో మహిళలు ఫెక్సీలను చించేసి అందులో నుంచి దూరి వెళ్లిపోయారు. సభకు ప్రత్యేక ఆహ్వానితుడిగా వచ్చిన సినీ నటుడు ఆలీ ప్రసంగం కూడా చప్పగా సాగింది. ఆలీ మాట్లాడే సమయానికి సభలో జనం సగం ఖాళీ అయ్యారు. ఎంపీ తలారి రంగయ్య మాట్లాడే సమయానికి జనం జారుకున్నారు. కాగా, ఈ యాత్రకు నిరసనకారుల సెగ తగలకుండా మెయిన్ రోడ్డులో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటుచేశారు. సభ కోసం ఉదయం 11 గంటల నుంచే మెయిన్ రోడ్డును పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. వాహనాలను ప్రత్యామ్నాయ దారుల్లో మళ్లించారు. స్థానికులు రాత్రి ఏడు వరకూ ఇబ్బంది పడ్డారు.


దర్శిలో ఎడ్లపోటీలను తిలకించేందుకు హాజరైన జనం

దర్శిలో కోలాహలంగా ఎడ్ల పోటీలు

- భారీగా తరలివచ్చిన ప్రజలు .. పందేల్లో 100 జతల ఎద్దులు

దర్శి, జనవరి 9: సంక్రాంతి పండుగ ముందే వచ్చింది. గతంలో ఎన్నడూ జరగని విధంగా 4 రోజులపాటు ప్రకాశం జిల్లా దర్శిలో జరిగిన ఎడ్ల బలప్రదర్శన పోటీలు ప్రత్యేకతను చాటుకున్నాయి. 100 జతల ఎడ్లు పోటీలలో పాల్గొనటం, ఎక్కువమంది పోషకులకు బహుమతులు ఇవ్వటం వీక్షకులు చూసేందుకు ప్రత్యేక వసతులతో పాటు భోజన సౌకర్యాలు కూడా కల్పించటం ప్రత్యేకతగా మారింది. జనసేన నేత గరికిపాటి వెంకట్ ఈ పోటీలను ఏర్పాటు చేశారు. గత శనివారం ప్రారంభమైన పోటీలు మంగళవారం రాత్రి ముగిశాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఎద్దులు ఈ పోటీలలో పాల్గొన్నాయి. ప్రతి ఎడ్ల జతల్లో రెండు విభాగాల్లో వాటికి రూ.6 వేలు, మరో రెండు విభాగాల్లోని ఎడ్ల యజమానులకు రూ.10వేల చొప్పున కన్సొలేషన్ బహుమతులు అందించారు. తొలి రెండు రోజులు సుమారు 6 జతల ఎడ్లకు బహుమతులుగా రూ.2.5 లక్షలు, మూడవరోజు మూడు లక్షలు అందించారు. మూడవ రోజు ప్రథమ బహుమతి విజేతకు బుల్లెట్ వాహనాన్ని అంచారు. ఇక మంగళవారం రాత్రి జరిగిన తుది పోరులో విజేతగా నిలిచిన వారికి ప్రథమ బహుమతిగా రూ.7 లక్షల విలువైన ట్రాక్టర్‌ను అందజేశారు.

నిరూపిస్తే నామినేషన్ వేయను: మోహిత్

తిరుపతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి నియోజకవర్గంలో లక్ష దొంగ ఓట్లు చేర్పించినట్టు నిరూపిస్తే వచ్చే ఎన్నికల్లో తాను నామినేషన్ కూడా వేయనని చంద్రగిరి నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు టీడీపీ అధినేత చంద్రబాబుకు లేఖ రాశారు. విజయవాడలో సీఈసీ అధికారులకు చంద్రబాబు చేసిన ఫిర్యాదుపై స్పందిస్తూ, మోహిత్ తిరుచానూరులో మంగళవారం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబుకు రాసిన బహిరంగలేఖలో ఆయనను తాతా అని సంబోధించారు. 2019 ఎన్నికల్లో చంద్రగిరి నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,91,734 ఉంటే ఇపుడు 3,08,672 ఓట్లు ఉన్నాయన్నారు. ఐదేళ్లలో కేవలం 16 వేల ఓట్లు మాత్రమే పెరిగాయన్నారు. అసత్య ఆరోపణలు చేసిన వారిపై పరువు నష్టం దావా వేస్తున్నానని తెలిపారు.

దివ్యాంగురాలి స్థలం కబ్జా

- వైసీపీ నేత అండతో ఆక్రమణ.. న్యాయం కోసం బాధితుల దీక్ష


తహసీల్దారు కార్యాలయం వద్ద బైఠాయించిన బాధితులు

విడపనకల్లు, జనవరి 9: అనంతపురం జిల్లా విడపనకల్లు మండలం కరకముక్కల గ్రామంలో మానసిక దివ్యాంగురాలు ఎర్రెమ్మకు చెందిన స్థలాన్ని అధికార పార్టీ నేత ఆక్రమించాడు. దీంతో బాధితురాలితో కలిసి తహసీల్దారు కార్యాలయం వద్ద తల్లి నిరసన దీక్ష చేపట్టారు. గ్రామానికి చెందిన పెద్ద సుంకన్న, తిప్పమ్మ దంపతుల చిన్న కూతురు ఎర్రెమ్మకు పుట్టుకతో మానసిక వైకల్యం వచ్చింది. పెద్ద సుంకన్నకు గతంలో ఇందిరమ్మ పథకం కింద ఇంటి స్థలం ఇచ్చారు. అందులో రెండు సెంట్ల స్థలాన్ని ఎర్రెమ్మ పేరిట 2009లో రాయించి ఇచ్చాడు. తండ్రి చనిపోయిన తర్వాత ఆ స్థలంలో ఎర్రెమ్మకు గుడిసె వేసి ఇచ్చేందుకు కుటుంబసభ్యులు ప్రయత్నం చేశారు. వారి ప్రయత్నాన్ని అధికార పార్టీ నేత ఒకరు అడ్డుకున్నారు. ఆయన తన అనుచరుడైన ముండ్ల ఈరన్న భార్య యశోదమ్మ పేరిట 2014లో నకిలీ పట్టాను తయారు చేయించారని బాధితులు ఆరోపిస్తున్నారు. స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించారని, దీంతో పాల్తూరు పోలీసులకు, తహసీల్దారుకు ఫిర్యాదు చేశామని వారు తెలిపారు. ఆ స్థలం జోలికి వెళ్లవద్దని అధికారులు హెచ్చరించినా ఈరన్న బండలు పాతి ఆక్రమించారని తెలిపారు. న్యాయం చేయాలని కోరుతూ తహసీల్దారు కార్యాలయం వద్ద ఎర్రెమ్మతో కలిసి ఆమె తల్లి తిప్పమ్మ బైఠాయించారు. తమకు గతంలో ప్రభుత్వం ఇచ్చిన స్థలమే కేటాయించాలని, లేదంటే ఆత్మహత్య చేసుకుంటామన్నారు.

చిన్నారిపై ఐదుగురు బాలురు అఘాయిత్యం

కవిటి, జనవరి 9: శ్రీకాకుళం జిల్లా కవిటి మండలంలోని ఓ గ్రామానికి చెందిన తొమ్మిదేళ్ల బాలికపై సామూహిక అత్యాచారం జరిగింది. ఆ చిన్నారి తల్లి మంగళవారం పోలీసులను ఆశ్రయించడంతో ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత నెల 31న జరిగిన ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి సమీపంలో ఆడుకుందామంటూ 12 ఏళ్ల వయసున్న ఐదుగురు బాలురు.. బాలికను తీసుకెళ్లి లైంగిక దాడి చేశారు. ఈ విషయం బాలిక తల్లికి చెప్పడంతో గ్రామపెద్దల దృష్టికి తీసుకెళ్లింది. వారంతా సర్దిచెప్పే ప్రయత్నం చేశా రు. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు ఆ ఐదుగురు బాలురుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కె.రాము తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'పర్యాటక' యుద్ధం!

మీ దేశంనుంచి మరింతమంది పర్యాటకులను మా దేశానికి పంపండి అంటూ చైనా పర్యటనలో ఉన్న మాల్దీవుల కొత్త అధ్యక్షుడు మొహమద్ మొయిజు మంగళవారం విజ్ఞప్తిచేశారు. మాల్దీవుల్లో ఇంటిగ్రేటెడ్ టూరిజం జోన్ ఏర్పాటుకు వీలుగా ఉభయదేశాలు యాభైమిలియన్ డాలర్ల ఒప్పందం చేసుకున్నట్టు వార్తలు వస్తున్నాయి. మొయిజు ఇంకా ఎన్నికల ప్రచారంలో ఉండగానే, ఆయన చైనా అనుకూలుడన్న విశ్లేషణలు లోతుగా జరిగాయి. అధికారంలోకి రాగానే, ఆయన భారతదేశానికి వ్యతిరేకంగా కొన్ని నిర్ణయాలు కూడా తీసుకున్నారు. తన తొలి విదేశీ పర్యటన టర్కీలో పూర్తిచేసుకొని, ఇప్పుడు చైనాలో కాలూనడం కూడా అంచనాలకు అనుగుణంగానే ఉన్నది. ఈ పర్యటనలో ఆయన వ్యాఖ్యలు, ఒప్పందాలకు ఇటీవలి 'లక్షద్వీప్ వర్సెస్ మాల్దీవ్స్' వైరం కూడా దోహదపడి ఉండవచ్చు.

భారతదేశానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసినందుకు ఆదివారం తన మంత్రులు ముగ్గురిని మొయిజు సస్పెండ్ చేశారు. కొత్త సంవత్సరం తొలివారంలో రెండురోజులు తమిళనాడు, కేరళలో పర్యటించిన భారత ప్రధాని నరేంద్రమోదీ, లక్షద్వీప్‌లోనూ కాలూని అక్కడ వెయ్యికోట్లు విలువచేసే ప్రాజెక్టులను ఆరంభించారు. ఈ ద్వీపంలో మోదీ అడుగుపెట్టడం పదేళ్ళ కాలంలో ఇది రెండోసారి. ఈసారి ఆయన సమీక్షలకు, ప్రకటనలకు పరిమితం కాకుండా, సముద్రంలో సాహసకృత్యాలు చేశారు, ఒడ్డున కూచొని ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించారు. జనవరి 4న ఆయన చేసిన ట్వీట్లలో 'సాహసికులకు సరైన గమ్యస్థానం లక్షద్వీప్' అంటూ ఓ వ్యాఖ్య కూడా ఉంది. సహజంగానే, ఆయన అభిమానులు, బీజేపీ మద్దతుదారులు దాని ఆధారంగా, మోదీ పర్యటనతో లక్షద్వీప్‌లో టూరిజం హెచ్చి, చైనా కీలుబొమ్మ ప్రభుత్వం ఉన్న మాల్దీవులు చావు దెబ్బతింటుందని, ఇది మోదీ తెలివైన ఎత్తుగడనీ కీర్తించడం ఆరంభించారు. దీనికి ప్రతిగా ఈ రెండు ప్రాంతాలను సరిపోల్చుతూ మాల్దీవులనుంచి కొందరు చేసిన ట్వీట్లు అసభ్యకరంగా ఉండటం, అక్కడి మంత్రులు శ్రుతిమించడం ఆ దేశానికి అప్రదిష్ట తెచ్చింది. ఏటా రెండు లక్షలమంది భారతీయులు మాల్దీవులకు టూరిస్టులుగా పోతున్నందున జరిగిన నష్టాన్ని వెంటనే గుర్తించి అక్కడి అసోసియేషన్ కూడా ఈ వ్యాఖ్యలను ఖండించింది. భారత ప్రభుత్వం ఆ దేశ రాయబారిని పిలిచి తన ఆగ్రహాన్ని వెలిబుచ్చడం, సినీ, క్రీడాప్రముఖులు కొందరు ఈ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా స్పందించడంతో అగ్గి చల్లారడం లేదు. ఈ రచ్చతో మనదేశంనుంచి వేసవి సెలవులకు మాల్దీవులకు పోదామనుకున్న వేలాదిమంది దేశాభిమానంతో టిక్కెట్లు రద్దుచేసుకున్నారని, ఇంటర్నెట్‌లో లక్షద్వీప్ గురించి తెలుసుకోవడం వేలాదిరెట్లు పెరిగిందని వార్తలు వస్తున్నాయి. 'బాయ్‌కాట్ మాల్దీవ్స్' అన్న నినాదం వినడానికి బాగుంటుంది కానీ, సగం దీవులు మాత్రమే నివాసయోగ్యంగా ఉంటూ పరిమాణంలో చిన్నదైన లక్షద్వీప్‌ను దానికి పోటీగా నిలపడం అసాధ్యమైన విషయం. చాలాదేశాలనుంచి మాల్దీవులకు ఇప్పటికే ఉన్న విమానసౌకర్యాలు, పర్యాటకమే లక్ష్యంగా దశాబ్దాలుగా అది వివిధ దీవుల్లో నెలకొల్పిన వసతులు, సౌకర్యాల దృష్ట్యా లక్షద్వీప్‌ను ఎంతోకొంత పెంచడానికి సైతం చేయవలసింది చాలా ఉంటుంది.

2020లో గుజరాత్ మాజీ మంత్రి ప్రఫుల్ ఖోడా పటేల్ లక్షద్వీప్ పాలకుడుగా నియమితుడైన తరువాత, లక్షద్వీప్ డెవలప్‌మెంట్ అథారిటీ రెగ్యులేషన్ చట్టం పేరిట ఆయనకు దఖలుపడిన సర్వాధికారాలు స్థానికుల, స్థానిక నాయకుల్లో తీవ్రమైన ఆగ్రహం కలిగించాయి. అభివృద్ధి కోసం స్థానికులను వేరే ప్రాంతాలకు తరలించేందుకు, వారి ఆస్తులను స్వాధీనం చేసుకొనేందుకు ఈ చట్టం అనుమతిస్తుంది. లక్షద్వీప్ అందం, అభివృద్ధి గురించి పాలకులు మాట్లాడుతున్నారంటే, వారి అభిమానులు దేశభక్తిని జోడిస్తున్నారంటే, దానిని ఆశ్రిత పెట్టుబడిదారులకు అప్పగించడానికేనని కొందరు ట్వీట్లు చేస్తున్నారు. మాల్దీవులకు, శ్రీలంకకు సమీపంలో ఉంటూ, హిందూమహా సముద్రంలో చైనా పెత్తనం పెరుగుతున్న నేపథ్యంలో లక్షద్వీప్‌ను రక్షణపరంగా బలోపేతం చేసుకోవడం ముఖ్యం. అలాగే, ప్రస్తుత పాలకుడు మనకు వ్యతిరేకంగా ఉన్నంత మాత్రాన మాల్దీవులను దూరం చేసుకోవడం అది చైనాకు మరింత సన్నిహితం కావడానికి ఉపకరిస్తుంది.

రాజకీయ పునర్వివాహాలు

వంద రోజుల్లో ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఏయే పూలు పూజకు పనికొస్తాయో, ఏయే పూలు పూజకు పనికిరావో నిర్ధారణ చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఎమ్మెల్యేలు ఒక్కొక్కరిని తాడేపల్లి ప్యాలెస్‌కి పిలిపించుకొని ఏవో సర్వే కాగితాలు చేతుల్లో పెట్టి, రేపటి ఎన్నికల్లో మీకు సీటు ఇవ్వం అని తెగేసి చెబుతున్నారు. ముఖ్యమంత్రి మాటకు ఎదురు చెప్పలేని అస్సాహసికులు కొందరు, చెప్పగలిగిన సాహసవంతులు ఇంకొందరు మీడియా ముందుకు వచ్చి వారి వారి మనోభీష్టాలను తెలియపరుస్తున్నారు. కొంతమంది ఎమ్మెల్యేలు వేదికలపైనే అలిగి వెళ్లిపోతున్నారు. కొంతమంది ఐదు నిమిషాల అపాయింట్‌మెంట్ చాలు అంటున్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే ఎమ్మెస్ బాబు లాంటివారు తిరగబడి వైసీపీలో దళితులు అంటే చులకన భావం ఉందని బహిరంగంగానే ఆవేదన వ్యక్తం చేశారు. వీరితోపాటు దాడి వీరభద్రరావు, సి. రామచంద్రయ్య లాంటి సీనియర్ పొలిటీషియన్లు ఈ కొలనులో నీళ్ళు ఎండిపోతున్నాయని, పక్క కొలనులోకి జారిపోయారు. మరికొందరు ఈ పడవ మునక తప్పదులే, అనుకొని పడవ నుంచి మెల్లగా ఒడ్డుకు జారుకుంటున్నారు.

అధికార పార్టీలో ఈ విడాకుల తంతు ఎందుకు జరుగుతుందో, దీని ప్రతిఫలం, ఫలితం ఎలా ఉంటుందో, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దశల వారీగా ఎమ్మెల్యేల సీట్లు ఎందుకు చించుతున్నారో, చిరిగే సీట్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఎమ్మెల్యేలే ఎందుకు టార్గెట్ అవుతున్నారో... అనేది మరో రాజకీయ చర్చ. దాని సంగతి కూడా పక్కన పెడితే, ఇలా నాలుగున్నరేళ్ళు వైసీపీలో సంసారం చేసి ఇప్పుడు విడిపోయిన వారి కోసం ప్రతిపక్ష పార్టీలు ఎందుకు తహతహ లాడుతున్నాయి?

ఎమ్మెల్యే ఏడుకొండలు సినిమాలో దర్శకుడు దాసరి నారాయణరావు ఒక మాట అంటారు. రాజకీయ నాయకునికి పెళ్ళాం లేచి పోయినా బాధ ఉండదు కానీ పదవి పోతే బాధపడతాడు అని. అప్పట్లో ఈ డైలాగ్ సూపర్ డూపర్ హిట్టయింది. బహుశా అలాంటి పదవీ ప్రేమ బంధం ఇదేనేమో. నాలుగున్నరేళ్ళ వైసీపీ పాలనలో ఎన్నో దురదృష్ట సంఘటనలు, మూర్ఖపు నిర్ణయాలు జరిగాయి. మూడు ప్రాంతాల ప్రజల సాక్షిగా, శాసనసభ తీర్మానాల సాక్ష్యంగా, సీఆర్డీఏ చట్టం, ఫాం 19.4 ఒడంబడికలతో రాష్ట్ర మధ్యస్థంగా రైతుల భూములతో నిర్మితమైన రాజధానిని ముఖ్యమంత్రి ఏకపక్షంగా రద్దు చేశారు. మూడు రాజధానుల పేరిట మూడు ప్రాంతాల్లో విభజన రేఖలు గీశారు. అయినా రాజధాని ప్రాంతంలోని వైసీపీ ఎమ్మెల్యేలు, నాయకులు మౌనం దాల్చారు. రాష్ట్రంలో దళిత, గిరిజనులపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు, శిరోముండనాలు, మూత్ర విసర్జనలు జరిగినా ఎస్సీ, ఎస్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు అందరూ మిన్నకుండి పోయారు. బీసీలపై హత్యలు, కేసులు పెట్టినా, మైనార్టీలపై దాష్టీకం జరిగినా ఆయా సామాజిక వర్గాల ఎమ్మెల్యేలు కూడా ముఖ్యమంత్రికి ఎదురు చెప్పలేకపోయారు. అందరూ ముఖ్యమంత్రి 'తానా' అంటే 'తందానా' అంటూ తాళం వేశారు. ఇప్పుడు వాళ్ళ కాళ్ళ కిందకి నీళ్లు రాగానే, ఎమ్మెల్యే సీట్లలో పోటీ చేసే అవకాశాలు సన్నగిల్లగానే పక్కచూపులు చూస్తున్నారు. అన్న వదిలిన షర్మిలమ్మ బాణం అన్నకు ఎదురు తిరిగి కాంగ్రెస్ పగ్గాలు చేపట్టగానే ఈ సందడి మరింత జోరుగా సాగుతోందనేది పరిశీలకుల అంచనా. ఏదైతేనేం? ఇంద్రధనస్సులో ఏడు రంగులు ఉంటే, ఏపీ రాజకీయ యవనికపై 14 రంగులు కనిపిస్తున్న పరిస్థితి.

– పోతుల బాలకోటయ్య

రణం – విస్తరణం

ఇజ్రాయెల్, హమాస్ రణం విస్తరణ చెంది ఆ ప్రమాదం ప్రపంచవ్యాప్తం కావడం శోచనీయం. ఇందుకు బాధ్యత ఇరువురి వైపు నుంచి ఉన్నా, ఇజ్రాయెల్ వైపు నుంచి ఎక్కువ ఉంది. ఏమైనా పరిస్థితులు దిగజారడానికి ప్రపంచ దేశాల ఐక్యరాజ్యసమితి వైఫల్యంతో పాటు, అగ్రరాజ్యాల స్వార్థబుద్ధి ప్రధాన కారణం. ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి చేసి వందల మంది పౌరుల్ని బలి తీసుకోగా, పాలస్తీనాపై ఇజ్రాయెల్ యుద్ధం ప్రకటించి ఇప్పటికి ఇరవై వేల మందికి పైగా పౌరులని పొట్టన పెట్టుకుంది. గాజాలో సగభాగాన్ని ధ్వంసం చేసి, యుద్ధాన్ని ఇంకా కొనసాగిస్తోంది. మానవతా దృక్పథంతో వచ్చే సాయాన్ని కూడా ఆ దేశ పౌరులకు అందనివ్వడం లేదు. భారత్ సహా ఐక్యరాజ్యసమితి దేశాలు యుద్ధాన్ని విరమించమని కోరినా పెడ చెవిన పెడుతోంది. పైగా ఇతర దేశాల్ని ఇందులోకి లాగుతోంది. లెబనాన్‌లో దాక్కున్న హమాస్ పెద్ద తలకాయని నేరుగా మట్టుబెట్టడంతో ఆ దేశం ఇజ్రాయెల్‌పై గుర్రుగా ఉంది. ఇటీవల ఇరాన్‌లో రెండు బాంబు పేలుళ్లతో వందమంది పౌరులు మరణించారు. వాటి వెనుక ఐఎస్ టెర్రరిస్ట్ సంస్థ హస్తమున్నట్టు ప్రకటించినా, ఇరాన్ అనుమానాలు మాత్రం ఇజ్రాయెల్, అమెరికా వైపుకే పోతున్నాయి. ఈ యుద్ధం పర్యవసానాలు అంతర్జాతీయ వాణిజ్యంపై నేరుగా పడుతోంది. యెమెన్ వేదికగా పనిచేస్తున్న తీవ్రవాదులు సూయజ్ కాలువ ద్వారా సాగుతోన్న వాణిజ్య నౌకలపై దాడి చెయ్యడం మొదలెట్టాయి. ఫలితంగా భద్రతపై వెచ్చించే ఖర్చు పెరుగుతోంది. ఇప్పటికీ ఇజ్రాయెల్ వెనక్కి తగ్గకపోవడం ప్రపంచ ఆర్థికాన్ని, శాంతినీ నష్టపరిచే ప్రక్రియ.

– డివిజి శంకరరావు

అమెరికా సరిహద్దుల్లో పట్టుబడ్డ సుమారు లక్ష మంది భారతీయులలో 45 వేల మంది తమకు స్వదేశంలో ప్రాణాపాయం ఉన్నందున శరణార్థులుగా ఆశ్రయం ఇవ్వాల్సిందిగా కోరడం గర్హనీయం. అమెరికాలో అడుగు పెట్టడానికై మాతృభూమిపై అభాండాలు వేయడమేమిటి? స్వదేశంపై నీచమైన నిందలు మోపిన వారి గురించి దేశానికి తెలియజేయడం ప్రభుత్వ నైతిక బాధ్యత కాదా?

లజ్జాకర వలసలు!

ఏదైనా ఒక ప్రాంతం నుంచి వలసలు జరుగుతున్నాయంటే సదరు ప్రాంతం అభివృద్ధికి అమడ దూరంలో ఉన్నదై ఉంటుంది. ఉపాధి, వ్యాపారావకాశాలు లేని చోట ఎవరు సుఖ సంతోషాలతో ఉండగలరు? మాతృభూమిలో లభించని మెరుగైన ఉన్నత విద్య, పరిశోధన అవకాశాలను అందిపుచ్చుకోవడానికై భారత మన యువజనులు నేడు పెద్ద సంఖ్యలో పరసీమలకు వెళ్లుతున్నారు.

భారత్ శరవేగంగా అభివృద్ధి చెందుతోంది, సందేహం లేదు. ముఖ్యంగా గుజరాత్, సత్వర అభివృద్ధిలో యావద్భారతదేశానికీ ఆదర్శప్రాయంగా ఉన్నది. 'గుజరాత్ అభివృద్ధి నమూనా' ఆధారంగానే నరేంద్ర మోదీ జాతీయ స్థాయి నాయకుడుగా ఎదిగారు. అయితే అన్ని రంగాలలో బాగా వెనుకబడిన వివిధ ఉత్తరాది రాష్ట్రాల నుంచి కాకుండా మోదీ నిర్మించిన 'ఉజ్వల గుజరాత్' నుంచే విదేశాలకు, ముఖ్యంగా అమెరికాకు వలసలు చోటు చేసుకుంటున్నాయి. ఇది నిజంగా ఒక విస్మయకర వాస్తవం. అనాదిగా వలసలకు గుజరాత్ పెట్టింది పేరు. మహాత్మాగాంధీ కంటే చాలా ముందుగా ఆఫ్రికా దేశాలకు గుజరాతీలు గౌరవప్రదమైన రీతుల్లో వలస వెళ్లారు. సిరి సంపదలు, పేరు ప్రతిష్ఠలు సంపాదించారు. గాంధీ మొదలు, ధీరుబాయి అంబానీ, శ్యాం పిట్రోడాల వరకు అనేక మంది గుజరాతీలు వలస వెళ్లారు. మళ్లీ మాతృభూమికి తిరిగి వచ్చారు. అటు కర్మభూమి, ఇటు జన్మభూమి అభివృద్ధికి అసాధారణ సేవలు అందించారు. గల్ఫ్ దేశాల వ్యాపార, వాణిజ్య రంగాలలో అగ్రగణ్యులుగా ఉన్న ప్రవాస భారతీయులలో గుజరాతీలనే ముందుగా చెప్పితీరాలి. దుబాయి అభివృద్ధిలో గుజరాతీల పాత్ర విస్మరించలేనిది.

గల్ఫ్ లేఖ

వలసజీవనులుగా విశిష్ట చరిత్ర ఉన్న గుజరాతీలు గత కొంత కాలంగా అడ్డదారిన అమెరికాకు పయనించడానికి పట్టువదలని విక్రమార్కుల్లా పడుతున్న పాట్లు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి. ప్రత్యేకించి అమెరికా ఇరుగు పొరుగు దేశాల నుంచి ఆ భాగ్యసీమలోకి చొరబడేందుకు చేస్తున్న ప్రయత్నాలు భారత్ ప్రతిష్ఠను మంటగల్పుతున్నాయి. వీసా వగైరా లేకుండా అడ్డదారిన అమెరికాలో చొరబడడానికి మరీ ప్రత్యేక విమానాలలో వెళ్ళినట్లుగా వస్తున్న వార్తలు భారత్‌కు గౌరవ హాని కలిగిస్తున్నాయి. గుజరాత్ నుంచి దుబాయికి, దుబాయి నుంచి ప్రత్యేక విమానాలలో నికరాగ్వాకు, అక్కడి నుంచి మెక్సికో వెళ్లి అంతిమంగా అమెరికాలో ప్రవేశించేందుకు గుజరాతీలు చేస్తున్న ప్రయత్నాలు వెలుగులోకి వస్తున్నాయి. భారత్ సిగ్గుతో మౌనంగా తలదించుకోవల్సిన ఆగత్యం ఏర్పడింది.



అమెరికాలోకి అక్రమ చొరబాటుకు పూనుకున్నవారిని తీసుకువెళ్లుతున్న ఒక ప్రత్యేక విమానం దుబాయి నుంచి బయలుదేరి తన గమ్య స్థానమైన నికరాగ్వాకు వెళ్లుతూ మార్గమధ్యంలో ఫ్రాన్స్‌లో అక్రమ రవాణా అభియోగంపై అడ్డగించబడి అటు నికరాగ్వా ఇటు దుబాయి కాకుండ గుట్టుచప్పుడుగా భారత్‌కు తిరిగి వచ్చింది. తీవ్ర ఉదంతంగా పరిగణించాల్సిన ఈ వ్యవహారంపై మీడియా, న్యూఢిల్లీ అధికార వర్గాలు మౌనం వహించడం మరీ ఆశ్చర్యం కలిగిస్తోంది.

ఒక్క 2023 సంవత్సరంలోనే వీసా లేకుండా అక్రమంగా తమ దేశంలో ప్రవేశించడానికి ప్రయత్నిస్తున్న ఇంచుమించు లక్ష మంది భారతీయులను అమెరికా అధికారులు అరెస్ట్ చేశారు. దీన్ని బట్టి అమెరికాలోకి అక్రమ చొరబాటుల వ్యవహారం ఎంత పరాకాష్ఠకు చేరిందో అర్థం చేసుకోవచ్చు. అదే సంవత్సరంలో బంగ్లాదేశ్ నుంచి భారత్‌లో అక్రమంగా చొరబడడానికి ప్రయత్నించి పట్టుబడ్డ బంగ్లాదేశీ జాతీయుల సంఖ్య ఎంతో తెలుసా? కేవలం 744 మాత్రమే. అమెరికా సరిహద్దుల్లో పట్టుబడ్డ సుమారు లక్ష మందిలో 45 వేల మంది తమకు భారత్‌లో ప్రాణాపాయం ఉందని చెప్పి తమకు శరణార్థులుగా ఆశ్రయం ఇవ్వాల్సిందిగా కోరడం గర్హనీయం. అమెరికాలో అడుగు పెట్టడానికై మాతృభూమిపై ఇలాంటి అభాండాలు వేయడమేమిటి? స్వదేశంపై నీచమైన నిందలు మోపిన వారి గురించి దేశానికి తెలియజేయడం ప్రభుత్వ నైతిక బాధ్యత కాదా? మొత్తం 7.25 లక్షల మంది భారతీయులు తమ దేశంలో అక్రమంగా నివసిస్తున్నారని అమెరికా ప్రభుత్వ నివేదికలు వెల్లడిస్తున్నాయి. రెండు దశాబ్దాల క్రితం తెలంగాణ రాష్ట్ర సమితి శాసనసభ్యులు కొందరు తమ కుటుంబ సభ్యులుగా గుజరాతీ మహిళలు, పిల్లలను అమెరికాకు తమ వెంట తీసుకువెళ్ళిన విషయం గుర్తుందా?

ఆకలి మంటలు, అంతర్యుద్ధాలతో విలవిలలాడే ఆఫ్రికా దేశాల వారు సహారా ఎడారి దాటి, సముద్రమార్గాన ఐరోపాకు చేరుకోవడాన్ని అర్థం చేసుకోవచ్చు. అదే విధంగా, కరువుకాటక ప్రాంతాలకు చెందిన (సరైన వృత్తి నైపుణ్యాలు లేని) యువత గల్ఫ్ దేశాలలో వీసా నేరంపై పట్టుబడుతున్నారంటే అర్థం చేసుకోవచ్చు. అయితే ఆర్థిక పరిస్థితి బాగా ఉండి కూడ అడ్డదారిన అమెరికాకు వెళ్లుతున్న గుజరాతీల ఉదంతాలను ఏ విధంగా అన్వయించుకోవాలి? తెలుగు యువజనులతో సహా ఎంతో మంది యువ భారతీయులు తమ ప్రతిభా సామర్థ్యాలతో అమెరికాలో తమ తమ వృత్తులు, ఉద్యోగాలలో అగ్రగాములుగా వెలుగొందుతున్నారు. మరి ఆ సుసంపన్న దేశంలోకి అక్రమంగా చొరబడేందుకు కొందరు చేస్తున్న ప్రయత్నాలు ఒక్క గుజరాత్ లేదా పంజాబ్‌కే కాకుండ సమస్త భారతావనికి తీరని కళంకం కలిగిస్తున్నాయి.

▪ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)


'జాతీయ' బంధాలలో ప్రాంతీయ పార్టీలు

దేశ రాజకీయాలు వేగంగా మారుతున్నాయి. గత రెండు సార్వత్రిక ఎన్నికల్లోనూ బీజేపీకి పూర్తి మెజారిటీ సాధించి పెట్టిన నరేంద్రమోదీ ఇప్పుడు ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు కనపడుతోంది. రామమందిర నిర్మాణాన్ని ఒక ఎన్నికల అంశంగా మార్చేందుకు ఎంత ప్రయత్నించినా అది ఎన్ని రాష్ట్రాల్లో బీజేపీకి సానుకూలంగా మారుతుందో ఆ పార్టీ నేతలు కూడా చెప్పలేకపోతున్నారు. ముఖ్యంగా ఈశాన్య, దక్షిణాది రాష్ట్రాల్లో మతం రాజకీయంగా భావోద్వేగపరమైన అంశంగా మారుతుందా అన్నది చర్చనీయాంశం. 'రామమందిరం నిర్మాణం జరిగినందుకు దూకుడుగా వ్యవహరించకండి' అని మోదీ తన మంత్రులకు చెప్పడం అతిగా ప్రచారం బెడిసికొడుతుందేమో అన్న భయానికి సంకేతం. ఇటీవల జరిగిన మూడు ఉత్తరాది రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించినప్పటికీ కాంగ్రెస్ ఓటు శాతం ఏ మాత్రం తగ్గలేదు. అసెంబ్లీ ఎన్నికలను కూడా మోదీ జాతీయ స్థాయి ఎన్నికలుగా మార్చడంతో ప్రాంతీయ పార్టీలను అక్కడి ప్రజలు పూర్తిగా తిరస్కరించారు. ఎస్పీ, బీఎస్పీలు మాత్రమే కాదు, ఛత్తీస్‌గఢ్‌లో అజిత్ జోగి కుమారుడు అమిత్ జోగి నేతృత్వంలోని జనతా కాంగ్రెస్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. అందువల్ల ఈ మూడు రాష్ట్రాల్లో ఓటమితో కాంగ్రెస్‌ను కొట్టిపారేయాల్సిన అవసరం ఎంత మాత్రమూ లేదు. కర్ణాటక, తెలంగాణ విజయాలతో పుంజుకున్న కాంగ్రెస్ ఈ సారి వివిధ రాష్ట్రాల్లో మిత్రపక్షాలతో పొత్తుల విషయంలో ఎన్ని త్యాగాలకైనా సిద్ధమన్న వైఖరిని ప్రదర్శించడంతో ఇండియా కూటమి ఈ సారి మోదీతో అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధపడుతున్న సంకేతాలు కనపడుతున్నాయి.

ఈ నేపథ్యంలో 2024 ఎన్నికలు స్పష్టంగా రెండు కూటములు, రెండు భావజాలాల మధ్య పోటీగా మారబోతున్నాయనడంలో సందేహం లేదు. బీజేపీ, దాని మిత్రపక్షాలు– కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు మధ్య జరిగే ఈ ప్రధాన పోటీలో ఇతర ప్రాంతీయ పార్టీల పాత్ర బాగా తగ్గిపోయే అవకాశాలు ఉన్నాయి. నిజానికి ఈ దేశంలో ప్రాంతీయ పార్టీల హవా 2014 నుంచీ తగ్గిపోతూ వస్తోంది. 1989–2014 మధ్య జాతీయ పార్టీలకు మెజారిటీ రాకపోవడంతో ప్రాంతీయ పార్టీల ప్రాధాన్యం బాగా పెరిగింది. కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏ జాతీయ పార్టీ ఏర్పాటు చేసినా ప్రాంతీయ పార్టీల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉండేది. 2014 తర్వాత లోక్‌సభలో బీజేపీ మెజారిటీ సాధించడం, యూపీ, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో బీజేపీదే పైచేయి కావడంతో ప్రాంతీయ పార్టీలు ఆత్మరక్షణలో పడ్డాయి. 2019 తర్వాత ప్రాంతీయ పార్టీల ఉనికికే ప్రమాదం ఏర్పడే పరిస్థితి ప్రారంభమైంది. కాంగ్రెస్, బీజేపీల్లో ఏదో ఒక జాతీయ పార్టీతో కలిసి పనిచేయాల్సిన చారిత్రక అవసరం వాటికి ఏర్పడింది.

కర్ణాటక, తెలంగాణల్లో కాంగ్రెస్‌ను గెలిపించడం ద్వారా ప్రాంతీయ పార్టీలను ప్రజలు తిరస్కరించారు. కర్ణాటకలో జెడి(ఎస్) బాగా దెబ్బతినగా, తెలంగాణలో బీఆర్ఎస్ తానెక్కిన కొమ్మను తానే నరుక్కుంది. కుమారుడి భవిష్యత్ కోసం జనతాదళ్ (ఎస్) అధినేత దేవెగౌడ తన చరమ దశలో మోదీ చెంతకు చేరేందుకు సిద్ధపడ్డారు. మరి తెలంగాణలో బీఆర్ఎస్‌ను బీజేపీ అధికారికంగా చేరదీస్తుందా, లేక బీఆర్ఎస్ మటుమాయమైపోతే ఆ స్థానంలో తాను బలపడాలని భావిస్తోందా అన్న చర్చ జరుగుతోంది. ఈ ప్రశ్నకు సమాధానం త్వరలో లభించవచ్చు. ఏమైనా బీఆర్ఎస్ మళ్లీ ఒకప్పటి పోరాట స్ఫూర్తితో పనిచేస్తేనే కాని కోలుకునే అవకాశాలు లేవు.

ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించినప్పుడు అక్కడ అధికారంలో ఉన్న వైసీపీ తీవ్ర ప్రజా వ్యతిరేకత కూడగట్టుకున్న విషయం స్పష్టమైంది. అధికార వర్గాలు, గ్రామీణ ప్రజలు, రాజకీయ పరిశీలకులు, జర్నలిస్టులు, మేధావులు అందరూ ముఖ్యమంత్రి జగన్ మళ్లీ అధికారానికి వచ్చే అవకాశాలు లేవని గట్టిగా అభిప్రాయపడ్డారు. ఇప్పటికే వేడెక్కిన రాజకీయ వాతావరణం జగన్‌కు ప్రతికూలంగా, తెలుగుదేశం–జనసేనకు అనుకూలంగా కనపడుతోంది. నిజానికి ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్‌తో ఒక సందర్భంలో మాట్లాడినప్పుడు తాను గత ఎన్నికల్లో జగన్‌కు సహాయపడే బదులు చంద్రబాబు తరఫున పనిచేసి ఉంటే బాగుండేదని అన్నారు. 'జగన్ ఒక వన్ టైమ్ వండర్' అని కూడా ఆయన వ్యాఖ్యానించారు. ఏ ఓటు బ్యాంకు ద్వారా జగన్ బలపడ్డారో ఆ ఓటు బ్యాంకును కొల్లగొట్టేందుకు జగన్ చెల్లెలు షర్మిలను కాంగ్రెస్ ప్రయోగించడం ఇటీవల జరిగిన ఒక కీలక పరిణామం. 2010లో కాంగ్రెస్ అధిష్ఠానం ఎంత చెప్పినా జగన్మోహన్ రెడ్డి వినకుండా పదవీకాంక్షతో ప్రాంతీయ పార్టీని స్థాపించారు. ఆయన జైలులో ఉన్నప్పుడు అన్న ప్రయోజనాలు కాపాడేందుకు షర్మిల ఎంతో కష్టపడ్డారన్నది జగద్విదితం. ఒక దశలో షర్మిల, తల్లి విజయమ్మ కలిసి ఎవరికి తెలియకుండా ఉండేందుకు బెంగళూరు ద్వారా ఢిల్లీ వచ్చి కాంగ్రెస్ పెద్దలతో జగన్ తరఫున రాజీకి ప్రయత్నించారు. ఇటీవల సోనియా, రాహుల్ గాంధీలను ఆమె కలుసుకున్నప్పుడు సొంత కుటుంబసభ్యురాలిని కలుసుకున్నట్లుగా వారు సంతోషించారు. 'అన్న లాగా షర్మిల వేరు కుంపటి పెడితే ఏం చేస్తారు' అని ఒక ఏపీ కాంగ్రెస్ నేత ప్రశ్నించినప్పుడు 'ఆమె ఇక కాంగ్రెస్ మనిషి. అది మా గ్యారంటీ' అని ఖర్గే, రాహుల్ అన్నట్లు సమాచారం. ప్రజలు అందలమెక్కించినప్పటికీ తనకు తానే నష్టం చేసుకున్న జగన్ కేసీఆర్ కోవలోకి చేరిపోయే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కాలక్రమేణా ఏపీలో కూడా ఎన్డీఏ, కాంగ్రెస్ పార్టీలే రంగంలో మిగిలిపోయినా ఆశ్చర్యపడనక్కర్లేదు.



ప్రధాని మోదీ పుణ్యమా అని ఏకమైన 'ఇండియా' కూటమి రాబోయే లోక్‌సభ ఎన్నికలకు సర్వసన్నద్ధమవుతోంది. మిత్రపక్షాలతో చురుగ్గా సీట్ల సర్దుబాట్లు చేసుకుంటోంది. బీజేపీతో ముఖాముఖి తలపడే సీట్లపైనే దృష్టి కేంద్రీకరిస్తోంది. రామమందిరం లాంటి భావోద్వేగ అంశాల జోలికి పోకుండా సామాజిక, ఆర్థిక సమస్యలపైనే వ్యూహాత్మకంగా ప్రజల్లోకి వెళుతోంది. దెబ్బతిన్న పులిలా రాహుల్ గాంధీ దేశంలో మరోసారి జోడో యాత్ర ప్రారంభించనున్నారు.

ఇక ఇతర రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీల పరిస్థితి ఎలా ఉన్నది? ఒడిషాలో నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బిజూజనతాదళ్ గత ఎన్నికల్లో అయిదోసారి అధికారంలోకి వచ్చినప్పటికీ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 8 సీట్లు గెలుచుకుంది. రాష్ట్రంలో బీజేపీ ప్రత్యర్థి అయినప్పటికీ ఆయన కేంద్రంలో బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. నవీన్ పట్నాయక్ అనంతరం బీజేడీ భవిష్యత్ అగమ్యగోచర పరిస్థితిలో పడడం తమకు ప్రయోజనకరమని బీజేపీకి తెలుసు. పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌ది పై చేయిగా ఉన్నప్పటికీ బీజేపీని ఎదుర్కోవడం కోసం కాంగ్రెస్, తదితర పార్టీలతో కలిసి పనిచేయక తప్పని పరిస్థితి ఏర్పడింది. బిహార్‌లో ఆర్‌జేడీకి గత లోక్‌సభలో ఒక సీటు కూడా రాలేదు. బీజేపీతో పొత్తు మూలంగా జనతాదళ్ (యు) లోక్‌సభలో 16 సీట్లు గెలిచింది కాని అది స్వంత బలం కాదు. అందువల్ల ఇప్పుడు మోదీ వ్యతిరేక శక్తులన్నీ కాంగ్రెస్‌తో కలిసి పోరాడక తప్పదు. యూపీలో సమాజ్‌వాది పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ ఈ సారి లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చూపించలేకపోతే ఆయన భవిష్యత్ కూడా సమస్యలో పడుతుంది. కనుక ఆయన కూడా కాంగ్రెస్‌తో కలిసి పనిచేయాల్సిన అగత్యం ఏర్పడింది. ఒకప్పుడు ముఖ్యమంత్రి పదవిలో ఉన్న మాయావతికి ఇప్పుడు అసెంబ్లీలో ఒక్క సీటే ఉన్నది. అదృశ్యమయ్యే ప్రాంతీయ పార్టీల జాబితాలో బిఎస్‌పి చేరకుండా ఆమె ఏమి చేస్తారన్నది ఇప్పుడు ఆసక్తికరం. '80 ఏళ్లు దాటినా కొందరు రాజకీయాలను పట్టుకుని వేళ్లాడుతుంటారు' అని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ తన బాబాయి, ఎన్‌సీపీ నేత శరద్ పవార్ గురించి వ్యాఖ్యానించారు. మహారాష్ట్రలో రెండు ముక్కలైన నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీని బతికించి తన కుమార్తె సుప్రియా సూలే భవిష్యత్‌ను కాపాడేందుకు 84 ఏళ్ల శరద్ పవార్ తీవ్ర పోరాటం చేస్తున్నారు. మరోవైపు ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని శివసేన కూడా రెండు ముక్కలై పార్టీ ఎన్నికల గుర్తు కూడా కోల్పోయింది. మోదీ ధాటికి తట్టుకోలేక కకావికలైన ఎన్‌సీపీ(శరద్ పవార్), శివసేన(ఉద్ధవ్ థాకరే)లకు కాంగ్రెస్‌తో కలిసి బీజేపీని ఎదుర్కోవడం మినహా వేరే మార్గం లేదు. ఢిల్లీ, పంజాబ్‌లలో ఒకప్పుడు కాంగ్రెస్‌పై పోరాడిన ఆమ్ ఆద్మీ పార్టీ కూడా నరేంద్రమోదీ తమపై కేంద్ర ఏజెన్సీలను ప్రయోగించడం మూలంగా దిక్కుతోచని పరిస్థితుల్లో కాంగ్రెస్‌తో రాజీపడాల్సివస్తోంది. జార్ఖండ్‌లో జేఎంఎం, తమిళనాడులో డీఎంకే మొదటి నుంచీ కాంగ్రెస్‌తో ఉన్నవే. బీజేపీతో తెగతెంపులు చేసుకున్న అన్నాడీఎంకే ఎటువైపు వెళుతుందో ఎన్నికల తర్వాత తేలుతుంది.



▪ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

ఇటీవల ముగిసిన పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఇండియా కూటమికి చెందిన పార్టీల ఎంపీలు అందరినీ మోదీ సర్కార్ ఉద్దేశపూర్వకంగానే బహిష్కరించింది. ఈ బహిష్కరణ మూలంగానే కాక, ఏజెన్సీలను ప్రయోగించడం వల్ల కూడా ఆ పార్టీలన్నీ గత్యంతరం లేక మరింత సంఘటితం అవుతాయని, తమను ఎదుర్కొనేందుకు సిద్ధపడతాయని మోదీకి బాగా తెలుసు. ఆయన కూడా తన వైపుకు వచ్చే పార్టీలను కూడా కలుపుకుని 'ఇండియా' కూటమిని ఎదుర్కొనేందుకు సిద్ధపడుతున్నారు. ఒకరకంగా ఇది మోదీ చేస్తున్న మరో బలమైన ప్రయోగం. ఎందరు ఎదురొచ్చినా తాడో పేడో తేల్చుకునేందుకు ఆయన తన సర్వశక్తులు ఒడ్డి పోరాడాలనుకుంటున్నారు. దేశంలో రాజకీయ పోరాటాన్ని ఆయనే రెండు కూటముల మధ్య ఘర్షణగా మార్చారు. ఈ ఘర్షణలో బీజేపీ ప్రభంజనం వీస్తే దేశంలో ఎన్ని పార్టీలు అస్తిత్వ పరీక్షలో పడతాయో చెప్పలేము. కాని మోదీ పుణ్యమా అని ఏకమైన ఇండియా కూటమి కూడా బలంగా రంగంలోకి దిగేందుకు సన్నాహాలు చేస్తోంది. అతి వేగంగా మిత్రపక్షాలతో సీట్ల సర్దుబాట్లు కుదుర్చుకుంటోంది. బీజేపీ, ఇతర రాజకీయ ప్రత్యర్థులతో ముఖాముఖి తలపడే సీట్లపైనే దృష్టి కేంద్రీకరిస్తోంది. రామమందిరం లాంటి భావోద్వేగ అంశాల జోలికి పోకుండా కేవలం రాజకీయ, సామాజిక, ఆర్థిక న్యాయానికి సంబంధించిన అంశాలపైనే వ్యూహాత్మకంగా ప్రజల్లోకి వెళుతోంది. దెబ్బతిన్న పులిలా రాహుల్ గాంధీ మరోసారి దేశంలో జోడో యాత్ర ప్రారంభించనున్నారు. ఈ ఎన్నికలు రాహుల్, కాంగ్రెస్, ఇండియా కూటమి భవిష్యత్‌నే కాదు, దేశ భవిష్యత్‌ను నిర్దేశించే ఎన్నికలని చెప్పక తప్పదు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

భారత్ వికసిస్తోందా... ఏదీ, ఎక్కడ?

నరేంద్రమోదీ ప్రభుత్వం 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర' పేరున దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రచారాన్ని చేపట్టింది. ఈ పదేళ్ల పాలనలో మోదీ సర్కార్ సాధించిన విజయాలను ప్రజల్లో ప్రచారం చేయడం ఈ యాత్ర ముఖ్యోద్దేశం. కేంద్ర మంత్రులు అనేక ప్రాంతాల్లో పర్యటిస్తూ తమ పాలనలో దేశం సాధించిన అభివృద్ధిని ప్రచారం చేస్తున్నారు. దేశ జీడీపీ (స్థూల జాతీయ ఉత్పత్తి) 7 శాతానికి పైగా వృద్ధి రేటుతో దూసుకుపోతోందని, 2047 కల్లా ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరిస్తుందని ప్రధాని మోదీ ఇటీవలే ప్రకటించారు. ఆయన ప్రభుత్వం ఈ పదేళ్ల కాలంలో సాధించిందేమిటో పరిశీలిస్తే స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాల (2047) నాటికి దేశం ఏ స్థితిలో ఉంటుందో స్పష్టంగా అవగతమవుతుంది.

జీడీపీ వృద్ధిరేటును ముందు సంవత్సరంతో పోల్చి ఈ సంవత్సరం ఎంత పెరిగిందో శాతంగా తెలుపుతారు. 2021లో కోవిడ్ సందర్భంగా మన జీడీపీ మైనస్ 5.8 శాతం నమోదయింది. దీనితో పోల్చి 2022, 2023లలో జీడీపీ వృద్ధిరేటు ఏడు శాతానికి పైగా చేరిందని ప్రభుత్వం లెక్క కట్టింది. వాస్తవంగా 2004–14 సంవత్సరాల మధ్య పదేళ్ల కాలంలో జీడీపీ వృద్ధిరేటు సగటున 8.1శాతంగా ఉంది. అదే నరేంద్ర మోదీ ప్రభుత్వ కాలంలో అది 5.4శాతం మాత్రమే. పోనీ వీరు చెబుతున్నట్లు సాధించిన అభివృద్ధి సామాన్యుల వద్దకు చేరుతోందా? ఆర్థిక అసమానతలలో భారతదేశం ప్రపంచంలోనే అగ్రభాగాన ఉందని ప్రపంచ బ్యాంకు తాజా నివేదిక పేర్కొంది. ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ గత పదేళ్ళ కాలంలో భారతదేశంలోని సంపన్నుల ఆదాయం పదిరెట్లు పెరిగిందని, వారి వార్షికాదాయం నేడు భారతదేశ బడ్జెట్ కంటే అధికమని తెలిపింది. జనాభాలో ఒక్క శాతంగా ఉన్న సంపన్నులకు దేశ ఆదాయంలో 73 శాతం పోతుండగా, 67 కోట్ల మంది సామాన్యుల ఆదాయం మాత్రం ఒక్క శాతమే పెరిగింది. వైద్య ఖర్చులకై అప్పులు చేయడం, ఆస్తులు అమ్ముకోవడం ద్వారా దేశంలో ప్రతి ఏటా 6.3 కోట్ల మంది ప్రజలు దారిద్ర్యంలోకి నెట్టబడుతున్నారని ఈ సంస్థ పేర్కొంది.

కేంద్ర ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్న వృద్ధిరేటు... ఉపాధి అవకాశాలు కల్పిస్తోందా అంటే అవీ సన్నగిల్లుతున్నాయి. మోదీ మహాశయుడు ఇచ్చిన రెండు కోట్ల ఉద్యోగాల హామీ గాలికి పోయింది. నిరుద్యోగిత రేటు పది శాతానికి చేరింది. ఇప్పటికే కులం, ప్రాంతం, మతం, జెండర్ అసమానతలతో ఉన్న భారతదేశంలో నేడు ఆర్థిక అసమానతలు కూడా చేరడం ఆందోళనకరంగా ఉందని ప్రొఫెసర్ హిమాన్షు (జేఎన్‌యూ) అన్నారు. పోనీ ప్రజల జీవన ప్రమాణాలయినా మెరుగుపడ్డాయా అంటే, దానికి భిన్నంగా పేదరికం పెద్ద ఎత్తున పెరుగుతోంది. ఆర్భాటంగా ప్రారంభించిన జన్‌ధన్ అకౌంట్లలో డబ్బులే లేవు. పెరుగుతున్న ధరలతో ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు.

ప్రధాని మోదీ పదేళ్ళ పాలనలో అసమానతలు మరింత పెరిగి, ప్రజల జీవన ప్రమాణాలు ఘోరంగా పడిపోయాయి. 2047లో స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాల నాటికి అయినా మనం నిజమైన 'వికాసం' సాధించగలుగుతామా?

నిత్యావసర సరుకులన్నీ విపరీతంగా పెరిగాయి. విద్య వైద్యం విలాస వస్తువులుగా మారిపోవడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఫలితంగా ప్రజలు పెద్ద ఎత్తున పేదరికంలోకి నెట్టబడుతున్నారు. 74.1 శాతం భారతదేశ పౌరులు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోలేకపోతున్నారని ఐక్యరాజ్యసమితికి చెందిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ నివేదిక తెలిపింది. జీడీపీ వృద్ధిరేటు సాధించడంలో విశేషమైన పాత్ర పోషిస్తున్న కార్మికులు, రైతుల జీవన ప్రమాణాలైనా మెరుగుపడ్డాయా అంటే అదీ లేదు.

అతి పెద్ద రైల్వే సహా ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగ నియామకాలను కేంద్ర ప్రభుత్వం దాదాపు నిలిపివేసింది. ఎటువంటి ఉద్యోగ భద్రత లేని, అత్యంత తక్కువ వేతనాలకు ఈ రోజున కార్మికులు పనిచేయవలసి వస్తోంది. కొత్తగా వస్తున్న ఉపాధి కూడా కాంట్రాక్టు, అసంఘటిత రంగాల్లోనే. వీరికి అత్యధికంగా నెలకు పదిహేను వేలకు మించి ఆదాయమే ఉండటం లేదు. మహిళాభివృద్ధి, బేటీ పడావో అని గొప్ప నినాదాలిస్తున్న మోదీ ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ, ఆశ, మిడ్ డే మీల్స్ వంటి రంగాల్లో పనిచేస్తున్న సుమారు కోటి మందికి పైగా మహిళా కార్మికులకు ఉద్యోగ భద్రత లేకపోవడమే కాక, వేతనాలు కూడా అత్యంత తక్కువ. పేదలకు పోషకాహారం, మహిళా, శిశు సంరక్షణ వంటి ముఖ్యమైన అనేక సేవలందిస్తున్న ఈ స్కీం వర్కర్ల సమస్యలు ఎంతగా ఉన్నాయంటే ఆఖరుకు ఆరెస్సెస్‌కు అనుబంధంగా ఉన్న భారతీయ మజ్దూర్ సంఘ్ కూడా వీరి సమస్యల పరిష్కారానికై ఆందోళన చేయవలసి వచ్చింది.



ఎన్డీఏ మొదటి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పెన్షన్ విధానం ఉద్యోగుల పొదుపు సొమ్మును కొంతమంది కార్పొరేట్లు కొల్లగొట్టుకుపోయేలా తయారైంది. దీనిని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని అనేక రాష్ట్రాల్లో ఉద్యోగులు పెద్ద ఎత్తున పోరాడుతున్నారు. ఇది చాలదన్నట్లు కార్మికులకు కొంతైనా మేలు కలిగే 27 కార్మిక చట్టాలను రద్దుచేసి, వాటి స్థానంలో సంఘం పెట్టుకోవడం, సమ్మె చేయడం వంటి హక్కులను సైతం హరించే కార్మిక వ్యతిరేక అంశాలతో నాలుగు లేబర్ కోడ్‌లను మోదీ ప్రభుత్వం చేసింది. మరోపక్క వ్యవసాయరంగంలో పూర్తి రైతు వ్యతిరేక విధానాలను అమలు చేస్తోంది. కార్పొరేట్ సేద్యాన్ని ప్రోత్సహించేలా నల్ల చట్టాలను చేసి, అన్నదాతలు సంవత్సరం పైగా పెద్ద ఎత్తున పోరాడిన దరిమిలా వాటిని రద్దు చేస్తున్నట్లు ప్రకటించినా ఆచరణలో అవే కార్పొరేట్ అనుకూల విధానాలను కేంద్రం కొనసాగిస్తోంది.

మోదీ ప్రభుత్వ కాలంలో శ్రామిక మహిళలతో పాటు సాధారణ మహిళలు కూడా పెద్ద ఎత్తున వివక్షకు గురవుతున్నారు. నేషనల్ క్రైమ్ బ్యూరో నివేదిక ప్రకారం గత ఏడాది దేశంలో 62,946 మంది బాలికలు కనిపించకుండా పోయారు. వీరిలో అత్యధికులు వేశ్యాగృహాలపాలయ్యారు. ఇవన్నీ అధికారికంగా నమోదైన లెక్కలు. వాస్తవంలో ఇంకా ఎక్కువగా ఉన్నాయి. ఉదాహరణకు ఒడిషా రాష్ట్రంలోని సుందర్‌ఘర్ ప్రాంతంలో సర్వే నిర్వహించిన ప్రగతి అనే స్వచ్ఛంద సంస్థ 70 గ్రామాలలో పదమూడు వేలమంది అమ్మాయిలు కనపడలేదని తెలిపింది.


నేడు దేశం వికసిత భారత్‌గా కాక, అత్యధిక ప్రజానీకాన్ని అభివృద్ధి ఫలాల నుండి గెంటివేసే భారత్‌గా రూపాంతరం చెందుతోంది. ఇది ఇలాగే కొనసాగితే 2047 కల్లా దేశం ఎలా ఉంటుందన్నది ఊహించుకుంటేనే ఆందోళన కలుగుతుంది. ప్రధాని మోదీ పదేళ్ళ పాలనలో అసమానతలు మరింత పెరిగి, ప్రజల జీవన ప్రమాణాలు ఘోరంగా పడిపోయాయన్నది వాస్తవం. భావోద్వేగాలు రెచ్చగొట్టి కొంతకాలం పబ్బం గడుపుకోగలరేమో గానీ, ఎల్లవేళలా అశేష ప్రజానీకాన్ని మోసపుచ్చలేరు.

● ఎ. అజ శర్మ
ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు

బుధవారం 10 జనవరి 2024

ఏలూరు లాకులు, లెనిన్ సెంటర్, సత్యనారాయణపురం, దుర్గాపురం ప్రాంతాల మధ్య ఉన్న అలంకార్ సెంటర్ రణరంగంగా మారింది. నిర్బంధాలకు నిలయమైంది. పీఆర్సీ బకాయిల కోసం ధర్నా చేయడానికి వస్తున్న ఉపాధ్యాయులను పోలీసులు అడుగు ముందుకు వేయకుండా అడ్డుకున్నారు. అత్యవసర సేవల్లో లేని అంగన్వాడీలపై ఎస్మా ఎందుకంటూ జైల్‌భరో కార్యక్రమాన్ని నిర్వహించిన కార్మిక సంఘాల నేతలను అరెస్టు చేసి పోలీసు వాహనాల్లోకి ఎక్కించారు. ఒకపక్క నిరసనకారులు, మరోపక్క పోలీసుల అడ్డగింపులతో అలంకార్ సెంటర్‌లో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. అలంకార్ కూడలికి ఉన్న ఐదు మార్గాలను పోలీసులు బారికేడ్లతో మూసివేశారు. వాటిని దాటుకుని వచ్చిన వారిని అటు నుంచి అటే వాహనాల్లోకి ఎక్కించారు.



ఉపాధ్యాయులను బలవంతంగా లాగుతున్న పోలీసులు

బెజవాడ రణరంగం

పోలీసు వలయంలో ధర్నాచౌక్ ప్రాంతాలు

- గురువులను ఎత్తేసిన లాఠీలు
- ఎక్కడికక్కడ ఉపాధ్యాయుల అరెస్టు
- ఎస్మాకు వ్యతిరేకంగా కార్మిక సంఘాల జైల్‌భరో
- పలువురు నేతల అరెస్టు

విజయవాడ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : పీఆర్సీ బకా యిలను చెల్లించడంతోపాటు జీపీఎఫ్ నిధులను జమ చేయాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ విజయవాడ జింఖానా గ్రౌండ్స్‌లో 36 గంటల ధర్నాకు పిలుపు నిచ్చింది. రాష్ట్రస్థాయిలో నిర్వహించే ఈ ధర్నాకు ఉపాధ్యాయులంతా హాజరుకావాలని విజ్ఞప్తి చేసింది. ధర్నా కోసం యూటీఎఫ్ నేతల పోలీసులకు దరఖాస్తు చేసుకున్నారు. దీన్ని తిరస్కరించిన పోలీసులు నిషేధాజ్ఞలు అమలు చేశారు. నిరసన తెలిపే హక్కు తమకు ఉందంటూ ఉపాధ్యాయులు నిషేధాజ్ఞలు దాటుకుని ముందుకు వచ్చారు. ఉత్తరాంధ్ర, ఉమ్మడి ఉభయగోదావరి, రాయలసీమ ప్రాంతాల నుంచి ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. కొంతమంది మంగళవారం ఉదయం రైళ్లు, బస్సుల్లో విజయవాడకు చేరుకున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చేవారు సోమవారం సాయంత్రమే చేరుకున్నారు.

అడుగేయకుండా అడ్డంకులు

ఐలాపురం హోటల్, శ్రీరామ ఫంక్షన్ హాలు, లెనిన్‌సెంటర్, సాంబమూర్తి రోడ్డు, దుర్గాపురం ప్రాంతాలను పోలీసులు ఆధీనంలోకి తీసుకున్నారు. ఈ మార్గాల నుంచి అలంకార్ వైపునకు వచ్చే అన్ని వాహనాలను వివిధ మార్గాల్లో మళ్లించారు. ఉపాధ్యాయులు గెరిల్లా టెక్నిక్ ఉపయోగిస్తారని గ్రహించిన పోలీసులు అందుకు తగిన ఏర్పాట్లు చేసుకున్నారు. అలంకార్ సెంటర్ వైపు నుంచి జింఖానా గ్రౌండ్స్‌కు వెళ్లే అవకాశం ఉండడంతో బారికేడ్లతో మూసివేశారు. కొంతమంది ఉపాధ్యాయులు గుంపులుగుంపులుగా ఒక్కో మార్గం నుంచి అలంకార్ సెంటర్ దాటడానికి యత్నించారు. వారిని అక్కడిక్కడే అరెస్టు చేశారు. పీఎన్‌బీఎస్‌లో అన్ని ప్లాట్‌ఫామ్‌ల మీద పోలీసులు కనిపించారు. వివిధ ప్రాంతాల నుంచి విజయవాడకు వచ్చిన బస్సుల నుంచి దిగిన ప్రయాణికులను తనిఖీ చేశారు. దిగిన వారిలో ఎవరైనా ఉపాధ్యాయులుగా కనిపిస్తే అరెస్టు చేశారు. రైల్వేస్టేషన్‌లో ఇదే పంథాను అవలంబించారు. మొత్తం 300 మంది ఉపాధ్యాయులను పోలీసుల అరెస్టు చేశారు. వారిని అజిత్‌సింగ్ నగర్‌లోని షాదీఖానా, పప్పులమిల్లు సెంటర్‌లోని రైసుమిల్లు, నాడార్ కల్యాణ మండపంలో ఉంచారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అరెస్టుల పరంపర కొనసాగింది. అనంతరం పూచీకతుపై విడుదల చేశారు.

ఎస్మా ఎందుకు?


కొద్దిరోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలపై ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ఉపయోగించడానికి సిద్ధమైన విషయం తెలిసిందే. దీనికి వ్యతిరేకంగా కార్మిక సంఘాలు రోడ్డు మీదకు వచ్చాయి. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ వంటి కార్మిక సంఘాలు ఎస్మాను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ జైల్‌భరో కార్యక్రమాన్ని నిర్వహించాయి. లెనిన్ సెంటర్ నుంచి అలంకార్ సెంటర్ వైపునకు వచ్చిన వివిధ కార్మిక సంఘాల నేతలను, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి బస్సుల్లో ఎక్కించారు. అటు ఉపాధ్యాయులు, ఇటు కార్మికులను అరెస్టులు చేయడంతో అలంకార్ సెంటర్ ప్రాంతమంతా వేడెక్కిపోయింది. కొంతమంది పోలీసుల అరెస్టుల నుంచి తప్పించుకోవడానికి సినిమా థియేటర్లలోకి వెళ్లారు. మరికొంతమంది ఇంద్రకీలాద్రికి వెళ్లి కనకదుర్గమ్మను దర్శించుకున్నారు.



ఎస్మాను ఉపసంహరించాలని నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నేతలను బలవంతంగా అరెస్టు చేస్తున్న పోలీసులు



రాత్రిపూట ధర్నాచౌక్ వద్ద దోమతెరలు కట్టుకుని నిద్రిస్తున్న అంగన్వాడీలు



కె.పి.సారథి

సారథి ససేమిరా..!

ఎంపీ వద్దు.. ఎమ్మెల్యే వద్దు...

వైసీపీ నుంచి పోటీకి విముఖత

అధికార పార్టీ తరపున టికెట్ ఇస్తామంటే కాదనే వారు ఉంటారా? కానీ ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో సీన్ రివర్స్‌లో ఉంది. మైలవరం నుంచి సిటింగ్ ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, పెనమలూరు నుంచి కొలుసు పార్థసారథి వైసీపీ తరపున పోటీ చేసేందుకు విముఖత చూపుతున్నారు. మరోవైపు టికెట్లు దక్కనివారు పార్టీమారే యోచనలో ఉండటంతో ఈ రెండు జిల్లాల్లో వైసీపీ పరిస్థితి ఏమిటో అంతుబట్టక పార్టీ శ్రేణులు అయోమయానికి గురవుతున్నారు.

- వెలంపల్లి, మల్లాదికి తాడేపల్లి నుంచి పిలుపు
- గందరగోళంలో పార్టీ శ్రేణులు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో మొత్తం 12 మంది వైసీపీ ఎమ్మెల్యేలు ఉండగా వారిలో విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణుకి, తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి, నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావుకు టికెట్ లేదని పార్టీ పెద్దలు స్పష్టం చేశారు. మరోవైపు మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి వైసీపీ టికెట్‌పై పోటీకి విముఖత చూపుతున్నారు. మిగిలిన ఏడుగురిలో పలువురికి సీటు ఖాయమైనా స్థానచలనం ఉంటుందని చెబుతున్నారు. ఇప్పటికే విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లిని సెంట్రల్‌కు మార్చగా, పెడన ఎమ్మెల్యే జోగి రమేశ్‌ను మైలవరం కానీ పెనమలూరు కానీ తీసుకొస్తారన్న ప్రచారం జరుగుతోంది. విజయవాడ పశ్చిమ సీటును ఆసిఫ్‌కు కేటాయించినా చివరి నిమిషంలో మార్పులు ఉంటాయని తెలుస్తోంది. టీడీపీ నుంచి బయటకు వచ్చిన కేశినేని నానికి విజయవాడ ఎంపీ సీటుతోపాటు విజయవాడ పశ్చిమ నుంచి ఆయన కుమార్తె కేశినేని శ్వేతకు కేటాయిస్తారన్న ప్రచారం ఉంది.



వెలంపల్లి శ్రీనివాస్



మల్లాది విష్ణు

అసంతృప్తులకు బుజ్జగింపులు

విజయవాడ సెంట్రల్ నుంచి వైసీపీ టికెట్ దక్కని సిటింగ్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్న సమాచారంతో తాడేపల్లి పెద్దలు అప్రమత్తమయ్యారు. మంగళవారం ఆయన్ను పిలిపించుకుని బుజ్జగించినట్టు తెలిసింది. వెలంపల్లి కూడా తాడేపల్లి వచ్చారు. సోమవారం నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు సోదరుడు అరుణ్‌ను పిలిపించిన తాడేపల్లి పెద్దలు జగన్మోహనరావుకి ఈసారికి టికెట్ ఇవ్వడం లేదని చెప్పినట్టు సమాచారం. అందరినీ పిలిపించి మాట్లాడుతున్న వైసీపీ పెద్దలు తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి విషయంలో మాత్రం తమ పార్టీ వ్యక్తే కానట్టు వ్యవహరిస్తుం డటం చర్చనీయాంశంగా మారింది. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన రక్షణనిధి విషయంలో పార్టీ తీరు సరిగా లేదని ఆయన అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఐప్యాక్, జగన్ లెక్కలు కొలిక్కి వస్తే రెండు జిల్లాల నుంచి నలుగురైదుగురు కొత్త ముఖాలు అసెంబ్లీ బరిలో నిలిచే అవకాశం ఉంది. విజయవాడ పశ్చిమ నుంచి ఆసిఫ్ కానీ ఆ స్థానంలో మరొక కొత్త వ్యక్తి కానీ పోటీలో ఉండే అవకాశం ఉంది. పెడన నుంచి ఉప్పాల రాము, నందిగామ నుంచి అమర్లపూడి సౌజన్య వైసీపీ టికెట్ రేసులో ఉన్నారు. తిరువూరు నుంచి కొత్త అభ్యర్థి అన్వేషణ కొనసాగుతోంది.

వైసీపీ నాయకుల్లో అసహనం

పెనమలూరు నుంచి సారథికి ప్రత్యామ్నాయంగా వైసీపీ అభ్యర్థి లేరు. ఒకవేళ ఈ స్థానాన్ని జోగి రమేశ్‌కు ఇస్తే, మైలవరం నుంచి వసంత కృష్ణ ప్రసాద్ పోటీ చేయకపోతే మైలవరం నుంచి ప్రత్యామ్నాయ అభ్యర్థి లేరు. ఇక తిరువూరులోనూ అదే పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో అభ్యర్థుల మార్పు పేరుతో పార్టీ శ్రేణుల్లో గందరగోళం సృష్టించడం ఏమిటని వైసీపీ నాయకులే అసహనం వ్యక్తం చేస్తున్నారు.



కేంద్ర ఎన్నికల కమిషనర్‌తో మంగళవారం బెజవాడలో జరిగిన సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ దిల్లీరావు, సీపీ రాణా

14 నుంచి దుర్గగుడిలో సంక్రాంతి సంబరాలు

- 6లో..

కాలు దువ్వుతున్న పందెం కోళ్లు

- బరులు సిద్ధం చేస్తున్న నిర్వాహకులు

- 6లో..

అప్పుల బాధతో దంపతుల ఆత్మహత్యా యత్నం

- భార్య మృతి, భర్త పరిస్థితి విషమం

- 6లో..

దొడ్డిదోవన దోపిడీ!

అసలు రైళ్లు రద్దు చేసి.. స్పెషల్ రైళ్లు ఎత్తుగడ

- ప్రయాణికులను దోచుకునేందుకు రైల్వే కుతంత్రం
- ఈనెల 28 వరకు మెయింటినెన్స్ పనుల పేరుతో పలు రైళ్లు రద్దు

సంక్రాంతి ప్రత్యేక రైళ్ల ప్రకటన



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మెయింట్‌నెన్స్ పేరుతో ఆరు నెలలుగా ఎడాపెడా రైళ్లను రద్దుచేస్తూ ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులు పెడుతున్న రైల్వే అధికారులు పండగ సీజన్‌లో కూడా ప్రయాణికులతో ఆడుకుంటున్నారు. పండగ సీజన్ అంతా పలు రైళ్లను రద్దు చేశారు. దాదాపుగా జనవరి 28వ తేదీ వరకు పలు రైళ్లను రద్దు చేశారు. సంక్రాంతి సీజన్‌లో ఉన్న రైళ్లను రద్దు చేసిన రైల్వే అధికారులు.. సంక్రాంతి స్పెషల్ రైళ్లను వేయటం గమనార్హం. స్పెషల్ రైళ్లు నడపటానికి ప్రత్యేకంగా రైల్వే దగ్గర రిజర్వు రైళ్లు ఏమీ లేవు. అవే రైళ్లను రొటేషన్ చేయాలి. వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ల కోసం ఇప్పటికే పెద్ద సంఖ్యలో రైళ్లను రద్దు చేస్తున్నారు. వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ల కోసమే ఈ రైళ్లను రద్దు చేస్తున్నారన్నది బహిరంగ రహస్యం. సంక్రాంతికి స్పెషల్ రైళ్లను నడిపితే.. మళ్లీ వందేభారత్ రైళ్లకు ఇబ్బందిగా మారుతుంది. కనుక మరికొన్ని రైళ్లు రద్దు చేస్తే.. వాటి స్థానంలో స్పెషల్స్ నడుపుతున్నట్టుగా ప్రకటిస్తే సరిపోతుంది. పండగ రద్దీ కోసం రైల్వే అధికారులు స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్టుగా కూడా ఉంటుంది. పైగా సాధారణ రైళ్ల కంటే స్పెషల్ రైళ్లలో అదనపు చార్జీలు వసూలు చేసుకోవచ్చు. ఇది కూడా రైల్వేకు లాభం కలిగించే అంశమే. దీనిని దృష్టిలో ఉంచుకుని రైల్వే అధికారులు ముందస్తుగా వ్యూహాత్మకంగా పలు రైళ్లను మెయింట్‌నెన్స్ పేరుతో రద్దు చేసినట్టు తెలుస్తోంది. బుధవారం విజయవాడ డివిజన్ పరిధిలో 8 రైళ్లను రద్దు చేశారు. మరో 8 రైళ్లను పాక్షికంగా రద్దు చేశారు. మొత్తం 11 రైళ్లను డైవర్షన్ చేశారు. అదే రోజున 30 సంక్రాంతి స్పెషల్ రైళ్లను నడుపుతున్నట్టు ప్రకటించారు. రైళ్లను రద్దు చేసింది కొన్ని డివిజన్లలో అయితే.. సంక్రాంతి స్పెషల్ రైళ్లను మాత్రం మరికొన్ని డివిజన్ల నుంచి నడుపుతున్నారు. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే.. అన్ని రైళ్లు కూడా పాసింగ్ అయ్యేది .. రద్దు చేసిన రైళ్ల స్టేషన్లలోనే. ఇలాంటపుడు సంక్రాంతి స్పెషల్ రైళ్లకు మెయింట్‌నెన్స్ పనులు అడ్డురావా అన్నది రైల్వే అధికారులే చెప్పాలి. మెయింట్‌నెన్స్ పనులకు అడ్డంకి రావటం లేదంటే .. అక్కడ అసలు మెయింట్‌నెన్స్ పనులే జరగటంలేదన్నది అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. ప్రయాణీకులను మభ్యపెట్టి ఈ సంక్రాంతి సీజన్‌లో రైల్వే అధికారులు ఆదాయాన్ని పిండుకోవటానికి సరికొత్త దందాకు శ్రీకారం చుట్టినట్టుగా అర్థమవుతోంది.

ఆర్వోఆర్‌పై ఐ



నిర్మాణంలో ఉన్న ఆర్వోఆర్

విజయవాడ బైపాస్ రైల్వే లైన్ కోసం గొల్లపూడిలో చేపడుతున్న రైల్ ఓవర్ రైల్ (ఆర్వోఆర్) ప్రాజెక్టు భవితవ్యం మళ్లీ గందరగోళంలో పడింది. విజయవాడ - విశాఖపట్నం మధ్య స్పెషల్ గూడ్స్ లైన్ కోసం చేపడుతున్న బైపాస్ రైల్వేలైన్ పనుల్లో భాగంగా ముస్తాబాద, గొల్లపూడి ప్రాంతాల్లో రెండు ఆర్వోఆర్ బ్రిడ్జ్‌లు నిర్మిస్తున్నారు. రెవెన్యూ అధికారుల అత్యుత్సాహం కారణంగా.. గొల్లపూడి రైతుల నుంచి తాజాగా అభ్యంతరాలు వచ్చాయి. దీంతో ఆర్వోఆర్ భవితవ్యంపై నీలినీడలు అలముకున్నాయి.

రెవెన్యూ తీరుపై గొల్లపూడి రైతుల అభ్యంతరాలు

- ఎకరం ప్రాతిపదిక పరిహారంతో రైతులకు నష్టం
- ఒక్కో ఎకరాకు రూ.4 కోట్లు వరకు తగ్గుదల
- మొదటికొచ్చిన భూ సమస్య

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ - విశాఖపట్నం గూడ్స్ థర్డ్ లైన్‌కు సంబంధించిన ప్రాజెక్టులో భాగంగా విజయవాడ బైపాస్ రైల్వేలైన్‌గా నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టుకు సంబంధించి రైతుల నుంచి సానుకూలతే వచ్చింది. గొల్లపూడి రైతులు కూడా ప్రాజెక్టుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. రెవెన్యూ అధికారులు మాత్రం రైతులను ఇబ్బందులు పెట్టే ప్రయత్నాలు చేపట్టారు. గొల్లపూడిలో రైతులు తమ పరిహారానికి సంబంధించి ఆశించింది ఒకటి అయితే మరొకటి జరిగింది. గొల్లపూడిలో చదరపు గజాల లెక్కన ఎక్కువగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. మార్కెట్‌లో అగ్రభాగాన ఏ ప్రాతిపదికన రిజిస్ట్రేషన్లు జరిగితే ఆ మేరకే పరిహారాన్ని ఇవ్వాల్సి ఉంటుంది. గొల్లపూడిలో మూడేళ్లుగా జరుగుతున్న భూ క్రయవిక్రయాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్లను పరిశీలిస్తే.. 123 రిజిస్ట్రేషన్లు చదరపు గజాల ప్రాతిపదికనే జరిగాయి. కేవలం 16 రిజిస్ట్రేషన్లు మాత్రమే ఎకరాల ప్రాతిపదికన జరిగాయి. విజయవాడ రూరల్ మండల తహసీల్దార్ స్వయంగా ఈ డేటాను రిజిస్ట్రేషన్స్ శాఖ నుంచి తెప్పించుకున్నారు. దాని ప్రకారం మేజర్‌గా ఏ ప్రాతిపదికన రిజిస్ట్రేషన్లు జరిగాయో.. దానికి అనుగుణంగానే అదే పద్ధతిలో పరిహారాన్ని నిర్దేశించారు. విజయవాడ - మచిలీపట్నం ఎన్‌హెచ్-65 నాలుగు వరసల విస్తరణలో భాగంగా అప్పట్లో కానూరు, తాడిగడప వరకు చదరపు గజాల ప్రాతిపదికనే పరిహారాన్ని చెల్లించాలి. అప్పట్లో చదరపు గజానికి 2 ఫ్యాక్టర్ చొప్పున పరిహారాన్ని ఇచ్చారు. అంటే నాలుగు రెట్ల మేర పరిహారాన్ని చెల్లించారు. ఆర్వోఆర్ విషయంలో కూడా గొల్లపూడి రైతులు ఇలానే తమకు పరిహారం నిర్దేశిస్తారని భావించగా.. రెవెన్యూ అధికారులు ఎకరం ప్రాతిపదికన పరిహారాన్ని చెల్లిస్తామని తాజాగా చావుకబురు చల్లగా చెప్పారు.

అధికారిని తప్పుదారి పట్టించి..

రెవెన్యూ యంత్రాంగం నుంచి ఈ ప్రతిపాదన రావటానికి ప్రధానంగా రెండు కారణాలు ఉన్నాయని తెలుస్తోంది. ఒకటి గతంలో ఉమ్మడి విజయవాడ డివిజన్ పరిధిలోని నందిగామలో ఒక భూ సేకరణకు సంబంధించి ఎకరం కాకుండా.. చదరపు గజం చొప్పున నిర్ణయించటం వల్ల పరిహారం ఎక్కువగా చెల్లించారు. ఇది అప్పట్లో ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. విచారణ కూడా జరిగింది. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని చదరపు గజాల చొప్పున చెల్లించాల్సిన ప్రాంతాన్ని కూడా ఎకరం ప్రాతిపదికలోకి తీసుకొచ్చారు. రెండోది.. రెవెన్యూలోని ఇద్దరు ఉద్యోగులు ప్రధానంగా సబ్ కలెక్టర్ అదితి సింగ్‌ను కూడా తప్పుదారి పట్టించారని తెలుస్తోంది.

రైతులకు నష్టం ఇలా..

మార్కెట్ ధరలు భారీగా ఉన్న గొల్లపూడిలో ఎకరా ప్రాతిపదికన ఇస్తే మాత్రం తాము నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరా ప్రాతిపదికన అయితే ఎకరానికి ఆయా భూములను బట్టి రూ.7 కోట్లు, రూ.8 కోట్లు, రూ.10 కోట్ల మేర చెల్లించాల్సి ఉంటుంది. ఇదే చదరపు గజం ప్రాతిపదికన అయితే రూ.14 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. చదరపు గజం లెక్కన తీసుకోకుండా భూ యజమానులు ఎకరాకు రూ.4 కోట్ల మేర నష్టపోయే అవకాశం ఉంటుంది. ఈ భూముల్లో కొన్ని వ్యవసాయ భూములు కూడా ఉన్నాయి. వ్యవసాయ భూములకైతే ఎకరానికి రూ.4.50 కోట్లు మాత్రమే ఇస్తారు. వ్యవసాయ భూములు కలిగిన రైతులు అయితే భారీగా నష్టపోతారు. దీనిని దృష్టిలో ఉంచుకుని గొల్లపూడి రైతులు చదరపు గజానికి రూ.12 వేల చొప్పున చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

తగ్గేదే లే..

సీఎం.. జగన్ ఇచ్చిన హామీలు అమలుచేయాలని అంగన్వాడీలు.. కనీస వేతనాలు పెంచాలని పారిశుధ్య కార్మికులు.. పీఆర్సీ బకాయిల కోసం ఉపాధ్యాయుల నిరసన కార్యక్రమాలతో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ధర్నాచౌక్‌లు దద్దరిల్లాయి. ప్రభుత్వ బెదిరింపులకు తగ్గేదే లేదని ఉద్యమకారులు బారికేడ్లను సైతం లెక్కచేయక ముందుకు కదిలారు. మరోవైపు ఎస్మా ప్రయోగంతో ప్రభుత్వం ఉద్యోగులపై ఉక్కుపాదం మోపగా భారీ సంఖ్యలో పోలీసు బలగాలు మోహరించి ఎక్కడికక్కడ ఉద్యమకారులను అరెస్టులు చేశారు.


బందరులో బారికేడ్లను తోసుకుంటూ దూసుకువెళుతున్న ఆందోళనకారులు



విజయవాడ ధర్నాచౌక్, పరిసర ప్రాంతాల్లో భారీగా మోహరించిన పోలీసులు

సీఎం స్పందించకపోవడం శోచనీయం

ధర్నాచౌక్ : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తు మున్సిపల్ కార్మికులు విజయవాడ ధర్నాచౌక్‌లో చేపట్టిన ధర్నా 15వ రోజు కొనసాగింది. 'ఆప్కాస్ వద్దు, పర్మినెంట్ ముద్దు.. నగరమంతా నీళ్లు-మాకు కన్నీళ్లు.. నగరమంతా వెలుగులు-మాకు చీకటి' అంటూ కార్మికులు పెద్దఎత్తున నినదించారు. తమ డిమాండ్లు సాధించేంత వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. గత ఎన్నికల ముందు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తానని హామీ ఇచ్చిన సీఎం జగన్ తన వాగ్దానాన్ని విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుధ్య పనులు చేస్తు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్నామన్నారు. 15 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్నా సీఎం జగన్ స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేయకుండా తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు అధిక సంఖ్యలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

- ఎస్మాకూ తలొగ్గని ఆందోళనకారులు.. ఉవ్వెత్తున ఎగసిన ఉద్యమం
- నిరసనలతో దద్దరిల్లిన ధర్నాచౌక్.. ఎక్కడికక్కడ అరెస్టుల పర్వం


ఆందోళనకారులను బలవంతంగా తరలిస్తున్న పోలీసులు

అంగన్వాడీల జైల్‌భరో..

- దద్దరిల్లిన కలెక్టరేట్.. అరెస్టుల పర్వం.. కొనసాగిన రిలే దీక్షలు

మచిలీపట్నం టౌన్, జనవరి 9 : జీతాలు పెంచాలంటూ అంగన్వాడీ కార్యకర్తలు మంగళవారం పెద్ద ఎత్తున జైల్ భరో కార్యక్రమం చేపట్టారు. తొలుత లక్ష్మీటాకీసు సెంటర్ వద్ద సంఘ నాయకులు రమాదేవి, రెజీనా రాణిలతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీలో అంగన్వాడీ కార్యకర్తలతో పాటు సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, సీపీఐ నాయకులు లింగం ఫిలిప్, కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ మతీన్, చంద్రశేఖర్, ఎన్.కుమారిలు పాల్గొన్నారు. ధర్నాచౌక్ వద్ద రిలే దీక్షలు జరుగుతుండగా, మరోవైపు ఆందోళనకారులు బారికేడ్లు తోసుకుంటూ కలెక్టరేట్ ముట్టడికి వెళ్లారు. ఆందోళనకారులు, పోలీసులకు మధ్య తోపులాట జరిగి ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. దీంతో ఆందోళనకారులను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం దీక్షా శిబిరంలో సంఘ నాయకులు మాట్లాడారు. ప్రభుత్వం ఎస్మా ప్రయోగించినా భయపడేది లేదని సంఘ నాయకులు పేర్కొన్నారు. నోటీసులిచ్చినా లెక్కచేయమని, ఉద్యమాన్ని కొనసాగిస్తామని అంగన్వాడీలు పేర్కొన్నారు.



- బెదిరింపులతో ఉద్యమాన్ని ఆపలేరు
- అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగం దుర్మార్గం
- సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నర్సింగరావు

ధర్నాచౌక్, జనవరి 9 : సీఎం జగన్ తమకిచ్చిన హామీలను అమలు చేయాలని సమ్మె చేస్తున్న అంగన్వాడీ ఉద్యమానికి రాజకీయ రంగు పులమడం సరైందికాదని సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సీహెచ్ నర్సింగరావు హితవు పలికారు. అంగన్వాడీల రాష్ట్రవ్యాప్త సమ్మెలో భాగంగా విజయవాడ ధర్నాచౌక్‌లో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఐదోరోజు మంగళవారం కొనసాగాయి. ఉద్యమం రాజకీయంగా జరుగుతోందని సజ్జల చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. అంగన్వాడీల్లో పలు పార్టీలకు చెందినవారు ఉన్నారన్నారు. వైసీపీ నేతల కుటుంబాలకు చెందిన వారు కూడా ఉద్యమంలో పాల్గొంటున్నారన్నారు. కార్మికుల మధ్య చీలిక తెచ్చేందుకే ఈ వాఖ్యలు చేశారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం బెదిరింపులతో ఉద్యమాన్ని ఆపలేదన్నారు. అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించాడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇది కార్మికుల హక్కులను కాలరాయడమేనన్నారు. ఇప్పటికైనా నోటీసులు ఇవ్వాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నేతలు పి.అజయ్‌కుమార్, యంవీ సుధాకర్, మెడికల్ రిప్స్ యూనియన్ రాష్ట్రనేత కృష్ణయ్యలు దీక్షకు సంఘీభావం తెలిపారు. అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నేతలు బి.బేబీరాణి, కె.సుబ్బరావమ్మ, ఎన్‌సీహెచ్.సుప్రజ, టి.గజలక్ష్మీ, జైనీ రత్నకుమారి, లలితమ్మ, అధిక సంఖ్యలో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.




మునేటిలో జలదీక్ష చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

నందిగామలో అంగన్వాడీల జలదీక్ష

నందిగామ : ఎస్మా ప్రయోగించినా, కేసులు బనాయించినా సమస్యలు పరిష్కారం అయ్యే వరకూ ఉద్యమాన్ని ఆపేది లేదని అంగన్వాడీలు స్పష్టం చేశారు. మంగళవారం దీక్షా శిబిరం నుంచి ర్యాలీగా వెళ్లి మునేటిలో జలదీక్ష చేశారు. ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చిన జగన్ నేడు తమ పట్ల అమానుషంగా ప్రవర్తిస్తున్నాడన్నారు. ముఖ్యమంత్రికి బుద్ధి చెప్పి తీరుతామని హెచ్చరించారు. అంగన్వాడీలు, సీఐటీయూ నేతలు పాల్గొన్నారు.

నీకేమో రూ.400 కోట్లతో రుషికొండలో ప్యాలెస్.. రాష్ట్ర ప్రజల నెత్తిన రూ.13లక్షల కోట్ల అప్పు..

వేతనం రూ.వెయ్యి పెంచలేవా జగన్!

- కళ్లకు గంతలతో పారిశుధ్య కార్మికుల నిరసన.. సమ్మెకు నెట్టెం రఘురాం సంఘీభావం

జగ్గయ్యపేట, జనవరి 9 : రూ.400 కోట్లతో రుషికొండలో నివాసానికి ప్యాలెస్ కట్టుకుని, రూ.13లక్షల కోట్లు అప్పును రాష్ట్ర ప్రజల నెత్తిన వేసిన ముఖ్యమంత్రి జగన్‌కు పారిశుధ్య కార్మికులకు రూ. వెయ్యి జీతం పెంచేందుకు మనసు రాదా.. అని విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి నెట్టెం రఘురాం ప్రశ్నించారు. పథకాల పేరుతో ప్రజలకు చిల్లర పంచుతున్న జగన్‌రెడ్డి వేలకోట్లు తాడేపల్లి ప్యాలెస్‌లో నింపుకుంటున్నారని ఆరోపించారు. మంగళవారం జగ్గయ్యపేట ఎన్టీఆర్ సర్కిల్‌లో పురపాలకసంఘ పారిశుధ్య, ఇంజనీరింగ్ సిబ్బంది ఆందోళనకు సంఘీభావం తెలిపిన నెట్టెం వారితో పాటు కళ్లకు గంతలు కట్టి నిరసనలో పాల్గొన్నారు. గత ఎన్నికల్లో జగన్ పారిశుధ్య కార్మికుల సేవలను ప్రశంసించి తాను వస్తే వేతనాలు పెంచుతానని నమ్మబలికి, ఐదేళ్లుగా మొహం చాటేయటం మోసకారితనం కాక మరేమిటని ప్రశ్నించారు. నిరుద్యోగులకు చంద్రబాబు నిరుద్యోగ భృతి కాదని, జాబ్ క్యాలెండర్‌తో ఉద్యోగాలు ఇస్తానని యువతను, సీపీఎస్ ఇస్తానని ఉద్యోగులను నమ్మించి మోసం చేసిన ఘనుడు జగన్ అని విమర్శించారు. త్వరలో చందబాబు తిరిగి అధికారం చేపట్టి పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నెట్టెంతో పాటు నియోజకవర్గ తెలుగుమహిళ అధ్యక్షురాలు, కౌన్సిలర్ కన్నెబోయిన రామలక్ష్మి, మేకా వెంకటేశ్వర్లు, గింజుపల్లి రమేష్, గట్టిడి దుర్గాప్రసాద్, సంకా వెంకట్రావు, సూర్యదేవర రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


జగ్గయ్యపేట ఎన్టీఆర్ సర్కిల్‌లో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న నెట్టెం, కార్మికులు

14 నుంచి దుర్గగుడిలో సంక్రాంతి సంబరాలు



వన్‌టౌన్, జనవరి 9 : సంక్రాంతి పండగను పురస్కరించుకుని దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించనున్నట్టు దేవస్థానం ఈవో కేఎస్ రామారావు తెలిపారు. ఈ మేరకు అయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 14వ తేదీ భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని తెల్లవారుజాము 5 గంటలకు కొండపై చిన్న రాజగోపురం వద్ద ఉన్న శ్రీ లక్ష్మీగణపతిస్వామి మందిరం వద్ద భోగిమంటలు, అనంతరం హరిదాసుల సంకీర్తన, బసవన్నల (గంగిరెద్దుల) విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. మల్లిఖార్జున మహామండపం 7వ అంతస్తులో రాజగోపురం ఎదురుగా బొమ్మల కొలువు, సాయంత్రం 5.30 గంటలకు గొబ్బెమ్మలు, భోగిపళ్ల కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని అమ్మవారి ప్రధాన ఆలయం, ఉపాలయాలు, రాజగోపుర ప్రాంగణాలను శోభాయమానంగా ప్రత్యేక పూలతో అలంకారాలు, రంగవల్లులు ఏర్పాటు చేస్తారని తెలిపారు. హిందూ సనాతన ధర్మం, తెలుగుదనం ఉట్టిపడేలా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఈవో పేర్కొన్నారు.

కృషి, క్రమశిక్షణతో ఎదిగిన వ్యక్తి చిరంజీవి



- వాల్తేరు వీరయ్య విజయోత్సవ సభలో బుద్ధప్రసాద్

అవనిగడ్డ, జనవరి 9 : సినీహీరో చిరంజీవి కృషి, పట్టుదలతో, స్వయం శక్తితో ఎదిగిన గొప్ప వ్యక్తి, అభిమాన సంఘాలను సమాజ సేవా సంఘాలుగా మార్చిన నటుడు చిరంజీవి అని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మంగళవారం అవనిగడ్డలో జరిగిన 'వాల్తేరు వీరయ్య' 365వ రోజుల విజయోత్సవ సభలో బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, వాల్తేరు వీరయ్య సినిమా అవనిగడ్డలో 365 రోజులు నిరంతరాయంగా ప్రదర్శించటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న డైరెక్టర్ బాబీ, నిర్మాత యలమంచిలి రవి మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేని విధంగా రామకృష్ణ థియేటర్‌లో సినిమా 365 రోజులపాటు ప్రదర్శించటం, ఇక్కడి ప్రజలకు చిరంజీవిపై ఉన్న అభిమానానికి నిదర్శనమని అన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు బండ్రెడ్డి రామకృష్ణ, జనసేన నేతలు గుడివాక శేషుబాబు, బచ్చు వెంకటనాథ్, చిరంజీవి అభిమాన సంఘ నేతలు తదితరులు పాల్గొన్నారు.

ధైర్యం ఉంటే అడ్వకేట్ కమిషన్ వేయించు

- ఎమ్మెల్యే వసంతకు మాజీమంత్రి ఉమా సలహా



మైలవరం : నీ అవినీతి చిట్టా మొత్తం కోర్టుముందు, ప్రజల ముందు ఉంచుతా.. నీకు దమ్మూ ధైర్యం ఉంటే అడ్వకేట్ కమిషన్ వేయించు.. అని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్‌కు టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు సలహా ఇచ్చారు. మంగళవారం పార్టీ కారాల్యయంలో ఉమా విలేకర్లతో మాట్లాడుతూ, ప్రకృతి సంపద దోచుకున్న నువ్వు నాపై రూ.10 కోట్లకు పరువు నష్టం దావా వేస్తావా.. అని వసంతను సూటిగా ప్రశ్నించారు. మీ ముఖ్యమంత్రికి, మీ మంత్రులకే పరువు లేదు నేను క్షమాపణ చెప్పాలా అని ప్రశ్నించారు. పొదిలి రవిని బినామీ ఆస్తుల కోసం చంపలేదా అని ప్రశ్నించారు. పాపట్ల మేరి బంధువులను తీసుకొస్తా ఒక అడ్వకేట్‌ను పెట్టి కమిషన్ వేయాలని డిమాండ్ చేశారు. పది రూపాయల నోట్లు చించి ఎన్నికల సమయంలో పంచి పెట్టాడని ఆరోపించారు. కొండపల్లి అడవి దోపిడీ నిజం కాదా అని నిలదీశారు. ఓటు ఆయుధంతో ప్రజలు నిన్ను ఎన్నికల్లో తరిమి కొడతారన్నారు. అన్ని విషయాలు కోర్టు ముందు ఆధారాలతో పెడతాం కోర్టులే సమాధానం చెబుతాయన్నారు.

చంద్రబాబు సభకు స్థల పరిశీలన


స్థల పరిశీలనలో వెనిగండ్ల , రావి

గుడివాడ : తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు చేపట్టిన 'రా.. కదలిరా' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 18వ తేదీన నిర్వహించనున్న భారీబహిరంగ సభకు చంద్రబాబు టూర్ కమిటీ సభ్యులు రవి యాదవ్, ఎమ్మెల్సీ సత్యనారాయణరాజులతో కలిసి నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావులు పరిశీలించారు. బంటుమిల్లి రోడ్డులోని అలంకృత ఫంక్షన్ హాల్ సమీపంలో, బందరు రోడ్డులో సిద్ధాంతం వద్ద, ఏఎన్ఆర్ కళాశాల సమీపంలో స్థలాలను పరిశీలించారు.

మోదీ పాలనలో శక్తివంతమైన దేశంగా భారత్

- కేంద్ర మంత్రి శ్రీపాద యశో నాయక్

గుడ్లవల్లేరు, జనవరి 9 : బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత భారత దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో మూడో స్థానానికి తీసుకువచ్చామని కేంద్ర పర్యాటక మంత్రి శ్రీపాద యశో నాయక్ అన్నారు. 2027 నాటికి భారత్ ప్రపంచంలోనే శక్తి వంతమైన దేశంగా ఎదగడానికి ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని మంత్రి అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఎస్వీఆర్ పబ్లిక్ స్కూల్ ఆవరణలో 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమానికి కేంద్రమంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో లక్ష ఉద్యోగాల బర్తీకి మోదీ కృషిచేస్తున్నారన్నారు. దేశంలో 80 కోట్ల మంది ప్రజలకు కేంద్ర ప్రభుత్వం ఉచితంగా రేషన్ పంపిణీ చేస్తోందన్నారు. జలజీవన్ మిషన్ పథకం ద్వారా 10.08 కోట్ల ఇళ్లకు త్రాగునీరు కుళాయిల ద్వారా అందిస్తుందన్నారు. తొలుత వ్యవసాయ, స్త్రీ శిశు సంక్షేమ శాఖలు రూపొందించిన ప్రదర్శనలను మంత్రి పరిశీలించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కృష్ణా కలెక్టర్ పి.రాజబాబు, గుడివాడ ఆర్డీవో పద్మావతి, డీఈవో తహేరా సుల్తానా, వైద్య ఆరోగ్య శాఖాధికారి గీతాబాయి, తదితరులు పాల్గొన్నారు.

శేషద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల (ఎస్.ఆర్.జి.ఇ.సి) కేంద్రమంత్రి శ్రీపాద యశోనాయక్ మంగళవారం సందర్శించారు. గ్రామీణ ప్రాంతంలో నాణ్యమైన విద్య అందించడం ముదావహమని మంత్రి అన్నారు. 25 సంవత్సరాలుగా కళాశాల యాజమాన్యం కృషిని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రిని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.కోదండరామారావు, ఎం.ఆర్.సిహెచ్ శాస్త్రిలు సన్మానించి జ్ఞాపికను బహూకరించారు.


చిరుధాన్యాలతో అలంకరించిన పుష్పాకృతిని తిలకిస్తున్న కేంద్రమంత్రి

12న మోదీ, షా హఠావో-దేశ్ బచావో భారీ సభ

ధర్నాచౌక్, జనవరి 9: దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకునేందుకు బీజేపీ, దాని మిత్రపక్షాలను రాబోయే ఎన్నికల్లో ఓడించాలని రాజ్యాంగ పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్లు వడ్డే శోభనాద్రీశ్వరరావు, కె.విజయరావులు పిలుపునిచ్చారు. రాష్ట్రానికి బీజేపీ ప్రభుత్వం తీరని ద్రోహం చేసిందని మండిపడ్డారు. "మోదీ, షా హఠావో- దేశ్ బచావో" నినాదంతో భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 12న స్థానిక సిద్ధార్థ ఆడిటోరియంలో భారీ సభను నిర్వహిస్తున్నామన్నారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ, దేశ సంపదను లూటీ చేసి ఆదానీ, అంబానీలకు కట్టబెడుతుందని విమర్శించారు. 12న జరిగే సభకు ఎస్‌కెఎం జాతీయ నాయకుడు రాకేష్ తికాయత్, ప్రముఖ సినీ నిర్మాతలు ఆర్.నారాయణ మూర్తి, తమ్మారెడ్డి భరద్వాజ్, సీఐటీయూ జాతీయ అధ్యక్షురాలు హేమలత, ఏఐటీయూసీ జాతీయ నాయకురాలు వహిదా నిజాంలతో పాటు రాజకీయ, కార్మిక, రైతు, మహిళ, యువజన, విద్యార్థి, ఉద్యోగ, ఉపాధ్యాయ, సామాజిక సంఘాల ప్రతినిధులు పాల్గొని వివిధ అంశాలపై ప్రసంగిస్తారన్నారు. వేదిక రాష్ట్ర నేతలు జి.ఓబులేసు, వై.కేశవరావు, భాస్కర్‌రావు, రిటైర్డ్ ఐఏఎస్ బి.శ్రీనివాసులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వడ్డే తదితరులు


పెదపూడిలో బరికి సిద్ధం చేసిన పొలం

కాలు దువ్వుతున్న పందెం కోళ్లు

- బరులు సిద్ధం చేస్తున్న నిర్వాహకులు

కూచిపూడి/మోపిదేవి, జనవరి 9 : సంక్రాంతి పోరుకు కోడిపుంజులు సై అంటూ కాలు దువ్వుతున్నాయి. పందెపురాయుళ్లు ఇప్పటికే పొలాల్లో బరులు సిద్ధం చేసుకుంటున్నారు. పెదపూడి, కూచిపూడి గ్రామాల్లో ట్రాక్టర్లతో పొలాన్ని దున్ని యంత్రాలతో చదును చేస్తున్నారు. బరుల్లో పేకాట, మద్యం, గుండాట, చిత్తులాట, కాయ్ రాజా కాయ్, బిర్యాని దుకాణాలను ఏర్పాటు చేసేందుకు ముందుగానే ఒప్పందాలు చేసుకుంటున్నారు. లాడ్జిలన్నీ బరి నిర్వాహకులు బుక్ చేస్తున్నారు. ఈ ఏడాది రబీలో రెండో పంటగా మినుమును సైతం వదిలేసి రైతులు కోడిపందేల నిర్వాహకులకు లీజుకు ఇవ్వగా.. నిర్వాహకులు బరులను సిద్ధం చేసుకునే పనిలో ఉన్నారు. ముందుగా క్రీడా పోటీలు నిర్వహించి అనంతరం పండగ మూడు రోజులు పెద్ద ఎత్తున కోడిపందాలతోపాటు పలు రకాల జూద క్రీడలు నిర్వహించేలా రంగం సిద్ధం చేస్తున్నారు. మండల కేంద్రమైన మోపిదేవి శివారు పెదప్రోలు గ్రామపంచాయతీ పరిధిలోని ఓ ప్రైవేట్ వెంచర్‌లో సంక్రాంతి సంబరాల పేరుతో కోడిపందేల నిర్వహణకు పొలం చదును చేసే పనులు మంగళవారం ప్రారంభించారు. అధికార వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధులు బరులు సిద్ధం చేస్తున్నట్టు సమాచారం.

పీఎం విశ్వకర్మ పథకానికి దరఖాస్తు చేసుకోండి

మచిలీపట్నం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : సాంప్రదాయ చేతివృత్తుల ఆధారంగా జీవనం సాగించే వారు పీఎం విశ్వకర్మ పథకం ద్వారా లబ్ధిపొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పరిశ్రమలశాఖ అధికారి ఆర్.వెంకట్రావ్ అన్నారు. కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వశాఖ(ఎంఎస్‌ఎంఈ) జిల్లా పరిశ్రమల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పీఎం విశ్వకర్మ పథకం అమలుపై అవగాహన సదస్సును మంగళవారం జిల్లాపరిషత్ సమావేశపుహాలులో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, వడ్రంగి, కుమ్మరి, స్వర్ణకారులు, సాంప్రదాయ బొమ్మల తయారీ, బుట్టలు, చాపలు అల్లడం, తాపీ పనివారు. పడవలు తయారు చేసేవారు శిల్పాలు, విగ్రహాలు తయారు చేయడం, చెప్పులు కుట్టే వారు, దర్జీలు, తదితర 18రకాల వృత్తుల వారికి పీఎం విశ్వకర్మ పథకం ద్వారా రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కులంతో సంబంధం లేకుండా సాంప్రదాయ వృత్తులు చేస్తూ కుటుంబాలను పోషించేకునే వారికి ఈ పథకం ద్వారా లబ్ధిచేకూర్చడం జరుగుతుందన్నారు. కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా, వార్డు సచివాయాల ద్వారా ఈ పథకం ద్వారా లబ్ధిపొందేందుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ పీఎస్ ఆర్ ప్రసాద్, లీడ్‌బ్యాంక్ జిల్లా డిప్యూటీ మేనేజర్ మూర్తి, కామన్ సర్వీస్ సెంటర్ స్టేట్ ప్రాజెక్టు మేనేజర్ రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో దంపతుల ఆత్మహత్యా యత్నం!

- భార్య మృతి, భర్త పరిస్థితి విషమం



పాయకాపురం, జనవరి 9 : శాంతినగర్ ప్రాంతంలో అప్పుల బాధతో దంపతులు మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఇరువురు పురుగుల మందు సేవించగా భార్య మృతి చెందింది. భర్త పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబటి ప్రతాప్‌కుమార్(35), అంబటి సాయి కన్య(32) భార్యాభర్తలు. వీరు గత కొంతకాలంగా శాంతినగర్‌లో నివాసం ఉంటున్నారు. భర్త ఫ్లవర్ డెకరేషన్ పనిచేస్తుండగా భార్య ఇంటి వద్ద చీటీల వ్యాపారం చేస్తుంది. మంగళవారం ఉదయం దంపతులు ఇద్దరూ ఇంట్లో అపస్మారక స్థితిలో పడిఉండటాన్ని గమనించిన వారి ఇద్దరు కుమార్తెలు ఇరుగుపొరుగు వారికి విషయం చెప్పారు. దీంతో స్థానికులు వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అప్పటికే భార్య సాయికన్య మృతిచెందినట్టు వైద్యులు ధృవీకరించారు. కాగా భర్త పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం అందుకున్న నున్న రూరల్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. చీట్ల వ్యాపారంలో అప్పులపాలైనట్టు పోలీసుల విచారణలో తేలింది. ఆ కారణంతోనే ఇరువురు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెలగలేరులో గోదాముల ప్రారంభం

జి.కొండూరు, జనవరి 9: వెలగలేరులో ఏఎంసీ మార్కెట్ యార్డ్ స్థలంలో రూ.10.91 కోట్లతో నూతనంగా నిర్మించిన గోదాములను మంగళవారం మంత్రి కాకాని గోవర్ధన రెడ్డి, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. ఈఈ వి.సురేంద్ర, డీఈఈ శ్యాం, ఏఈఈ విజయభాస్కర్ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	90, 97, 107
చికెన్ విత్ స్కిన్	174
చికెన్ స్కిన్‌లెస్	184

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.65

దర్గా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : షేక్ ఆసిఫ్



ఉరుసు మహోత్సవంలో షేక్ ఆసిఫ్

వన్‌టౌన్, జనవరి 9: ప్రకాశం బ్యారేజీ వద్ద సుప్రసిద్ధ హజరత్ సయ్యద్ హుస్సేన్ షాఖాద్రి బాబా ఉరుసు మహోత్సవాలలో మంగళవారం మైనారిటీ సెల్ రాష్ట్ర చైర్మన్, వైసీపీ పశ్చిమ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ పాల్గొన్నారు. దర్గా ముతావల్లి సయ్యద్ ఖాజా మొహిద్దీన్ పీరా ఇస్లాం సంప్రదాయం ప్రకారం ఆసిఫ్‌ను ఆహ్వానించి సత్కరించారు. ఆసిఫ్ దర్గాలో బాబాకు పూలు, అత్తరు, చందనం, చాదర్‌లను సమర్పించారు. సలాం, దువాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ దర్గాలో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వైసీపీ నాయకులు ఆంజాద్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

దొంగ ఓట్లతో అధికారంలోకి రావాలని చూస్తున్న

జగన్‌కు బుద్ధి చెప్పండి

బూత్ లెవల్ కన్వీనర్ల సమావేశంలో ఎమ్మెల్యే గద్దె

మొగల్రాజపురం, జనవరి 9: దొంగ ఓట్లతో అధికారంలోకి రావాలని చూస్తున్న జగన్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పిలుపునిచ్చారు. 7వ డివిజన్‌లో బాబు షూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డివిజన్ పార్టీ కార్యాలయంలో బూత్ లెవల్ కన్వీనర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నేరవేర్చి ప్రజలను ఓట్లు అడుగుతారని, కానీ ఉన్న ఓట్లను తొలగించి ఎన్నికల్లో గెలవాలని జగన్ చూడటం సిగ్గుచేటన్నారు. అందుకే ప్రజలు తమ ఓటు ఉందో తొలగించారో అనే అయోమయంలో ఉన్నారని చెప్పారు. సంక్షేమ పథకాల పేరుతో రూ.100 ఇచ్చి లక్షల రూపాయలను పన్నుల రూపంలో వసూలు చేస్తున్నారని విమర్శించారు. పార్టీ డివిజన్ కార్యాలయాల వద్ద ఓటర్ల జాబితాలను ఉంచామని, ప్రజలు వచ్చి తమ పేరు ఉందో లేదో చూసుకోవాలని చెప్పారు. డివిజన్ పార్టీ అధ్యక్షుడు సతీష్, దోమకొండ రవి, దయాల శిరీషా గాంధీ, దోమకొండ రత్నాకర్, కొండపల్లి లక్ష్మణరావు, రేపాకుల శ్రీనివాస్, పెనుగొండ శ్రీనివాస్, పరసా లక్ష్మణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తదితరులు

పసుపు జెండా గెలుపే

లక్ష్యంగా పని చేయాలి: బొండా ఉమా

అజిత్‌సింగ్‌నగర్: రాబోయే ఎన్నికల్లో పసుపు జెండా గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో మంగళవారం 62వ డివిజన్ టీడీపీ ముఖ్య నేతలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రావటం చారిత్రాత్మక అవసరమని అన్నారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నేతలు ఘంటా కృష్ణమోహన్, పైడి శ్రీను, బత్తుల కొండ, పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

లబ్బీపేట, జనవరి 9: నలంద డిగ్రీ కళాశాలలో మంగళవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మన సంస్కృతి సంప్రదాయాలు, సంక్రాంతి విశిష్టత తెలియజేసేలా పలు కార్యక్రమాలతో పాటు వివిధ పోటీలు నిర్వహించారు. సంక్రాంతి లక్ష్మి, గాలిపటం తయారీ, బొమ్మల కొలువు, పల్లెల్లో సంక్రాంతి, భోగి కుండల అలంకరణ, రంగోలి తదితర పోటీలు నిర్వహించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనూరాధ మాట్లాడుతూ సంప్రదాయ వస్త్రధా రణ పోటీల్లో విద్యార్థినులు పాల్గొనడం సంతోషకర మని అన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ లక్ష్మీ పాల్గొన్నారు.



సంక్రాంతి ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు



వాణీ స్కూల్‌లో..

వాణీ స్కూల్‌లో...

గవర్నర్‌పేట: ఏలూరు రోడ్డులోని శ్రీ వాణీ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో మంగళవారం పల్లె వాతావరణం కనిపించేలా ప్రాంగణాన్ని అలంకరించారు. సంప్రదాయ దుస్తులు ధరించిన చిన్నారులు సంక్రాంతి ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టారు. హరిదాసు వేషధారణ, కోలాట బృందం, భోగిపండ్లు కార్యక్రమాలు చేపట్టారు. తల్లిదండ్రులతో కలిసి చిన్నారులు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. స్కూల్ డైరెక్టర్ ఏ. శేషుబాబు, హెచ్ఎం ఏ. ఝాన్సీలక్ష్మీలు కార్యక్రమాలను పర్యవేక్షించారు.



నియామక పత్రాలు అందజేస్తున్న అంజిబాబు

ప్రజా కాపునాడు కార్యవర్గ నియామకం

గవర్నర్‌పేట, జనవరి 9: ఎంజీ రోడ్డులోని సంఘ కార్యాలయంలో మంగళవారం 29వ డివిజన్ ప్రజా కాపునాడు కార్యవర్గ నియామకం జరిగింది. అధ్యక్షుడిగా కోల రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా కొప్పుశెట్టి దుర్గారావు, ఉపాధ్యక్షులుగా పులప ప్రకాశరావు, దేవిరెడ్డి ఆదినారాయణలకు నియామకపు పత్రాలు అందజేశారు. నూతనంగా నియమితులైన కార్యవర్గ సభ్యులకు శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు మాట్లాడుతూ కాపుల అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేయాలని, కాపు కుల ధ్రువీకరణ పత్రం కోసం సంఘ నేతలను సంప్రదించాలని కోరారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్

కొండ ప్రాంతంలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

భవానీపురం, జనవరి 9 : స్థానిక 45వ డివిజన్‌లోని కొండప్రాంతంలోని ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య తెలిపారు. సొరంగంకొండ ప్రాంతంలో మంగళవారం ఆమె పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆడుదాం-ఆంధ్రా కార్యక్రమం కింద క్రీడాకారులకు ఆమె క్రికెట్ కిట్‌లను పంపిణీ చేశారు. బి.కోటేశ్వరరావు, లక్ష్మి, కోటేశ్వరి, ఎవి ఎనిటీస్ సెక్రటరీ వెంకట్రావు పాల్గొన్నారు.

ముత్యాలంపాడులో 12న ముగ్గుల పోటీలు

సత్యనారాయణపురం, జనవరి 9: సిటీవైడ్ ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతిని పురస్కరించుకొని ఈనెల 12న ముత్యాలంపాడులో చుక్కల, గీతల, ఆర్ట్ ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామని ఫ్యాన్స్ అసోసియేష్ గౌరవాధ్యక్షుడు బొండా ఉమామహేశ్వరరావు తెలిపారు. ముత్యాలంపాడు టీడీపీ కార్యాలయంలో మంగళవారం ముగ్గుల పోటీలకు సంబంధించిన కరపత్రాలను బొండా ఉమామహేశ్వరరావు, సిటీప్రభాస్ ఫ్యాన్ అసోసియేషన్ అధ్యక్షుడు దెందుకూరి మురళీకృష్ణంరాజుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ ముగ్గుల పోటీలను ముత్యాలంపాడు అల్లూరి సీతారామరాజు రోడ్డులో శుక్రవారం మధ్యాహ్నం 1గంటకు నిర్వహిస్తామని చెప్పారు. ఆసక్తిగల మహిళలు 11లోగా ముత్యాలంపాడు చర్చి ఎదురు కాల్‌మీ టైలరింగ్ షాపులో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. సిటీవైడ్ ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ కృష్ణాజిల్లా అధ్యక్షుడు నున్న నాగేశ్వరరావు, పైడి శ్రీను, దాసరి కనకారావు, తొట్టెంపూడి ఉదయశంకర్ తదితరులు పాల్గొన్నారు.



పోటీలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బొండా ఉమా తదితరులు

పెట్రోల్ ఎక్స్‌పీ 95ను ఉపయోగించుకోవాలి

లబ్బీపేట, జనవరి 9: ఇండియన్ ఆయిల్ వినియోగదారుల దినోత్సవంను ఎంజీ రోడ్డులోని ఇండియన్ ఆయిల్ పైలెట్ సర్వీస్ స్టేషన్ పెట్రోల్ బంక్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఆయిల్ సంస్థ ప్రతినిధులు వినియోగదారులతో కేక్ కట్ చేయించి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐవోసీఎల్ చీఫ్ డివిజనల్ రిటైల్ హెడ్ అనిల్ మాట్లాడుతూ వినియోగదారులు నాణ్యమైన, కాలుష్య రహిత పెట్రోల్ ఎక్స్‌పి 95ను ఉపయోగించుకోవాలని సూచించారు. జిల్లా సేల్స్ ఆఫీసర్ కొమ్మోజు వరప్రసాద్ మాట్లాడుతూ ఈ రోజు నుంచి ఫిబ్రవరి 15 వరకు ఎక్స్‌ట్రా రివార్డ్స్ సౌకర్యం వినియోగించుకుని తద్వారా ఉచిత పెట్రోల్, ఎక్స్‌ట్రా రివార్డ్స్ పాయింట్స్ శాశ్వతంగా పొందే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. చీఫ్ మేనేజర్ కె.వి.ఎస్.పవన్ కుమార్, డీలర్ ఎంవీవీ సత్యనారాయణ, నంద కిషోర్, మేనేజర్ కె.వెంకటప్పయ్య పాల్గొన్నారు.



వినియోగదారులచే కేక్ కట్ చేయిస్తున్న ఐవోసీఎల్ ప్రతినిధులు

పారిశుధ్య కార్మికులను మోసగించిన జగన్

● కార్పొరేటర్ బోయి సత్యబాబు

చిట్టినగర్, జనవరి 9: పారిశుధ్య కార్మికులను జగన్ ప్రభుత్వం మోసం చేసిందని సీఐటీయూ పశ్చిమ నగర ఉపాధ్యక్షుడు, కార్పొరేటర్ బోయి సత్యబాబు దుయ్యబట్టారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికుల ఆందోళనలో భాగంగా మంగళవారం కొత్తపేట నెహ్రూబొమ్మ సెంటర్ నుంచి సర్కిల్-1 కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 రోజులుగా పారిశుధ్య కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తున్నా జగన్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఎస్మా చట్టాల పేరిట కార్మికుల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారన్నారన్నారు. వెంటనే ప్రభుత్వం కార్మికుల, ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సమ్మెను విరమింపచేయాలని కోరారు. కె.సూరిబాబు, కొండలు, ఆదిలక్ష్మి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.



నిరసన ప్రదర్శన చేస్తున్న పారిశుధ్య, సీఐటీయూ నాయకులు

మహిళల విద్యకు పాటుపడిన ఫాతిమా షేక్

టీడీపీ సీనియర్ నాయకుడు ఎంఎస్ బేగ్

వన్‌టౌన్, జనవరి 9: విద్యాభారత వైతాళికురాలుగా, అణగారిన కులాలకు, మహిళలకు విద్యను అందించే దిశగా కృషి చేసిన గొప్ప మహిళా నాయకురాలు ఫాతిమా షేక్ అని టీడీపీ సీనియర్ నాయకుడు ఎంఎస్ బేగ్ కొనియాడారు. ఆమె జయంతి సందర్భంగా టీడీపీ పశ్చిమ కార్యాలయంలో ఎంఎస్ బేగ్, తదితర మహిళ నాయకురాళ్లు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగువర్గాల కోసం విద్యావ్యవస్థలను ఏర్పాటు చేసే గొప్ప లక్ష్యాలున్న పూలే దంపతులకు అండగా ఫాతిమా, ఆమె సోదరుడు ఉస్మాన్‌లు నిలిచారన్నారు. టీడీపీ మహిళా అధ్యక్షురాలు సుఖాసి సరిత మాట్లాడుతూ ఆధునిక భారతదేశ తొలి ముస్లిం ఉపాధ్యాయురాలిగా ఆమెకు ఘనత దక్కిందన్నారు. మహిళా సెల్ ప్రధాన కార్యదర్శి నసీమా, కొట్టేటి సరిత, శాంతి, అపర్ణ, బుజ్జి, జ్యోతి, స్రవంతి, రామలక్ష్మి, వాణి, షకీలా, రాధిక, మల్లీశ్వరి, వరలక్ష్మి, నిర్మలాలక్ష్మి, టీమ్ టీడీపీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఫాతిమాకు నివాళులర్పిస్తున్న ఎంఎస్ బేగ్, మహిళా నాయకురాళ్లు

రెస్టారెంట్‌లలో ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు

కృష్ణలంక, జనవరి 9 : ఆహార భద్రతా ప్రమాణాలను పాటించని రెస్టారెంట్లు, హోటల్స్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని విజయవాడ రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కరీముల్లా షరీఫ్ తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారులు, ఫుడ్‌సేఫ్టీ అధికారులతో కలిసి పటమట పరిసర ప్రాంతంలోని మధురిమ, ఆర్‌ఆర్ దర్బార్ రెస్టారెంట్‌లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ప్రమాణాలను పరిశీలించారు. ఆహార భద్రతలో ప్రమాణాలు లేకపోవడాన్ని గుర్తించారు. అధికారులు నిల్వ వుంచిన ఆహారం, మిస్‌బ్రాండెడ్ వస్తువుల నుంచి నమూనాలు సేకరించి స్టేట్ ఫుడ్ ల్యాబ్, హైదరాబాద్‌కు విశ్లేషణ నిమిత్తం పంపారు. హోటల్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేసి తగు చర్యల నిమిత్తం పరిపాలన అధికారి, జేసీకి ఫిర్యాదు చేశారు. హోటల్ నిర్వాహకులు పరిశుభ్రమైన ప్రదేశంలో, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, లేని పక్షంలో నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని కరీముల్లా షరీఫ్ హెచ్చరించారు.



ఆర్చరీలో భువన రాజేశ్వరికి పతకాలు

విజయవాడ కల్చరల్, జనవరి 9 : తమ కళాశాల విద్యార్థిని టి.భువన రాజేశ్వరి ఛత్తీస్‌ఘర్‌లో జరిగిన సబ్ జూనియర్ నేషనల్స్ ఆర్చరీ టోర్నమెంట్‌లో సిల్వర్ మెడల్, బ్రాంజ్ మెడల్ గెలుచుకొని ఈ నెలలో చెన్నైలో జరిగే ఖేలో ఇండియాకి సెలక్ట్ అవడం సంతోషంగా వుందని సిద్ధార్థ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.పద్మజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టి.భువన రాజేశ్వరి తమ కళాశాలలో జూనియర్ ఇంటర్ సీఈసీ చదువుతుందని తెలిపారు. సిద్ధార్థ అకాడమీ సెక్రటరీ పి.లక్ష్మణ్, కళాశాల కన్వీనర్ ఎన్.లలిత ప్రసాద్, కళాశాల సిబ్బంది, విద్యార్థినులు భువన రాజేశ్వరికి అభినందనలు తెలిపారు.



రాజేశ్వరిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పద్మజ

యువతిని వేధిస్తున్న తల్లీకొడుకులపై కేసు

అజిత్‌సింగ్‌నగర్, జనవరి 9 : ప్రేమ పేరుతో ఓ యువతిని వేధిస్తున్న యువకుడితో పాటుగా అతని తల్లిపై మంగళవారం అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం అమరావతి కాలనీకి చెందిన ఓ యువతి నగరంలోని ఓ కళాశాలలో బీఎస్సీ చదువుతుంది. గతంలో యువతి కుటుంబం మధురానగర్ ప్రాంతంలో ఉన్నారు. ఆ సమయంలో అదే ప్రాంతానికి చెందిన మణికంఠ కుటుంబంతో వారికి పరిచయం ఉంది. యువతి కుటుంబం అమరావతి కాలనీలోని ఇంటికి మారారు. మణికంఠ యువతితో అసభ్యంగా ప్రవర్తిస్తున్న నేపథ్యంలో యువతి మాట్లాడటం మానుకుంది. సోమవారం రాత్రి యువతి డాబా కొట్లు సెంటర్ వద్ద ఉన్న సమయంలో మణికంఠ అతని తల్లి నర్సమ్మలు ఆటోలో వచ్చి యువతిని బెదిరింపులకు గురి చేశారు. తనను పెళ్లి చేసుకోవాలని యువకుడు బెదిరించగా తల్లి కొడుకుకు మద్దతుగా యువతిని దుర్భాషలాడింది. విషయం తెలుసుకున్న యువతి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

భార్య కనిపించడం లేదని ఫిర్యాదు

అజిత్‌సింగ్‌నగర్, జనవరి 9 : భార్య కనిపించడం లేదని ఓ వ్యక్తి మంగళవారం అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల ప్రకారం లూనా సెంటర్ ప్రాంతానికి చెందిన షేక్ సన్నీ(35) గత నెల 17న పనికి వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. అప్పటి నుంచి చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసిన కుటుంబ సభ్యులు మహిళ ఆచూకీ తెలీకపోవడంతో అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సామాజిక సమత సంకల్పం

రాణిగారితోట, జనవరి 9: సామాజిక సమత సంకల్పం కార్యక్రమాన్ని 17వ డివిజన్‌లోని 78వ సచివాలయంలో మంగళవారం నిర్వహించారు. డివిజన్ కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఓటమి విజయానికి సోపానం

మొగల్రాజపురం, జనవరి 9: జీవితంలో ఎదురయ్యే ఓటమిని విజయానికి సోపానంగా మార్చుకోవాలని అపుడే లక్ష్యానికి చేరుకుంటారని ఇన్ కంటాక్స్ ప్రిన్సిపల్ కమిషనర్ సునీత బిల్లా చెప్పారు. వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ 45వ వార్షికోత్సవం సోమవారం రాత్రి నిర్వహించారు. సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సునీత బిల్లా, గౌరవ అతిథి సీబీఎస్ఈ శేఖర్‌చంద్ర మాట్లాడారు.అనంతరం విద్యార్థులు పలు రాష్ట్రాల సంప్రదాయ నృత్యాలు, ఆంగ్ల, తెలుగు నాటకాలు, వెస్ట్రన్ నృత్యాలు, జానపద కళా కదంబం ప్రదర్శించారు. ఠాగూర్ హౌస్ కోకర్య్కులర్ యాక్టివిటీస్ కప్పును గెలుచుకుంది. 25ఏళ్లు పూర్తి చేసుకున్న ఐదుగురు ఉపాధ్యాయులను, మున్నీ ఆయమ్మను సత్కరించారు. 100 శాతం హాజరు ఉన్న ఉపాధ్యాయిని కృష్ణవేణిని సత్కరించారు. సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, ఉపాధ్యక్షులు నాగభూషణం, సెక్రటరీ లలిత ప్రసాద్, కోశాధికారి ఎస్. వెంకటేశ్వరరావు, పాఠశాల కన్వీనర్ సూరెడ్డి విష్ణు పాల్గొన్నారు.



రైల్వేగోడను తొలగించిన వారికే ఎన్నికల్లో మద్దతు

సత్యనారాయణపురం, జనవరి 9: రైల్వేగోడను తొలగించిన వారికే ఎన్నికల్లో మద్దతు ఉంటుందని శ్రీనగర్ కాలనీవాసులు, శ్రీనగర్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. స్థానిక శ్రీనగర్ కాలనీలో మంగళవారం సాయంత్రం రైల్వే గోడను తొలగించాలని శ్రీనగర్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం కార్పొరేటర్ వీరమాచినేని లలితతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికలో రైల్వేగోడను తొలగించిన వారికే మద్దతిస్తామన్నారు. వెల్ఫేర్ అసోసియేష్ అధ్యక్షుడు ఎన్వీ నారాయణ, ప్రధాన కార్యదర్శి కలిగినీడి గంగాధర రామారావు, జీ.ద్వారక, ఎన్.శరత్, సుధాకర్ నాయుడు, కేకేఎం రాజు కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
బుధవారం • 10 జనవరి 2024
cinema@andhrajyothy.com

ఈసారి కూడా బాగా గట్టిగా కొడతాం

మహేశ్‌బాబు



"నాకూ, నాన్నగారికీ సంక్రాంతి బాగా కలిసొచ్చిన పండుగ. సంక్రాంతికి విడుదలైన మా సినిమాలు బ్లాక్‌బస్టర్లయ్యాయి. ఈ సారి కూడా బాగా గట్టిగా కొడతాం. కానీ ఈ సారి 'గుంటూరు కారం' చిత్రం రికార్డులు, వసూళ్ల గురించి మాట్లాడడానికి నాన్న మన మధ్య లేరనే వెలితి ఉంది. ఆ లోటును ఇక మీరే (అభిమానులు) తీర్చాలి. ఇకపై నాకు అమ్మా, నాన్నా... అన్నీ మీరే' అని మహేశ్‌బాబు భావోద్వేగంతో స్పందించారు. ఆయన హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వం వహించిన చిత్రమిది. ఈనెల 12న విడుదలవుతోంది. మంగళవారం చిత్రబృందం గుంటూరులో ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. ఈ సందర్భంగా మహేశ్‌బాబు మాట్లాడుతూ "త్రివిక్రమ్ అంటే నాకు చాలా ఇష్టం. గత రెండేళ్ల ఆయన నాకు అండగా నిలిచిన తీరు ఎప్పటికీ మర్చిపోలేను. ఆయన సినిమాల్లో చేసేటప్పుడు నా నటనలో ఏదో మ్యాజిక్ జరుగుతుంది. 'అతడు, ఖలేజా' చిత్రాల తరహాలో ఇప్పుడు 'గుంటూరు కారం'లోనూ అదే మ్యాజిక్ జరిగింది. ఇందులో మీరు కొత్త మహేశ్‌బాబును చూడబోతున్నారు. దానికి కారణం త్రివిక్రమే. మా నిర్మాత చినబాబు ఇష్టపడే హీరోని నేనే. వారితో మరిన్ని గొప్ప సినిమాలు తీయాలని కోరుకుంటున్నాను. చాలా రోజుల తర్వాత మన తెలుగు అమ్మాయి శ్రీలీల పెద్ద హీరోయిన్ కావడం గొప్ప విషయం. ఆ అమ్మాయితో డాన్స్ చేయాలంటే హీరోలందరికీ తాట ఊడిపోద్ది. థమన్ బెస్ట్ సాంగ్స్ ఇచ్చాడు' అని తెలిపారు. త్రివిక్రమ్ మాట్లాడుతూ 'ఒక సినిమాకు వంద శాతం పనిచేయాలంటే రెండొందల శాతం పనిచేసే హీరో ఎవరైనా ఉన్నారంటే అది మహేశ్‌బాబే. పాతికేళ్లయింది అంటున్నారు కానీ ఆయన్ను చూస్తుంటే నిన్నో, మొన్నో సినిమాల్లోకి వచ్చిన హీరోలానే ఉన్నారు. సూపర్‌స్టార్ కృష్ణగారు గొప్ప నటుడు. ఆయన నటించిన ఒక సినిమాకు సహాయ రచయితగా పనిచేశాను. అంత గొప్ప మనిషికి కొడుకుగా పుట్టిన మహేశ్‌బాబు ఎంత అదృష్టవంతుడో కదా అనిపిస్తుంది. 'అతడు, ఖలేజా' సినిమాలకు పనిచేసినప్పుడు మహేశ్ ఎలా ఉన్నారో ఇప్పుడు కూడా అలానే ఉన్నారు. నటనలోనూ అదే స్పీడ్ చూపిస్తున్నారు. షూటింగ్ తర్వాత బాగా అలసిపోయి కూడా మిమ్మల్ని కలుసుకోవడానికి గుంటూరు వచ్చారు. జనవరి 12న థియేటర్లలో కలుద్దాం. సంక్రాంతిని ఈసారి రమణగాడితో కలసి చేసుకుందాం' అన్నారు. శ్రీలీల మాట్లాడుతూ 'నాకు ఈ సినిమా మళ్లీ రీ లాంచ్‌లా అనిపిస్తోంది. మహేశ్‌బాబు బంగారపు విగ్రహానికి ప్రాణం పోసినట్లు ఉంటారు. ఆయన మనసు కూడా అంతే అందమైనది' అని చెప్పారు. నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ 'మేకర్స్‌గా చినబాబు, వంశీ ప్రయాణం అద్భుతంగా ఉంది. త్రివిక్రమ్ ఈ సినిమాతో కలెక్షన్ల తాట తీస్తాడు. మహేశ్‌బాబు మరో బ్లాక్‌బస్టర్ చిత్రం ఇస్తున్నారు' అన్నారు. మీనాక్షి చౌదరి మాట్లాడుతూ 'త్రివిక్రమ్‌తో పనిచేయాలనే కోరిక ఈ చిత్రంతో తీరింది. ఆయనను అందరూ గురూజీ అని ఎందుకు పిలుస్తున్నారో అర్థమవుతోంది. మహేశ్‌బాబు గారి సినిమాలో చేయాలని అడిగినప్పుడు షాక్ తిన్నాను. ఆయనతో నటించే అవకాశం రావడం గౌరవంగా భావిస్తున్నాను. ఇది మహేశ్‌గారి మాస్ ఫిల్మ్' అని అన్నారు.

రేకుల షెడ్డు కూలి అభిమానులకు గాయాలు

గుంటూరు జిల్లాలోని పెదకాకాని సమీపంలో మహేష్ బాబు హీరోగా నటించిన గుంటూరు కారం సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో మంగళవారం రాత్రి అపశృతి చోటుచేసుకుంది. అంచనాలకు మించి భారీగా మహేష్ బాబు అభిమానులు రావడంతో, సభ ప్రాంగణం మొత్తం కనుచూపు మేర జనసంద్రంగా మారిపోయింది. దీంతో ప్రాంగణం కుడి వైపున వాచ్‌మెన్ కోసం నిర్మించిన రేకుల షెడ్డుపైకి పెద్ద ఎత్తున అభిమానులు ఎక్కారు. మహేష్ బాబును చూసేందుకు యువత ఒక్కసారిగా ఎగబడ్డారు. దీంతో రేకుల షెడ్డు కూలిపోయింది. ఈ ఘటనలో 20 మందికి స్వల్ప గాయాలయ్యాయి. అందులో కొందరిని విజయవాడ, గుంటూరు అస్పత్రులకు తరలించి చికిత్స అందించారు.

- పెదకాకాని

మొయినుద్దీన్‌గా తలైవా..



కులాలకు, మతాలకు, జాతులకు, ప్రాంతాలకు అతీతమైనవి క్రీడలు. అలాంటి క్రీడలకు మత మౌఢ్యాన్ని అద్ది.. లేనిపోని వివాదాలకు తెరలేపుతూ పెడత్రోవ తొక్కుతున్న కొందరు యువకులను సన్మార్గంలో నడిపించి, వారిలో సఖ్యతను కుదిర్చే ఓ వ్యక్తి కథే 'లాల్ సలామ్'. ఇందులో సూపర్‌స్టార్ రజనీకాంత్ మొయినుద్దీన్ అనే శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నారు. ముంబై నేపథ్యంలో నడిచే సినిమా ఇది. విష్ణు విశాల్, విక్రాంత్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి ఐశ్వర్య రజనీకాంత్ దర్శకురాలు. సుభాస్కరన్ నిర్మాత. ప్రపంచవ్యాప్తంగా ఫిబ్రవరి 9న విడుదల కానున్న ఈ పాన్‌ఇండియా సినిమాకు సంబంధించిన రిలీజ్ డేట్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. బ్లాక్‌బస్టర్ 'జైలర్' తర్వాత వస్తున్న తలైవా సినిమా కావడంతో సినిమాపై భారీ అంచనాలే ఉన్నాయి. కెరీర్‌లో ఇప్పటివరకూ చేయని విభిన్న పాత్రను ఇందులో రజనీ చేసున్నారని మేకర్స్ చెబుతున్నారు. ప్రపంచ ప్రఖ్యాత క్రికెటర్ కపిల్‌దేవ్ ఇందులో ప్రత్యేకపాత్ర పోషిస్తుండటం విశేషం. జీవితా రాజశేఖర్, సెంథిల్, తంబి రామయ్య, అనంతిక, వివేక్ ప్రసన్న, తంగదురై తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: విష్ణు రంగస్వామి, సంగీతం: ఏ.ఆర్.రెహమాన్.

లోకేశ్ కనకరాజ్ దర్శకత్వంలో రజనీకాంత్ 171వ చిత్రం రూపొందుతున్న విషయం తెలిసిందే. విశేషమేమిటంటే.. తలైవా 172కు కూడా రంగం సిద్ధమైంది. కర్ణన్, మామన్నన్ చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న మారి సెల్వరాజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. లోకేశ్ కనకరాజ్ సినిమా నిర్మాణం పూర్తికాగానే, ఈ సినిమా షూటింగ్ మొదలవుతుంది.

ఐదొందల జీతానికి పనిచేశా

సమంత



స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన తర్వాత జీవితంలో ఆర్థిక స్థిరత్వం వచ్చింది, అన్ని సౌకర్యాలు అమరాయి కానీ కెరీర్ ఆరంభంలో చాలా కష్టాలు పడాల్సి వచ్చిందన్నారు సమంత. ఒక్కపూట భోజనం కోసం వెతుక్కున్న రోజులు తన జీవితంలో ఉన్నాయని ఆమె చెప్పారు. ప్రస్తుతం మయోసైటిస్ వ్యాధితో సినిమాలకు విరామం ఇచ్చారు సమంత. ఇటీవలే జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో సినిమాల్లోకి రాకముందు తన జీవితం గురించి వివరిస్తూ ఆమె భావోద్వేగానికి గురయ్యారు. అమ్మానాన్న చదువుకోమని చాలా ప్రోత్సహించినా ఆర్థిక స్తోమత సరిపోక పెద్ద చదవులు చదవలేకపోయానని చెప్పారు. 'కుటుంబ పోషణ కోసం చిన్న చిన్న ఉద్యోగాలు చేసేదాన్ని. ఒక స్టార్ హోటల్లో రూ. 500 నెల జీతానికి పనిచేశాను. అక్కడ నిర్వహించే కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరించేదాన్ని. మధ్యతరగతి కుటుంబం నుంచి జీవితంలో ఈ స్థాయికి రావడం వెనుక ఎన్నో కష్టనష్టాలు, అవమానాలు, హేళనలు ఎదుర్కోవలసి వచ్చింది' అని తెలిపారు. త్వరలోనే సమంత ఓ బాలీవుడ్ చిత్రం చేయబోతున్నారని సమాచారం.

వెంకటేశ్ నట విశ్వరూపం చూస్తారు

'జయాపజయాల గురించి పట్టించుకోను. ప్రయాణాన్ని మాత్రమే ఆస్వాదిస్తాను. నిజాయితీగా పనిచేస్తే విజయం అదే వస్తుంది' అంటున్నారు దర్శకుడు శైలేష్ కొలను. ఆయన దర్శకత్వంలో వెంకటేశ్ కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'సైంధవ్'. వెంకట్ బోయనపల్లి ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ఈ సినిమా ఈ నెల 13న సంక్రాంతి కానుకగా విడుదల కానుంది. ఈ సందర్భంగా శైలేష్ విలేకరులతో మాట్లాడారు.



- 'హిట్2' తర్వాత వెంకటేశ్‌గారిని కలిశాను. బాగా తీశావ్ అని అభినందించారు. మేం సినిమాల కంటే జనరల్ విషయాలే ఎక్కువ మాట్లాడుకునేవాళ్లం. రెండుమూడు మీటింగ్స్‌లో మా ఇద్దరికీ మంచి బాండింగ్ ఏర్పడింది. సినిమా చేయాలనుకున్నాం. 'సైంధవ్' ఐడియా చెప్పాను. ఆయనకి బాగా నచ్చింది. 'నా 75వ సినిమా అంటే ఇలా ఉండాలి' అంటూ సంబరపడిపోయారు. ఆ లైన్ డవలప్‌చేసి పూర్తి స్క్రిప్ట్ వినిపించాను. కథ మొత్తం విని హగ్ చేసుకున్నారు. 'ఇది చేస్తున్నాం' అంటూ భుజం తట్టారు
- ఎలాంటి టెన్షన్ లేకుండా సినిమాను పూర్తి చేశాను. దానికి కారణం వెంకటేశ్‌గారే. అయితే.. ప్రమోషన్స్‌లో వెంకటేశ్‌గారి ఏవీలు చూస్తుంటే.. 'ఇంతటి అద్భుతమైన జర్నీ ఉన్న హీరోతో సినిమా చేశానా!?' అని టెన్షన్ మొదలైంది. నా వరకూ దర్శకుడిగా పూర్తి సంతృప్తితో ఉన్నా. వెంకీ 75 మూవీ ఎలా ఉండాలో అలా చేశాం. ఇందులో వెంకటేశ్ విశ్వరూపం చూస్తారు.
- వెంకటేశ్‌గారు ఎమోషనల్‌గా చేసిన ప్రతి సినిమా హిట్టే. శత్రువు, ధర్మచక్రం, గణేశ్, తులసి.. ఇలా చెప్పుకుంటూపోతే చాలా ఉన్నాయి. ఈ సినిమా వాటిని మించేలా ఉంటుంది. ఇంత ఎమోషనల్ డెప్త్ ఉన్న కథ చేయడం నాకిదే ప్రథమం. ఇందులో వెంకటేశ్‌గారి పెర్ఫార్మెన్స్ ప్రేక్షకులకు గూజ్‌బమ్స్ తెప్పిస్తుంది. హృదయాలను ద్రవింపజేసే భావోద్వేగపూరిత సన్నివేశాలు ఉన్నాయి ఇందులో.
- స్పైనల్ మస్కులర్ ఆట్రోఫీ అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్న వారి పోరాటానికి బలమైన గొంతుకలేదు. 17కోట్ల ఇంజక్షన్ కోసం తపన పడే పేరెంట్స్ గురించి, వారి పోరాటం గురించి మనకి పెద్దగా అవగాహనలేదు. సమాజంలో ఈ విషయంపై అవగాహన పెంచాలంటే విస్తృతంగా కమ్యునికేట్‌చేసే నటులు కావాలి. వెంకటేశ్‌గారితోపాటు ఆండ్రియా, రుహానీ శర్మ లాంటి నటులు ఇందులో భాగమవ్వడానికి కారణం అదే. ఒక పవిత్రభావనతో తయారు చేసుకున్న కథ ఇది. అందుకే అందరికీ కనెక్ట్ అవుతుందని నమ్ముతున్నాను.
- ఇందులో నవాజుద్దీన్ సిద్దిఖీ పాత్ర యూనిక్‌గా ఉంటుంది. ఇప్పటివరకూ ఆయన కూడా ఈ తరహా పాత్ర చేయలేదు. డబ్బింగ్ సమస్య కారణంగా ఆయన దక్షిణాది సినిమాలు చేయడానికి ఇన్నాళ్లూ ఆసక్తి చూపలేదు. ఇందులో వచ్చీరాని తెలుగులో మాట్లాడే పాత్రని రాసుకున్నాను. ఆ పాత్రకు ఆయనతో డబ్బింగ్ చెప్పించడమే కరెక్ట్. అది ఆయనకి నచ్చింది. దాంతో చేయడానికి ఒప్పుకున్నారు. శ్రద్ధగా డబ్బింగ్ చెప్పారు.
- సినిమా చాలా కాస్ట్‌లీగా ఉంటుంది. కథకోసం వైజాగ్ సముద్రతీరంగా 'ఇంద్రప్రస్థ' అనే ఫిక్షనల్ టౌన్‌ని క్రియేట్ చేశాం. నిర్మాత ఏ విషయంలోనూ రాజీ పడలేదు. అందుకే సినిమా ఇంతబాగా వచ్చింది. పార్ట్2కు అవకాశం ఉన్న కథ ఇది. ప్రేక్షకులు కోరుకుంటే తప్పకుండా పార్ట్2 ఉంటుంది. ఇక నా 'హిట్3' రైటింగ్ దశలో ఉంది. అది రావడానికి ఏడాదిన్నర పట్టొచ్చు.

సంగీత దర్శకుడు ఉస్తాద్ రషీద్‌ఖాన్ కన్నుమూత



ప్రముఖ సంగీత దర్శకుడు ఉస్తాద్ రషీద్‌ఖాన్ (55)కన్నుమూశారు. ప్రొస్టేట్ క్యాన్సర్ బారిన పడిన ఆయన కొంతకాలంగా చికిత్స తీసుకుంటున్నారు. మంగళవారం కోల్‌కతాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో రషీద్‌ఖాన్ తుదిశ్వాస విడిచారు. అభిమానుల సందర్శనార్థం ఆయన భౌతిక కాయాన్ని రవీంద్ర సదన్‌లో ఉంచారు. నేడు అంత్యక్రియలు నిర్వహించనున్నారు. రషీద్‌ఖాన్ మృతిపట్ల పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం తెలిపారు. ఆయనకు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తామని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తెలిపారు. సంగీత రంగంలో ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం పద్మభూషణ్, పద్మశ్రీ పురస్కారాలతో సత్కరించింది. 'ఇష్కేరియా, మౌసమ్, హేట్ స్టోరీ 2, రాజ్, షాదీ మైన్, ఆవోగే జబ్‌తుమ్, కర్లే ప్యార్ కర్లే' తదితర చిత్రాలకు ఆయన సంగీతం అందించారు.

వరాలు అందరికీ నచ్చుతుంది..



'ఇందులో నాపేరు వరాలు. స్వతంత్ర భావాలు కలిగిన అమ్మాయిని. పల్లెటూరి అమ్మాయిలంటే సాధారణంగా సున్నితంగా ఉంటారు. కానీ నేను మాత్రం ఇందులో రెబల్. సినిమా చూసినవాళ్లు 'అమ్మాయి అంటే ఇలా ఉండాలి' అనేలా నా పాత్ర ఉంటుంది' అని ఆషిక రంగనాథ్ అన్నారు. అక్కినేని నాగార్జున కథానాయకుడిగా విజయ్ బిన్నీ దర్శకత్వంలో శ్రీనివాస్ చిట్టూరి నిర్మించిన 'నా సామిరంగ' చిత్రంలో ఆషిక కథానాయికగా నటించారు. జనవరి 14న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో ముచ్చటించారు. 'నాలాంటి కొత్తమ్మాయికి నాగార్జునగారి లాంటి టాప్‌స్టార్‌తో నటించే అవకాశం రావడం నిజంగా అదృష్టం. నా కేరక్టర్‌లో రెండు కోణాలుంటాయి. కొంతభాగం యంగ్‌స్టర్‌గా, కొంతభాగం ప్రౌఢగా కనిపిస్తాను. నటనలోనే కాదు, ఆహార్యంలో కూడా తేడా ఉంటుంది. కష్టపడి చేశాను. ఇంత అద్భుతమైన పాత్ర దక్కడం నా అదృష్టం.' అంటూ ఆనందం వెలిబుచ్చారు ఆషిక. కథానుగుణంగా నాగార్జున పాత్రకూ, తన పాత్రకూ మధ్య అద్భుతమైన లవ్‌ట్రాక్ ఉంటుందని, రొమాంటిక్ సన్నివేశాలను కూడా అందంగా దర్శకుడు తీర్చిదిద్దారని ఆషిక చెప్పారు. అల్లరి నరేశ్, రాజ్‌తరుణ్ పాత్రలు కూడా కథలో కీలకంగా ఉంటాయని, వారి కాంబినేషన్‌లో వచ్చే తన సీన్స్ చక్కని వినోదాన్ని పంచుతాయని ఆషిక తెలిపారు. ఎం.ఎం.కీరవాణి లాంటి గ్రేట్ టెక్నీషియన్ పనిచేస్తున్న చిత్రంలో భాగమవ్వడం పట్ల ఆషిక సంతోషం వ్యక్తం చేశారు. వేగం, క్లారిటీ ఈ రెండూ దర్శకుడు విజయ్ బిన్నీకి ఆభరణాలని, అనుభవం ఉన్న దర్శకుడిగా వండర్ అనిపించేలా సినిమాను తీర్చిదిద్దాడని, నిర్మాత శ్రీనివాస్ సహకారం వల్లే ఇంత అద్భుతమైన ప్రొడక్ట్ తయారైందని ఆమె పేర్కొన్నారు. తమిళంలో సిద్ధార్థ్ కథానాయకుడిగా రూపొందుతోన్న చిత్రంతోపాటు కన్నడలో రెండు చిత్రాల్లో నటిస్తున్నట్టు ఈ సందర్భంగా ఆషిక తెలిపారు.

నిజాలు తెలుసుకొని వార్తలు రాయండి

- మిడిమిడి జ్ఞానంతో వార్తలు రాసి చిత్రపరిశ్రమను ఇబ్బందిపెడితే చర్యలు తప్పవు
- అసత్యాలను ప్రచారం చేసే పాత్రికేయులపై చర్యలు తీసుకోవాలని మీడియా సంస్థలను కోరిన తెలుగు చలనచిత్ర వాణిజ్య మండలి, తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర వాణిజ్య మండలి, తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి

తెలుగు చలనచిత్ర పరిశ్రమ

ఇక నుంచి మెయిన్‌స్ట్రీమ్ మీడియా, సోషల్ మీడియా, డిజిటల్ మీడియా సంస్థలు చిత్ర పరిశ్రమను ఇబ్బందిపెట్టేలా ఇష్టం వచ్చిన రాతలు రాస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలుగు చలనచిత్ర వాణిజ్య మండలి, తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర వాణిజ్య మండలి, తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి సంయుక్తంగా హెచ్చరించాయి. ఈ మేరకు మంగళవారం ఆ మూడు సంస్థలు సంయుక్తంగా ఓ ప్రకటన విడుదల చేశాయి. నిజాలను నిర్భయంగా ప్రచారంలో పెట్టవచ్చు కానీ అసత్యాలు, ఈర్ష్య ద్వేషాలతో వ్యక్తుల గౌరవాన్ని దెబ్బతీయడం సరైనది కాదని లేఖలో మీడియా సంస్థలకు హితవు పలికాయి. కొన్ని వెబ్‌సైట్లు, డిజిటల్ మీడియా సంస్థలు సంక్రాంతి టైంలో వాళ్ల రేటింగ్స్ కోసం అదేపనిగా తమకు నచ్చినట్లు వార్తలు రాయడం వల్ల హీరోలు, దర్శకులు వారి అభిమానుల నుంచి విమర్శలు ఎదుర్కొంటున్నారు, కాబట్టి ఇక నుంచి ఏ మీడియా సంస్థ అయినా వార్తలు ప్రచురించేముందు మా మూడు సంస్థలను సంప్రదించి నిజాలు తెలుసుకోవాలని కోరాయి. సినీ ప్రముఖులు మాట్లాడేటప్పుడు పూర్తిగా అవగతం చేసుకోకుండా మిడిమిడి జ్ఞానంతో పరిశ్రమ ఇబ్బందిపడేలా వార్తలు రాయడం విచారకరం అని పేర్కొన్నాయి. సంక్రాంతి సినిమాల మధ్య పోటీ ఆహ్లాదకరంగా ఉండాలనీ, తెలుగు సినిమా హీరోలు, దర్శకులు, నిర్మాతలు... ఎవరూ నష్టపోకూడదనీ మా మూడు సంస్థలు కలసి కృషి చేస్తుంటే సహకరించాల్సింది పోయి మీడియా సంస్థలు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని సూచించాయి. తెలుగు సినీ పరిశ్రమకు పుట్టుక నుంచి మీడియాతో ఉన్న అనుబంధాన్ని దృష్టిలో ఉంచుకొని ఇబ్బందికర వ్యాఖ్యలు చేసేవారిపైన తగు చర్యలు తీసుకోవాలని సినీ పాత్రికేయ సంఘాలు, మీడియా యాజమాన్యాలను లేఖలో అభ్యర్థించాయి. సంక్రాంతి బరిలో ఉన్న సినిమాలకు థియేటర్ల కేటాయింపు వివాదంపై ఆ సంస్థల గౌరవ కార్యదర్శులు కే.ఎల్ దామోదర్ ప్రసాద్, కే అనుపమ్ రెడ్డి, తుమ్మల ప్రసన్నకుమార్ ప్రకటనలో స్పందిస్తూ 'గతంలో ఓ సమావేశం ఏర్పాటు చేసి, నిర్మాతలను పిలిచి సహకరించమని కోరాము. మా వినతిని మన్నించి, 'ఈగల్' చిత్రాన్ని సంక్రాంతికి విడుదల చేయకుండా వాయిదా వేసుకున్నారు. తద్వారా మిగతా నాలుగు సినిమాలకు సహకరించినందుకు ఆ చిత్ర నిర్మాత టీజీ విశ్వప్రసాద్, హీరో రవితేజకు ధన్యవాదాలు. అలాగే రజనీకాంత్ ' లాల్‌సలామ్', ధనుష్ 'కెప్టెన్ మిల్లర్' శివ కార్తికేయన్ 'అయలాన్' చిత్రాలను తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతికి విడుదల చేయకుండా వాయిదా వేసేందుకు అంగీకరించినందుకు వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాం' అని ప్రకటనలో తెలిపారు.

పోలీస్ వారి హెచ్చరిక



బాబ్జీ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'పోలీస్‌వారి హెచ్చరిక'. అఖిల్ సన్నీ, అజయ్‌ఘోష్, రవికాలే ప్రధానపాత్రధారులు. బెల్లి జనార్థన్ నిర్మాత. ప్రస్తుతం చిత్ర ప్రధాన తారగణంపై పోరాట సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. దర్శకుడు మాట్లాడుతూ '80 శాతం షూటింగ్ పూర్తయింది. ఈ నెలాఖరుకు షూటింగ్ పూర్తవుతుంది. త్వరలోనే సినిమాను విడుదల చేస్తాం' అని చెప్పారు. సంజయ్ నాయర్, కాశీవిశ్వనాథ్, గడ్డేష్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: కొండపల్లి నళినీకాంత్, సంగీతం: గజ్వేల్ వేణు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు (పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్: స్వర్గసీమ సుకేతన) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని 83 కేంద్రాల్లో జనవరి 5, 6, 7, 8 తేదీల్లో ఘనంగా జరిగాయి. 12 వేల మందికి పైగా మహిళలు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతి కేంద్రంలో ప్రథమ రూ.6,000, ద్వితీయ రూ.4,000, తృతీయ బహుమతి రూ.3,000తో పాటు అనేక కన్సొలేషన్ బహుమతులు అందించాం. ప్రతి ఉమ్మడి జిల్లా స్థాయిలో విజేతగా నిల్చిన మహిళలు రాష్ట్ర స్థాయిలో జరిగే ఫైనల్ పోటీలకు అర్హత సాధించారు. తెలంగాణలోని 10 ఉమ్మడి జిల్లాల విజేతలకు హైదరాబాద్‌లో జనవరి 10న ఫైనల్ పోటీలు జరుగుతాయి. ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాలతోపాటు తమిళనాడు, కర్ణాటక విజేతలిద్దరు... మొత్తం 15 మందికి జనవరి 11న విజయవాడలో ఫైనల్ పోటీలు జరుగుతాయి. ఫైనల్స్‌లో ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించిన ఎనిమిదిమందికి రూ.1,20,000 బంపర్ బహుమతులతోపాటు ఇతరులకు రూ.51,000 కన్సొలేషన్ బహుమతులు ఉంటాయి. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనబోతున్న ఫైనలిస్టులు, వారు జిల్లాస్థాయి పోటీల్లో తీర్చిన అందమైన రంగవల్లులు 'నవ్య' పాఠకుల కోసం....

కెనరా బ్యాంక్-ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీలు

ఫైనలిస్టులు వీరే



ఆర్.ఆశాజ్యోతి , శ్రీకాకుళం



ఎం.రాజు, విజయనగరం



బి.లక్ష్మి, విశాఖపట్నం



మల్లీశ్వరి, తూర్పుగోదావరి



టి.ఆదిశ్రీ, పశ్చిమగోదావరి



పి.పూజిత, కృష్ణా



ఎ.సునీత, గుంటూరు



సీహెచ్.మణిమంజరి, ప్రకాశం



ఎం.సునీత, నెల్లూరు



విద్య, చిత్తూరు



ఎస్.శ్వేత, కడప



ఎస్.రాజేశ్వరి, కర్నూలు



కె.ఉమాదేవి, అనంతపురం



కె.రాధ, తమిళనాడు



లిఖిత, కర్ణాటక

బిజినెస్

విజయవాడ ● బుధవారం 10 జనవరి 2024

ఈ ఏడాదిలో రూ.4.15 లక్షల కోట్లు

ఐపీఓలు, ఫండింగ్ డీల్స్‌పై కోటక్ అంచనా



ముంబై: దేశీయ క్యాపిటల్ మార్కెట్లో ఈ ఏడాది పబ్లిక్ ఆఫరింగ్స్ (ఐపీఓ), ఫండింగ్ డీల్స్ మరింత చురుకుగా జరగనున్నాయని కోటక్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ పేర్కొంది. వీటి ద్వారా నిధుల సమీకరణ 2021లో నమోదైన ఆల్‌టైం రికార్డును సైతం మించి 5,000 కోట్ల డాలర్ల (రూ.4.15 లక్షల కోట్లు)కు చేరుకోవచ్చని అంచనా వేసింది. నవతరం టెక్ కంపెనీల ఇష్యూలు ఈ ఏడాది ప్రైమరీ మార్కెట్ మరింత సందడి చేయనున్నాయని కోటక్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ ఎండీ, సీఈఓ ఎస్ రమేశ్ మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అన్నారు. 2023లో దేశీయ ఫండ్స్ మార్కెట్లో 2,580 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టాయన్నారు. నిఫ్టీ ఏడాది ఫార్వార్డ్ ప్రీమియం సరికొత్త రికార్డు 20.1 రెట్ల స్థాయిలో ఉందని, వర్ధమాన మార్కెట్లలోకెల్లా ఇదే అత్యధికమని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. ఈ ఏడాది మరిన్ని బడా ఐపీఓలను చూడబోతున్నామని కోటక్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ ఎండీ వీ జయశంకర్ అన్నారు. సెకండరీ మార్కెట్లో లోక్‌సభ ఎన్నికల సంబంధిత ఊగిసలాటలు ప్రైమరీ మార్కెట్లో పబ్లిక్ ఇష్యూలను దీర్ఘకాలం పాటు ప్రభావితం చేసే అవకాశాల్లేవన్నారు. ఎందుకంటే, ఎన్నికల తంతు 2-3 నెలల్లో ముగుస్తుందన్నారు.

గత ఏడాది రికార్డు స్థాయిలో 59 కంపెనీలు ఐపీఓకు వచ్చాయి. తద్వారా దాదాపు రూ.53,000 కోట్లు సమీకరించాయి. కాగా, మరో 182 ఎస్ఎంఈలు సైతం పబ్లిక్ ఇష్యూకు వచ్చాయి. ఐపీఓల ద్వారా అత్యధికంగా నిధులు సమీకరించిన మార్కెట్లలో అమెరికా, చైనా, జపాన్ తర్వాత మన దలాల్‌స్ట్రీట్ నాలుగో స్థానంలో నిలిచింది. డీల్స్ విషయానికొస్తే, 2019 నుంచి 2023 మధ్య కాలంలో 5,500 కోట్ల డాలర్ల విలువైన కొనుగోళ్లు జరిగాయి. అంతకు 15 ఏళ్లలో నమోదైన డీల్స్ కంటే అధికమిది. ప్రమోటర్లు కంపెనీల విలువను పెంచేందుకు వాటాను వదులుకునేందుకు ముందుకు వస్తుండటమే ఇందుకు కారణం. అలాగే, పలు కంపెనీలు ఈక్విటీతోపాటు రుణ పత్రాల (డెట్ ఇన్‌స్ట్రుమెంట్స్) జారీ ద్వారా నిధుల సమీకరణలో వివిధీకరణ వ్యూహాన్ని అనుసరిస్తుండటం మరో కారణం. వచ్చే రెండేళ్లలో దేశీయ మార్కెట్లో మరో 20 స్టార్టప్‌లు యూనికార్న్‌లుగా (కనీసం 100 కోట్ల డాలర్ల విలువైన కంపెనీ) ఎదిగే అవకాశం ఉందని కోటక్ అంచనా వేసింది.

అదానీ చేతికి ల్యాంకో అమర్‌కంటక్ ప్లాంట్!

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని మరింతగా విస్తరిస్తోంది. ఇందులో భాగంగా దివాలా ప్రక్రియలో ఉన్న మధ్యప్రదేశ్‌లోని ల్యాంకో అమర్‌కంటక్ థర్మల్ పవర్ ప్లాంట్ కోసం పోటీపడుతోంది. ఇందుకోసం రూ.4,100 కోట్లకు బిడ్ సమర్పించింది. ఈ నెల 16న ఎన్‌సీఎల్‌టీ దీనిపై నిర్ణయం తీసుకోనుంది. 2022 జనవరిలోనే ఈ ప్లాంట్ కోసం పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ) నాయకత్వంలోని కన్సార్షియం రూ.3,020 కోట్లకు బిడ్ సమర్పించింది. మెజారిటీ రుణ దాతలు ఆమోదించడంతో ఈ ప్రతిపాదనను దివాలా పరిష్కార నిపుణుడు ఎన్‌సీఎల్‌టీ ఆమోదం కోసం సమర్పించారు. ఎన్‌సీఎల్‌టీ తన నిర్ణయాన్ని వెల్లడించక ముందే అదానీ గ్రూప్ సంస్థ అదానీ పవర్ రూ.4,100 కోట్లు చెల్లించేందుకు ముందుకు వచ్చింది. పీఎఫ్‌సీ సమర్పించిన బిడ్ కంటే ఇది 36 శాతం ఎక్కువ. దీంతో ల్యాంకో అమర్‌కంటక్ ప్లాంట్ అదానీ గ్రూప్ పరమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

పెట్టుబడులతో రండి..

గాంధీనగర్ (గుజరాత్): భారత్‌లో ఆటోమొబైల్ వాహనాలు, హరిత ఇంధనాల ఉత్పత్తికి అవసరమైన పెట్టుబడులు పెట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ముందుకు రావాలని ప్రధాని నరేంద్ర మోదీ ప్రపంచ ప్రఖ్యాత కంపెనీల సీఈఓలను కోరారు. బుధవారం 'వైబ్రెంట్ గుజరాత్ గ్లోబల్ సదస్సు'ను ప్రారంభించేందుకు ఒకరోజు ముందుగానే గుజరాత్‌కు వచ్చిన ఆయన ప్రముఖ అంతర్జాతీయ కంపెనీల సీఈఓలతో జరిగిన భేటీలో ఈ విజ్ఞప్తి చేశారు. సుజుకీ మోటార్ కార్పొరేషన్, మైక్రాన్ టెక్నాలజీ, ఏపీ ముల్లర్ వంటి ప్రఖ్యాత కంపెనీల సీఈఓలు ఈ భేటీలో పాల్గొన్నారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	62,950 ▼	57,700 ▼	78,000 ▲
ముంబై	62,415 ▲	57,172 ▲	71,840 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



9వ తేదీ		విజయవాడ	565
హైదరాబాద్	560	విశాఖపట్నం	625
10 జనవరి		వరంగల్	562
చిత్తూరు	583	దజను గుడ్లు రూ.72	
గోదావరి	565		

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	85	గోదావరి	84
వరంగల్	85	విజయవాడ	84
కరీంనగర్	85	గుంటూరు	85
మహబూబ్‌నగర్	85	ఒంగోలు	85
కర్నూలు	85	చిత్తూరు	85
విశాఖపట్నం	79		

అంతంత మాత్రంగానే జాబ్ మార్కెట్

ఐటీలో 21 శాతం తగ్గిన రిక్రూట్‌మెంట్.. నౌకరీ జాబ్ స్పీక్ ఇండెక్స్ వెల్లడి

ముంబై: వైట్ కాలర్ జాబ్స్ మార్కెట్ ఇంకా కోలుకోలేదు. 2022 డిసెంబరుతో పోలిస్తే గత ఏడాది డిసెంబరులో వైట్ కాలర్ జాబ్స్ నియామకాలు 16 శాతం పడిపోయాయి. ఐటీ, బీపీఓ, విద్య, రిటైల్, హెల్త్‌కేర్ కంపెనీలు నియామకాలపై ఆచితూచి వ్యవహరించడం ఇందుకు ప్రధాన కారణం. 2023 నవంబరుతో పోల్చితే మాత్రం గత నెలలో నియామకాలు రెండు శాతం పెరిగాయి. ఐటీయేతర రంగాల్లో నియామకాలు కొద్దిగా పెరగడం ఇందుకు ప్రధాన కారణం. మంగళవారం వెలువడిన 'నౌకరీ జాబ్ స్పీక్ ఇండెక్స్' ఈ విషయం తెలిపింది.

ఇంకా డౌన్‌లోనే ఐటీ: ఐటీ రంగంలో సంక్షోభం ఇంకా కొనసాగుతోంది. ఐటీ, బీపీఓ కంపెనీలు కొత్త నియామకాలను దాదాపుగా పక్కన పెట్టాయి. దీంతో 2022 డిసెంబరుతో పోలిస్తే గత ఏడాది డిసెంబరులో ఐటీ రంగంలో 21 శాతం, బీపీఓ రంగంలో 17 శాతం నియామకాలు తగ్గాయి. నవంబర్‌తో పోల్చినా డిసెంబరు నెలలో ఐటీ కంపెనీల నియామకాలు నాలుగు శాతం తగ్గినట్టు నౌకరీ ఇండెక్స్ తెలిపింది. అయితే డేటా సైంటిస్టులు, ఐటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంజనీర్లు, ఆటోమేషన్ ఇంజనీర్లకు ఐటీ కంపెనీలు ఇప్పటికీ స్వాగతం పలుకుతున్నాయి.

ఈ రంగాల్లో అప్: ఐటీ వంటి కొన్ని రంగాల్లో నియామకాల జోరు తగ్గినా కొన్ని రంగాల్లో మాత్రం నియామకాల జోరు పెరిగింది. డిసెంబరులో ఆతిథ్య రంగంలో నియామకాలు నాలుగు శాతం, ఫార్మా రంగంలో రెండు శాతం, పెరిగాయి. ఆయిల్ అండ్ గ్యాస్ రంగంలో నియామకాలు పెరగకపోయినా స్థిరంగా ఉన్నాయి.

హైదరాబాద్‌లో 23 శాతం క్షీణత

గత ఏడాది డిసెంబరు నెల హైదరాబాద్ జాబ్ మార్కెట్‌కు పెద్దగా కలిసి రాలేదు. 2022 డిసెంబరుతో పోలిస్తే 2023 డిసెంబరులో నియామకాలు 23 శాతం పడిపోయాయి. ఐటీ కంపెనీలో నియామకాల జోరు తగ్గడం ఇందుకు ప్రధాన కారణం. భారత సిలికాన్ వ్యాలీగా పేరొందిన బెంగళూరులోనూ ఇదే పరిస్థితి. చెన్నై, పుణె, కోల్‌కతాల్లోనూ నియామకాలు 16 నుంచి 24% పడిపోయాయి.

ఆఖరి గంటలో అమ్మకాలు

స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్న సూచీలు

ముంబై: స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు మంగళవారం అతి స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నాయి. ఆఖరి గంటలో అమ్మకాలు పోటెత్తడం ఇందుకు కారణమైంది. ఈ వారంలోనే కార్పొరేట్ కంపెనీల త్రైమాసిక ఆర్థిక ఫలితాల సీజన్ ప్రారంభంతో పాటు స్థూల ఆర్థిక గణాంకాలు కూడా విడుదల కానున్న నేపథ్యంలో మదుపరులు ముందుజాగ్రత్తగా లాభాల స్వీకరణకు పాల్పడ్డారని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. ఒక దశలో 680 పాయింట్లకు పైగా ఎగిసి 72,000 స్థాయిని దాటిన సెన్సెక్స్. చివరికి 30.99 పాయింట్ల లాభంతో 71,386.21 వద్ద క్లోజైంది. ఇంట్రాడేలో 211 పాయింట్లు పెరిగిన నిఫ్టీ.. ట్రేడింగ్ ముగిసే సరికి కేవలం 31.85 పాయింట్ల లాభంతో 21,544.85 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో సగం లాభపడగా.. మిగతా సగం నష్టాలు చవిచూశాయి.

జీ షేరు ఢమాల్: సోనీ ఇండియాతో గతంలో కుదుర్చుకున్న విలీన ఒప్పందంపై అనిశ్చితి మబ్బులు కమ్ముకోవడంతో జీ ఎంటర్‌టైన్‌మెంట్ షేరు ఇంట్రాడేలో 12.66 శాతం వరకు క్షీణించి రూ.242.30కి పతనమైంది. చివరికి, 7.64 శాతం నష్టంతో రూ.256.25 వద్ద ముగిసింది. దాంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.2,036 కోట్లు తగ్గి రూ.24,613.31 కోట్లకు పడిపోయింది. కాగా, సోనీతో విలీన ఒప్పందాన్ని పూర్తి చేసేందుకు కట్టుబడి ఉన్నామని, ఈ దిశగా ప్రయత్నాలు కొనసాగుతున్నాయని జీ ఎంటర్‌టైన్‌మెంట్ వివరణ ఇచ్చింది.

బజాజ్ ఆటో.. రూ.2 లక్షల కోట్లు: దేశీయ వాహన కంపెనీ బజాజ్ ఆటో బోర్డు రూ.4,000 కోట్ల సొంత షేర్ల తిరిగి కొనుగోలు (బైబ్యాక్)కు ఆమోదం తెలుపడంతో కంపెనీ షేరు ధర ఒకదశలో 6.21 శాతం పుంజుకొని రూ.7,420 వద్ద సరికొత్త ఏడాది గరిష్ఠాన్ని నమోదు చేసుకుంది. చివరికి 1.55 శాతం లాభంతో రూ.7,093.75 వద్ద స్థిరపడింది. దాంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.2 లక్షల కోట్లు దాటింది.



బీ న్యూలో రెడ్‌మీ నోట్ 13 5జీ ఆవిష్కరణ

మల్టీ బ్రాండ్ మొబైల్స్ రిటైల్ చెయిన్ బీ న్యూ మొబైల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ స్టోర్లలో రెడ్‌మీ నోట్ 13 5జీ సిరీస్ స్మార్ట్‌ఫోన్ అందుబాటులోకి వచ్చింది. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ 5జీ స్మార్ట్‌ఫోన్‌ను సినీ నటి రుహానీ శర్మ, బీ న్యూ మొబైల్స్ సీఈఓ సాయి నిఖిలేష్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయి నితేష్ లాంఛనంగా విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని 150కి పైగా బీ న్యూ షోరూమ్‌ల్లో ఈ స్మార్ట్‌ఫోన్‌ను కొనుగోలు చేయవచ్చు. రెడ్‌మీ నోట్ 13 ప్రొ ప్లస్ 5జీ.. 8జీబీ, 12 జీబీ వేరియంట్లలో, రెడ్‌మీ నోట్ 13 5జీ.. 6జీబీ, 8జీబీ, 12 జీబీ వేరియంట్స్‌లో అందుబాటులో ఉండనుంది.

సెలెక్ట్ మొబైల్స్‌లో రెడ్‌మీ నోట్ 13 5జీ



మొబైల్ రిటైల్ చెయిన్ సెలెక్ట్ మొబైల్స్ మాదాపూర్ స్టోర్‌లో షావోమీ రెడ్‌మీ నోట్ 13 5జీ స్మార్ట్‌ఫోన్‌ను సినీ నటి సిరి హనుమంతు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో షావోమీ తెలంగాణ స్టేట్ హెడ్ సయ్యద్ అన్వర్, ఇఫ్తికార్ (రిటైల్ మార్కెటింగ్ హెడ్) పాల్గొన్నారు. కొత్త టెక్నాలజీ, కొత్త మోడల్స్‌ను ప్రవేశపెట్టడంలో సెలెక్ట్ మొబైల్స్ ఎప్పుడు ముందు వరుసలో ఉంటుందని.. అదే ఒరవడిని కొనసాగిస్తూ రెడ్‌మీ నోట్ 13 5జీ ఫోన్‌ను తీసుకువచ్చినట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మురళి రేతినేని తెలిపారు. ఈ స్మార్ట్‌ఫోన్ ఏపీ, తెలంగాణ, మహారాష్ట్రలోని అన్ని సెలెక్ట్ స్టోర్లలో అందుబాటులో ఉంటుందన్నారు.

2036 నాటికి 6.4 కోట్ల ఇళ్లు అవసరం

న్యూఢిల్లీ: దేశంలో నివాస గృహాలకు డిమాండ్ రోజురోజుకీ పెరిగిపోతోంది. పెరుగుతున్న జనాభా, ఆర్థిక వ్యవస్థతో 2036 నాటికి దేశంలో 6.4 కోట్ల ఇళ్లకు డిమాండ్ ఉంటుందని అంచనా. ఇందులో ఎక్కువ భాగం ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోనే ఉంటుందని క్రెడాయ్, డేటా అనలిటిక్స్ సంస్థ లిసెస్ ఫోరాస్ సంయుక్తంగా రూపొందించిన ఒక నివేదికలో తేలింది. 2018 నాటికి ఉన్న 2.9 కోట్ల గృహాల కొరతను కూడా పరిగణనలోకి తీసుకుంటే 2036 నాటికి మొత్తం 9.3 కోట్ల గృహాలు అవసరమని ఈ నివేదిక పేర్కొంది. గత ఏడాది రెరా వద్ద నమోదైన 19,050 రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుల్లో 45 శాతం నివాస గృహాల ప్రాజెక్టులని క్రెడాయ్ జాతీయ అధ్యక్షుడు బొమన్ ఇరానీ తెలిపారు.

మూడేళ్లలో 5 కొత్త కార్లు

రెనో సీఈఓ వెంకట్రామ్ మామిళ్లపల్లి



న్యూఢిల్లీ: ఫ్రెంచ్ కార్ల ఉత్పత్తి దిగ్గజ సంస్థ రెనో... రాబోయే మూడు సంవత్సరాల కాలంలో 5 కొత్త కార్లను భారత మార్కెట్లో ప్రవేశపెట్టనుంది. భిన్న సవాళ్ల కారణంగా గత ఏడాది అమ్మకాలు నిరాశావహంగా ఉన్న నేపథ్యంలో ఈ ఏడాది పునరుజ్జీవం సాధించగలమని విశ్వసిస్తోంది. 2023 సంవత్సరంలో కంపెనీ 49,000 కార్లను దేశీయ మార్కెట్లో విక్రయించడంతో పాటు 28,000 కార్లను విదేశాలకు ఎగుమతి చేసింది. ఈ ఏడాది తాము తప్పనిసరిగా రెండంకెల వృద్ధిని సాధిస్తామని రెనో ఇండియా సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ వెంకట్రామ్ మామిళ్లపల్లి తెలిపారు. కొత్తగా విడుదల చేయనున్న కార్లన్నీ పూర్తిగా కొత్త మోడళ్లని, వాటిలో కొత్తతరం కైగర్, ట్రైబర్ కూడా ఉంటాయని ఆయన అన్నారు. భారత మార్కెట్లో పూర్తిగా కొత్త బ్రాండ్ గుర్తింపు సాధించాలనే ప్రయత్నానికి ఇది నిదర్శనమని ఆయన చెప్పారు. కస్టమర్ బేస్‌ను విస్తరించుకునే ప్రయత్నాల్లో భాగంగా రెనో మంగళవారం క్విడ్, ట్రైబర్, కైగర్ కార్లలో కొత్త వేరియెంట్లను మార్కెట్లో ప్రవేశపెట్టింది. వీటి ధరల శ్రేణి రూ.4.69 లక్షల నుంచి రూ.10.99 లక్షల మధ్యన ఉంది.

2028 నాటికి 1000 స్టోర్లు

ముంబై: టాటా స్టార్‌బక్స్ 2028 నాటికి తమ స్టోర్ల సంఖ్య వెయ్యికి పెంచుకోవాలనుకుంటోంది. ప్రస్తుతం దేశంలో 390 స్టార్‌బక్స్ స్టోర్లున్నాయి. రాబోయే రోజుల్లో ప్రతి 3 రోజులకు ఒక స్టోర్ ప్రారంభించాలనుకుంటున్నామని; అలాగే ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు విస్తరించనున్నామని స్టార్‌బక్స్ ఒక ప్రకటనలో తెలిపింది. తమ ఉద్యోగుల సంఖ్యను కూడా 8600కి పెంచనున్నట్టు వెల్లడించింది.

'అర్జును'లు హుస్సామ్, అజయ్

● సాత్విక్, ఇషా గైర్హాజరు
● ఘనంగా క్రీడా అవార్డుల ప్రదానోత్సవం

న్యూఢిల్లీ: తెలుగు క్రీడాకారులు మహ్మద్ హుస్సాముద్దీన్ (బాక్సింగ్), ఇల్లూరి అజయ్‌కుమార్ రెడ్డి (అంధుల క్రికెట్)తోపాటు క్రికెటర్ షమి అర్జున అవార్డులతో మెరిశారు. మంగళవారం రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన జాతీయ క్రీడా అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా వీరు ప్రతిష్ఠాత్మక క్రీడా అవార్డులను అందుకొన్నారు. ఈ ఏడాది 26 మందిని అర్జునకు ఎంపిక చేయగా.. జకార్తాలో ఆసియా ఒలింపిక్స్ క్వాలిఫయర్స్‌లో పాల్గొంటున్న తెలుగు షూటర్ ఇషా సింగ్ ఈ వేడుకకు గైర్హాజరైంది. సాధారణంగా హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి రోజైన ఆగస్టు 29న క్రీడా అవార్డులను ప్రదానం చేస్తుంటారు. అయితే, ఆసియాడ్ కారణంగా ఈసారి వాయిదా వేయాల్సి వచ్చింది. గతేడాది జరిగిన బాక్సింగ్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో హుస్సాముద్దీన్ కాంస్య పతకం సాధించాడు. ఇక, అజయ్ కుమార్ సారథ్యంలో భారత అంధుల క్రికెట్ జట్టు వన్డే, రెండు టీ20 వరల్డ్‌కప్‌లు గెలిచింది.

ప్రత్యేక ఆకర్షణ.. షమి, శీతల్: క్రికెటర్ షమి, పారా ఆర్చర్ శీతల్ దేవి ఈ కార్యక్రమానికే హైలైట్‌గా నిలిచారు. షమి అవార్డు అందుకోవడానికి వచ్చినప్పుడు ఆహూతులు కరతాళ ధ్వనులతో అభినందించారు. వన్డే వరల్డ్‌కప్‌లో షమి అద్భుత ప్రదర్శన చేశాడు. కాగా, అర్జున అందుకొన్న పిన్నవయసు అథ్లెట్‌గా 16 ఏళ్ల శీతల్ ప్రత్యేకంగా నిలిచింది. దివ్యాంగురాలైన ఆమె అవార్డు స్వీకరిస్తున్నప్పుడు కూడా హాల్‌లో ఎంతో ఉత్సాహ వాతావరణం నెలకొంది. రెండు చేతులు లేకపోయినా.. కాళ్లతో ఆర్చరీ సాధన చేసిన శీతల్ పారా ఆసియాడ్‌లో మూడు స్వర్ణాలు సాధించడం విశేషం. యువ గ్రాండ్ మాస్టర్ ఆర్. వైశాలి, రెజ్లర్ అంతిమ్ పంగల్ కూడా అర్జునను స్వీకరించారు.

'మలేసియా'లో సాత్విక్, చిరాగ్ జోడీ..: క్రీడా అవార్డుల్లో అత్యున్నతమైన ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డుకు బ్యాడ్మింటన్ డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి ఎంపికయ్యారు. అయితే, మలేసియా ఓపెన్‌లో ఆడుతుండడంతో వీరిద్దరూ కార్యక్రమానికి హాజరుకాలేక పోయారు. మరోసారి ప్రత్యేకంగా ఏర్పాటు చేసే కార్యక్రమంలో వీరికి అవార్డులను ప్రదానం చేస్తారు. ఖేల్‌రత్న అవార్డు కింద మొమెంటోతోపాటు రూ. 25 లక్షల నగదు బహుమతి అందనుంది. అర్జున్ అవార్డీలకు మొమెంటోతోపాటు రూ. 15 లక్షల నజరానా దక్కనుంది.


శీతల్ దేవి


మహ్మద్ షమి




రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అవార్డులు అందుకుంటున్న హుస్సాముద్దీన్, అజయ్‌కుమార్

చైతన్యకు సాహస అవార్డు



టెన్సింగ్ నార్కే జాతీయ సాహస అవార్డును ఆంధ్రకు చెందిన స్విమ్మర్ మోతుకూరి తులసీ చైతన్య అందుకొన్నాడు. వృత్తిరీత్యా ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగం హెడ్ కానిస్టేబుల్ అయిన చైతన్య.. ఇంగ్లిష్ చానెల్, జిబ్రాల్టర్ జలసంధి, పాక్ జలసంధి ఈదాడు. చైతన్య పలు అంతర్జాతీయ మారథాన్ స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొన్నాడు.

శ్రీకాంత్ ముందంజ



కౌలాలంపూర్: ఫామ్ కోసం తంటాలు పడుతున్న మాజీ వరల్డ్ నెంబర్ వన్ కిడాంబి శ్రీకాంత్ మలేసియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో ప్రీక్వార్టర్స్‌కు చేరుకొన్నాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలిరౌండ్‌లో శ్రీకాంత్ 12-21, 21-18, 21-16తో ఆరో సీడ్ జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా)పై పోరాడి నెగ్గాడు. మహిళల్లో ఆకర్షి కశ్యప్ 15-21, 15-21తో జాంగ్ ఇ మన్ (చైనా) చేతిలో ఓడింది. డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప-తనీష జోడీ 21-13, 21-16తో అమెరికా జంట ఫ్రాన్సెసా-అలిసన్‌పై గెలిచింది. అయితే, రితూపర్ణ-శ్వేతపర్ణ ద్వయం, అర్జున్-ధ్రువ్ జంటలు ఆరంభరౌండ్లోనే వెనుదిరిగాయి.

మళ్లీ జట్టులోకి సింధు..



న్యూఢిల్లీ: మోకాలి గాయం నుంచి కోలుకొంటున్న ఏస్ షట్లర్ పీవీ సింధు మళ్లీ కోర్టులోకి అడుగుపెట్టనుంది. మంగళవారం ప్రకటించిన భారత ఆసియా టీమ్ చాంపియన్‌షిప్ జట్టులో ఆమెకు చోటు దక్కింది. గతేడాది అక్టోబరులో సింధుకు గాయమైంది. వచ్చేనెలలో 13 నుంచి 19 వరకు మలేసియాలో ఈ టోర్నీ జరగనుంది. ఒలింపిక్ క్వాలిఫికేషన్ పాయింట్లు లభించనుండడంతో.. ఈ టోర్నీ మన షట్లర్లకు కీలకం.

భారత జట్లు

పురుషులు: ప్రణయ్, శ్రీకాంత్, లక్ష్య సేన్, చిరాగ్ సేన్, సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ షెట్టి, ధ్రువ్, అర్జున్. సూరజ్, పృథ్వీ రాయ్.
మహిళలు: సింధు, అన్‌మోల్, తన్వీ, అస్మిత, ట్రీసా జాలీ, గాయత్రి, అశ్విని, తనీషా, ప్రియా దేవి, శ్రుతి.

తీరు మారని టైటాన్స్

ముంబై: ప్రొ కబడ్డీలో వరుస ఓటములతో తెలుగు టైటాన్స్ చెత్త రికార్డును మూటగట్టుకునే దిశగా సాగుతోంది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 26-46తో బెంగాల్ వారియర్స్ చేతిలో ఓడింది. ఈ సీజన్‌లో టైటాన్స్‌కు ఇది పదో పరాజయం.

'టాప్'లేపిన చెన్నై క్విక్ గన్స్

సెమీస్‌లో యోధాస్ ప్రత్యర్థి చెన్నై

అల్టిమేట్ ఖో-ఖో

కటక్: అల్టిమేట్ ఖో-ఖో సీజన్-2లో భాగంగా మంగళవారం జరిగిన మ్యాచ్‌లో చెన్నై క్విక్ గన్స్ 38-21తో గుజరాత్ జెయింట్స్‌పై నెగ్గింది. దీంతో చెన్నై 25 పాయింట్లతో టేబుల్ టాపర్‌గా నిలిచింది. మరో మ్యాచ్‌లో ఒడిశా 34-23తో ముంబై ఖిలాడీస్‌పై నెగ్గింది. ఇక్కడితో గ్రూప్ దశ ముగిసింది. గురువారం జరిగే సెమీఫైనల్స్‌లో ఒడిశా జగ్గర్‌నాట్స్‌తో గుజరాత్, తెలుగు యోధాస్‌తో చెన్నై తలపడతాయి.

ఈసారీ నిరాశే..

ఆఖరి మ్యాచ్‌లోనూ భారత్ ఓటమి

2-1తో ఆసీస్‌దే సిరీస్



ముంబై: స్వదేశంలో ఆస్ట్రేలియాపై తొలి టీ20 సిరీస్ సాధించాలనుకున్న భారత మహిళలకు ఈసారి కూడా ఫలితం దక్కలేదు. మొదటి మ్యాచ్‌లో గెలిచి ఆధిక్యం సాధించినా.. ఆ తర్వాత గతి తప్పిన ఆటతీరుతో సువర్ణావకాశాన్ని చేజార్చుకుంది. మంగళవారం జరిగిన ఆఖరి టీ20లో బ్యాటింగ్ కాస్త పర్వాలేదనిపించినా.. బౌలర్లు నిరాశపరిచారు. దీంతో ఆస్ట్రేలియా 7 వికెట్ల తేడాతో నెగ్గి 2-1తో సిరీస్ దక్కించుకుంది. కెప్టెన్ హీలీ (55), మూనీ (52 నాటౌట్) అర్ధసెంచరీలతో కీలక ఇన్నింగ్స్ ఆడారు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 147 పరుగులు చేసింది. రిచా ఘోష్ (34), మంధాన (29) రాణించారు. సదర్లాండ్, వేర్‌హామ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ఆసీస్ 18.4 ఓవర్లలో 3 వికెట్లకు 149 పరుగులు చేసి గెలిచింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా సదర్లాండ్, ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా హీలీ నిలిచారు.

మెరుపు ఆరంభం: ఛేదనలో ఆసీస్ ఓపెనర్లు హీలీ, మూనీ ఆరంభం నుంచే కదం తొక్కారు. అయితే హీలీ 38 రన్స్ దగ్గర ఉన్నప్పుడు క్యాచ్ అవుట్‌పై రీప్లేలో స్పష్టత లేకపోవడంతో బతికిపోయింది. ఈ ఊపులో హీలీ 34 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసింది. కానీ తర్వాతి ఓవర్‌లోనే ఆమెను దీప్తి శర్మ అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 89 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత తహిలా (20), పెర్రీ (0)లను వరుస బంతుల్లో వస్త్రాకర్ అవుట్ చేసి కాస్త ఆశలు రేకెత్తించినా.. వచ్చీ రాగానే లిచ్‌ఫీల్డ్ (17 నాటౌట్) బాదుడు మొదలెట్టింది. ఇక రెండు వరుస ఫోర్లతో హాఫ్ సెంచరీ చేసిన మూనీ.. 8 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించింది.

ఆదుకున్న రిచా: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ స్కోరు ఓ దశలో 66/4. అయినా దాదాపు 150 పరుగుల దరిదాపుల్లోకి రాగలిగిందంటే మిడిలార్డర్‌లో రిచా ఘోష్ మెరుపు ఆటతీరే కారణం. దీప్తి శర్మ (14), అమన్‌జోత్ (17 నాటౌట్) తమ వంతు సహకారాన్ని అందించారు. ఆరంభంలో ఓపెనర్లు మంధాన, షఫాలీ తొలి వికెట్‌కు 39 పరుగులందించారు. షఫాలీ వర్మ 26 పరుగులు చేసింది.



స్కోరుబోర్డు

భారత్: షఫాలీ (సి) హీలీ (బి) షట్ 26; మంధాన (సి) గార్డ్‌నర్ (బి) వేర్‌హమ్ 29; జెమీమా (సి) వేర్‌హమ్ (బి) సదర్లాండ్ 2; హర్మన్‌ప్రీత్ (బి) సదర్లాండ్ 3; రిచా (బి) గార్డ్‌నర్ 34; దీప్తి శర్మ (సి) తహిలా (బి) వేర్‌హమ్ 14; అమన్‌జోత్ (నాటౌట్) 17; వస్త్రాకర్ (నాటౌట్) 7; **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 20 ఓవర్లలో 147/6. వికెట్ల పతనం:** 1-39, 2-60, 3-64, 4-66, 5-99, 6-135; **బౌలింగ్:** షట్ 4-0-36-1; గార్త్ 4-0-31-0; గార్డ్‌నర్ 4-0-40-1; సదర్లాండ్ 4-0-12-2; వేర్‌హమ్ 4-0-24-2.

ఆస్ట్రేలియా: హీలీ (ఎల్బీ) దీప్తి శర్మ 55; మూనీ (నాటౌట్) 52; మెక్‌గ్రాత్ (సి) దీప్తి శర్మ (బి) వస్త్రాకర్ 20; పెర్రీ (ఎల్బీ) వస్త్రాకర్ 0; లిచ్‌ఫీల్డ్ (నాటౌట్) 17; **ఎక్స్‌ట్రాలు:5, మొత్తం: 18.4 ఓవర్లలో 149/3. వికెట్ల పతనం:** 1-85, 2-117, 3-117; **బౌలింగ్:** రేణుకా సింగ్ 4-0-35-0; టిటాస్ 3-0-23-0; శ్రేయాంక 4-0-30-0; వస్త్రాకర్ 3.4-0-26-2; దీప్తి శర్మ 4-0-32-1.

స్పోర్ట్స్

ఆసియా షూటింగ్‌లో ఉమా జోడీకి స్వర్ణం



జకర్తా: ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్ గ్రాండ్ ప్రీలో విజయవాడ యువ షూటర్ మద్దినేని ఉమామహేష్ జోడీ పసిడి పతకం కొల్లగొట్టింది. మంగళవారం ఇక్కడ ముగిసిన 10 మీటర్ల జూనియర్ మిక్స్‌డ్ టీమ్ ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో ఉమామహేష్-ఇషా అనిల్ టక్సాలే ద్వయం 17-11తో చు జికింగ్-పాన్ బోవెన్ (చైనా) జోడీపై గెలిచి, అగ్రస్థానంలో నిలిచింది. ఇదే ఈవెంట్‌లో భారత్‌కే చెందిన అభినవ్ షా-అన్వీ రాథోడ్ ద్వయం కాంస్యం సాధించింది. 10 మీటర్ల సీనియర్ ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ రుద్రాంక్ష్-మెహులీ జోడీ 16-10తో షెన్ యుఫాన్-వింగ్‌మయ్ (చైనా) ద్వయంపై గెలిచి స్వర్ణం సాధించింది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో అర్జున్-రిథిమ్ జోడీ రజతం అందుకుంది.

రోజున్నర పిచ్..మరీ నాసి

» ఐసీసీ ఆగ్రహం

కేప్‌టౌన్: భారత్-దక్షిణాఫ్రికా మధ్య జరిగిన రెండో టెస్టు ఒకటిన్నర రోజుల్లోనే ముగిసి క్రికెట్ ప్రేమికులను తీవ్రంగా నిరాశపరిచింది. బ్యాటర్లకు చుక్కలు చూపించిన ఈ పిచ్‌పై ఐసీసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది మరీ నాసిరకంగా ఉందని, నిబంధనల ప్రకారం దక్షిణాఫ్రికా క్రికెట్ (ఎస్ఏ)ను మందలించడంతో పాటు ఒక డీమెరిట్ పాయింట్ విధించింది. 'న్యూలాండ్స్ పిచ్‌పై బ్యాటింగ్ చేయడం కష్టంగా మారింది. మ్యాచ్ సాగుతున్నకొద్దీ బంతి అనూహ్యంగా బౌన్స్ అయ్యింది. ఈ కారణంగానే ఎక్కువ వికెట్లు నేలకూలాయి' అని మ్యాచ్ రెఫరీ క్రిస్ బ్రాడ్ పేర్కొన్నాడు. ఈ టెస్టు తొలి రోజునే పేసర్లు 23 వికెట్లతో పండగ చేసుకున్న విషయం తెలిసిందే.

ఉప్పల్ టెస్టు మ్యాచ్ విద్యార్థులకు ఫ్రీ ఎంట్రీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య ఉప్పల్ స్టేడియంలో ఈనెల 25 నుంచి 30 వరకు జరగనున్న తొలి టెస్టు మ్యాచ్‌కు పాఠశాల విద్యార్థులను ఉచితంగా అనుమతించనున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, సర్కారు గుర్తింపు గల స్కూళ్లలో చదివే 6 నుంచి 12వ తరగతి విద్యార్థులకు ఈ అవకాశం కల్పిస్తున్నారు. మ్యాచ్‌కు వచ్చే విద్యార్థులకు హెచ్‌సీఏ ఉచితంగా భోజనాన్ని కూడా అందించనుంది. అయితే, ఇందు కోసం పాఠశాలల ప్రిన్సిపాల్స్ తమ స్కూల్‌నుంచి ఎంతమంది విద్యార్థులు, సిబ్బంది వస్తున్నారో ఈనెల 18వ తేదీ లోపు హెచ్‌సీఏ సీఈఓకు ceo.hydca@gmail.com మెయిల్ చేయాలి.

మాకంతా తెలుసు..

తట్టుకోలేమంటే ఇప్పుడే తప్పుకోండి

- అలర్ట్‌గా ఉండాల్సిందే.. మరోసారి చెప్పం
- కలెక్టర్లు, ఎస్పీలపై కేంద్ర ఎన్నికల కమిషన్ ఫైర్

అమరావతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఓటరు నమోదులో అక్రమాలపై వెల్లువెత్తుతున్న ఫిర్యాదులపై కేంద్ర ఎన్నికల కమిషన్ గట్టిగానే స్పందించింది. రాజకీయ ఒత్తిళ్లు తట్టుకోలేమంటే ఇప్పుడే తప్పుకోండి అని జిల్లాల ఎస్పీలు, సీపీలను ఘాటుగా హెచ్చరించింది. విధుల్లో పార్టీ యాటిట్యూడ్‌ను ఉపేక్షించబోమని తెగేసి చెప్పింది. 'అంతా మాకు తెలుసు.. ఎన్నికల అధికారులంటే అలుసా' అని ఆగ్రహించింది. ఫెయిర్ అండ్ ఫ్రీ పద్ధతుల్లో ఎన్నికలు నిర్వహించాల్సిందేనని నిర్దేశించింది. మంగళవారం విజయవాడలో కేంద్ర ఎన్నికల కమిషన్ పూర్తి బెంచ్.. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సమావేశమైంది. ఈ సందర్భంగా విజయవాడ సీపీ, తిరుపతి ఎస్పీలపై తీవ్రంగా మండిపడిందని సమాచారం. సీపీ పనితీరు బాగో లేదని హెచ్చరించినట్టు తెలుస్తోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం విజయవాడ సీపీ ఏదో సమాధానం చెప్పడానికి ప్రయత్నించగా, ఆయనపై బెంచ్ మరింతగా అసహనం వ్యక్తం చేసింది. బై ఎలక్షన్స్‌లో నమోదైన కేసులు ఎందుకు దర్యాప్తు చేయలేదని తిరుపతి ఎస్పీని గట్టిగానే ప్రశ్నించింది. "ఎవరైనా పక్షపాతధోరణితో కనిపిస్తే ఉపేక్షించబోం. గమనిస్తూనే ఉంటాం.. వెంటపడుతూనే ఉంటాం. కుదరదు అనుకుంటే వెళ్లిపోండి.. ఎన్నికల తర్వాత విధుల్లోకి రండి.." అంటూ గట్టి హెచ్చరికలు చేసింది. దేశంలో ఒక్క ఏపీలోనే ఓటర్ల నమోదుపై ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని కమిషన్ వ్యాఖ్యానించింది. "ఏపీ అంటేనే మద్యం, డబ్బు ప్రవాహం ఎక్కువగా ఉంటుంది. ఎన్నికల సమయంలో మరింత తీవ్రస్థాయిలో అవి పంపిణీ అవుతాయి. వాటిని నియంత్రించడానికి కలెక్టర్లు, ఎస్పీలు గట్టి చర్యలు తీసుకోవాలి. మీకు మేం పూర్తిస్థాయిలో సహకరిస్తాం. మాకు రాజకీయ నేతల నుంచి ఒత్తిళ్లు వస్తున్నాయి, మేం తట్టుకోలేకపోతున్నామంటే ఇప్పుడే తప్పుకోవాలి" అని కలెక్టర్లు, ఎస్పీలకు తేల్చిచెప్పింది. "సరిహద్దు రాష్ట్రాల నుంచి మద్యం, డబ్బు ఎక్కువగా ఏపీలో డంప్ అవుతోంది. కర్ణాటక నుంచి ఎక్కువగా మద్యం ఇక్కడకు తరలిస్తున్నారు. సరిహద్దు జిల్లాల్లో చెక్‌పోస్టులను ఎందుకు అప్రమత్తం చేయడం లేదు? ఈశాన్య సరిహద్దు రాష్ట్రాల నుంచి ఎక్కువగా వస్తున్న గంజాయిని పూర్తిస్థాయిలో కంట్రోల్ చేయాలి. తిరుపతి, చంద్రగిరి, అనంతపురం, కాకినాడ, గుంటూరు వెస్ట్, కడపలో ఓటరు నమోదుపై ఎక్కువ ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాల్లో కొన్ని డూప్లికేట్ ఓటర్ ఐడీ కార్డులు ప్రింట్ అవుతున్నాయన్న సమాచారం మా దగ్గర ఉంది. వీటన్నింటిపైనా ఇప్పుడే చర్యలు తీసుకోండి. వెంటనే నియంత్రించండి. జిల్లాల్లో ఓటరు నమోదుపై ఎస్పీలకు ఫిర్యాదులు వచ్చిన వెంటనే యాక్షన్ ఉండాలి. రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని చెప్పే కారణాలు మా దగ్గర నడవవు" అని స్పష్టం చేసింది. సమావేశానికి ముందే చంద్రగిరి, తిరుపతిలో ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ, ఫారం-7పై చంద్రబాబు, పవన్... కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేశారు. ఈ అంశంపై కూడా సీఈసీ సమావేశం దృష్టి సారించింది. ఈ రెండు నియోజకవర్గాల్లో వస్తున్న ఫిర్యాదులపై కేంద్ర ఎన్నికల కమిషన్ గట్టిగానే ప్రశ్నించింది. అక్కడే అత్యధిక ఫిర్యాదులు ఎందుకు వస్తున్నాయని, వాటిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీసింది. ఈసీ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక అధికారులు ఇబ్బంది పడినట్టు సమాచారం.


ఓటర్ల జాబితా నుంచి పిటిషనర్ల పేర్లు తొలగించొద్దు

- హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు.. పర్చూరు ఈఆర్‌సీపై అభ్యంతరం

అమరావతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఫాం-7ల ఆధారంగా ఇష్టారీతిన ఓట్ల తొలగించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యాలపై హైకోర్టు స్పందించింది. ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ వైఖరిపై అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 22 ప్రకారం ఈఆర్‌వో జారీ చేసిన ఉత్తర్వులు, పిటిషనర్లకు రిజిస్టర్ పోస్టు ద్వారా పంపిన సమాచారంపై తేదీలు పేర్కొనకపోవడాన్ని తప్పుపట్టింది. ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయకుండానే, వాస్తవాలు దాచిపెట్టి స్టాండింగ్ కౌన్సిల్‌కు సమాచారం ఇచ్చినట్లు ఉందని అభిప్రాయపడింది. అందుకు గల కారణాలు వారికి తెలుసని పేర్కొంది. తుది ఓటర్ల జాబితా నుంచి పిటిషనర్ల పేర్లు తొలగించవద్దని అధికారులను ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. విచారణను ఫిబ్రవరి 2కు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.జయసూర్య ఇటీవల మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు.

ఇన్ని అక్రమాలు ఏ రాష్ట్రంలోనైనా చూశారా?

> "ఎన్నికలు ఎంత నిష్పక్షపాతంగా నిర్వహిస్తామో మీరే చూస్తారు. కచ్చితంగా స్వేచ్ఛగా జరుపుతాం. అందరికీ సమాన అవకాశాలు ఉండే పరిస్థితిని సృష్టిస్తాం. ఎన్నికల నిర్వహణలో భయోత్పాత పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందన్న మీ ఆందోళన అర్థమైంది. దానికి అనుగుణంగా మేం చర్యలు తీసుకొంటాం"
> - కేంద్ర ఎన్నికల కమిషన్



కేంద్ర ఎన్నికల కమిషన్‌ను ప్రశ్నించిన బాబు, పవన్

అమరావతి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): "మీరు దేశవ్యాప్తంగా ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఓటర్ల తొలగింపు, మార్పుచేర్పులు, ఎన్నికల అధికారుల నియామకంలో ఇన్ని అక్రమాలు దేశంలో ఏ రాష్ట్రంలో అయినా చూశారా? పై నుంచి మీరు చెబుతున్నదేమిటి? ఈ రాష్ట్రంలో జరుగుతున్నదేమిటి? ఇంత ఘోరంగా అక్రమాలు జరుగుతుంటే కఠినంగా వ్యవహరించాల్సిన బాధ్యత మీకు లేదా" అని తెలుగుదేశం, జనసేన పార్టీల అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్... కేంద్ర ఎన్నికల కమిషన్‌ను ప్రశ్నించారు. త్వరలో రాష్ట్ర శాసనసభకు ఎన్నికలు జరగాల్సి ఉండటంతో ఎన్నికల నిర్వహణ అంశాలను పరిశీలించడానికి కేంద్ర ఎన్నికల కమిషన్ పూర్తి బెంచ్ రాష్ట్రానికి వచ్చింది. మంగళవారం ఉదయమిక్కడ రాజకీయ పార్టీల నేతలను విడివిడిగా కలిసింది. ఈ బెంచ్‌లో ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్, ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అనూప్ చంద్ర పాండే, అరుణ్ గోయల్, ఉప ఎన్నికల కమిషనర్ హితేశ్ ఉన్నారు. వీరితోపాటు రాష్ట్ర ఎన్నికల కమిషన్ సీఈవో ముఖేశ్ కుమార్ మీనా కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. సుమారు నలభై నిమిషాలపాటు ఎన్నికల కమిషన్‌తో సమావేశం అయిన చంద్రబాబు, పవన్... ఆ తర్వాత అక్కడే మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. వారు ఏమన్నారంటే...

మరీ ఇంత దుర్మార్గమా?

ప్రజలపై నమ్మకం కోల్పోయి దొడ్డిదారిన అయినా గెలవాలన్న తపనతో రాష్ట్రంలో వైసీపీ పార్టీ సకల అక్రమాలకు పాల్పడుతోందని, ఈ దుర్మార్గాలకు కూడా అంతూపొంతూ లేకుండా పోతోందని చంద్రబాబు ధ్వజమెత్తారు. "ఒక్క చంద్రగిరి నియోజకవర్గంలోనే లక్షకుపైగా కొత్త ఓటర్లను చేర్చేందుకు వైసీపీ నేతలు దరఖాస్తులు ఇచ్చారు. ఒక్క నియోజకవర్గంలో లక్ష మంది ఓటర్లు ఎలా పుట్టుకొస్తారు? పక్క నియోజకవర్గాల వారిని అక్కడ చేరుస్తున్నారు. ఇది కేవలం ఒక ఉదాహరణ. ఇలాంటి అక్రమాలు అనేక నియోజకవర్గాల్లో జరుగుతున్నాయి. ఎన్నికల నిర్వహణ బాధ్యతలు ఎవరికి అప్పగించాలనే దానిపై దేశవ్యాప్తంగా ఒక విధానం ఉంది. టీచర్లు, ఇతర సీనియర్ ఉద్యోగులకు ఈ బాధ్యతలు అప్పగిస్తారు. ఈ రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ఆ సంప్రదాయాలను పక్కన పెట్టి తమ హయాంలో కొత్తగా నియమితమైన గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లకు ఎన్నికల విధులు అప్పగిస్తోంది. దేశవ్యాప్తంగా బూత్ లెవల్ అధికారులుగా ఉపాధ్యాయులను నియమిస్తున్నారు. ఈ రాష్ట్రంలో 3400 మంది సచివాలయాల మహిళా పోలీసులను బీఎల్‌వోలుగా నియమించారు. రాష్ట్రానికి జగనే కావాలి అని ఒక కార్యక్రమం పెట్టి గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగులతో ప్రభుత్వం ఇంటింటికీ ప్రచారం చేయించింది. అదే ఉద్యోగులతో ఇప్పుడు ఎన్నికలు నిర్వహిస్తామని చెబుతోంది. జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలని ప్రచారం చేసిన సచివాలయాల ఉద్యోగులు, ఎన్నికలు నిష్పక్షపాతంగా ఎలా నిర్వహిస్తారు? గతంలో రాష్ట్రంలో ఎన్నికల ప్రధానాధికారిగా పనిచేసిన ఒక సీనియర్ అధికారి ఈ ప్రభుత్వ వేధింపులు భరించలేక తన కుటుంబ సభ్యులకు రక్షణ కావాలని కేంద్ర హోం మంత్రిని అభ్యర్థించాల్సి వచ్చింది. అదీ ఈ రాష్ట్రంలో పరిస్థితి. ఎన్నికల సమయంలో ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలను బెదిరించడానికి విపరీతంగా తప్పుడు కేసులు పెడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ, జనసేన పార్టీల కార్యకర్తలపై 60- 70 వేల అక్రమ కేసులు పెట్టారు. ఒక్క పుంగనూరు నియోజకవర్గంలో ఒకే ఒక్క సంఘటనలో 250మంది టీడీపీ నాయకులపై కేసులు పెట్టి 200 మందిని జైలుకు పంపారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఈ పరిస్థితులను తీవ్రంగా తీసుకోవాలి. అవసరం అయితే కేంద్ర పోలీస్ పరిశీలకులను నియమించాలి. ప్రత్యేకంగా సెల్ ఏర్పాటుచేసి పర్యవేక్షణ చేయాలని కోరాం. మేం చెప్పిన విషయాలపై ఎన్నికల కమిషన్ బాగా స్పందించింది. కఠిన చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చింది" అని చంద్రబాబు అన్నారు.

> "ఎన్నికల నిర్వహణలో అక్రమాలపై బలంగా స్పందిస్తాం. ఒక్క దొంగ ఓటు ఉన్నా తీవ్రంగా ప్రతిఘటిస్తాం. ఎవరికీ భయపడేది లేదు. తప్పు చేసినవారిని జైలుకు పంపేవరకూ వదిలిపెట్టం" - చంద్రబాబు

> "ఎన్నికల కమిషన్ నేరుగా దృష్టి పెట్టాలని, అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని, హింస చెలరేగకుండా చూడాలని, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలని కోరాం " - పవన్

టీడీపీ మిత్రపక్షంగా జనసేన

ఈసీ వద్దకు ఒంటరిగా వెళ్లిన బీజేపీ నేతలు

సీఈసీ మంగళవారం నిర్వహించిన సమావేశం ఒక ఆసక్తికర రాజకీయ పరిణామానికి కేంద్ర బిందువు అయింది. జనసేన గుర్తింపు పొందిన పార్టీ కాకపోవడంతో ఈ సమావేశానికి ఆహ్వానం పొందలేదు. కానీ తమ మిత్రపక్షంగా పవన్‌తో కలిసి హాజరవుతామని చంద్రబాబు ముందుగా లేఖ రాశారు. దానికి ఈసీ అనుమతించి వారిద్దరికీ కలిపి సమయం ఇచ్చిం ది. జనసేన తమ మిత్రపక్షం అని చెప్పే బీజేపీ మాత్రం ఒంటరిగా హాజరైంది. సమావేశానికి జనసేన పార్టీకి ఆహ్వానం లభించడంపై వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. "గుర్తింపు లేకపోయినా జనసేన పార్టీని ఎలా పిలుస్తార"ని ప్రశ్నించారు.

కేంద్రం పట్టుదలగా ఉంది

రాష్ట్రంలో ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలని కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ పట్టుదలగా ఉన్నాయని, అందుకే కేంద్ర ఎన్నికల కమిషన్ మొత్తం బెంచ్ ఇక్కడకు తరలివచ్చిందని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. "చంద్రబాబుకు సీఎంగా సుదీర్ఘ అనుభవం ఉంది. తమ హయాంలో ఎన్నికలు ఎలా స్వేచ్ఛగా నిర్వహించారో ఆయన ఎన్నికల కమిషన్‌కు విపులంగా వివరించారు. జనసేన తరపున నేను.. రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎంత ఘోరంగా దిగజారిపోయాయో... అడ్డగోలుగా కేసులు ఎలా పెడుతున్నారో... బైండోవర్ కేసులు పెట్టి ఎలా వేధిస్తున్నారో అన్నీ వివరించాను. ఈ విషయంలో ఎన్నికల కమిషన్ బలంగా హామీ ఇచ్చింది. కేంద్రం గట్టిగా ఉన్నందువల్లే ఈ భరోసా లభించింది" అని పవన్ కల్యాణ్ అన్నారు.

సీఎంవో పాత్రపై బాబు ఫిర్యాదు

ఎన్నికల నిర్వహణలో సీఎంవో పాత్రపై చంద్రబాబు... కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. 'రాష్ట్ర ఎన్నికల సీఈవో పేరుకు తెర మీద ఉన్నారు. ఆయనను పక్కన పెట్టి సీఎం కార్యాలయంలో ఉన్న అధికారి ధనుంజయ్ రెడ్డి తానే ఎన్నికల వ్యవహారాలపై కలెక్టర్లు, ఎస్పీలు, రిటర్నింగ్ అధికారులకు ఆదేశాలు ఇస్తున్నారు. ప్రత్యేకంగా కొంత మందిని పెట్టి సీఎం కార్యాలయం దీనిపై పర్యవేక్షణ చేస్తోంది. అధికార పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తే పింఛన్లు కత్తిరిస్తామని పేదలను బెదిరిస్తున్న గ్రామ సచివాలయ ఉద్యోగులను ఎన్నికల అధికారులుగా పెట్టి వారితో ఎన్నికలు నిర్వహించడం ఏవిటి? అని చంద్రబాబు ప్రశ్నించారు.

ఓట్లపై టీడీపీవి తప్పుడు ఫిర్యాదులు!

- లోకేశ్ రెడ్‌బుక్ చూపి అధికారులను బెదిరిస్తున్నారు
- సీఈసీకి వైసీపీ ఎంపీ విజయసాయి ఫిర్యాదు
- జనసేన గుర్తింపులేని పార్టీ అని వ్యాఖ్య
- పవన్‌కు సీఈసీ అపాయింట్‌మెంట్‌పై అభ్యంతరం

అమరావతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా లక్షల సంఖ్యలో దొంగ ఓట్లు నమోదు చేశారంటూ తెలుగుదేశం పార్టీ తప్పుడు ఫిర్యాదులు చేస్తోందని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ఆరోపించారు. రాష్ట్ర పర్యటనకు వచ్చిన భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్‌ను వైసీపీ ఎంపీలు విజయసాయిరెడ్డి, మార్గాని భరత్ మంగళవారం విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో కలిశారు. అనంతరం విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో 10 లక్షల దొంగ ఓట్లు నమోదు చేశారంటూ టీడీపీ తరఫున ఎన్నికల సంఘానికి గంపగుత్తగా ఫిర్యాదులు చేసిన కోనేరు సురేశ్‌పై చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశామని చెప్పారు. ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని టీడీపీ ఉల్లంఘిస్తూ 'మై పార్టీ డాష్‌బోర్డ్.కామ్' అనే వెబ్‌సైట్ ద్వారా ఓటర్ల వివరాలను ప్రొఫైల్ చేసిందని, ఇది పూర్తిగా చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. నారా లోకేశ్ పాదయాత్రలో ప్రతిచోటా రెడ్‌బుక్‌ను చూపిస్తూ అధికారులను బెదిరిస్తున్నారని కూడా సీఈసీకి ఫిర్యాదు చేశామన్నారు. చంద్రబాబు, లోకేశ్ అసభ్య పదజాలంతో ముఖ్యమంత్రి జగన్‌ను దూషిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. గుర్తింపు లేని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు సీఈసీ అపాయింట్‌మెంట్ ఇవ్వడంపై విజయసాయిరెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. గుర్తింపు లేని జనసేనకు కామన్ సింబల్‌గా గాజు గ్లాసు గుర్తును కేటాయించడం చట్టవిరుద్ధమన్నారు. తెలంగాణలో ఓటు హక్కు వినియోగించుకున్నవారు ఇప్పుడు ఏపీలో ఓట్లు వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరామని తెలిపారు.

ఓటర్లకు వీవీప్యాట్స్ ఇవ్వాలి: సీపీఎం

అమరావతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానంపై అందరికీ నమ్మకం కలగాలంటే ఓటుహక్కును వినియోగించుకున్న ప్రతి ఓటరుకు వీవీప్యాట్స్ ఇవ్వాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరినట్లు సీపీఎం ప్రతినిధులు తెలిపారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు (వైవీ), రాష్ట్ర కమిటీ సభ్యుడు జె.జయరాం మంగళవారం విజయవాడలో సీఈసీని కలిశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఓట్ల నమోదు, తొలగింపు ప్రక్రియలో వలంటీర్లు కీలక పాత్ర పోషించినట్లుగా వస్తున్న ఫిర్యాదులపై తగిన చర్యలు తీసుకోవాలని సీఈసీని కోరామన్నారు. అలాగే అనేక నియోజకవర్గాల్లో గంపగుత్తగా ఓట్లను తొలగించినట్లు వచ్చిన ఫిర్యాదులపై సీఈసీ స్పందించి ఓటర్ల జాబితాలను సరిచేసేలా చర్యలు తీసుకుంటోందని, అలాగే గంపగుత్తగా ఓట్లు తొలగించినవారిపై కూడా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశామన్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో రెండు చోట్లా ఓటుహక్కు కలిగి ఉన్నవారు ఒక్క రాష్ట్రంలోనే ఓటుహక్కు వినియోగించుకునేలా చూడాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉండేలా గ్రామాలవారీగా పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే, బీజేపీ, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీల తరఫున ఆ పార్టీల నాయకులు సీఈసీని కలిసి తమ అభిప్రాయాలు తెలిపారు.

చివరిదాకా సాగదీత!

(మొదటి పేజీ తరువాయి)

ఇదే పరిస్థితి. టికెట్ దక్కని ఎమ్మెల్యేల ముఖమైనా చూసేందుకు, నచ్చజెప్పడానికి జగన్ ప్రయత్నమే చేయలేదు. తీవ్ర మనస్తాపంతో వారు వెనుదిరిగారు. అయితే ఆయన చెల్లెలు కాంగ్రెస్‌లో చేరడం.. ఏపీ పగ్గాలు చేపడతారన్న ప్రచారం.. టికెట్ రాని మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆమె వెంట నడుస్తానని ప్రకటించడం.. సీట్లు దక్కని వైసీపీ ఎమ్మెల్యేలు టీడీపీతోపాటు కాంగ్రెస్ వైపు కూడా చూస్తుండడం.. తదితర పరిణామాలు జగన్ అండ్ కోను భయపెడుతున్నాయి. అందుకే ఎమ్మెల్యేలను తాడేపల్లికి పిలిపించి మరీ బుజ్జగించే ప్రయత్నం చేస్తున్నారు. తొలివిడత 11 మందిని.. రెండోసారి 24 మంది అసెంబ్లీ ఇన్‌చార్జులను, ముగ్గురు లోక్‌సభ ఇన్‌చార్జులను ప్రకటించిన ఆయన.. మిగతా వారి జాబితా విడుదలపై తొందరపడకూడదని భావిస్తున్నారు. ఇప్పుడే ప్రకటిస్తే వారు ప్రత్యామ్నాయాలు చూసుకుంటారని.. ఇదే జరిగితే ఎన్నికల్లో నష్టపోతామని .. వారికి ఆ అవకాశం ఇవ్వకుండా చివరిదాకా సాగదీస్తేనే మంచిదని ఇప్పుడు అనుకుంటున్నట్లు తెలిసింది. రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి కాంగ్రెస్‌లో చేరతారన్న వార్తలతో మిగతావారు జారిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రాంతీయ సమన్వయకర్తలను జగన్ ఆదేశించినట్లు సమాచారం.

కప్పం కట్టేందుకు జంకు!

లోక్‌సభకు పోటీచేసేవారికి వైసీపీలో కొరత ఏర్పడింది. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎన్నికల ఖర్చు భరించేందుకు ఎంపీ అభ్యర్థులెవరూ సిద్ధంగా లేరు. పైగా లోక్‌సభకు పోటీ చేయాలంటే రూ.180 కోట్లు.. ఎమ్మెల్యే అభ్యర్థి సగటున 30 కోట్లన్నా డిపాజిట్ చేయాలని జగన్ షరతు విధించడంతో పలువురు జంకుతున్నారు.

మెట్టుదిగని పార్థసారథి..

మచిలీపట్నం లోక్‌సభకు పోటీచేయాలని సీఎం జగన్ పదే పదే చెప్పినా పెనమలూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొలుసు పార్థసారథి అంగీకరించడం లేదు. పెనమలూరు మినహా మరెక్కడా పోటీ చేయనని సోమవారం ముఖ్యమంత్రికే చెప్పివచ్చారు. మంగళవారం పార్థసారథితో ఎంపీ అయోధ్యరామిరెడ్డి సుదీర్ఘంగా మంతనాలు జరిపినా ప్రయోజనం లేకుండా పోయింది.

పద్మావతికి జగన్ క్లాస్

శింగనమల దళిత మహిళా ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతిపై వైసీపీ పెద్దలు ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ఈ ప్రభుత్వంలో ఎస్సీ నియోజకవర్గ ఎమ్మెల్యేలు అందరికీ అణిగిమణిగి ఉండాలి.. ఎవరినో సంతృప్తి పరచడానికి వాళ్ల కాళ్లూ వీళ్ల కాళ్లూ పట్టుకోవాలి.. నీళ్లు ఇవ్వక పోయినా మాట్లాడకూడదు.. పొరపాటున మాట్లాడితే అది పెద్ద నేరం' అంటూ ఆమె ఇటీవల తన ఆవేదనను సోషల్ మీడియాలో వీడియో ద్వారా తెలియజేశారు. దీనిపై తాడేపల్లి నుంచి ఫోన్లోనే క్లాస్ తీసుకున్న పెద్ద నాయకులు.. వెంటనే వచ్చి జగన్‌కు సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. హుటాహుటిన వచ్చిన ఆమె.. మొదట సజ్జల రామకృష్ణారెడ్డితో మాట్లాడిన తర్వాత సీఎంను కలిశారు. 'నియోజకవర్గంలో ఏం జరుగుతోందో నాకు తెలుసు.. మీ కుటుంబ అవినీతి, ఆలయాల హుండీలను సైతం వదలకుండా బెదిరించడం, పార్టీ కార్యకర్తలను డబ్బుల కోసం ఇబ్బంది పెట్టడం, నా పేరు చెప్పి బెదిరించడం కూడా తెలుసు.. అయినా ఎందుకులే అని పక్కనబెట్టా, మాట్లాడకుండా పార్టీ కోసం పని చేయండి..' అంటూ ఆమె భర్త సాంబశివారెడ్డి చిట్టాను సీఎం విప్పడంతో పద్మావతి కన్నీరు పెట్టుకుని బయటకు వచ్చేసినట్లు తెలిసింది.

ప్రత్యామ్నాయం ప్రాసెస్‌లో: మాధవ్

హిందూపురం ఎంపీ టికెట్ కర్ణాటకకు బీజేపీ నాయకుడు శ్రీరాములు సోదరి శాంతకు గతవారం వైసీపీ కేటాయించడంతో సిటింగ్ ఎంపీ గోరంట్ల మాధవ్ అవాక్కయ్యారు. వెంటనే తాడేపల్లి క్యాంపు కార్యాలయానికి వచ్చి.. హడావుడి చేశారు. మంగళవారం మళ్లీ మాధవ్ వచ్చారు. ఆయనను జగన్ లోపలకు పిలిచి ఒక మాట మాట్లాడినట్లు తెలిసింది. ఆయనను విలేకరులు పలకరించగా.. 'ప్రత్యామ్నాయం ప్రాసెస్‌లో ఉంది' అని అంటున్నారు.

మల్లాది విష్ణుకు బుజ్జగింపు...

విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణును ముఖ్యమంత్రి బుజ్జగించే ప్రయత్నం చేశారు. తన స్థానాన్ని విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్‌కు కేటాయించడంతో విష్ణు అలక బూనారు. అనుచరులతో రాజీనామా చేయించేందుకు సిద్ధమయ్యారు. అయోధ్య రామిరెడ్డిని పంపి విష్ణుతో పాటు వెలంపల్లినీ పిలిపించి వారితో జగన్ మాట్లాడారు.

రాజ్యసభ వల!

అసంతుష్ట ఎమ్మెల్యేలను బుజ్జగింపు క్రమంలో జగన్ కొందరికి ఇతర పదవులతో గేలం వేయడానికి ప్రయత్నిస్తున్నారు. వైసీపీ పెట్టిన నాటి నుంచి తన వెంటే ఉన్న పాయకరావుపేట (ఎస్సీ) ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకు ఈ దఫా మొండిచేయి చూపిన సంగతి తెలిసిందే. ఎస్సీల్లో వ్యతిరేకత వస్తుందన్న భయంతో ఆయన్ను రాజ్యసభకు పంపుతామని వైసీపీ పెద్దలు ప్రతిపాదించారు. చిత్తూరు ఎమ్మెల్యే జంగాలపల్లి శ్రీనివాస్, ఒంగోలు ఎంపీ టికెట్ ఆశిస్తున్న జగన్ బాబాయి వైవీ సుబ్బారెడ్డిని కూడా రాజ్యసభకు పంపుతున్నట్లు ప్రచారం చేశారు. అయితే రాజ్యసభ ఎన్నికలు ఇప్పట్లో లేవు. ప్రస్తుత రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, సీఎం రమేశ్, కనకమేడల రవీంద్రకుమార్ ఈ ఏడాది ఏప్రిల్లో పదవీ విరమణ చేయనున్నారు. ఎన్నికలకు ముందు ఇలాంటి హామీలు ఇవ్వడం జగన్‌కు అలవాటేనని రాజకీయ వర్గాలు అంటున్నాయి. చిలకలూరిపేటలో టికెట్ దక్కని మర్రి రాజశేఖర్‌కు ఎమ్మెల్సీ, మంత్రి పదవి ఇస్తానంటూ ఆచప 2019లో బహిరంగ సభలోనే వెల్లడించారు. కానీ రెండున్నరేళ్లు సాగదీసి.. ఎట్టకేలకు ఎమ్మెల్సీ ఇచ్చారు. మంత్రి పదవి మాత్రం ఇవ్వలేదని.. ఇప్పుడు అసెంబ్లీ టికెట్ నిరారించినవారికి రాజ్యసభ సీటు ఎరవేస్తున్నారని రాజకీయ వర్గాలు అంటున్నాయి. బలమైన బలిజ సామాజిక వర్గానికి చెందిన శ్రీనివాస్‌కు టికెట్ నిరాకరించి.. ఆయన పక్కచూపులు చూడకుండా రాజ్యసభకు పంపుతామని అంటున్నారని.. దీనిని ఆయా వర్గాలు నమ్మడం లేదని చెబుతున్నాయి.

రఘువీరాతో కాపు మంతనాలు

అనంతపురం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డితో అనంతపురం జిల్లా రాయదుర్గం వైసీపీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి భేటీ అయ్యారు. కాపునకు వైసీపీ అధిష్ఠానం టికెట్ నిరాకరించిన నేపథ్యంలో ఆయన తిరుగుబాటు బావుటా ఎగరేసిన విషయం తెలిసిందే. రఘువీరారెడ్డితో కాపు రెండు గంటల పాటు ఏకాంతంగా చర్చలు జరిపారు. రఘువీరారెడ్డి నేతృత్వంలో ముందుగా ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్యం ఠాగూర్‌ను కలుస్తారని సమాచారం. కల్యాణదుర్గం నియోజకవర్గం నుంచే పోటీ చేయాలని కాపు భావిస్తున్న నేపథ్యంలో... ముందుగా ఆ నియోజకవర్గంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఆ సభకు వైఎస్ షర్మిల హాజరయ్యేలా సన్నాహాలు చేస్తున్నారు. ఆమె సమక్షంలోనే కాపు రామచంద్రారెడ్డి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటారని తెలుస్తోంది. కాగా, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, రఘువీరారెడ్డితో ఉన్న సాన్నిహిత్యం నేపథ్యంలో తాను రఘువీరారెడ్డిని కలిసేందుకు వచ్చానని ఎమ్మెల్యే కాపు మీడియాతో చెప్పారు.

జగన్ వ్యూహం బూమ'రాంగే'!

ఎన్నికల విధులకు సచివాలయ ఉద్యోగులు అర్హులేనా?

ఎన్నికల్లో ఉపాధ్యాయులు సేవలందించక తప్పని పరిస్థితి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల విధుల నుంచి ఉపాధ్యాయులను తప్పించాలనుకున్న జగన్ వ్యూహం బెడిసికొట్టేలా ఉంది. బోధనేతర బాధ్యతల నుంచి టీచర్లను దూరంగా ఉంచుతున్నామంటూ సచివాలయ ఉద్యోగుల జాబితాను ఇప్పటికే ఎన్నికల కమిషన్‌కు పంపారు. వీరంతా ఎన్నికల విధుల్లో ఉంటే జగన్ గెలుపునకు సహకరిస్తారని వైసీపీ భావిస్తోంది. అయితే ఉద్యోగుల బదిలీలకు సంబంధించి డిసెంబరులో ఈసీ ఇచ్చిన మార్గదర్శకాలతో ఈ వ్యూహం బూమరాంగ్ అయ్యేలా ఉంది. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు మూడేళ్ల సర్వీసు పూర్తిచేసి ఉంటే వారిని ఇతర జిల్లాలకు బదిలీ చేయాలని ఈసీ మార్గదర్శకాల్లో పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా 1.26 లక్షల మంది సచివాలయ కార్యదర్శులు గత నాలుగేళ్ల నుంచి ఒకేచోట పనిచేస్తున్నారు. వీరికి బదిలీ అవకాశం ఇస్తామని చెప్పిన వైసీపీ సర్కారు గతేడాది నామమాత్రంగా 10శాతం లోపే ట్రాన్స్‌ఫర్ చేసింది. ఈ ఉద్యోగులు కూడా బదిలీల కోసం డిమాండ్ చేస్తూనే ఉన్నారు. ప్రభుత్వ వ్యూహం ప్రకారం వారందరికీ ఎన్నికల విధులు అప్పగించాలటే ఈసీ నిబంధనలను అనుసరించి మొత్తం 1.26లక్షల మంది సచివాలయ ఉద్యోగులను బదిలీ చేయాల్సి ఉంటుంది. ఇప్పటికిప్పుడు అంతమందిని ఒకేసారి డివిజన్/ జిల్లా మార్చడం సాధ్యమేనా అని పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల్లో గెలిచేందుకు వ్యూహాలు

రాష్ట్రంలో వైసీపీ సర్కారు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆ పార్టీ నేతలు మళ్లీ ఎన్నికల్లో గెలిచేందుకు అవసరమైన అన్ని ఎత్తులు వేస్తూనే ఉన్నారు. మరో 30ఏళ్లు జగనే సీఎం అనే నినాదంతో వివిధ కార్యక్రమాలు రూపొందించుకున్నారు. అభివృద్ధి జాడ లేకుండా చేశారు. ప్రజల ఖాతాల్లో డబ్బులు వేసిన జగన్‌కే ఓట్లు వేయాలంటూ వలంటీర్లతో ప్రచారం చేయించుకుంటున్నారు. పీఆర్సీ, రిటైర్మెంట్ ప్రయోజనాల విషయంలో ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం మొండిచెయ్యి చూపించింది. ఉద్యోగులు, టీచర్లు, కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టినా కనికరించలేదు. దీంతో వీరంతా ఎన్నికల్లోస్తే వైసీపీ సర్కారును ఇంటికి సాగనంపుదామన్న కృతనిశ్చయంతో ఉన్నారు. ఈ సమయంలో టీచర్లకు ఎన్నికల విధులు అప్పగిస్తే తమకు వ్యతిరేకంగా పనిచేస్తారన్న ఆందోళన ప్రభుత్వ పెద్దలకు పట్టుకుంది. అందుకే ఎన్నికల కమిషన్‌కు సచివాలయ ఉద్యోగుల జాబితా పంపారు. అయితే ఏమాత్రం అనుభవం లేని వీరికి ఎన్నికల విధులు ఎలా అప్పగిస్తారని ఈసీని టీడీపీ, జనసేన ప్రశ్నిస్తున్నాయి. ఓటర్లజాబితా పనులు వలంటీర్లుకు ఇవ్వడాన్ని ఈ పార్టీలు తప్పుబడుతున్నాయి.

బదిలీ చేయాలన్నా చిక్కులే

సచివాలయాల కార్యదర్శులందరూ రికార్డు అసిస్టెంట్ కేడర్ ఉద్యోగులు. వారికి అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్ బాధ్యతలు మాత్రమే అప్పగించాల్సి ఉంటుంది. పోలింగ్ ఆఫీసర్‌గా కచ్చితంగా గెజిటెడ్ అధికారిని మాత్రమే నియమించాలి. అప్పుడు ఈ ఉద్యోగులెవరూ ఎన్నికల అధికారి పోస్టుకు అర్హులు కారు. పైగా ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులందరినీ వేరే సచివాలయాలకు మార్చాల్సి ఉంటుంది. అయితే ఇంతమందిని మూకుమ్మడిగా బదిలీ చేయడం సాధ్యమేనా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. అరకొర జీతాలు తీసుకుంటున్న సచివాలయ ఉద్యోగులను డివిజన్/జిల్లా మారుస్తూ నిర్ణయాలు తీసుకుంటే వారు ప్రభుత్వానికి సహకారం అందిస్తారా అనే సందేహం కూడా వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల విధులకు టీచర్లను వినియోగించుకోవడం తప్పనిసరనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సచివాలయ సిబ్బంది కాకుండా మిగతా ఉద్యోగులందరూ తమకు వ్యతిరేకంగా పనిచేస్తారని, ఎన్నికల్లో తమ ఓటమికి తలా ఒక చేయి వేస్తారన్న ఆందోళనతోనే ఎన్నికల కమిషన్‌కు ప్రతిపక్షాలు చేసిన ప్రతి ఫిర్యాదును అధికార పార్టీ నేతలు వ్యతిరేకిస్తూ... తాము కూడా ఎదురు ఫిర్యాదులు చేస్తున్నారు. అర్హత లేని సచివాలయ ఉద్యోగులకు ఎన్నికల బాధ్యతలు అప్పగించడంలో సర్కారు ఎంతవరకూ సఫలీకృతమవుతుందో వేచిచూడాలి.

పెద్దల సభకు యుద్ధం

వేడెక్కిన రాజ్యసభ ఎన్నికలు

- ఏప్రిల్‌లో మూడు స్థానాలు ఖాళీ
- అధికార పార్టీకి టికెట్లు దక్కని నేతల సెగ
- వారిని ఆకర్షించేలా దేశం ప్లాన్
- వెరసి 'ఎమ్మెల్సీ ఎన్నికల' ఫలితం రిపీట్?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పెద్దల సభకు యుద్ధం ప్రారంభమైంది. రాష్ట్రంలో త్వరలో ఖాళీ కానున్న మూడు రాజ్యసభ స్థానాలకు సంబంధించి అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ వేడి రాజుకుంది. ఈ ఎన్నికల్లో విజయం సాధించడానికి అధికార పక్షం వైసీపీ, ప్రధాన ప్రతిపక్షం టీడీపీలు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నాయి. మూడు స్థానాలూ శాసన సభ్యుల కోటాలోనే ఉన్నాయి. దీంతో ఎమ్మెల్యేల ఓటు ఈ ఎన్నికల్లో కీలకంగా మారనుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత జట్టును చేజారకుండా చూసేందుకు, ప్రత్యర్థి జట్టును బలహీన పరచేందుకు వైసీపీ ప్రయత్నిస్తుండగా, తన వారిని కాపాడుకుంటూ.. అధికార పార్టీ ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ టీడీపీ కూడా అంతే దూకుడు ప్రదర్శిస్తోంది.

రిటైర్మెంట్ వీరికే

రాజ్యసభలో ముగ్గురు ఎంపీలు ఈ ఏడాది ఏప్రిల్‌లో రిటైర్ అవుతున్నారు. వీరిలో వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి(వైసీపీ), సీఎం రమేశ్(బీజేపీ), కనకమేడల రవీంద్ర కుమార్(టీడీపీ) ఉన్నారు. వీరిలో రమేశ్ టీడీపీ తరఫున గెలిచి, పెద్దల సభలో అడుగు పెట్టినా తర్వాత బీజేపీ కండువా కప్పుకొన్నారు. ఇక, మిగిలిన ఇద్దరూ వారి వారి పార్టీల్లోనే కొనసాగుతున్నారు. ఏప్రిల్‌లో ఖాళీ కానున్న ఈ స్థానాలకు నెల ముందుగానే మార్చిలో ఎన్నికలు జరుగుతాయని అంచనా. రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు ఈ రాజ్యసభ ఎన్నికల్లో ఓటు వేయాల్సి ఉంది. అసెంబ్లీ బలాబలాల ప్రకారం ఈ మూడు సీట్లు వైసీపీ గెలుచుకోవడానికి అవకాశం ఉంది. కానీ, ప్రస్తుతం చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణామాలు కొత్త సమీకరణాలకు చోటు కల్పిస్తున్నాయి. వైసీపీలో పెద్ద సంఖ్యలో సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ఈసారి టికెట్లు నిరాకరిస్తున్నారు. ఆయా నియోజకవర్గాల్లో కొత్త ఇన్‌చార్జులను నియమిస్తున్నారు. సమన్వయకర్తల పేరుతో ఇప్పుడు ప్రకటిస్తున్న ఇన్‌చార్జులే రాబోయే ఎన్నికల్లో తమ అభ్యర్థులని మంత్రి బొత్స సత్యనారాయణ ఇటీవల ప్రకటించారు. ఆ సమయంలో ఆయన పక్కన ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి కూడా ఉన్నారు. టికెట్ నిరాకరిస్తున్న ఎమ్మెల్యేల సంఖ్య ఎంతో బయటకు రాకపోయినా సుమారు 40 మంది ఉండవచ్చని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఆ సంఖ్య 50 వరకు చేరినా ఆశ్చర్యం లేదని వైసీపీలో కొందరు నేతలు అభిప్రాయపడుతున్నారు. గత ఎన్నికల్లో వైసీపీ 151 సీట్లు గెలుచుకుంది. తర్వాత టీడీపీ నుంచి నలుగురు ఎమ్మెల్యేలు, జనసేన నుంచి ఒక ఎమ్మెల్యే ఆ పార్టీలో చేరిపోయారు. అదే సమయంలో వైసీపీ నుంచి నలుగురు ఎమ్మెల్యేలు బయటకు వచ్చి టీడీపీలో చేరారు. టికెట్లు నిరాకరించిన ఎమ్మెల్యేల్లో అధికులు రాజ్యసభ ఎన్నికల్లో టీడీపీకి అభ్యర్థికి క్రాస్ ఓట్ చేస్తే ఆ పార్టీ ఒక సీటును సునాయాసంగా గెలుచుకునే పరిస్థితి ఉంటుంది. టికెట్ నిరాకరణతో వైసీపీ నాయకత్వంపై ఆగ్రహంతో ఉన్న ఎమ్మెల్యేలు ప్రత్యర్థి పక్షానికి ఖాయంగా ఓటు వేస్తారని, దీనిని ఆపడం కష్టమని ఒక సీనియర్ నేత వ్యాఖ్యానించారు.

టీడీపీపై కుటిల వ్యూహం

రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో టీడీపీ ఎమ్మెల్యేల సంఖ్యా బలాన్ని కొంతవరకైనా తగ్గించడానికి వైసీపీ కుటిల వ్యూహానికి తెరదీసింది. టీడీపీకి మద్దతుగా మారిన నలుగురు వైసీపీ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయించే ప్రయత్నాన్ని మొదలు పెట్టింది. ఆ నలుగురిపై వేటు వేయాలని కోరుతూ శాసనసభ స్పీకర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. స్పీకర్ దానిపై ఒక విధానాన్ని పాటించాల్సి ఉంటుంది. ఆ ఎమ్మెల్యేలకు నోటీసు ఇచ్చి వారి సమాధానం తీసుకోవాలి. వారు సమయం అడిగితే ఇవ్వాల్సి ఉంటుంది. వీలైనంత త్వరగా దీనిపై నిర్ణయం జరిగేలా చూడాలని వైసీపీ నాయకత్వం ప్రయత్నిస్తోంది. ఈ నిర్ణయం కోసమే స్పీకర్ తమ్మినేని సీతారాంకు టికెట్ కేటాయింపుపై నాన్చుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఆయన కూడా మార్పుల జాబితాలో ఉన్నారని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మరో పక్క టీడీపీ కూడా వ్యూహాత్మకంగా పావులు కదుపుతోంది. తమ నుంచి వైసీపీలోకి వెళ్లిన నలుగురు ఎమ్మెల్యేలపైనా అనర్హత వేటు వేయాలని స్పీకర్‌కు లేఖ ఇవ్వాలని నిర్ణయించింది. మరోపక్క వైసీపీలో టికెట్ దక్కని ఎమ్మెల్యేలతో దేశం నేతలు సంప్రదింపులు మొదలు పెట్టారు. మొత్తంగా చూస్తే రాజ్యసభ ఎన్నికల కాక ఇరు పార్టీల రాజకీయాలను వేడెక్కించింది.

ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ

గత ఏడాది జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ అధికార పక్షానికి ఇలాంటి పరిణామమే ఎదురైంది. నలుగురు వైసీపీ ఎమ్మెల్యేలు టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పంచుమర్తి అనురాధకు క్రాస్ ఓటు వేయడంతో ఆమె ఎమ్మెల్సీగా నెగ్గారు. వైసీపీ అభ్యర్థుల్లో కోలా గురువులు ఓడిపోయారు. అసెంబ్లీ ఎన్నికల ముందు రాజ్యసభ ఎన్నికల్లో కూడా ఇదే తరహా పరిస్థితి ఎదురవుతుందనే భయం వైసీపీ వర్గాలను వెన్నాడుతోంది. అలాగని, రాజ్యసభ ఎన్నికలు జరిగే వరకు పార్టీ అభ్యర్థులను ప్రకటించకుండా ఆపే పరిస్థితి లేదు. అప్పటివరకూ ప్రకటన ఆపితే తర్వాత అభ్యర్థులకు ఎన్నికల ప్రచార సమయం బాగా తగ్గిపోతుంది. దీంతో ఏం చేయాలన్న మీమాంసలో వైసీపీ నాయకత్వం ఉంది.

రాజకీయ లబ్ధి కోసమే వైఎస్ మరణంపై ఆరోపణలు

▸▸ ఎన్నికలొచ్చినప్పుడల్లా వైసీపీది అదే వరుస: గిడుగు రుద్రరాజు



విశాఖపట్నం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికలు జరిగినప్పుడల్లా వైఎస్ మరణంపై అసంబద్ధ ఆరోపణలు చేస్తూ రాజకీయంగా లబ్ధి పొందేందుకు వైసీపీ ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు విమర్శించారు. విశాఖపట్నంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ హెలికాప్టర్ ప్రమాదంపై విచారణకు నియమించిన త్యాగి కమిటీ హెలికాప్టర్‌లో రికార్డుయిన అంశాలను పరిశీలించిన తరువాత ప్రమాదవశాత్తూ జరిగినట్టు తేల్చిందన్నారు. అయినప్పటికీ వైసీపీ నాయకులు ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ కాంగ్రెస్ పార్టీపై, సోనియాగాంధీపై పథకం ప్రకారం ఆరోపణలు చేస్తూ రాజకీయంగా లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని ఆక్షేపించారు. వైఎస్ మరణం గురించి కాంగ్రెస్ పార్టీపై ఆరోపణలు చేస్తున్న వారిపై న్యాయపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధన, పోలవరం పూర్తి చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు.

నేడు విజయవాడకు కాంగ్రెస్ ఇన్‌చార్జి రాక

▸▸ షర్మిలకు బాధ్యతలపై స్పష్టత ఇచ్చే చాన్స్

అమరావతి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌లో చేరిన వైఎస్ షర్మిలకు.. ఏపీ బాధ్యతలు ఇంకెప్పుడు అప్పగిస్తారన్న ఉత్కంఠ పీసీసీ నేతల్లో కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్కం ఠాగూర్ బుధవారం విజయవాడ రానున్నారు. పీసీసీ కార్యవర్గంతో సమావేశమవుతారు. చర్చల సందర్భంగా షర్మిలకు బాధ్యతల అప్పగింతపై ఆయన స్పష్టత ఇస్తారని తెలుస్తోంది. ఆయన గురువారం యువజన కాంగ్రెస్ నేతలనూ కలుస్తారు. పీసీసీ పగ్గాలు ఆమెకివ్వాలని పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ గట్టిగా భావిస్తున్నారు. సీఎం జగన్‌ను దీటుగా ఎదుర్కొని.. రాష్ట్రంలో పార్టీకి పూర్వవైభవం తీసుకురావడానికి షర్మిల చేరిక బాగా ఉపయోగపడుతుందని విశ్వసిస్తున్నారు. ఆమెకు పగ్గాలు అప్పగిస్తే.. పూర్వం కాంగ్రెస్‌లో ఉన్న నేతలు, వైసీపీ టికెట్లు దక్కని నాయకులు పార్టీలోకి వస్తారని రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఎంతో ఆశతో ఉన్నారు.

రాష్ట్రాభివృద్ధిపై వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం

▸▸ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఆరోపణలు



అరకులోయ, జనవరి 9: కేంద్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు మంజూరు చేసినా అందుకు తగినట్లుగా రాష్ట్రంలో అభివృద్ధి కనిపించడం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆరోపించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం మధ్యాహ్నం ఆమె అరకులోయలోని టీటీడీ కల్యాణ మండపంలో మీడియాతో మాట్లాడారు. అభివృద్ధి విషయంలో ఏజెన్సీతో పాటు అన్ని ప్రాంతాలనూ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. నిరుపేదల కోసం కేంద్రం మంజూరు చేసిన ఇళ్లను పూర్తి చేయలేకపోయిందన్నారు. ఇళ్లు లేక గ్రామాల్లో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని పురందేశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు. సోమ, మంగళవారాల్లో పలు గ్రామాలను సందర్శించినట్టు తెలిపారు. ఇప్పటికైనా గిరిజనులకు కేంద్రం మంజూరు చేస్తున్న ఇళ్లను నిర్మించే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని కోరారు. వైసీపీ ప్రభుత్వం ఓటర్ల జాబితాల్లో అక్రమాలకు పాల్పడుతోందని గుర్తించి ఆధారాలతో సహా కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్టు పురందేశ్వరి తెలిపారు. రాష్ట్రంలో జనసేనతోనే బీజేపీ ఉందని పురందేశ్వరి స్పష్టం చేశారు. టీడీపీతో పొత్తు విషయంలో కేంద్ర నాయకత్వం నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు.

అవినీతి పర్వతం!

(మొదటి పేజీ తరువాయి)

కారు చవకగా ముందే భూములు కొని ఆనక రెట్టింపు రేటుకు ప్రభుత్వానికి అంటగట్టి అయినకాడికి దోచేశారు. రాష్ట్రంలో ఈ నియోజకవర్గం క్వారీలకు పెట్టింది పేరు కావడంతో అనేక క్వారీల నుంచి నెలవారీ మామూళ్లతో కోట్లకు పడగలెత్తారు. స్వయంగా కొన్ని క్వారీలు స్వాధీన పరుచుకున్నారు. నియోజకవర్గం సమీపంలోని పోర్టు, హార్బర్, నేవల్‌బేస్‌కు వెళ్లే బండరాళ్ల టిప్పర్లనుంచీ కమీషన్లు పిండేశాడు. లెక్కకు విక్కిలి అనధికార క్వారీలను మింగేశాడు. తన నియోజకవర్గంలోని ఉన్న ప్రముఖ దేవస్థానాన్ని కూడా వదలలేదు. వ్రత పురోహితుల నియామకంలో లక్షలకు లక్షలు దిగమింగేశారు. దేవస్థానం బస్సు డ్రైవర్ పోస్టుల నుంచి చిన్నచిన్న ఉద్యోగాల వరకు వారి నుంచి లక్షల్లో డబ్బులు పిండేశారు. ఇక ఆ నియోజకవర్గంలో కొండలు, గుట్టలు ఎక్కువ కావడంతో వాటిల్లో ఎంచక్కా సురక్షిత పేకాట స్థావరాలను సదరు నేతే గుర్తించి సమీపంలో విశాఖ నుంచి వచ్చే పేకాటరాయుళ్లకు డెన్‌లు కుదిర్చి కోట్లలో సంపాదించారు.

పోలవరం మట్టి.. కొల్లగొట్టి..

పోలవరం ఎడమ కాలువ మట్టి సదరు ఎమ్మెల్యేకు కోట్లలో డబ్బు పంట పండించింది. ఈ నియోజకవర్గంలోని హైవేను ఆనుకుని ఉన్న రెండు మండలాల మీదుగా కాలువ పయనిస్తోంది. టీడీపీ ప్రభుత్వ హయాంలో తవ్విన ఈ కాలువ వెంబడి లక్షల క్యుబిక్ మీటర్ల మట్టి, గ్రావెల్ కాలువ వెంబడి పోగయింది. దీనిపై కన్నేసిన ఎమ్మెల్యే ఈ మట్టి ద్వారా రెండు చేతులా సంపాదించాడు. వాస్తవానికి కాకినాడ జిల్లాలో రియల్ ఎస్టేట్ అవసరాలకు మట్టి, గ్రావెల్‌కు భారీ డిమాండ్ ఉంది. పేదల ఇళ్ల స్థలాల చదును కూడా అదేస్థాయిలో డిమాండ్ ఉండడంతో అనేక వ్యాపారులు ఈ మట్టికోసం పోటీపడ్డారు. సదరు ఎమ్మెల్యే ఈ వ్యాపారులకు ఒక్కో పాయింట్‌లో ఉన్న కాలువ మట్టిని తవ్వుకోవడానికి ప్యాకేజీల వారీగా రేట్లు కట్టి అమ్మేశాడు. తద్వారా పోలవరం మట్టిలోనే రూ.7కోట్ల వరకు సంపాదించారు. పోలవరం మట్టిలో ఆయన సంపాదించినంత డబ్బు మరే ఎమ్మెల్యే ఆర్జించలేదు. వాస్తవానికి రాష్ట్ర ఖజానా అప్పుల్లో కూరుకుపోవడంతో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో పోలవరం మట్టిని వేలం వేసి రూ.800కోట్ల నిధులు సమకూర్చాలని అధికారంలోకి వచ్చిన కొత్తలో సీఎం జగన్ భావించారు. ఒక్క కాకినాడ జిల్లాలోనే రూ.200కోట్ల వరకు వస్తుందని అంచనా వేశారు. తీరా ఖజానాకు ఆదాయమేమోగానీ సదరు ఎమ్మెల్యే జేబుల్లోకి మాత్రం కోట్లలో డబ్బు చేరింది. ఇది కాకుండా ఏజెన్సీని ఆనుకుని ఉన్న వందల ఎకరాల్లో ఉన్న రెండు చెరువుల్లో మట్టి తవ్వకాలను అనుచరులకు కట్టబెట్టి ఇందులోను రెండుచేతులా సంపాదించాడు.

కోట్లు కురిపించిన క్వారీలు..

ఈ నియోజకవర్గం రాష్ట్రంలోనే మెటల్ క్వారీలు, పిక్కరాయికి పెట్టింది పేరు. పోర్టు, హార్బర్, నేవల్ బేస్‌కు లక్షల టన్నుల బండరాళ్లు ఇక్కడి క్వారీలనుంచే వెళ్తాయి. ఇది కాకుండా జిల్లాతోపాటు చుట్టుపక్కల అనేక ప్రాంతాలకు రహదారులు, ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి పిక్కరాయి కూడా ఈ నియోజకవర్గంలోని క్వారీల నుంచే తరలుతోంది. స్టోన్‌క్రషర్లు వందల్లో ఇక్కడున్నాయి. ఇవన్నీ సదరు ఎమ్మెల్యేలకు బంగారు బాతుగుడ్లుగా మారాయి. నియోజకవర్గంలో క్వారీ ఓనర్లు, లీజుదారులు నెలనెలా లక్షల్లో సదరు ఎమ్మెల్యేకు చెల్లింపులు చేస్తున్నారు. ముడుపులు ఇవ్వకుంటే క్వారీల్లో తవ్వకాలు నిలిపివేయించడం ఆయన ప్రత్యేకత. ఇదికాకుండా స్వయంగా బంధువులను రంగంలోకి దించి అనధికారిక క్వారీలు తవ్వించి అందులో కోట్లు కొల్లగొట్టారు. ముఖ్యంగా నియోజకవర్గం పరిధిలోని కొన్ని గ్రామాల్లో నల్లమెటల్ క్వారీల్లో తవ్విన రాళ్లకు టన్నుకు రూ.25 చొప్పున రేటు కట్టి పిండేశారు. ఇక్కడి నుంచి వేరే జిల్లాల్లోని పోర్టు పనులు నిమిత్తం పెద్దపెద్ద బండరాళ్లను తరలించే సమయంలో టన్నుకు రూ.25 చొప్పున వసూలు చేసేవారు. పిక్కరాయితో వెళ్లే 40 టన్నుల లారీకి వెయ్యి చొప్పున మామూళ్లు వసూలు చేస్తున్నారు. ఓ వ్యాపారికి లేటరైట్ నిల్వ కోసం ప్రభుత్వ భూములను లీజుకు ఇచ్చి కోట్లలో సంపాదించారు. ఒకరకంగా చెప్పాలంటే ఈ నాలుగున్నరేళ్లలో మైనింగ్‌లో రూ.30కోట్లకుపైగానే దర్జాగా సంపాదించారు.

> నియోజకవర్గంలో హైవేను ఆనుకుని ఉన్న ఓ మండలంలో ఓ వ్యాపారికి 62 ఎకరాలు భూమి ఉండేది. దీన్ని 30ఏళ్ల కిందట స్థానికులు ఆక్రమించుకుని సాగుచేసుకునేవారు. పేదల కోసం ఇంటి స్థలాలు సేకరిస్తున్న సమయంలో.. స్థానికులను బెదరగొట్టి ఆ నేత వారిని ఖాళీ చేయించారు. సదరు వ్యాపారి భూమిని పేదల ఇళ్లస్థలాలకు ఎకరం రూ.43లక్షల చొప్పున ప్రభుత్వానికి అమ్ముకుని.. వ్యాపారికి మాత్రం ఎకరానికి పది లక్షలు చొప్పున ఇచ్చాడు. పోయిన భూమికి దక్కిందే దక్కుదల అనుకుని ఆ వ్యాపారి మౌనంగా ఉన్నాడు.

'పెద్దోడిని' చేసిన పేదల ఇళ్ల స్థలాలు..

పేదల ఇళ్లస్థలాల పథకం ద్వారా పేదలకు జరిగిన లబ్ధి కంటే సదరు ఎమ్మెల్యే పిండుకున్నదే ఎక్కువ. నియోజకవర్గంలో హైవేను ఆనుకుని ఉన్న ఓ మండలంలో ఓ వ్యాపారికి 62 ఎకరాలు భూమి ఉండేది. దీన్ని 30ఏళ్ల కిందట స్థానికులు లాక్కుని సాగు చేసుకునే వారు. సదరు ఎమ్మెల్యే వీరిని బెదిరించి ఖాళీ చేయించి సదరు వ్యాపారి భూమిని పేదల ఇళ్లస్థలాలకు రూ.43లక్షల చొప్పున విక్రయించేశాడు. ఇందులో ఎకరాకు రూ.10లక్షల చొప్పున ఆ వ్యాపారికి చెల్లించాడు. పోయిన భూమికి కనీసం ఎకరాకు రూ.10లక్షలు రావడంతో ఆ వ్యాపారి కూడా మౌనంగా ఉన్నాడు. అడవిలో ఎకరం రూ.3లక్షలు కూడా చేయని మూడు ఎకరాల భూమిని రూ.25లక్షల చొప్పున ప్రభుత్వంతో కొనుగోలు చేయించారు. అసలు యజమానులకు ఎకరాకు రూ.10లక్షల చొప్పున ఇచ్చి మిగిలింది సదరు ఎమ్మెల్యే కాజేశాడు. ఈనం భూములు సెటిల్‌మెంట్ పేరుతో లక్షల్లో మింగేశాడు. హైవేను ఆనుకుని ఉన్న ఓ భారీ ఇళ్ల స్థలాల లేఅవుట్‌లో రెండు వందల సైట్లను సదరు నేత బహిరంగ మార్కెట్ రేటుకు విక్రయించి కోట్లు కొల్లగొట్టాడు. ఒకరకంగా చెప్పాలంటే పేదల ఇళ్ల స్థలాల ముసుగులో తక్కువ రేటుకు ముందే భూములు కొని, వాటిని మూడింతలకు ప్రభుత్వానికి అంటగట్టి మొత్తం రూ.6కోట్ల వరకు సంపాదించారు.

హాయిగా హైవే ఆదాయం..

నియోజకవర్గంలో ఎన్-16హైవే ఆయనకు కాసులు పండించినంతగా ఎవరికీ పండించలేదు. ఇక్కడ కొన్ని ముఠాలు ఇతర రాష్ట్రాలనుంచి వచ్చే లారీలనుంచి ఆయిల్, ఇనుము తక్కువ ధరకు కొట్టేసి తిరిగి దుకాణాలకు విక్రయిస్తాయి. ఈ ముఠాలకు ఇబ్బంది లేకుండా సదరు ఎమ్మెల్యే వారితో నెలకు రూ.10లక్షలకు బేరం కుదుర్చుకున్నారు. ఒడిశా నుంచి ఇక్కడకు కొంతమంది గుట్కా తెచ్చి గ్రామాలు, ఏజెన్సీలకు పంపుతారు. వీరినుంచి సదరు ఎమ్మెల్యే నెల నెలాల మామూళ్లు పిండేస్తున్నారు. పేకాట డెన్‌ల రూపంలో వారాంతాల్లో లక్షల్లో సంపాదిస్తున్నారు. అయనకు సహకరించి ఏకంగా ఓ ముగ్గురు సీఐలు అడ్డంగా దొరికిపోయి దెబ్బతిన్నారు. ఇలా పోగేసిన సొమ్ములతో హైవేను ఆనుకుని ఓ భారీ గోడౌన్‌ను సదరు ఎమ్మెల్యే రూ.8కోట్లకు కొనుగోలు చేశారని చెబుతున్నారు.



ఆ దేవుని కంటే ఈయనకే ఆదాయం ఎక్కువ

నియోజకవర్గం పరిధిలోకి వచ్చే ప్రముఖ దేవస్థానం సదరు ఎమ్మెల్యేకు నిత్యం కాసులు కురిపిస్తూనే ఉంది. ఆ దేవస్థానంలో కల్యాణాలు, వ్రతాలకు వ్రత పరోహితులను దేవస్థానం కమీషన్ ప్రాతిపదికపై నియమించుకుంది. దేవస్థానానికి వచ్చే వ్రత టిక్కెట్ ఆదాయంలో వీరికి కమీషన్ ఇస్తుంది. ఇలా 40మంది వరకు వ్రత పురోహితులను నియమించగా, ఎమ్మెల్యే ఒక్కొక్కరినుంచి రూ.10లక్షల వరకు వసూలు చేశారు. ప్రసాదం విభాగం, గార్డెన్, బస్సు కండెక్టర్లు, కేశఖండన, గోశాల తదితర విభాగాల్లో దేవస్థానం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను నియమించుకుంది. వీరినుంచి ఒక్కొక్కరి వద్ద రూ.5లక్షల వరకు ఎమ్మెల్యే పిండేశారు. సరుకులు సరఫరా చేసే కాంట్రాక్టర్లనుంచి కూడా ఆ ఎమ్మెల్యే కమీషన్లు పిండేశారు. ఇటీవల ఆలయ ఈవో ఆ ఎమ్మెల్యే ఆదాయానికి గండికొట్టడంతో కొందరు జిల్లా ఎమ్మెల్యేల నుంచి సంతకాలు సేకరించి సీఎంకు ఫిర్యాదు చేసి ఆ ఈవోను బదిలీ చేయించేశారు.

అవసరమైతే ఆర్టీసీ డ్రైవర్లతో నడిపిద్దాం..!

▸▸ 108, 104 సేవలు ఆగడానికి వీల్లేదు

▸▸ సిబ్బంది సమ్మె నోటీసులతో జగన్ సర్కారు యోచన

అమరావతి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు అంగన్వాడీలు, సర్వశిక్ష సిబ్బంది, మున్సిపల్ కార్మికుల సమ్మెతో ఉక్కిరిబిక్కిరవుతున్న జగన్ సర్కారు.. తాజాగా 108 అంబులెన్స్, 104 ఉద్యోగులు కూడా సమ్మె నోటీసులివ్వడంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. 108 వంటి ఎమర్జెన్సీ సేవలు నిలిచిపోతే ప్రభుత్వం ప్రతిష్ఠ దిగజారుగుతుంది. అత్యవసర సేవలకూ తీవ్ర అంతరాయం ఏర్పడి.. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. అందుకే అవసరమైతే ఆర్టీసీ డ్రైవర్లతోనైనా 108 అంబులెన్స్‌లు నడిపించాలనే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. సమ్మె నోటీసులు అందగానే ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ అధికారులు మంగళవారం ఉదయం ఆగమేఘాలమీద అత్యవసర సమావేశం నిర్వహించారు. 108 ఉద్యోగుల జీతాలు మొత్తం క్లియర్ చేయాలని అరబిందో సంస్థను ఆదేశించారు. తమకు ప్రభుత్వం నుంచి 5 నెలలుగా బిల్లులు రావడం లేదని ఆ సంస్థ సమాధానమిచ్చింది. ఈ విషయాన్ని ట్రస్ట్ అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లగా.. జగన్ సర్కారు మంగళవారం మధ్యాహ్నానికి మూడు నెలల జీతాల బిల్లులు క్లియర్ చేసింది. అనంతరం జరిగిన చర్చల్లో 108 ఉద్యోగులతో ప్రభుత్వానికి సంబంధం లేదు, కాబట్టి సర్వీస్‌లకు ఎలాంటి అంతరాయం కలిగినా అరబిందోపై చర్యలు తీసుకుంటామని అధికారులు గట్టిగానే హెచ్చరించారు. ప్రభుత్వం 108 అంబులెన్స్‌లను ప్రైవేటు సంస్థ ద్వారా నిర్వహిస్తోంది కాబట్టి.. ఆ సిబ్బందిని ప్రైవేటు ఉద్యోగులుగానే పరిగణిస్తామని తేల్చిచెప్పారు. ఒకవేళ వారు సమ్మె చేసినా ఎట్టి పరిస్థితుల్లోనూ 108 సేవలకు బ్రేక్ పడకూడదని ఆదేశించారు. అవసరమైతే పైలెట్ స్థానంలో ఆర్టీసీ డ్రైవర్లను, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ల(ఈఎంటీ) స్థానంలో ఎంఎల్‌హెచ్‌పీలను నియమించి అంబులెన్స్‌లు నడిపించాలని నిర్ణయించారు. మరోవైపు 108 ఉద్యోగుల డిమాండ్లలో ఒక్క జీతాల అంశాన్ని తప్ప మిగిలిన ఏ డిమాండ్‌నూ పరిష్కరించే పరిస్థితుల్లో ప్రభుత్వం లేదు. జీతాలు, బోనస్‌లు, ఇతర విషయాలన్నీ అరబిందో సంస్థతో ఉద్యోగులు తేల్చుకోవాల్సి ఉంటుందని అధికారులు చర్చించుకున్నారు. 104 ఉద్యోగులకు కూడా ఇవే నిబంధనలు వర్తిస్తాయని అధికారులు భావిస్తున్నారు. ఏదేమైనా 108 ఉద్యోగులు ప్రభుత్వ సేవకులే కాదన్న ధోరణిలో జగన్ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ అధికారులు ప్రభుత్వానికి దాదాపు ఇదే రిపోర్టు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. మరి దీనిపై 108 అంబులెన్స్ ఉద్యోగులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.

వైసీపీ పాలనలో వ్యవస్థలు నిర్వీర్యం

▸▸ కార్మికులు సమ్మె చేస్తున్నా పట్టదా..?: బాలకృష్ణ

హిందూపురం, జనవరి 9: వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికులు, అంగన్వాడీల దీక్షా శిబిరాలను మంగళవారం ఆయన సందర్శించారు. అక్కడ ఆయన మాట్లాడుతూ, కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. తెల్లవారకు ముందు నుంచి సూర్యుడు అస్తమించేదాకా పారిశుధ్య కార్మికులు వీధుల్లో ఉంటారని, అలాంటి వారికి ఇచ్చిన హామీని ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం అంగన్వాడీల దీక్షా శిబిరంలో కూర్చుని సంఘీభావం తెలిపిన ఆయన రాష్ట్ర వ్యాప్తంగా 29 రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తున్నా ఈ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.



అనంతపురం నగరంలో కార్మికుల ర్యాలీ



ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో అంగన్వాడీల నిరసన ర్యాలీ



విజయవాడలో మంగళవారం మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న మునిసిపల్ కార్మికులు

భగ్గుమన్న బెజవాడ

▸▸ ఆందోళనకు దిగిన ఉపాధ్యాయులు

▸▸ ఎక్కడికక్కడ అడ్డుకుని అరెస్టు చేసిన పోలీసులు



విజయవాడలో ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

విజయవాడ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): విజయవాడ ధర్నా చౌక్ మంగళవారం రణరంగాన్ని తలపించింది. ఉపాధ్యాయులకు పీఆర్సీ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో జింఖానా గ్రౌండ్స్‌లో 36గంటల ధర్నా చేపట్టాలని నిర్ణయించారు. దీనికి పోలీసులు అనుమతి నిరాకరించారు. అయినా 26జిల్లాల నుంచి ఉపాధ్యాయులు తరలివచ్చారు. కొంతమంది టీచర్లు సోమవారం రాత్రికే విజయవాడ చేరుకుని యూటీఎఫ్ హోంలో, బంధువుల ఇళ్లలో తలదాచుకున్నారు. ధర్నా నేపథ్యంలో జింఖానా గ్రౌండ్స్, ధర్నాచౌక్‌కు వెళ్లే అన్ని మార్గాలను పోలీసులు బారికేడ్లతో మూసివేశారు. ట్రాఫిక్‌ను మళ్లించారు. జింఖానా గ్రౌండ్స్‌కు వెళ్తున్న సుమారు 300మంది ఉపాధ్యాయులను అరెస్టు చేశారు. అనంతరం పూచీకత్తుపై విడుదల చేశారు. చేశారు. మరోవైపు అంగన్వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగానికి నిరసనగా సీఐటీయు, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ కార్మిక సంఘాలు జైల్‌భరో కార్యక్రమాన్ని నిర్వహించాయి. కార్మికులు ర్యాలీగా వెళ్తుండగా పోలీసులు అడ్డుకుని, అరెస్టు చేశారు. కాగా, ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన రూ.18వేల కోట్ల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ప్రజాస్వామ్య పద్ధతిలో చేస్తున్న పోరాటంపై నిర్బంధాన్ని ప్రయోగించడాన్ని యూటీఎఫ్ తీవ్రంగా ఖండించింది. దీక్షలకు అనుమతి ఇవ్వకుండా.. ఉద్యోగులు, ఉపాధ్యాయులను నిర్బంధించడం సరికాదని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్. ప్రసాద్ పేర్కొన్నారు.

మంత్రి దిష్టిబొమ్మతో శవయాత్ర

కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పట్టణంలోని ఎంబీ చర్చి నుంచి సోమప్ప సర్కిల్ వరకు మున్సిపల్ కార్మికులు మంత్రి ఆదిమూలపు సురేశ్ దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించారు.

అరెస్టు చేసుకోండి

▸▸ అంగన్వాడీల జైల్‌భరో.. ఉద్రిక్తం

▸▸ అండగా కార్మిక, ప్రజా సంఘాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

నిన్నటి వరకూ శిబిరాలకే పరిమితమైన అంగన్వాడీల ఆందోళన రోడ్డెక్కింది. సమ్మెను నిషేధించిన ప్రభుత్వం.. షోకాజ్ నోటీసులు ఇస్తుండటంతో ఆగ్రహోదగ్రులైన అంగన్వాడీ కార్యకర్తలు మంగళవారం అపర కాళికలయ్యారు. ప్రధాన రోడ్లు.. పోలీసు స్టేషన్ల వద్ద బైఠాయించి ఎస్మా చట్టాన్ని ఎత్తివేయాలని నినదించారు. వారికి మద్దతుగా కార్మిక సంఘాలు జైల్‌భరో ఆందోళనకు పిలుపునివ్వడంతో రోజంతా రాష్ట్రంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నంద్యాలలో దీక్షా శిబిరం నుంచి వందలాది మంది అంగన్వాడీలు జైల్‌భరో కార్యక్రమాన్ని చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో పోలీసులు అరెస్టు చేసి టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అంగన్‌వాడీలు పోలీస్ స్టేషన్ వద్దే బైఠాయించి, 2 గంటలపాటు ఆందోళన చేయడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ప్రకాశం జిల్లా ఒంగోలు కలెక్టరేట్ వద్ద అంగన్వాడీలు 24 గంటల నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. ప్రజాసంఘాల రాస్తారోకోతో ట్రాఫిక్ పెద్దఎత్తున నిలిచిపోవటంతో వారందరినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సమయంలో తోపులాట జరిగింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో వేలాది మంది అంగన్వాడీ వర్కర్లు, మున్సిపల్ కార్మికులు జైల్‌భరో నిర్వహించారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, అంగన్వాడీ యూనియన్ల నాయకులు పోలీస్ స్టేషన్‌లోకి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు అరెస్టు చేశారు.



కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో మంత్రి ఆదిమూలపు సురేశ్ దిష్టిబొమ్మతో శవయాత్ర చేస్తున్న మున్సిపల్ కార్మికులు

పార్వతీపురంలో నిరవధిక దీక్షను కొనసాగించారు. రాత్రికి శిబిరం వద్దే చలిలో పడుకున్నారు. తిరుపతి జిల్లావ్యాప్తంగా అంగన్వాడీ సిబ్బంది జైల్‌భరో కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీలతోపాటు కార్మిక సంఘాల నాయకులనూ పోలీసులు అరెస్టు చేసి ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్కడ స్టేషన్ ఆవరణలోనే అంగన్వాడీలు బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గూడూరు, వెంకటగిరి నాయుడుపేట, సత్యవేడులోనూ నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. చంద్రగిరి, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, పుత్తూరు, పిచ్చాటూరు తదితర చోట్ల కూడా జైల్‌భరో కార్యక్రమం నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఆర్డీవో కార్యాలయంలోకి అధికారులను వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద రోడ్డుపై బైఠాయించడంతో అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో రహదారిపై అంగన్‌వాడీలు రెండు గంటలపాటు బైఠాయించారు. ఉంగుటూరులో శిబిరాన్ని ఎమ్మెల్సీ ఐవీ సందర్శించి మద్దతు తెలిపారు. నెల్లూరులో అంగన్‌వాడీలకు మద్దతుగా ప్రజాసంఘాలు భారీ ప్రదర్శన నిర్వహించాయి. వీఆర్సీ కూడలిలో రాస్తారోకోతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో పోలీసులు అరెస్టు చేసి వాహనాలలో ఎక్కిస్తుండగా కార్యకర్తలు ప్రతిఘటించి పోలీసు వాహనాలకు అడ్డుగా కూర్చొన్నారు. దీంతో చేసేదిలేక నాయకులను విడిచిపెట్టారు. తిరిగి అక్కడి నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శనగా వెళ్లి అంగన్‌వాడీల దీక్షకు మద్దతు ప్రకటించారు. శ్రీకాకుళంలోనూ జైల్‌భరో నిర్వహించగా, నాయకులను అరెస్టు చేసి పోలీసుస్టేషనుకు తరలించారు. కడపలో మానవహారం, పోరుమామిళ్లలో జైల్‌భరో నిర్వహించారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఒంటికాలిపై నిరసన తెలిపారు.

మంత్రి బొత్స ఇంటి ముట్టడి

సమగ్రశిక్ష ఉద్యోగులు మంగళవారం విజయనగరంలోని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఇంటిని ముట్టడించారు. ఆయన ఇంటికెదురుగా రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం చాలా దారుణమన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

చేతకాక... కక్ష సాధింపు!

▸▸ అంగన్వాడీల ఇళ్లకు నోటీసులు

అమరావతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): తన అసమర్థ, చేతగాని పరిపాలనను కప్పిపుచ్చుకోవడానికి జగన్ సర్కార్ అంగన్వాడీలపై కక్ష పూనింది. ఇచ్చిన హామీలు నెరవేర్చలేక రోడ్డెక్కిన అంగన్వాడీలపై ఎస్మా పేరుతో బెదిరింపులకు దిగింది. అంగన్వాడీలకు నోటీసులు జారీచేసే ప్రక్రియను మంగళవారం నుంచి చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలకు సీడీపీవోలు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నారు. వారు నివాసం ఉంటున్న అడ్రస్‌కు రిజిస్టర్ పోస్టు ద్వారా పంపడం, అంగన్వాడీ కేంద్రాల గోడలకు అంటించడం, అంగన్వాడీల ఇంటి గోడలకు అంటించడం అనే మూడు విధాలుగా నోటీసులు సర్వ్ చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే షోకాజు నోటీసులకు బెదిరేదే లేదని అంగన్వాడీలు తెగేసి చెబుతున్నారు.

సమ్మె విచ్ఛిన్నానికి ప్రభుత్వం యత్నం

ప్రభుత్వం అంగన్వాడీపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా పలు కార్మిక, ప్రజా సంఘాల నేతలు జైల్‌భరో నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నా చేశారు. వారిని పోలీసులు స్టేషన్లకు తరలించారు. కాగా, అంగన్వాడీల సమ్మె విచ్ఛిన్నానికి ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. వారిలో వైసీపీ సానుభూతిపరులు, వైసీపీ నేతల కుటుంబ సభ్యులు ఎంతమంది ఉన్నారో గుర్తించే పనిలో ఉంది. వీరిని విధుల్లోకి చేర్చడం ద్వారా సమ్మెను బలహీనపర్చాలనే ఎత్తుగడలో ప్రభుత్వం ఉందని తెలుస్తోంది.



అల్లూరి జిల్లా ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ సెంటర్‌కు షోకాజ్ నోటీసును అతికిస్తున్న అధికారులు

సమగ్ర శిక్ష ఉద్యోగి మృతితో ఉద్రిక్తత



వాసుదేవరావు (ఫైల్)

అనకాపల్లి రూరల్, జనవరి 9: నిరవధిక సమ్మెలో పాల్గొంటున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగి మృతి అనకాపల్లిలో మంగళవారం ఉద్రిక్తతకు దారితీసింది. ఆయన మృతదేహంతో కుటుంబ సభ్యులు, ఉద్యోగులు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ఎదుట ఐదు గంటలపాటు ఆందోళన చేశారు. వివరాలిలా ఉన్నాయి. మునగపాక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న జడ్డు వాసుదేవరావు(ఎస్ఎస్ఏ ఉద్యోగి) సమ్మెలో భాగంగా గతనెల 23న అనకాపల్లి మండలం కొండకొప్పాకలోని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట దీక్షా శిబిరంలో కూర్చున్నారు. ఆ సమయంలో ఒక్కసారిగా కుప్పకూలడంతో వెంటనే ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఆయనకు బ్రెయిన్ స్ట్రోక్ వచ్చినట్టు వైద్యులు గుర్తించి శస్త్ర చికిత్స చేశారు. అప్పటి నుంచి ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్న వాసుదేవరావు మంగళవారం మృతిచెందారు. ఆయన మృతదేహాన్ని కొండకొప్పాకలో సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన దీక్షా శిబిరం వద్దకు తీసుకొచ్చారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుమారు 5గంటలపాటు ఆందోళన చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. సమాచారం తెలుసుకున్న మంత్రి బొత్స స్పందించి తక్షణం రూ.2.25 లక్షలు ఇవ్వాల్సిందిగా జిల్లా అధికారులకు ఆదేశాలిచ్చారని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ వివరించారు. మరొక రూ.10 లక్షలు కుటుంబానికి ఇస్తామని, వాసుదేవరావు భార్యకు సమగ్ర శిక్షలో ఉద్యోగం ఇస్తామని బొత్స హామీ ఇచ్చినట్టు పీలా తెలిపారు. ఆ తర్వాత ఆందోళన విరమించి, మృతదేహాన్ని తరలించారు.

సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ధర్నా

అమరావతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పదోన్నతులకు సంబంధించి మధ్యస్థాయి అధికారుల కమిటీని రద్దు చేసి, సీనియర్ ఐఏఎస్ అధికారులతో కమిటీ వేయాలని, ఓసీ, బీసీ ఉద్యోగాలపై ఉన్న అనుమానాలను నివృత్తి చేసి, సచివాలయ ఉద్యోగులంతా స్నేహపూరిత వాతావరణంలో పనిచేసే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. సీఎస్‌కు వినతి పత్రం ఇవ్వడానికి ఒకటో బ్లాక్ వద్దకు ర్యాలీగా వెళ్లిన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులను భద్రతా సిబ్బంది అడ్డగించారు. వారు అక్కడే బైఠాయించడంతో సంఘ నాయకుల్ని మాత్రం అనుమతించారు. ఏపీ సెక్రటేరియట్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్‌కుమార్, నారాయణస్వామినాయక్, సుజాత, సుబ్బారావు, వెంకటేష్, మాధవ కిరణ్, నరేంద్ర, విల్సన్, అనిల్ పాల్గొన్నారు.

ఓపీఎస్ కోసం సీపీఎస్ ఉద్యోగుల ఆందోళన

సీపీఎస్ రద్దు చేసి, ఓపీఎస్ అమలు చేయాలని, ఉద్యోగులకు 2018 నుంచి రావాల్సిన డీఏ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సచివాలయం, అసెంబ్లీ సీపీఎస్ ఉద్యోగులు ఆందోళనకు దిగారు. మంగళవారం సీపీఎస్ ఉద్యోగ సంఘ ప్రతినిధులు ఐదో బ్లాక్ నుంచి మొదటి బ్లాక్ వరకు ప్లకార్డులు పట్టుకుని, నినాదాలు చేస్తూ ర్యాలీ జరిపారు. భద్రతా సిబ్బంది అడ్డుకోవడంతో రెండో బ్లాక్ వద్ద బైఠాయించి, ఆందోళనకు దిగారు. అనంతరం సీఎస్‌కు అందజేశారు. డిమాండ్ల సాధన కోసం దశల వారీగా ఆందోళనలు చేపడతామని సీపీఎస్ ఉద్యోగ సంఘ అధ్యక్షుడు కోట్ల రాజేశ్, ఉపాధ్యక్షుడు నాపా ప్రసాద్ చెప్పారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఎవరి కోసం..?

- అనధికారికంగా బస్ షెల్టర్ తొలగింపు
- వైసీపీ నేత స్థలం కోసమా.. వెలంపల్లి కార్యాలయానికా..!
- ఎన్టీఆర్ సుజల స్రవంతి వాటర్ ప్లాంట్ తొలగింపునకూ యత్నాలు

స్థానిక డాబాకొట్ల సెంటర్‌లోని బస్‌షెల్టర్ తొలగింపు వ్యవహారం వివాదాస్పదంగా మారింది. అధికారుల అనుమతి లేకుండా ప్రయాణికులకు ఉపయోగపడే బస్ షెల్టర్‌ను తొలగించడం షెల్టర్ వెనకాలే వైసీపీ నేతకు చెందిన స్థలం ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. వైసీపీ నేత స్థలానికి ప్రధాన రహదారిని అనుసంధానించేందుకు తొలగించారని ఆరోపణలున్నాయి. ప్రజలకు ఉపయోగపడే ఈ షెల్టర్‌ను అధికార పార్టీ నేత కోసం తొలగించడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు తమకేం తెలీదని చెప్పడం కొసమెరుపు. మరోవైపు పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి కార్యాలయం కోసమేనని మరో ప్రచారం జరుగుతోంది.



వైసీపీ నేత స్థలం ఎదురుగా తొలగించిన బస్ షెల్టర్

అజిత్‌సింగ్‌నగర్, జనవరి 9: స్థానిక డాబా కొట్ల సెంటర్ వద్ద గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో బస్ బేను ఏర్పాటు చేశారు. అనంతరం ఇందులో ప్రయాణికుల సౌకర్యార్థం రూ.లక్షలు వెచ్చించి బస్ షెల్టర్లను నిర్మించారు. పాయకాపురం, నున్న, నూజివీడు, విస్సన్నపేట వైపు వెళ్లే ప్రయాణికులు వినియోగించుకుంటున్నారు. అయితే నిత్యం వేలాది మంది వేచి ఉండే బస్ షెల్టర్ 4 రోజుల క్రితం తొలగించారు. అందరూ ఇది అధికారికంగా తొలగించబడిందని మళ్లీ షెల్టర్ ఏర్పాటు చేస్తారని భావించారు. కానీ లోతుగా అధ్యయనం చేస్తే బస్ షెల్టర్ తొలగింపు వెనుక చాలా పెద్ద కథే నడిచినట్టు తెలుస్తుంది.

వైసీపీ నేత సౌకర్యం కోసమేనా..!

డాబాకొట్ల సెంటర్‌లో బస్ షెల్టర్ తొలగింపు వ్యవహారాన్ని పరిశీలిస్తే సెంట్రల్‌కు చెందిన వైసీపీ నేత, డిప్యూటీ మేయర్ భర్త సౌకర్యం కోసమే తొలగించినట్టు తెలుస్తుంది. తొలగించిన బస్ షెల్టర్ వెనకాలే సదరు నేత స్థలం ఉండటం ఆరోపణలకు బలం చేకూరుతుంది. రెండేళ్ల క్రితం సదరు నేత బస్ షెల్టర్ వెనుకాల 177 గజాల సలాన్ని కొనుగోలు చేశాడు. దీనికి కేవలం పదడుగుల డొంక రోడ్డు మాత్రమే ఉంది. బస్ షెల్టర్ తొలగింపుతో ఆయనగారి స్థలానికి నూజివీడు ప్రధాన రహదారి అనుసంధానమైంది. దీంతో డొంక రోడ్డులోని వైసీపీ నేత స్థలానికి రహదారి ఏర్పడినట్టైంది. ఇదంతా అనధికారికంగా జరగటం విశేషం.

ఎన్టీఆర్ సుజల స్రవంతి వాటర్ ప్లాంట్‌పై కన్ను

వైసీపీ నేత స్థలానికి ఒక వైపు ఉన్న బస్ షెల్టర్‌ను తొలగించగా మరోవైపు ఎన్టీఆర్ సుజల స్రవంతి వాటర్ ప్లాంట్‌పై కన్ను పడినట్టు తెలుస్తుంది. బస్ షెల్టర్‌ను తొలగించినట్టే అనధికారికంగా రాత్రికి రాత్రే వాటర్ ప్లాంట్ తొలగించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. గత ప్రభుత్వ హయాంలో సాధారణ ప్రజలకు కూడా రూ.2కే మినరల్ వాటర్ అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ప్లాంట్ భవనాన్ని తొలగించి తన స్థలానికి మార్గం సుగుమం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తుంది.

వెల్లంపల్లి కార్యాలయానికేనని ప్రచారం

వైసీపీ నేత స్థలానికి అడ్డుగా ఉన్న ప్రభుత్వ ఆస్తుల తొలగింపు వ్యవహారమంతా వెల్లంపల్లి కోసమేనని మరో ప్రచారం జరుగుతోంది. ఇటీవల పశ్చిమ ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్‌ను వైసీపీ సెంట్రల్‌కు ఇన్‌చార్జ్‌గా నియమించడంతో ఆయన కార్యాలయ అన్వేషణలో ఉన్నారు. వెల్లంపల్లి కార్యాలయం ఏర్పాటు కోసమే ప్రజల ఆస్తులను ధ్వంసం చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. వెల్లంపల్లి ఇంకా సెంట్రల్ బాధ్యతలు పూర్తిగా తీసుకోకుండానే పెద్ద ఎత్తున అరాచకాలకు పాల్పడటంపై విమర్శలు వినిపిస్తున్నాయి.



అపరిశుభ్రానికి నెలవు

● విజ్జీ స్విమ్మింగ్ పూల్‌లో పచ్చగా మారుతున్న నీరు ● కోట్లతో ఆధునీకరించినా తీసికట్టుగానే..

విజయవాడ స్పోర్ట్సు: నగరంలోని గాంధీనగర్‌లోని సర్ విజ్జీ వీఎంసీ స్విమ్మింగ్ పూల్ నిర్వహణ నానాటికీ తీసికట్టుగా మారుతోంది. ఏడాదిన్నర క్రితం రూ.కోట్ల వ్యయంతో ఆధునీకరించినా పనుల్లో నాణ్యత లోపం వలన పూల్ వినియోగం అంతంత మాత్రంగానే ఉంది. గతేడాది అక్టోబర్ నుంచి 50 మీటర్ల మెయిన్ స్విమ్మింగ్ పూల్‌లో నీరంతా పచ్చగా మారిపోయి అపరిశుభ్రంగా ఉంటోంది. క్రీడాకారులు, నిరంతరం శిక్షణకు వచ్చే 200 మంది పెద్దలు, చిన్నారులు స్విమ్మింగ్‌కు దూరంగా ఉండాల్సిన దుస్థితి నెలకొంది. ఫీజుల రూపేణా వీఎంసీకి ఆదాయం సమకూరుతోంది. పలు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో కొద్దిరోజుల క్రితం నీటిని మార్చినా ఉపయోగం లేకుండా పోయింది. క్లోరిన్ గ్యాస్ వినియోగంతో పూల్ పరిశుభ్రంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. కొద్దినెలలు క్రితం గ్యాస్ వినియోగం మోతాదుకు మించి వాడటంతో స్విమ్మర్లు అస్వస్థతకు గురయ్యారు. దీంతో కెమికల్స్‌ను వినియోగించే పూల్‌ను శుభ్రం చేస్తున్నారు. ఆధునీకరణ పనుల్లోని నాణ్యతాలోపం వల్లే ఈ దుస్థితి నెలకొందన్న ఆరోపణలున్నాయి. వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ పూల్‌ను విజిట్ చేసి వాస్తవాలను అధ్యయనం చేసి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై వీఎంసీ స్పోర్ట్సు అధికారి, రీజనల్ ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా కొద్ది రోజుల క్రితం స్విమ్మింగ్ పూల్ లో నీరంతా పచ్చగా మారిపోయిందని, వారం పోయాక మళ్లీ క్షేత్రస్థాయిలో పరిశీలించి మరమ్మతులు చేసి వినియోగంలోకి తెస్తామన్నారు.

బీజేవైఎం నిరాహారదీక్ష భగ్నం

● అధ్యక్షుడు వంశీ ఆసుపత్రికి తరలింపు

ధర్నాచౌక్: తక్షణమే జాబ్ క్యాలండర్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా వంశీకృష్ణ చేపట్టిన ఆమరణ నిరాహారదీక్షను పోలీసులు మంగళవారం భగ్నం చేశారు. పోలీసులు వంశీని ఆసుపత్రికి తరలించారు. ఏటా జనవరి 1న జాబ్ క్యాలండర్ అని, 2.30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని నమ్మించి రాష్ట్రంలోని నిరుద్యోగులను మోసం చేసిన సీఎం జగన్ జాబ్ క్యాలండర్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక జింఖానగ్రౌండ్స్‌లో అమరణ నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓట్ల కోసం హామీలిచ్చి ఐదేళ్లపాటు నిరుద్యోగులను మనోవేదనకు గురి చేశారని విమర్శించారు. నిరుద్యోగుల ఆత్మహత్యలకు సీఎం జగన్ బాధ్యత వహించాలన్నారు. ఆయనకు సీఎం గా ఇదే చివరి అవకాశమన్నారు.

డాల్ఫిన్ బార్ రోడ్డులో చోరీ

విద్యాధరపురం: డాల్ఫిన్ బార్ రోడ్డులోని ఓ ఇంట్లో బంగారు, వెండి, నగదు చోరీ జరిగినట్టు భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. భవానీపురం డాల్ఫిన్ బార్ రోడ్డులో అన్నా వెంకట నరసింహారావు కుటుంబసభ్యులతో ఉంటున్నాడు. ఇతడు, భార్య కుమారుడు వేర్వేరు షాపుల్లో పనిచేస్తుంటారు. ఈ నెల 5న ఉదయం అతడు, కుమారుడు పనుల కు వెళ్లగా భార్య గొల్లపూడిలో బంధువుల ఫంక్షన్‌కు వెళ్లింది. కుమారుడు శివ మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగులకొట్టి బీరువాలోని వస్తువులన్నీ కిందపడవేసి చెల్లాచెదురుగా ఉన్నాయి. బీరువాలో భద్రపరచిన సుమారు 90 గ్రాముల బంగారు ఆభరణాలు, 90 గ్రాముల వెండి వస్తువులు, రూ.18 వేల నగదు చోరీకి గురయ్యాయి. బాధితుడు నరసింహారావు ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు కేసును బయటకు తెలియనీయకుండా గోప్యంగా ఉంచారు.

రెండు బైకులు చోరీ

వేర్వేరు ప్రాంతాల్లో రెండు మోటార్ సైకిళ్ల చోరీకి గురయినట్టు భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం రెండు కేసులు నమోదయ్యాయి. గొల్లపూడి ఎస్ఎస్ఎస్ కాలనీలో బొర్రా రమేష్‌బాబు కుటుంబ సభ్యులతో ఉంటూ ఓ ప్రైవేట్ కంపెనీలో అకౌంటెంట్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 8న రాత్రి 10 గంటల కు తన బైకును ఇంటి ముందు పార్కింగ్ చేశాడు. మరుసటి రోజు ఉదయం చూడగా బైకు చోరీకి గురైంది. మరో సంఘటనలో మూలపాడుకు చెందిన కామసాని రమేష్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతను ఈ నెల 8న రాత్రి 7గంటలకు తన మోటార్ సైకిల్‌పై భవానీపురం పున్నమిఘాట్‌లో జరుగుతున్న ఎగ్జిబిషన్‌కు వెళ్లాడు. బైకు పార్కింగ్ చేసి లోపలకు వెళ్లాడు. ఆరోజు రాత్రి 10 గంటలకు బైకు వద్దకు వచ్చి చూడగా కనిపించలేదు. దీంతో బాధితులిరువురూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

11న ఖేలో ఇండియా వాలీబాల్ ఎంపికలు

విజయవాడస్పోర్ట్సు: తమిళనాడు రాష్ట్రం చెన్నై లో ఈ నెల 19 నుంచి 31 వరకు జరిగే 6వ ఎడిషన్ ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2024లో వాలీబాల్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర బాలుర జట్టు ఎంపికలను ఈ నెల 11న ఉదయం 9 గంటలకు నగరంలోని ఐ జీఎంసీ స్టేడియంలో చేపడతున్నట్టు శాప్ వీసీ, ఎం డీ ధ్యాన్‌చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికల్లో పాల్గొనే బాలురు 2005 జనవరి 1న లేదా ఆ తర్వాత జన్మించిన వారై ఉండాలని, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టుసైజు ఫొటో, మెట్రిక్యులేషన్ సర్టిఫికెట్‌తో పాటు రాష్ట్ర, జాతీయస్థాయిలో పాల్గొన్న సర్టిఫికెట్ల తో హాజరుకావాలన్నారు. ఎంపికలో పాల్గొనే వారికి టీఏ, డీఏ ఇవ్వబడవన్నారు.

సౌత్‌జోన్ క్రికెట్‌లో కేఆర్‌యూ జయకేతనం

చెన్నైలోని హిందూస్థాన్ వర్శిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న సౌత్‌జోన్ ఇంటర్ వర్శిటీ క్రికెట్ టోర్నీలో కృష్ణా వర్శిటీ టీమ్ తొలి విజయాన్ని నమోదు చేసిం ది. మంగళవారం 10 ఓవర్ల మ్యాచ్‌లో కాలసైంగం అకాడమీపై 22 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాట్‌పట్టిన కేఆర్‌యూ టీమ్ 10 ఓవర్లలో 80/7 పరుగులను చేసింది. బ్యాటర్స్ టీ.వరుణ్ సాత్విక్ 23 పరుగులతో అజేయంగా నిలిచాడు. 81 పరుగుల లక్ష్యంతో బరిలో దిగిన కాలసైంగం టీమ్ 10 ఓవర్లలో 6 వికెట్లను కోల్పోయి 57 పరుగులను మాత్రమే చేసింది.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

భవానీపురం: బీసీ, ఎస్సీ, మైనార్టీ ఎంప్లాయాస్ టీచర్స్, వర్కర్స్ ఆంధ్రప్రదేశ్ కార్యవర్గ సమావేశం తాడేపల్లిలోని పార్చ్యూన్ గ్రాండ్‌లో జేఏసీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవ చైర్మన్ మందారపు వెంకటరామయ్య అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో జేఏసీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా ఏపీ మౌలికసదుపాయాలు, పెట్టుబడుల శాఖ స్పెషల్ సెక్రటరీ టీఎస్ఎన్ మూర్తి, బి.విజయ్‌కుమార్, విశిష్ట అతిథిగా ఎపీఎఫ్‌డీసీ డైరెక్టర్ బీవీ రత్నం హాజరయ్యా రు. జేఏసీ రాష్ట్ర చైర్మన్ కేతా శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వీఏ.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఏపీలో అన్ని స్థానాలకు పోటీ: ఏటీపీపీ

గవర్నర్‌పేట: రానున్న ఎన్నికల్లో ఆల్ తెలుగు ప్రజా పార్టీ 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాలకు పోటీ చేస్తుందని పార్టీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె. శివభాగ్యారావు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయం లో మంగళవారం మీడియాతో మాట్లాడారు. స్టేట్ కన్వీనర్ నమ్మి అప్పారావు యాదవ్, వైస్ ప్రెసిడెంట్ కె.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ టెన్నిస్‌బాల్ క్రికెట్‌కు రిత్విక్ ఎంపిక



విజయవాడస్పోర్ట్సు, జనవరి 9: తమిళనాడు రాష్ట్రం సేలంలో ఈ నెల 20, 21న జరగనున్న అండర్-14 సౌత్‌జోన్ టెన్నిస్‌బాల్ క్రికెట్‌కు కృష్ణాజిల్లా నుంచి ఆంధ్రప్రదేశ్ జట్టుకు తల్లా రిత్విక్ ఎంపికయ్యాడు. ఉయ్యూరు శ్రీ విశ్వభారతి ఉన్నత పాఠశాలలో (స్టేట్ బోర్డు 9వ తరగతి) చదువుతున్న రిత్విక్ మహారాష్ట్రలో ఇటీవల జరిగిన జాతీయ టోర్నీలో చూపిన ప్రతిభ కారణంగా ఏపీ జట్టుకు ఎంపికయ్యాడు. రిత్విక్ ఎంపికపై ఏపీ టెన్నిస్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీ రంభ ప్రసాద్, జిల్లా సెక్రటరీ ఎం.గోపాలకృష్ణ అభినందించారు.


డీసీపీ విశాల్ గున్నీకి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

ఉపముఖ్యమంత్రి నారాయణస్వామిపై చర్యలు తీసుకోవాలి: కాంగ్రెస్

గవర్నర్‌పేట, జనవరి 9: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియాగాంధీ, మాజీ సీఎం వైఎస్ఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కె. నారాయణస్వామిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి బృందం డీసీపీ విశాల్ గున్నికి వినతిపత్రం అందజేసింది. పీసీసీ ఉపాధ్యక్షుడు వి. గుర్నాథం, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు నేతృత్వంలో కాంగ్రెస్ నేతలు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఏఐసీసీ సభ్యుడు ఖాజా మొహిద్దీన్, లీగల్ సెల్ రాష్ట్ర సెక్రటరీ కె.వరప్రసాద్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడు కటారి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అలరించిన గరికపాటి గాత్రకచేరీ



విజయవాడ కల్చరల్, జనవరి 9: బాల గాయకుడు గరికపాటి జగన్నాథ్ రామ్ గాత్ర కచేరీ ప్రేక్షకులను అలరించింది. స్వరఝరి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే నెల నెల సంగీత స్రవంతిలో భాగంగా మంగళవారం సత్యనారాయణపురం శృంగేరీ శారద పీఠం శివరామకృష్ణ క్షేత్రంలో కచేరీ నిర్వహించారు. నెరనమ్మితి-కానడరాగం-వర్ణంతో ప్రారంభించి శ్రీ మహాగణపతి-అఠాణ రాగం ఆదితాళంలో వినాయక స్తుతి చేశారు. శాంకరి నీరు-బెగడరాగం రూపకతాళంలో, విశ్వనాథం-నాటభరణంలో, కద్దానువారికి-తోడిరాగంలో, హరిదాసులు వెడలే-త్యాగరాజ కృతి మాధుర్యంగా ఆలపించి మంగళ కీర్తనతో ముగించారు. ఈ చిన్నారి గాత్రానికి వేదుల శ్రీకిరణ్‌పై మంగళగిరి శ్రీధర్ మృదంగంపై వాద్య సహకారం అందించారు. అనంతరం వీరిని నిర్వాహకులు మోదుమూడి సుధాకర్, అంజనీ అభినందించి సత్కరించారు.


గొల్లపూడి అట్కిన్సన్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నేషనల్ గ్రీన్ కోర్ రాష్ట్ర సంచాలకులు స్రవంతి, పీవో సత్యనారాయణ

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

● నేషనల్ గ్రీన్ కోర్ రాష్ట్ర సంచాలకులు స్రవంతి

విజయవాడ, జనవరి 9: పర్యావరణాన్ని పరిరక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నేషనల్ గ్రీన్ కోర్ రాష్ట్ర సంచాలకులు పి.స్రవంతి అన్నారు. విజయవాడ రూరల్ మండలంలోని గొల్లపూడిలోని అట్కిన్సన్, నున్నలోని కెనడీ స్కూల్స్‌ను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో పర్యావరణ విద్యను అమలు చేస్తున్నట్టు తెలిపారు. వాతావరణంలో వస్తున్న మార్పులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే మొక్కల పెంపకంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అట్కిన్సన్ ప్రిన్సిపాల్ రత్నకుమారి, నేషనల్ గ్రీన్ కోర్ ప్రాజెక్టు ఆఫీసర్ సత్యనారాయణ, క్లస్టర్ కో-ఆర్డినేటర్ షేక్ సాయిరున్నీసాబేగేమ్ పాల్గొన్నారు.

పద్మావతి ఘాట్ పార్కింగ్ టెండర్ ఖరారు

వన్‌టౌన్, జనవరి 9: వీఎంసీ ఆధ్వర్యంలోని పద్మావతి ఘాట్ పార్కింగ్ టెండర్‌ను కొత్తపేటకు చెందిన కాంట్రాక్టర్ ఫణుకు ఫణీంద్ర దూండీ ఏడాదికి రూ.12.05 లక్షలు చెల్లించేలా దక్కించుకున్నారు. మంగళవారం వీఎంసీ ఎస్టేట్ ఆఫీసర్ (ఈవో) టి.శ్రీనివాస్ తన కార్యాలయంలో పద్మావతి ఘాట్ పార్కింగ్ సెల్లార్ టెండర్‌కు వేలంపాట నిర్వహించారు. ఎనిమిది మంది టెండర్ ఫారాలు కొనుగోలు చేయగా నలుగురు పాల్గొన్నారు. మొదటిగా జరిగిన వేలంపాటలో ఐదుగురు పోటాపోటీగా రూ.10.30లక్షల వరకు పెంచుతూ పాడారు. ఈవో సీల్ టెండర్‌లో ఫణుకు ఫణీంద్ర దూండీ రూ.12.05 లక్షలు కోట్ చేశారు. దీంతో హెచ్చు ధర కోట్ చేసిన ఫణీంద్రకు టెండరు ఖరార్ చేశారు. గత ఏడాది రూ.6.66 లక్షల కంటే హెచ్చు ధర వచ్చింది. అయితే ఈ టెండర్‌ను పార్కింగ్ సమీపంలోని ఓ కాంట్రాక్టర్ దక్కించుకోవడానికి గట్టి ప్రయత్నం చేశారు. వేలంపాటలో ఎవరూ పాల్గొనకుండా చేసేందుకు ప్రయత్నించినప్పటికీ పాల్గొన్న కాంట్రాక్టర్లు పోటాపోటీగా పాట పెంచేశారు.

మండల న్యాయస్థానాలతో త్వరగా కేసుల పరిష్కారం

● రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ చలసాని



భూ హక్కు చట్టానికి వ్యతిరేకంగా బెజవాడ బార్ న్యాయవాదుల నిరసన దీక్ష

విజయవాడ లీగల్, జనవరి 9: రూ.లక్షల జీతాలు చెల్లించి ప్రతి మండలానికి ఒక టైట్లింగ్ ఆఫీసర్ నియమించే బదులు అదే స్థానంలో మండల న్యాయస్థానాలు, న్యాయమూర్తులను ఏర్పాటు చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేసినట్టయితే కేసులను త్వరగా పరిష్కరించేందుకు వీలుంటుందని రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ చలసాని అజయ్‌కుమార్ తెలిపారు. భూహక్కు చట్టం-2022కు వ్యతిరేకంగా బెజవాడ బార్ న్యాయవాదులు చేస్తున్న రిలే నిరసన దీక్షలు మంగళవారం నాటికి 20వ రోజుకు చేరాయి. మంగళవారం దీక్షలో డీవీ ప్రసాద్, కె.ఎస్.పరశురామ్‌సింగ్, పొందూరు శ్రీనివాస్, పి.సుప్రియ, సూర్రాతి ప్రసూన, ఎస్.జ్యోతి, కె.కమలకుమారి పాల్గొన్నారు. న్యాయవాదులకు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన అజయ్‌కుమార్ మాట్లాడుతూ భూ హక్కు చట్టం అమల్లోకి వస్తే రాష్ట్రం మొత్తం మీద ఉన్న 553 కోర్టులో సివిల్ కేసులు దాఖలు చేసేందుకు వీలుండదన్నారు. వీటి స్థానంలో ట్రిబ్యునల్స్ ఏర్పాటు చేసి కేసులను త్వరగా పరిష్కరిస్తామని ప్రభుత్వం చెబుతోందని, 553 కోర్టులు చేయలేని కేసులు రాష్ట్రంలో ఉన్న 26 ట్రిబ్యునల్స్ ఎలా పరిష్కరిస్తాయో ప్రభుత్వమే చెప్పాలన్నారు. బార్ ఉపాధ్యక్షుడు పుప్పాల శ్రీనివాస్, మాజీ ప్రధాన కార్యదర్శి గంధం శ్రీనివాసరావు, న్యాయవాదులు నామాల కోటేశ్వరరావు, అల్లు కృష్ణకిషోర్, అల్లం పద్మనాభం, సోము కృష్ణమూర్తి, పి.జయలక్ష్మి పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన కలయికతో

వైసీపీ నేతల గుండెల్లో దడ

● టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమా

ధర్నాచౌక్, జనవరి 9: చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలయికతో రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రజలకు మేలు జరగబోతుందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు తెలిపారు. టీడీపీ, జనసేన కలయికతో వైసీపీ పార్టీ నేతల గుండెల్లో దడ మొదలైందన్నారు. స్థానిక హనుమాన్‌పేటలో "భవిష్యత్తుకు గ్యారెంటీ" మంగళవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో నిత్యావసర ధరలు ఆకాశనంటాయని, టీడీపీ హయంలో రూ.500 కరెంట్ బిల్లు వస్తే ప్రస్తుతం రూ.2వేలు వస్తుందన్నారు. కేవలం టీడీపీకి మాత్రమే సంపద సృష్టి సాధ్యమన్నారు. రాష్ట్రంలో ఉద్యోగులకు జీతాలు, పెన్షనర్లకు పెన్షన్లు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. వైసీపీతో దెబ్బతిన్న పేద, బడుగు, బలహీన వర్గాలకు చంద్రబాబుతోనే న్యాయం జరుగుతుందన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు, డివిజన్ నేతలు చలమలశెట్టి శ్రీనివాస్, ఇమ్మడి రాము, జనసేన నేతలు ప్రభుజీ, వాసా అనిల్ కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

రాజకీయ ప్రాధాన్యత కల్పించండి: బొడ్డు

ధర్నాచౌక్, జనవరి 9: తగిన రాజకీయ ప్రాధాన్యత లేక వివిధ రాజకీయ పార్టీల్లోని మాదిగలు తీవ్ర నిరాశకు గురవుతున్నారని మాదిగ అభివృద్ధి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బొడ్డు కిషోర్ ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన సంఘం ప్రారంభోత్సవ సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్ని ప్రభుత్వాలు మారినా మాదిగల అభివృద్ధి శూన్యమన్నారు. ఒక ఎమ్మెల్సీ, కార్పొరేషన్ చైర్మన్, మేయర్, డిప్యూటీ మేయర్ పదవులిచ్చి మాదిగల అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. కంబగళ్ల రాజు, పల్లె తిమోచి, కేసిగళ్ల శ్రీనివాసరావు, పరిశపోగు డానియేలు, ఎన్.డానియేలు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఐటీఎఫ్ సీనియర్స్ టెన్నిస్ టోర్నీ

విజయవాడ స్పోర్ట్సు, జనవరి 9: ఆంధ్రప్రదేశ్ లాన్‌టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఐజీఎంసీ టెన్నిస్ కాంప్లెక్సులో సీనియర్ మాస్టర్స్-200 ఐటీఎఫ్ (ఎస్వీ.రామయ్య మెమోరియల్ టెన్నిస్) టోర్నీలో మ్యాచ్‌లు హోరాహోరీగా సాగుతున్నాయి. 4వ రోజు పురుషుల 45 ప్లస్ సింగిల్స్ ఫైనల్స్‌లో నల్లమోతు బోసు కిరణ్ (ఇండియా) సురేంద్ర అల్లం (ఇండియా)పై 6-2, 6-2 తేడాతో విజయం సాధించి టైటిల్‌ను వశం చేసుకున్నాడు. 55 ప్లస్ సింగిల్స్ క్వార్టర్స్‌లో కాకుమాను శ్రీనివాసరావు, ప్రకాశ్ రాజశేఖర్, బండారు సాయిబాబా ప్రత్యర్థిలపై చెమటోడ్చి గెలిచి సెమిస్‌కు చేరారు. 60 ప్లస్ సెమిస్‌లో పవన్ జైన్, దిలీప్ సింగ్ ప్రత్యర్థులపై గెలిచి టైటిల్ రేసుకు చేరుకున్నారు. 65 ప్లస్‌లో ఆశిష్ సేన్, వీర వెంకట సత్యనారాయణ ఫైనల్స్‌కు చేరుకున్నారు. పురుషుల 70 ప్లస్ సెమీస్‌లో జార్జ్‌థామస్ శేఖర్ తాహిర్ అలీ ఫైనల్స్‌కు చేరుకున్నారు. 45 ప్లస్ డబుల్స్‌లో సురేంద్ర అల్లం, బోస్ కిరణ్ నల్లమోతు (ఇండియా) బినేష్ బాబూకుట్టన్, విజు మలైకల్ (ఇండియా)పై 6-2, 6-3తో విజయం సాధించి టైటిల్‌ను సాధించారు. పోటీలను టోర్నీ డైరెక్టర్ సూదగాని రామకృష్ణ పర్యవేక్షిస్తున్నారు.

నేటికీ బల్లకట్టే ఆధారం.!





గుణదల: ఎనికేపాడు ఏలూరు రోడ్డు అవతల ఒడ్డున నివాసాలు ఉంటున్న వారంతా కాల్వ దాటడానికి నేటికీ బల్లకట్టే ఆధారంగా ఉంది. గడచిన 60 ఏళ్లుగా అటు రైతులు ఇటు కాల్వకట్ట వెంబడి నివాసాలు ఉండేవారంతా కాల్వదాటి ఇవతల ఒడ్డుకు రావడానికి బల్లకట్టే తప్ప మరే ప్రత్యామ్నాయ మార్గాలు లేవని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో రాజకీయ నేతలు ఓట్ల కోసం రావడం వంతెన నిర్మాణం చేపడతామని చెప్పి వెళ్లిపోవడం పరిపాటైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు కాల్వకట్ట వెంబడి సుమారు 150 కుటుంబాలు నివాసాలుంటున్నాయి. అంతేకాక వెయ్యి ఎకరాల పంట భూమి సాగుకు రైతులు బల్లకట్ట మీదుగానే రాకపోకలు సాగించాలి. రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు ఈ సమస్యపై దృష్టి పెట్టి వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



డాన్‌బాస్కో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

ఘనంగా డాన్‌బాస్కో 41వ వార్షికోత్సవం

పటమట: డాన్‌బాస్కో స్కూల్ 41వ వార్షికోత్సవ వేడుకలు గురునానక్ కాలనీలోని స్కూల్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ కృష్ణార్జునరావు, సిద్ధార్థ మెడికల్ కాలేజ్ ప్రొఫెసర్ కల్యాణ చక్రవర్తి, పూర్వ విద్యార్థి కెనరా బ్యాంక్ ఆఫీసర్ భాస్కరన్ పాల్గొన్నారు. ఆడిటర్ కృష్ణార్జునరావు మాట్లాడుతూ పాఠశాల దశలోనే విలువలు, నైతిక బాధ్యతలు అలవడతాయని 41ఏళ్ల నుంచి అదే విలువలతో బాధ్యతాయుతంగా డాన్‌బాస్కో అనేకమంది విద్యార్థులను సమాజానికి అందించిందని కొనియాడారు. నిబద్ధత గల పౌరులను తయారు చేస్తున్నారని ఉపాధ్యాయులను అభినందించారు. నేషనల్ ఇన్నోవేషన్ హబ్‌గా నీతి అయోగ్ ఈ స్కూల్‌ని గుర్తించిందని రోబో టిక్స్, కెడి ప్రింటింగ్‌తో కూడిన అధునాతన ల్యాబ్ కలిగి ఉండటం విద్యారుల అదృష్టమని డాక్టర్ కల్యాణ్ కొనియాడారు. ప్రతి ఏడాది అనేక జాతీయ, అంతర్జాతీయ అవార్డులు నేషనల్ ఇన్‌స్పైర్ అవార్డ్ చదరంగంలో జాతీయ అవార్డు రావడం విద్యార్థుల ప్రతిభకు నిదర్శనమని కెనరా బ్యాంక్ అధికారి భాస్కరన్ పేర్కొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు సభికులను ఎంతగానో అలరించాయి. ఈ ఏడాది విశాఖ ఏటీఎల్ మారథాన్ పాల్గొన్న విద్యార్థులకు ముఖ్య అతిథులు బహుమతి ప్రదానం చేశారు. బీవీఎన్ ప్రసాద్ వందన సమర్పణ చేశారు.



ఓంకారేశ్వర పీఠాధిపతి ప్రతాప దక్షిణా మూర్తి దంపతులకు, ఇజ్రాయెల్ రాయబారి విన్ల్టర్ నౌర్ గిలోన్ దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న అధికారులు

దుర్గమ్మ సన్నిధిలో ప్రముఖులు

వన్‌టౌన్, జనవరి 9: దుర్గగుడిలో దుర్గమ్మ దర్శనానికి మంగళవారం పలువురు ప్రముఖులు విచ్చేశారు. తెలంగాణలోని పూర్ (కోహిర్) ఓంకారేశ్వర పీఠాధిపతి డాక్టర్ ప్రతాప దక్షిణామూర్తి దంపతులు, ఇజ్రాయెల్ రాయబారి, డిపార్ట్‌మెంట్ నౌర్ గిలోన్, హదాన్ జేకెస్ట్ దంపతులున్నారు. వారికి అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలకగా అమ్మవారి దర్శనానంతరం ఆశీర్వచనం అందించారు. ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు. ప్రతాప దక్షిణా మూర్తి దంపతులకు అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు వేద స్వస్తి పలికారు. అధికారులు ప్రసాదాలు అందజేయగా స్వామిజీ అనుగ్రహభాషణం చేశారు.

న్యూఢిల్లీ ఎంక్వయిరీ కమిషన్ జస్టిస్ బాలకృష్ణన్

ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ దర్శనార్థం మంగళవారం న్యూఢిల్లీ ఎంక్వయిరీ కమిషన్ జస్టిస్ కె.జి బాలకృష్ణన్ విచ్చేశారు. ఆయనకు ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. చైర్మన్ వారికి అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.


జస్టిస్ బాలకృష్ణన్‌కు దుర్గమ్మ చిత్రపటం ఇస్తున్న ట్రస్ట్ బోర్డు చైర్మన్ రాంబాబు

ఆర్టీసీ జోనల్ చైర్మన్‌కు సత్కారం



బస్‌స్టేషన్, జనవరి 9: ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన పెన్నింటి మహేష్‌ను బస్‌స్టేషన్ ప్రాంగణంలోని ఆయన చాంబర్‌లో మంగళవారం ఏపీఎస్ ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర, జిల్లా నేతలు ఘనంగా సత్కరించారు. ఆయనకు శాలువా కప్పి గజమాల వేసి అభినందించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, జోనల్ కమిటీ, నాన్ ఆపరేషన్ నేతలు పాల్గొన్నారు.

జస్టిస్ రమణకు అయోధ్య ఆహ్వానం



అయోధ్యలో ఈనెల 22న జరిగే రామ మందిర ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి సకుటుంబ సమేతంగా రావాలని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణను ఆహ్వానించారు. వీహెచ్‌పీ అంతర్జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు అలోక్ కుమార్, సీనియర్ నాయకుడు రామ్ లాల్ మంగళవారం ఢిల్లీలో ఆయనకు ఆహ్వానపత్రం అందించారు.

బీజేపీ, వైసీపీలను ఓడించాలి: జేడీ శీలం



విశాఖపట్నం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో, రాష్ట్రంలో నిరంకుశ విధానాలను అమలు చేస్తున్న బీజేపీ, వైసీపీ ప్రభుత్వాలను ఓడించేందుకు భావ సారూప్యత కలిగిన పార్టీలు ముందుకురావాలని కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం పిలుపునిచ్చారు. దళిత, గిరిజన, బీసీ, మైనారిటీ, ప్రజా సంఘాల నేతలతో మంగళవారం విజయవాడలో సమాలోచన సదస్సును నిర్వహించారు. జేడీ శీలం మాట్లాడుతూ బీజేపీ, వైసీపీలను ఓడించి ఇంటికి సాగనంపాలని, లేకపోతే అరాచక పాలన మరోసారి చవిచూడాల్సి వస్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ప్రభుత్వ రంగ సంస్థలకు రక్షణ ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ సభ్యుడు కొప్పుల రాజు, పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, రాకేశ్ రెడ్డి, సీపీఐ నుంచి పైడిరాజు, విరసం ఐక్య వేదిక వెంకటరావు, దళితనేతు కొత్తపల్లి వెంకటరమణతోపాటు వివిధ వర్గాలకు చెందిన నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

భూ హక్కు చట్టంతో రైతులకు నష్టం: సీపీఎం

ఏలూరు టూటౌన్, జనవరి 9: 'భూ యాజమాన్య హక్కు చట్టం వల్ల రైతులు అధికంగా నష్టపోతారు. ఆ చట్టం కార్పొరేట్, పారిశ్రామిక వర్గాలకు ఉపయోగపడుతుంది. రైతులు నష్టపోయే చట్టాన్ని రద్దు చేయాలి' అని సీపీఎం డిమాండ్ చేసింది. ఆ పార్టీ రాష్ట్ర మహాసభలు ఏలూరులో మంగళవారం ప్రారంభమయ్యాయి.

పాలన గాలికి వదిలేసిన జగన్: : రామకృష్ణ

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 9: 'జగన్మోహన్‌రెడ్డి పరిపాలనా సంబంధిత సమస్యలను పక్కనబెట్టారు. తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చుని ఎమ్మెల్యేల, ఎంపీల బదిలీలు, ఫండ్ కలెక్షన్లు, ఎలక్షన్లు, రాజకీయాలకే సమయం అంతా కేటాయిస్తున్నారు' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ మండిపడ్డారు. రాజమహేంద్రవరంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్‌కు పరిపాలనకు టైం లేదు కాబట్టి బొత్స సత్యనారాయణ, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వంటి వారికి సీఎం పదవి అప్పగించాలన్నారు. కాగా, 'ఎన్నికల్లో టీడీపీ కలిసి ప్రయాణం చేయాలనే ప్రయత్నం చేస్తున్నాం. అయితే, బీజేపీతో ఎలా కలుస్తారో టీడీపీ ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.

దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా కల్పించాలి: మేరుగ

అమరావతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మతం మారినా దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా కొనసాగించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. దళిత క్రిస్టియన్లను ఎస్సీల్లో చేర్చాలన్న అంశంపై ఏర్పాటైన జస్టిస్ కె.జి. బాలకృష్ణన్ కమిషన్ సచివాలయానికి రాగా, ఈ మేరకు వినతిపత్రమిచ్చామని మంత్రి తెలిపారు. విజయవాడలో అంబేద్కర్ స్మృతి వనాన్ని ఈ నెల19న సీఎం ప్రారంభిస్తారని ఆయన తెలిపారు.

రివైజింగ్ కమిటీకి తెలుగు తెలుసా?

▸▸ 'వ్యూహం' సెన్సార్ సర్టిఫికెట్ రద్దుపై నారా లోకేశ్ తరఫు వాదనలు

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఏపీలో ప్రతిపక్షాల ప్రతిష్ఠను దెబ్బతీసి.. ఎన్నికల్లో లబ్ధిపొందే విధంగా రాంగోపాల్ వర్మ దర్శకత్వంలో నిర్మించిన వ్యూహం సినిమా సెన్సార్ సర్టిఫికెట్‌ను రద్దు చేయాలని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తరఫు న్యాయవాది హైకోర్టును కోరారు. ఈ సినిమా సర్టిఫికెట్‌పై హైకోర్టు సింగిల్ జడ్జి ఈనెల 11 వరకు స్టే విధిస్తూ మధ్యంతర ఆదేశాలు జారీచేశారు. దీనిపై నిర్మాత డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించడంతో సింగిల్ జడ్జి వద్దే తేల్చుకోవాలని సూచించింది. ఈ నేపథ్యంలో ఈ సినిమా సర్టిఫికెట్ రద్దు చేయాలన్న టీడీపీ పిటిషన్‌పై జస్టిస్ సూరేపల్లి నంద ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధర్ వాదనలు వినిపిస్తూ.. ఒక్కసారి సర్టిఫికెట్ రిజెక్ట్ అయిన తర్వాత రివైజింగ్ కమిటీ ఎలా సర్టిఫికెట్ ఇస్తుందని ప్రశ్నించారు. 'అసలు రివైజింగ్ కమిటీ సభ్యులకు తెలుగు భాష తెలుసా? భాష తెలిసిన వారెవరూ ఈ సినిమాకు సర్టిఫికెట్ ఇవ్వరు. రాబందులు, గుంట నక్కలు వంటి పదాలు వాడారు. తీవ్ర పరువునష్టం, హక్కులకు భంగం కలిగిచేలా సీన్లు, పాటలు, ట్రైలర్ ఉండటంతోపాటు కోర్టు ధిక్కరణ పాల్పడేలా కొన్ని సన్నివేశాలు ఉన్నాయి. ఈ సినిమాకు రివైజింగ్ కమిటీ జారీచేసిన సర్టిఫికెట్ రద్దు చేయాలి' అని కోరారు. నిర్మాత తరఫున వాదనలు పూర్తికాకపోవడంతో విచారణ బుధవారానికి వాయిదా పడింది.

భానుకిరణ్ బెయిల్‌పై తీర్పు రిజర్వు

హైదరాబాద్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): అప్పట్లో సంచలనం సృష్టించిన మద్దెలచెరువు సూరి హత్య కేసులో నిందితుడు.. జీవితఖైదు శిక్ష అనుభవిస్తున్న మలిశెట్టి భానుకిరణ్ అలియాస్ భాను బెయిల్ పిటిషన్‌పై మంగళవారం హైకోర్టు తీర్పు రిజర్వు చేసింది. నిందితుడు చాలా ఏళ్లుగా జైలుశిక్ష అనుభవిస్తున్నాడని.. మధ్యంతర బెయిల్ ఇవ్వాలని పిటిషనర్ తరఫు న్యాయవాది కోరారు. ఏపీలో ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోందని.. ఇప్పుడు విడుదల చేస్తే పిటిషనర్ ప్రాణాలకే ప్రమాదమని పీపీ రాజేందర్‌రెడ్డి వాదనలు వినిపించారు. నమోదు చేసుకున్న ధర్మాసనం తీర్పు రిజర్వు చేసింది.

ఆ తయారీదారులకు ప్రోత్సాహం: పవన్

అమరావతి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మట్టి, నార, తాటాకులు, కొబ్బరాకులు, ఇలా మనకు పల్లెల్లో దొరికే ప్రకృతి వనరులతోనే చక్కటి కళాకృతులు, గృహోపకరణాలు తయారు చేసే కళాకారులను ప్రోత్సహిస్తూ, భరోసా ఇచ్చే బాధ్యతను జనసేన తీసుకుంటుందని ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. ప్రకృతి వ్యవసాయ నిపుణుడు విజయరామ్ మంగళవారం జనసేన కేంద్ర కార్యాలయంలో పవన్ కల్యాణ్‌ను కలిసిన సందర్భంగా ఆయన ఈ హామీ ఇచ్చారు. ఎన్నికల మేనిఫెస్టోలో కూడా పెడతామన్నారు.

ఏపీకి 1.51 కోట్ల ఆయుష్మాన్ కార్డులు: కేంద్రమంత్రి

కర్నూలు, జనవరి 9: భారతదేశంలో ఎన్నడూ లేని విధంగా నరేంద్ర మోదీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందని, ఏపీలో 1.51 కోట్ల ఆయుష్మాన్ భారత్ కార్డులు అందించి, రోగులకు మెరుగైన వైద్యసేవలందించేందుకు కృషి చేస్తోందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి సత్యపాల్ సింగ్ బాఘేల్ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన కర్నూలు సర్వజన వైద్యశాలలో రోగులతో మాట్లాడి వారిని పరామర్శించారు. వైద్యశాలలో స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.72 కోట్లు కేటాయించిందని, ఇప్పటికే రూ.54 కోట్లు విడుదల చేశామని, మరో రూ.18 కోట్లు కూడా త్వరలో విడుదల చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా.. ఆసుపత్రికి కొత్తగా 3-టెస్లా ఎంఆర్ఐ మిషన్‌ను మంజూరు చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ మంత్రికి విన్నవించారు.

నిజాయితీగా పనిచేసేవారిని ఎన్నుకోవాలి

గ్రామాలు అభివృద్ధి చెందాలంటే నీతి, నిజాయితీలతో పనిచేసేవారినే ఎన్నుకోవాలని మంత్రి సత్యపాల్‌సింగ్ ప్రజలకు పిలుపునిచ్చారు. జిల్లాలోని గార్గేయాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆయన వికసిత్ భరత్ సంకల్పయాత్రలో ఆయన మాట్లాడారు. ఆయన వెంట మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్, జేసీ మౌర్య, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

232 కిలోల గంజాయి పట్టివేత

ఉంగుటూరు, జనవరి 9: హైవే-16పై చిన అవుటపల్లి చెక్‌పోస్టు సమీపంలో ఓ వ్యాన్‌లో తరలిస్తున్న 232 కిలోల గంజాయిని కృష్ణాజిల్లా ఆత్కూరు పోలీసులు సోమవారం రాత్రి స్వాధీనం చేసుకున్నట్లు హనుమాన్‌జంక్షన్ సీఐ ఎ.నవీన్ నరసింహమూర్తి, ఆత్కూరు ఎస్సై టి.సూర్యశ్రీనివాస్ మంగళవారం విలేకరులకు తెలిపారు. గంజాయిని రాజమహేంద్రవరం నుంచి తమిళనాడులోని ధర్మపురికి రవాణా చేస్తున్నట్టు చెప్పారు.తమిళనాడుకు చెందిన తంగమ్ శశికుమార్(34)ను పట్టుకోగా, అతడి స్నేహితుడు ముత్తు(40) పరారయ్యాడు. పట్టుకున్న గంజాయివిలువ రూ.23 లక్షలుంటుందని సీఐ తెలిపారు.

ఇంత తగలేసి ఏం సాధించారు..?

అమరావతిని ధ్వంసం చేసి... రుషికొండను చెరపట్టిన జగన్


▸▸ రుషికొండపై 421.87 కోట్ల ఖర్చు

▸▸ అనధికారికంగా మరింత వ్యయం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

అమరావతే రాజధాని అని విపక్షనేతగా నవిష్మించి అధికారంలోకొచ్చిన జగన్ తనదైన శైలిలో విధ్వంసానికి పాల్పడ్డారు. మూడు రాజధానుల అంశాన్ని తెరమీదకు తీసుకొచ్చి విశాఖను ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ అంటూ హడావుడి చేశారు. ముఖ్యమంత్రి జగన్, ఆయన మంత్రులు విశాఖే రాజధాని అని ఊరూవాడా ప్రచారం చేశారు. విశాఖ రాజధాని పేరిట రుషికొండలో మకాం వేసేందుకు పన్నాగం పన్ని.. 421.87 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి ఇంద్రభవనాన్ని నిర్మించారు. తొలుత టూరిజం కోసం అన్నారు. ఆ తర్వాత హోటల్ అన్నారు. చివరకు జగన్ ఉండే క్యాంప్ ఆఫీసు అని చెప్పారు. రుషికొండను విధ్వంసం చేసి ప్రజల సొమ్మును హారతి కర్పూరంలా కరిగించేసిన జగన్.. విశాఖ వెళ్లిందీ లేదు.. రాజధానిని తీసుకెళ్లిందీ లేదు. మరి.. రుషికొండపై రూ.421 కోట్ల ప్రజల సొమ్మును తగలేసి సాధించేదేమిటి? ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం వినహా ప్రజలకు చేసిన మేలేమిటి...?

విశాఖ నుంచే పాలన అంటున్న ముఖ్యమంత్రి, మంత్రులు ఈ పేరిట రుషికొండపై అడ్డగోలు నిర్మాణాలు చేపట్టారు. మూడున్నరేళ్లలో రూ.421.87 కోట్లు రుషికొండ నిర్మాణాలకు కేటాయించారు. స్వయంగా ప్రభుత్వమే ఈ విషయాన్ని వెల్లడించింది. సమాచార హక్కు సంఘం జాతీయ అధ్యక్షుడు టి.గంగాధర్‌కు ఆర్‌టీఐ కింద ఇచ్చిన సమాచారంలో రుషికొండపై గత మూడున్నరేళ్లలో 421.87 కోట్ల రూపాయలను ఖర్చుపెట్టినట్లు లిఖితపూర్వకంగా తెలిపింది. అయితే ఇది అధికారికంగా చెబుతోన్న లెక్క మాత్రమే. అనధికారంగా ఇంకా ఎంత ఖర్చుపెట్టారు? ఇంకా ఎంత వ్యయం చేయబోతున్నారన్న లెక్క తేలాల్సి ఉంది.



జనం సొమ్ముతో దొంగాట

పర్యాటక ప్రాజెక్టు పేరిట మొదలుపెట్టి సీఎం క్యాంప్ ఆఫీసు అనేవరకు రుషికొండపై నిర్మాణాలు సాగించారు. ఇందుకు మూడున్నర సంవత్సరాల్లో 421.87 కోట్లను జగన్ సర్కారు ఖర్చుచేసింది. ఇదంతా ప్రజల సొమ్ము. ఇదే డబ్బుతో ఉత్తరాంధ్రలోని పేదరిక నిర్మూలన పథకాలు లేదా ఉత్తరాంధ్ర అభివృద్ధి పనులు చేపట్టవచ్చు. కానీ అవేవీ పట్టని జగన్ సర్కారు రుషికొండను బోడిగుండుగా మార్చేసంకల్పం తీసుకున్నారు. ఇందుకోసం తొలుత టూరిస్టు హోటల్స్ పేరిట 159.31 కోట్లు కేటాయించి ఖర్చుపెట్టారు. 2022, మే 5న ఈ నిధులు విడుదల (జీవో 58) చేశారు. ఆ తర్వాత జూన్ 8న మరో 94.49 కోట్లు విడుదల (జీవో-83) చేశారు. గతేడాది ఆగస్టు 18న జీవో 177 ద్వారా 112.76 కోట్లు విడుదల చేశారు. అదే నెల 24న జీవో-179 ద్వారా 21.83 కోట్లు విడుదల చేశారు.

ల్యాండ్‌స్కేపింగ్‌కు 21.83 కోట్లు

రుషికొండ సహజ సిద్ధంగా పర్యావరణాన్ని కాపాడుతుంది. పచ్చనిచెట్లు, అరుదైన వృక్షాలు అక్కడ ఉన్నాయి. ఇటు విశాఖ నగరానికి, అటు సముద్రానికి మధ్య ఉండే ఈ ప్రాంతం విపత్తులనుంచి నగరాన్ని కాపాడే అతిపెద్ద రక్షణగా పనిచేస్తోంది. అలాంటి పచ్చని కొండను సర్కారు విధ్వంసం చేసింది. అడ్డగోలుగా భవనాలు నిర్మించింది. వాటి మధ్య పచ్చదనం కొరవడిందని గుర్తించి తిరిగి ల్యాండ్‌స్కేపింగ్ చేయడం కోసం రూ.21.83 కోట్లు ఖర్చుపెట్టింది. పచ్చని కొండను తవ్వి తిరిగి ల్యాండ్‌స్కేపింగ్ పేరిట ఇంతగా ప్రజాధనం ఖర్చుపెట్టిన ఘనత జగన్ సర్కారుదే. వందల కోట్లు ధారబోసి నిర్మించిన భవనాల్లో అంతర్గత సోకుల కోసం సర్కారు 33.48 కోట్లు విడుదల చేసింది. గతేడాది సెప్టెంబరు 21న జీవో 193 ద్వారా ఈ నిధులు విడుదల చేసింది. పర్యావరణానికి విఘాతం కలిగించేలా నిర్మాణాలే వద్దని నిపుణులు, మేధావులు గగ్గోలు పెడుతోంటే, సర్కారు క్షణం ఆలోచించకుండా ఆ భవనాల్లో సోకులు, లగ్జరీ ఏర్పాట్ల పేరిట 33.48 కోట్లు ఖర్చుపెట్టింది.

సీఎం జగన్ సాధించేదేమిటి..?

విశాఖ రాజధాని అంటూ పదేపదే ప్రచారం చేసిన సీఎం జగన్ విశాఖలో తన క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేసుకుంటానని ధైర్యంగా ప్రకటించలేదు. టూరిజం ముసుగులో రుషికొండపై పర్యావరణాన్ని పణంగా పెట్టి వందల కోట్ల ఖర్చుతో భవంతులు కట్టారు. దేశంలో ప్రధానికి కూడా లేనంతగా సముద్ర తీరాన, ఓ కొండపై క్యాంపు కార్యాలయం కోసం ఏర్పాట్లు చేసుకున్నారు. ఇదిగో వస్తున్నా, అదిగో వస్తున్నా అంటూ ఏడాదిన్నర కాలంగా నాలుగు ముహూర్తాలు పెట్టారు. ఇదే అంశంపై హైకోర్టులో కేసు నడుస్తోంది. కోర్టు అనుమతి లేకుండా విశాఖకు కార్యాలయాలను తరలించడానికి వీల్లేదు. అంటే, విశాఖలోని రుషికొండ మీద నుంచి పాలించాలన్న జగన్ మొండి ఆశలకు కోర్టు కళ్లెంవేసింది. మరి ఇంత చేసి జగన్ ఏం సాధించినట్లు?



టీఎస్ 'మహాలక్ష్మి'.. ఏపీకి 'ధనలక్ష్మి'!

▸▸ మహిళలకు ఉచిత ప్రయాణంతో పెరిగిన రద్దీ

అమరావతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో మహాలక్ష్మి పథకం ఆంధ్రప్రదేశ్‌కు ధనలక్ష్మిగా మారింది. సంక్రాంతి పండగ ఏపీఎస్‌ఆర్టీసీకి కాసుల వర్షం కురిపిస్తోంది. అదనంగా నడపనున్న సర్వీసుల్లో మొత్తం రిజర్వేషన్లు పూర్తవడంతో సర్వీసులు ఏకంగా రెట్టింపు చేస్తోంది. వివరాలివీ.. ప్రతి సంవత్సరం సంక్రాంతి సందర్భంగా హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. అందుకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులు పెంచుతుంది. ఈ ఏడాది పండగ సీజన్ మొత్తం 6,795 బస్సులు నడుపుతున్న ఏపీఎస్‌ఆర్టీసీ.. హైదరాబాద్‌కు 1600సర్వీసులు(గత ఏడాది 1500) తిప్పబోతోంది. ఇదే స్థాయిలో తెలంగాణ ఆర్టీసీ కూడా మన రాష్ట్రంలోకి ప్రత్యేక బస్సులు పంపుతుంది. అయితే అనూహ్యంగా ఏపీ బస్సుల్లో సీట్లన్నీ ముందస్తు రిజర్వేషన్లో అయిపోతున్నాయి. రెట్టింపు చార్జీలు వసూలు చేస్తున్న ప్రైవేటు బస్సుల్లో సైతం ఈ నెల 11 నుంచి 13మధ్యలో డిమాండ్ ఎక్కువ అవడంతో ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు కారణాలు ఆరా తీశారు. తెలంగాణలో మహాలక్ష్మి(మహిళలకు ఉచిత ప్రయాణం) పథకం అమలుతో హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ తదితర ప్రాంతాలకు రద్దీ ఎక్కువైంది. టీఎస్‌ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తే పురుషుడు టికెట్ తీసుకుంటే మహిళకు ఉచితం గనుక దాదాపు అందరూ వాటినే ఆశ్రయిస్తున్నారు. దీంతో తెలంగాణ నుంచి మన రాష్ట్రానికి పంపేందుకు బస్సులు లేక టీఎస్‌ఆర్టీసీ చేతులెత్తేసింది. రైళ్లన్నీ ఫుల్ అవడంతో ప్రయాణికులు ఇతర మార్గాలను అన్వేషించే పనిలో ఉండగా ఏపీఎస్‌ఆర్టీసీ అధికారులు అదనంగా మరో 1400బస్సులు అందుబాటులోకి తీసుకొచ్చారు. జిల్లాల మధ్య తిరిగే సూపర్ లగ్జరీ, డీలక్స్ బస్సుల్లో కండీషన్ ఉన్నవాటిని హైదరాబాద్‌కు మళ్లించారు. ఒకే సారి మూడు వేల బస్సులు అందుబాటులోకి రావడంతో మన రాష్ట్రానికి వచ్చే ప్రయాణికులు ఇబ్బంది లేకుండా రిజర్వేషన్లు చేసుకొంటున్నారు. అయితే అనూహ్యంగా అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న మన ఆర్టీసీ.. అదనపు ధరల్లేని తమ సేవలు వినియోగించుకోవాలని పండుగ ప్రయాణికుల్ని కోరుతోంది.

జమ్మూ కశ్మీర్ రెరా చైర్మన్‌గా సతీష్ చంద్ర

అమరావతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మన రాష్ట్రంలో పని చేసి రిటైర్ అయిన సతీష్‌చంద్రను జమ్మూ కశ్మీర్ రెరా చైర్మన్‌గా నియమిస్తూ ఆ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో చంద్రబాబు ప్రభుత్వంలో కీలకపాత్ర పోషించిన ఆయన జగన్ సర్కార్‌లోనూ కీలక పోస్టులు నిర్వహించారు.

గ్యారేజీలపై దృష్టి పెట్టండి

▸▸ బస్సు ప్రమాదాలను నివారించండి: ఎన్‌ఎంయూ

విజయవాడ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల నిర్వహణ సరిగా లేకపోవటం, గ్యారేజీలలో తగిన టూల్స్ స్పేర్ పార్ట్స్ అందుబాటులో లేకపోవటంతో బస్సు ప్రమాదాలకు దారితీసే ప్రమాదం పొంచి ఉందని, తక్షణం దిద్దుబాటు చర్యలు చేపట్టాలని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు ఏపీపీటీడీ ఎన్‌ఎంయూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ రమణారెడ్డి, వై.శ్రీనివాసరావు మంగళవారం లేఖ రాశారు. గ్యారేజీల్లో స్పెషల్ టూల్స్ సప్లై సరిగా ఉండటం లేదని ఇంద్ర బస్సులకు సంబంధించి స్లాకర్స్, బ్రేక్ డ్రమ్స్ ఇతర స్పేర్ పార్ట్స్ సప్లై జరగటం లేదని పేర్కొన్నారు. యాభై వేల కిలోమీటర్లు తిరిగిన టైర్లను తీసి ఆర్‌సీకి పంపించాల్సి వస్తోందన్నారు. ఆర్టీసీ సర్క్యులర్ ప్రకారం 5 లక్షల కిలోమీటర్లు దాటిన ప్రతి బస్సుకు కూడా డైలీ మెయింటెనెన్స్ చేయాల్సి ఉండగా.. డిపో గ్యారేజీలలో మూడు రోజులకు ఒకసారి మాత్రమే మెయింటెనెన్స్ చేస్తున్నారని, దీనివల్ల బస్సు ఫెయిల్యూర్స్‌కు ఎక్కువగా అవకాశం ఉందని తెలిపారు. బీఎస్ 4 బస్సులకు సంబంధించి వైరింగ్ షార్టేజీలు ఎక్కువగా వస్తున్నందున ఎలక్ట్రీషియన్లకు శిక్షణ ఇప్పించాలని కోరారు. గ్యారేజీలలో ఖాళీలను తక్షణం భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్యారేజీలలో పనిచేసే సిబ్బందికి అధునాతన టెక్నాలజీకి అనుగుణంగా నైపుణ్యాన్ని పెంపొందించేవిధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

శ్రీశైలం ప్రాజెక్టును పరిశీలించిన ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు

శ్రీశైలం, జనవరి 9: శ్రీశైలం ప్రాజెక్టును ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు, కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) అధికారులు మంగళవారం పరిశీలించారు. జలాశయానికి సంబంధించిన నిర్వహణ, చేపట్టవలసిన మరమ్మతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గతంలో వరద తాకిడికి దెబ్బతిన్న ఆయకట్టు ప్లంజ్‌పూల్, కొండ ప్రాంత ప్రదేశాలతోపాటు డ్యాం క్రస్టు గేట్లు, గ్యాలరీ తదితర వాటిని సీడబ్ల్యూసీ ప్రతినిధులు పరిశీలించారు. అనంతరం అధికారులతో నిధుల వినియోగంపై సమీక్షించారు. డ్రిప్ పథకం కింద బ్యాంక్ నిధులు 70 శాతం కేంద్రం, 30 శాతం రాష్ట్రం నిధులు కేటాయిస్తాయని తెలిపారు. ఈమేరకు ప్రపంచ బ్యాంక్, రాష్ట్ర ప్రభుత్వం మధ్య ఒప్పందం జరిగినట్టు చెప్పారు.

కొలిక్కి వస్తున్న 'ఇండియా' సర్దుబాట్లు

▸▸ ఏడు రాష్ట్రాల్లో కుదిరిన అవగాహన

▸▸ బిహార్, మహారాష్ట్రల్లో పొత్తులు ఖరారు

▸▸ ఆప్‌తో కొనసాగుతున్న సంప్రదింపులు

▸▸ నితీశ్ కూడా పెద్దనేతే: రాజా



న్యూఢిల్లీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సీట్ల సర్దుబాటు దిశగా ఇండియా కూటమి వేగంగా అడుగులు వేస్తోంది. తొలుత ఏడు రాష్ట్రాల్లో సీట్ల పంపకంపై దాదాపుగా ఒప్పందం కుదిరింది. మహారాష్ట్ర, బీహార్, పంజాబ్, ఢిల్లీ, గోవా, గుజరాత్ రాష్ట్రాల్లో మిత్రపక్షాలతో కాంగ్రెస్ ఒక అవగాహనకు వచ్చింది. ఉత్తరప్రదేశ్‌లో కూడా సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేష్ యాదవ్‌తో కాంగ్రెస్ నేతలు సల్మాన్ ఖుర్షీద్, ముకుల్ వాస్నిక్, అశోక్ గెహ్లోత్‌లు చర్చలు ప్రారంభించారు. మహారాష్ట్రలో అయితే మంగళవారం శివసేన (ఉద్ధవ్ థాకరే), కాంగ్రెస్, ఎన్‌సీపీల మధ్య ఒప్పందం కుదిరింది. శివసేన, కాంగ్రెస్ చెరి 20 సీట్లకు పోటీ చేయనున్నాయి. ఎన్‌సీపీకి 6 సీట్లు, ప్రకాశ్ అంబేద్కర్ నేతృత్వంలోని వంచిత్ బహుజన్ అగాడీకి రెండు సీట్లు కేటాయించాలని నిర్ణయించారు. బీహార్‌లోనూ పొత్తులు ఖరారయ్యాయి. జనతాదళ్ (యు), ఆర్‌జేడీలకు చెరి 17 సీట్లు, కాంగ్రెస్‌కు నాలుగు, సిపిఐ(ఎంఎల్)కు రెండు, సీపీఐకు ఒక సీటు ఇవ్వాలని ఇప్పటికే నిర్ణయించుకున్నారు. ఢిల్లీలో కూడా ఆప్‌కు, కాంగ్రెస్‌కు మధ్య సీట్ల ఒప్పందం దాదాపు కొలిక్కి వచ్చింది. ఢిల్లీలో కాంగ్రెస్‌కు 3 లేదా 4 సీట్లు ఇచ్చేందుకు ఆప్ సుముఖంగా ఉన్నట్లు సమాచారం. గుజరాత్, గోవాలో చెరొక సీటు, హర్యాణాలో 4 సీట్లు కేటాయించాలని ఆప్ కాంగ్రెస్‌ను కోరుతోంది. పంజాబ్‌లో కాంగ్రెస్‌కు ఆరు సీట్లు కేటాయించేందుకు ఆప్ సుముఖంగా ఉంది. కాంగ్రెస్, ఆప్‌ల మధ్య తుది చర్చలు ఒకటి రెండు రోజుల్లో ముగియనున్నాయి.

దేశంలో సీపీఐ బలంగా ఉంది

ఇండియా కూటమి పార్టీల నేతల్లో బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కూడా పెద్ద నాయకుడేనని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా వ్యాఖ్యానించారు. మంగళవారం పట్నాలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నితీశ్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అయితే, ఇండియా కూటమిలో 'అతి పెద్ద పాత్ర' పోషించే అవకాశం నితీశ్‌కు ఉంటుందా? అన్న ప్రశ్నకు మాత్రం ఆయన సమాధానాన్ని దాట వేశారు. లోక్‌సభ ఎన్నికలో కూటమి పార్టీలు మెజారిటీ దక్కించుకున్నాకే ప్రధాని అభ్యర్థిని నిర్ణయిస్తామని అన్నారు. 1990లో యునైటెడ్ ఫ్రంట్ సమయంలోనూ ఇలానే నిర్ణయించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఇక, కూటమి కన్వీనర్ పగ్గాలను నితీశ్‌కు అప్పగించాలన్న ప్రచారం కేవలం ఊహాగానమేనని, ఇలా జరగపోయినా కూమటి బలోపేతానికి వచ్చిన నష్టం ఏమీ ఉండదని రాజా అన్నారు. "ఇండియా కూటమిలో నితీశ్ కుమార్ అతిపెద్ద నేత అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆయన చాలా అనుభవశాలి" అని వ్యాఖ్యానించారు. సీపీఐ బిహార్ సహా దేశవ్యాప్తంగా బలంగా ఉందని, సీట్ల కేటాయింపుపై చర్చలు ప్రారంభమయ్యాక తమ డిమాండ్లను వినిపిస్తామని రాజా చెప్పారు. రాహుల్ గాంధీ ప్రారంభించనున్న భారత్ జోడో న్యాయ యాత్రకు ఆహ్వానం అందితే దానిలో పాల్గొంటామని తెలిపారు.



హైదరాబాద్ నుంచి అయోధ్యకు బయలుదేరిన నిత్యావసర సరుకుల లారీ

అయోధ్యలో తెలంగాణ రుచులు!

▸▸ 40 రోజులపాటు రామసన్నిధిలో మన వంటకాలు

▸▸ రోజూ 6వేల మంది భక్తుల కోసం.. ఉచితంగా అందజేత

బర్కత్‌పుర, జనవరి 9(ఆంధ్రజ్యోతి): అయోధ్యలోని రామయ్య సన్నిధిలో భక్తులు తెలంగాణ రుచులను 'శ్రీరామ ప్రసాదం' పేరుతో ఆస్వాదించనున్నారు. అదీ 40 రోజుల పాటు.. పూర్తి ఉచితంగా! తెలంగాణకే ప్రత్యేకమైన పచ్చిపులుసుతోపాటు బగారా, తెల్లన్నం, కిచిడి, ఆలూ కుర్మా, టమాట ఆలుగడ్డ కూర, పప్పు, వంకాయ మసాలా, పులిహోర, పెరుగన్నం తదితర వంటకాలను భక్తులకు వడ్డించనున్నారు. ఇక తెలంగాణకే ప్రత్యేకమైన స్వీట్లు కూడా మూడు రోజులపాటు భక్తులకు అందించనున్నారు. ఈ నెల 14 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు రోజుకు 6 వేల మందికి వడ్డిస్తారు. అయోధ్యలోని శ్రీ రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా హైదరాబాద్ నుంచి వీహెచ్‌పీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేకంగా నిత్యావసర సరుకుల లారీలు వెళ్లాయి. ఇందుకుగానూ తెలంగాణ సంబంధించి రెండు బృందాలకు అయోధ్య శ్రీరామతీర్థ ట్రస్ట్ ఈ అవకాశం ఇచ్చింది. 25 టన్నుల బియ్యం, 12 టన్నుల నిత్యావసర సరుకులతో కూడిన లారీలు బషీర్‌బాగ్‌లోని శ్రీఅమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం బయలుదేరాయి. ఈ వాహనాలు 12న అయోధ్యకు చేరుకోనున్నాయి. వంటల తయారీ కోసం ప్రత్యేకంగా హైదరాబాద్‌కే చెందిన 35 మంది వంటవాళ్లు, సహాయానికి 160 మంది వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ కార్యకర్తలు అయోధ్యకు వెళ్తున్నారు.

రాహుల్ కన్నా మోదీకే ప్రజాదరణ

▸▸ కాంగ్రెస్ నేత కార్తీ వ్యాఖ్యల దుమారం

చెన్నై, జనవరి 9: రాహుల్ గాంధీ కన్నా ప్రధాని నరేంద్ర మోదీకే ప్రజాదరణ ఎక్కువగా ఉందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరం సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు పార్టీలో దుమారం రేపాయి. తాజాగా తంతి టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో కార్తీ మాట్లాడుతూ.. ప్రధాని మోదీపై ప్రశంసల జల్లు కురిపించారు. "ప్రధాని మోదీకి రాహుల్‌ను మించిన ప్రజాదరణ ఉంది" అని అన్నారు. అంతేకాదు.. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు.. ఈవీఎంలపై సందేహాలు వ్యక్తం చేస్తున్న సమయంలో కార్తీ మాత్రం ఈవీఎంలపై తనకు పూర్తి విశ్వాసం ఉందని వ్యాఖ్యానించారు. అయితే కార్తీ వ్యాఖ్యలు పార్టీలో దుమారం రేపాయి. దీంతో ఆయనకు పార్టీ క్రమశిక్షణా సంఘం నాయకుడు, ఎమ్మెల్యే కేఆర్ రామసామి షోకాజ్ నోటీసు జారీ చేశారు. కానీ, రామసామికి షోకాజ్ నోటీసు జారీ చేసే అర్హత లేదని, ఏమైనా ఉంటే ఏఐసీసీ చూసుకుంటుందని స్థానిక నాయకులు వ్యాఖ్యానించడం గమనార్హం.

కర్ణాటక కాంగ్రెస్‌లో ముసలం

3 ఉపముఖ్యమంత్రి పోస్టుల కోసం మంత్రుల పట్టు

బెంగళూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కర్ణాటకలో ఉపముఖ్యమంత్రి పదవుల వ్యవహారం కాంగ్రెస్ అధిష్ఠానానికి తలనొప్పిగా మారింది. బెంగళూరు పర్యటనలో ఉన్న రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి రణదీప్‌సింగ్ సూర్జేవాలాతో సీనియర్ మంత్రుల బృందం భేటీ అయ్యాక వివాదం మరింత రాజుకుంటోంది. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ వ్యూహాన్ని తిప్పికొట్టాలంటే కులాలవారీగా ప్రాధాన్యమిస్తూ మూడు ఉపముఖ్యమంత్రి పదవులను సృష్టించాలని పలువురు మంత్రులు ఆయనకు సూచించారు. దీనిపై డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌కు ఫోన్ చేసి, కొత్తగా ఉపముఖ్యమంత్రి పదవులు సృష్టించడాన్ని అంగీకరించబోనని, కాదంటే డీసీఎం పదవికి రాజీనామా చేసి కేపీసీసీ అధ్యక్షుడిగా మాత్రమే కొనసాగుతానని తేల్చి చెప్పినట్టు తెలుస్తోంది. కాగా, మూడు ఉపముఖ్యమంత్రి పదవుల కథనాలను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కొట్టి పారేశారు.

ప్రధానికి వ్యతిరేకంగా దేన్నీ అంగీకరించను



ముంబై, జనవరి 9: "ప్రధానమంత్రికి వ్యతిరేకంగా దేశానికి ఆవల జరిగే దేనినీ నేను అంగీకరించను. ప్రధాని పీఠానికి మనమంతా గౌరవం ఇవ్వాల్సిందే" అని ఎన్సీపీ అధినేత శరద్ పవార్ వ్యాఖ్యానించారు. మాల్దీవుల ఎంపీ చేసిన వివాదాస్పద వ్యాఖ్యల వ్యవహారంపై ఆయన స్పందిస్తూ.. ఈ వ్యాఖ్యలు ఆమోదయోగ్యం కావన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. "దేశం ఏదైనా.. ఎంతటి వారైనా.. ప్రధాన మంత్రిపై ఇలాంటి అవమానకర వ్యాఖ్యలు చేయడం ఆమోదయోగ్యంకాదు. ఆయన(మోదీ) ఈ దేశానికి ప్రధాన మంత్రి. మనం ఆ పదవికి గౌరవం ఇవ్వాలి" అని పవార్ వ్యాఖ్యానించారు. ఇదిలావుంటే, బిల్కిస్ బానో కేసు విషయంలో 11 మంది దోషులు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఆశ్రయించే అవకాశం ఉందని, అయితే, ఈ విషయంలో రాష్ట్ర సర్కారు జాగ్రత్తగా వ్యవహరించాలని పవార్ సూచించారు. ఈ కేసులో సదరు దోషుల శిక్షా కాలాన్ని తగ్గిస్తూ గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టిన విషయం తెలిసిందే. మహారాష్ట్ర అధికారాన్ని దోచుకున్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఈ నేపథ్యంలో సదరు దోషులు.. మహారాష్ట్ర సర్కారును ఆశ్రయించి.. శిక్ష తగ్గింపుపై అభ్యర్థించే అవకాశం ఉందని పవార్ అన్నారు. ఈ నేపథ్యంలో ఏక్‌నాథ్ శిండే ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. నిర్ణయం తీసుకునే ముందు బాధితురాలి ఆవేదనను గుర్తుంచుకోవాలన్నారు.

అధికారికి సొమ్ము చేరినట్లు ఆధారాల్లేవు

▸▸ పదోన్నతిని అడ్డుకొనేందుకే కేసులో ఇరికిస్తున్నారు

▸▸ హైకోర్టులో ఐపీఎస్ త్రిపాఠి ఉజేలా న్యాయవాదుల వాదన

అమరావతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): హోంగార్డు ఉద్యోగం ఇప్పిస్తామంటూ రూ.4లక్షలు తీసుకొని మోసం చేశారని గుంటూరు జిల్లా, మంగళగిరి పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ ఐపీఎస్ అధికారి, అదనపు డీజీపీ(రహదారి భద్రత) కృపానంద్ త్రిపాఠి ఉజేలా దాఖలు చేసిన పిటిషన్ మంగళవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ఆయన తరఫున సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావు, న్యాయవాది జవ్వాజి శరత్‌చంద్ర వాదనలు వినిపించారు. 'హోంగార్డు ఉద్యోగం ఇప్పిస్తామని మోసం చేశారనే ఆరోపణలతో పోలీసులు కేసు నమోదు చేశారు. పిటిషనర్ ఫోర్జరీ సంతకాలతో నకిలీ ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చారని అందులో పేర్కొన్నారు. పిటిషనర్‌ను 8వ నిందితుడిగా పేర్కొన్నట్లు పోలీసులు కౌంటర్‌లో తెలిపారు. పిటిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేశారని చెబుతూనే పోలీసులు కేసు నమోదు చేయడంలో అర్థం లేదు. ఒక రకంగా పిటిషనర్ బాధితుడిగా మారారు. ఐపీఎస్ అధికారికి సొమ్ము చేరినట్లు ఆధారాలు లేవు. హోంగార్డు ఉద్యోగాలు ఇప్పిస్తామని బాధితులను మభ్యపెట్టి డబ్బులు వసూలు చేసిన మహిళకు, పిటిషనర్‌కు ఎలాంటి సంబంధమూ లేదు. ఒకే అపార్ట్‌మెంట్‌లో వేర్వేరు ఇళ్లలో ఉంటున్న పిటిషనర్, మహిళకు సంబంధాలు అంటగట్టడం సరికాదు. డీజీపీగా పదోన్నతి పొందకుండా అడ్డుకొనేందుకు ఈ కేసులో ఇరికిస్తున్నారు. సర్వీసులో ఉన్న తోటి అధికారులే దురుద్దేశంతో కుట్రలు చేస్తున్నారు. గత 25 ఏళ్లుగా పిటిషనర్ సర్వీసులో ఉన్నారు. దేశం విడిచి వెళ్లే అవకాశమే లేదు. అరెస్ట్ చేసే ప్రమాదం ఉంది. బెయిల్ మంజూరు చేయండి' అని కోరారు. పిటిషనర్ తరఫు వాదనలు ముగియడంతో పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనల కోసం న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు విచారణను బుధవారానికి వాయిదా వేశారు. తన నుంచి రూ.4లక్షలు తీసుకొని మోసం చేశారంటూ వైఎస్సార్ కడపజిల్లాకు చెందిన తలారి మనోజ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా 2022 జూలై 15న నరేశ్, అరవింద్ అనే వ్యక్తులపై మంగళగిరి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుతో తనకు సంబంధం లేకపోయినా దర్యాప్తు పేరుతో పోలీసులు తన నివాసానికి వస్తున్నారని వ్యాజ్యంలో కృపానంద్ త్రిపాఠి ఉజేలా పేర్కొన్నారు. అరెస్ట్ చేస్తారనే ఆందోళన ఉందని, ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ హైకోర్టును ఆశ్రయించారు.



యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(యూఓహెచ్) ఆధ్వర్యంలోని సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ వర్చువల్ లెర్నింగ్(సీడీవీఎల్) - డిప్లొమా, అప్‌స్కిల్లింగ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. వీటిని డిస్టెన్స్, ఆన్‌లైన్ మోడ్‌లలో నిర్వహిస్తారు. ఒక్కో ప్రోగ్రామ్‌లో కనిష్ఠంగా 50 సీట్లు ఉంటాయి. అకడమిక్ ప్రతిభ, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● బుధవారం 10 జనవరి 2024
diksuchi@andhrajyothy.com

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో డిస్టెన్స్ డిప్లొమాలు

డిప్లొమా ప్రోగ్రామ్‌లు

- డిప్లొమా ఇన్ లైబ్రరీ ఆటోమేషన్ అండ్ నెట్‌వర్కింగ్
- డిప్లొమా ఇన్ సైబర్ లాస్ అండ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్
- డిప్లొమా ఇన్ కమ్యూనికేటివ్ ఇంగ్లీష్
- డిప్లొమా ఇన్ క్రిమినల్ జస్టిస్ అండ్ ఫోరెన్సిక్ సైన్స్
- డిప్లొమా ఇన్ బిజినెస్ మేనేజ్‌మెంట్
- డిప్లొమా ఇన్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్
- డిప్లొమా ఇన్ పంచాయతీ రాజ్ గవర్నెన్స్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్
- డిప్లొమా ఇన్ ఇన్ఫెక్షన్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్
- డిప్లొమా ఇన్ కమ్యూనిటీ ఐ హెల్త్
- డిప్లొమా ఇన్ టెలికాం టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్

అప్ స్కిల్లింగ్ ప్రోగ్రామ్‌లు

- డిప్లొమా ఇన్ గవర్నెన్స్
- డిప్లొమా ఇన్ ఎనర్జీ మేనేజ్‌మెంట్
- డిప్లొమా ఇన్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్
- సర్టిఫికెట్ కోర్స్ ఇన్ బర్త్ కేర్ ప్రాక్టీషనర్

ప్రోగ్రామ్‌ల వివరాలు: ఒక్కో డిప్లొమా ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. గరిష్ఠంగా మూడేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. ఒక్కో ప్రోగ్రామ్‌లో రెండు టర్మ్‌లు ఉంటాయి. ప్రతి టర్మ్‌లో అయిదు నుంచి పది రోజుల పాటు కాంటాక్ట్ క్లాసెస్ నిర్వహిస్తారు. వీటికోసం అభ్యర్థులు యూనివర్సిటీ క్యాంపస్‌లకు హాజరు కావచ్చు. లేదంటే ఆన్‌లైన్ ద్వారా వినవచ్చు. ప్రాక్టికల్ సెషన్స్ కూడా ఉంటాయి. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. ప్రతి ప్రోగ్రామ్‌లో స్టడీ సెమినార్‌లు, కౌన్సెలింగ్ సెషన్స్, ఇంటర్నల్ అసెస్‌మెంట్‌లు, అసైన్‌మెంట్‌లు, ప్రాజెక్ట్ వర్క్‌లు, టర్మ్ ఎండ్ ఎగ్జామినేషన్‌లు ఉంటాయి.

- సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఇన్ బర్త్ కేర్ ప్రాక్టీషనర్ వ్యవధి ఆర్నెల్లు.

అర్హత: లైబ్రరీ ఆటోమేషన్ అండ్ నెట్‌వర్కింగ్ ప్రోగ్రామ్‌నకు డిగ్రీ(లైబ్రరీ సైన్స్) పూర్తిచేసి ఉండాలి. ఇన్ఫెక్షన్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి డిగ్రీ(హెల్త్/మెడికల్/నర్సింగ్/అలైడ్ హెల్త్ సైన్సెస్) ఉత్తీర్ణులై ఉండాలి. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు హెల్త్ కేర్ సెక్టార్‌లో కనీసం రెండేళ్ల అనుభవం ఉన్నవారు కూడా అర్హులే. టెలికాం టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌నకు ఇంజనీరింగ్ డిగ్రీ(ఈసీఈ/ ఈఈఈ/ ఈఐఈ/ ఈటీసీ/ఐసీటీ) ఉత్తీర్ణులు; ఎలక్ట్రానిక్స్ ఒక సబ్జెక్టుగా ఏదేని ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తిచేసినవారు; ఎమ్మెస్సీ (ఎలక్ట్రానిక్స్) ఉత్తీర్ణులు అర్హులు. బీఎస్సీ(ఎలక్ట్రానిక్స్/ఫిజిక్స్/మేథ్స్/కంప్యూటర్ సైన్స్) లేదా డిప్లొమా(ఈసీఈ/ ఈఈఈ) ఉత్తీర్ణతతోపాటు కనీసం రెండేళ్ల అనుభవం ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కమ్యూనిటీ ఐ హెల్త్ ప్రోగ్రామ్‌నకు డిగ్రీ(మెడిసిన్/ఆయుష్/ఆప్టోమెట్రీ/నర్సింగ్/అలైడ్ హెల్త్ సైన్సెస్/ న్యూట్రిషన్) పూర్తిచేసినవారు; బయాలజీ ప్రధాన సబ్జెక్టుగా బీఎస్సీ ఉత్తీర్ణతతోపాటు సంబంధిత విభాగంలో ఏడాది అనుభవం ఉన్నవారు అప్లయ్ చేసుకోవచ్చు. సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఇన్ బర్త్ కేర్ ప్రాక్టీషనర్‌కు ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. మిగిలిన ప్రోగ్రామ్‌లన్నింటికీ ఏదేని డిగ్రీ పాసైతే చాలు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.300
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **జతచేయాల్సిన పత్రాలు:** దరఖాస్తు ఫీజు రిసీట్, పదోతరగతి సర్టిఫికెట్, ఇంటర్ మార్కుల పత్రాలు, డిగ్రీ సర్టిఫికెట్, రెండు ఫొటోలు
- **చిరునామా:** అసిస్టెంట్ రిజిస్ట్రార్, సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ వర్చువల్ లెర్నింగ్-యూఓహెచ్, సిటీ క్యాంపస్, గోల్డెన్ థ్రెషోల్డ్ బిల్డింగ్, నాంపల్లి స్టేషన్ రోడ్, అబిడ్స్, హైదరాబాద్ - 500001
- **వెబ్‌సైట్:** cdvl.uohyd.ac.in

పీజీ డిప్లొమా ఇన్ బిజినెస్ అనలిటిక్స్



ఖరగ్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ కేజీపీ), కోల్‌కతాలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎంసీ), ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్(ఐఎస్ఐ) ఉమ్మడిగా నిర్వహిస్తున్న 'పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బిజినెస్ అనలిటిక్స్(పీజీడీబీఏ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువడింది. ఇది రెండేళ్ల ఫుల్ టైం రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ముందుగా కోల్‌కతా ఐఐఎంలో ఓరియంటేషన్ ప్రోగ్రామ్, ప్రీ సెమిస్టర్ మాడ్యూల్ నిర్వహిస్తారు. ఐఎస్ఐలో మొదటి సెమిస్టర్, ఐఐటీ కేజీపీలో రెండో సెమిస్టర్, ఐఐఎం కోల్‌కతాలో మూడో సెమిస్టర్ చదవాల్సి ఉంటుంది. నాలుగో సెమిస్టర్‌లో ఇండస్ట్రీ ఇంటర్న్‌షిప్ ఉంటుంది. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 65 సీట్లు ఉన్నాయి. అడ్మిషన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. మెరిట్ కం మీన్స్ స్కాలర్‌షిప్‌లను అనుమతిస్తారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్ సౌకర్యం ఉంది.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీఈ/బీటెక్/ఎమ్మెస్సీ/ఎంకాం ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంజనీరింగ్ డిప్లొమా తరవాత లేటరల్ ఎంట్రీ ద్వారా మూడేళ్ల ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తిచేసినవారు; నాలుగేళ్ల బీఎస్సీ ఉత్తీర్ణులు; సీఏ/సీఎస్/ఐసీడబ్ల్యూఏఐ పూర్తిచేసినవారు; ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు అప్లయ్ చేసుకోవచ్చు. ఏ కోర్సులోనైనా ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. ఏడాది వ్యవధిగల ఎంబీఏ డిగ్రీ చేసినవారు దరఖాస్తుకు అనర్హులు.

అడ్మిషన్ టెస్ట్ వివరాలు: దీనిని సీబీటీ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 50 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. వెర్బల్ ఎబిలిటీ నుంచి 15, లాజికల్ రీజనింగ్ నుంచి 5, డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ డేటా విజువలైజేషన్ నుంచి 5, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ నుంచి 25 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు నిర్దేశించారు. మొత్తం మార్కులు 150. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం మూడు గంటలు. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ఎంపిక: అడ్మిషన్ టెస్ట్‌లో సాధించిన స్కోర్ ఆధారంగా అభ్యర్థులను ఇంటర్వ్యూకి పిలుస్తారు. అడ్మిషన్ టెస్ట్ స్కోర్‌కు 45 శాతం, ఇంటర్వ్యూలో వచ్చిన మార్కులకు 40 శాతం, ఇంటర్/డిప్లొమా స్థాయి మార్కులకు 8 శాతం, అనుభవానికి 7 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.25 లక్షలు(ట్యూషన్ ఫీజు+ క్యాంపస్ లాడ్జింగ్+బుక్స్+స్టడీ మెటీరియల్+ఎగ్జామినేషన్ మెటీరియల్స్+ల్యాబొరేటరీ చార్జీలు)
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1250
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 6
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** ఫిబ్రవరి 20 నుంచి 22 వరకు
- **మాక్ టెస్ట్ నిర్వహణ:** మార్చి 9, 10
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విశాఖపట్నం
- **కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ తేదీ:** మార్చి 17
- **పర్సనల్ ఇంటర్వ్యూలు:** మే 11, 12
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** మే 24
- **పీజీడీబీఏ ప్రోగ్రామ్ ప్రారంభం:** జూలై 10 నుంచి
- **వెబ్‌సైట్:** isical.ac.in, iitkgp.ac.in, iimcal.ac.in

SCHOLARSHIP ALERT

TSDPL Silver Jubilee Scholarship Program

Description: Tata Steel Downstream Products Limited (TSDPL) invites applications from students who are domiciles of Jamshedpur, Kalinganagar, Pantnagar, Faridabad, Pune, Chennai, Tada, and Kolkata. The scholarship is meant to support meritorious students from low income families to continue their education.

Eligibility: Open for students who are domiciles of locations such as Jamshedpur, Kalinganagar, Pantnagar, Faridabad, Pune, Chennai, Tada, and Kolkata are eligible to apply. Applicants must be pursuing any year of ITI/diploma, graduation or postgraduation in fields such as Nursing, UG medical courses such as MBBS, BDS, PG medical courses (any specialization), paramedical courses, ITI/diploma subjects such as fitter, electrical, welders, safety, etc. from government-recognized institutes. Must have scored at least 60% marks in their Class 10 and 12 examination. Annual family income of the applicants must not be more than INR 5,00,000 from all sources.

Prizes & Rewards: INR 1,00,000 for 1 year

Last Date to Apply: 21-01-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/TSDPL2

PROMYS India
(Program in Mathematics for Young Scientists)

Description: PROMYS India (Program in Mathematics for Young Scientists), India 2024 is an opportunity offered in partnership with the Indian Institute of Science (IISc), Bengaluru, for students in Class 9 to 12. The selected students will be awarded a full scholarship covering tuition, housing, and meals for the six weeks of the programme.

Eligibility: Open for students aged 15 years or older by May 5th, 2024, currently enrolled in Class 9 to 12 (or equivalent) at any recognised secondary or higher secondary school across India. Applicants must have completed (or be in) Class 9 before the program begins.

Prizes & Rewards: A full scholarship covering tuition, housing, and meals for the six weeks of the programme

Last Date to Apply: 01-02-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/POR1

Piaggio "Shiksha Se Samriddhi" Program

Description: An initiative of Piaggio Vehicles Pvt. Ltd. to support the STEM education of female students from Pune, Satara, Baramati, Nashik, Aurangabad, and Ahmednagar.

Eligibility: Open to female students pursuing STEM courses.

- Students from Pune, Satara, Baramati, Nashik, Aurangabad, and Ahmednagar can apply for the scholarship.
- Final-year students enrolled in graduation, post-graduation and diploma will be eligible under this program.
- Students must have scored at least 50% marks in their previous class.
- The annual income of the family should be less than INR 4 lakh.

Note: Children of employees of Piaggio and Buddy4Study are not eligible to participate.

Prizes & Rewards: INR 15000 - INR 20,000 (based on actuals)

Last Date to Apply: 20-01-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/PSD5

buddy4study.com

ఏపీపీఎస్సీ నోటిఫికేషన్స్

రిమైండర్

గ్రూప్-1 సర్వీస్ పోస్టులు

ఖాళీలు 81

ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న గ్రూప్-1 పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) నోటిఫికేషన్ దరఖాస్తులు స్వీకరిస్తోంది.

శాఖల వారీ ఖాళీలు

1. డిప్యూటీ కలెక్టర్(ఏపీ సివిల్ సర్వీస్- ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్): **9 పోస్టులు**
2. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్(ఏపీ స్టేట్ ట్యాక్స్ సర్వీస్): **18 పోస్టులు**
3. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్(సివిల్)(ఏపీ పోలీస్ సర్వీస్) కేటగిరీ-2: **26 పోస్టులు**
4. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ జైల్స్(మెన్)(ఏపీ జైల్ సర్వీస్): **1 పోస్టు**
5. డివిజనల్/డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్(స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీస్: **1 పోస్టు**
6. రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్(ఏపీ ట్రాన్స్‌పోర్ట్ సర్వీస్): **6 పోస్టులు**
7. డిస్ట్రిక్ట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్(ఏపీ బీసీ వెల్ఫేర్ సర్వీస్): **1 పోస్టు**
8. డిస్ట్రిక్ట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్(ఏపీ సోషల్ వెల్ఫేర్ సర్వీస్): 3 పోస్టులు
9. డిప్యూటీ రిజిస్ట్రార్(ఏపీ కో ఆపరేటివ్ సర్వీస్): **5 పోస్టులు**
10. మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-2(ఏపీ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్): **1 పోస్టు**
11. అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్(ఏపీ ఎక్సైజ్ సర్వీస్): **1 పోస్టు**
12. అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్/అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్(ఏపీ ట్రెజరీ అకౌంట్స్ సర్వీస్): **3 పోస్టులు**
13. డిస్ట్రిక్ట్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్(ఏపీ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ సర్వీస్): **4 పోస్టులు**
14. అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్(ఏపీ స్టేట్ ఆడిట్ సర్వీస్): **2 పోస్టులు**

అర్హతలు: పూర్తి సమాచారం నోటిఫికేషన్‌లో చూడొచ్చు

ఎంపిక ప్రక్రియ: స్క్రీనింగ్ టెస్ట్, మెయిన్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

చివరి తేదీ: జనవరి 21

స్క్రీనింగ్ టెస్ట్(ప్రిలిమినరీ ఎగ్జామినేషన్): మార్చి 17

వెబ్‌సైట్: psc.ap.gov.in/

డిగ్రీ లెక్చరర్స్

ఖాళీలు 240

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ)...ఏపీ కాలేజియేట్ ఎడ్యుకేషన్ సర్వీస్‌కు సంబంధించి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

సబ్జెక్టుల వారీగా ఖాళీలు

1. బోటనీ: **19**
2. కెమిస్ట్రీ: **26**
3. కామర్స్: **35**
4. కంప్యూటర్ అప్లికేషన్స్: **26**
5. కంప్యూటర్ సైన్స్: **31**
6. ఎకనామిక్స్: **16**
7. హిస్టరీ: **19**
8. మేథమెటిక్స్: **17**
9. ఫిజిక్స్: **11**
10. పొలిటికల్ సైన్స్: **21**
11. జువాలజీ: **19**



అర్హత: సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ, నెట్/స్లెట్/సెట్ ఉత్తీర్ణులై ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్, కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్ట్ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు: జనవరి 24 నుంచి ఫిబ్రవరి 13 వరకు

రాత పరీక్ష తేదీ: 2024 ఏప్రిల్/మే

వెబ్‌సైట్: https://psc.ap.gov.in/

డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్లు

ఏపీ ఎడ్యుకేషనల్ సర్వీస్‌లో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఖాళీల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్‌ను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) విడుదల చేసింది.

ఖాళీలు 38

అర్హత: ఏదైనా పీజీ తో పాటు బీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి

పే స్కేల్: రూ.61,960 - రూ.1,51,370

వయసు: 2023 జూలై 1 నాటికి 18-42 ఏళ్ల మధ్య ఉండాలి

దరఖాస్తు రుసుము: జనరల్ అభ్యర్థులకు రూ.370, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, ఎక్స్ సర్వీస్‌మెన్ అభ్యర్థులకు రూ.250.

ఎంపిక విధానం: స్క్రీనింగ్, మెయిన్ పరీక్ష ఆధారంగా ఎంపిక చేస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 29

స్క్రీనింగ్ పరీక్ష తేదీ: ఏప్రిల్ 13

వెబ్‌సైట్: https://psc.ap.gov.in

లిటిల్స్



ప్రాంతం-లక్షద్వీప్

మీకు తెలుసా?

- ప్రధాని మోడీ పర్యటన వల్ల ఈ ఇరవై ఏళ్లలో గరిష్ఠంగా 'లక్షద్వీప్'కోసం వెతికారు. ఇదో కేంద్రపాలిత ప్రాంతం.
- సముద్రతీరాలు, కొండపగుళ్లు, మడుగులతో ఎంతో అందంగా ఉంటాయి ఈ ద్వీపాలు. మాల్దీవుల్లా భూమి కింద కనపడే స్వచ్ఛమైన నీళ్లు ఇక్కడ ఉంటాయి. ఇక్కడ జీవావరణం అద్భుతం.
- కేరళకు 300 కి.మీ. దూరంలో ఉండే ఈ దీవులు 27 దీవుల కలయిక.




ఇందులో 17 దీవుల్లో మనుషులు జీవించటానికి అనువుగా లేదు. కేవలం పది దీవుల్లోనే మాత్రమే ఉన్నారు.

- లక్షద్వీప్ అనేది ఓ జిల్లా. ఆ పేరుతోనే ఈ ప్రాంతం పిలవబడుతోంది. ఈ ద్వీప సముదాయాలకు ప్రధాన నగరం కవరట్టి.
- 2021 లెక్కల ప్రకారం ఈ దీవుల్లో జీవించే వారి సంఖ్య 60,965. ఉత్తర ద్వీపవాసుల్లోని ప్రజలంతా అరబిక్, తమిళ ప్రభావం ఉండే మలయాళం భాష మాట్లాడతారు. దక్షిణ ద్వీప వాసులు (మినికోయ్ దీవి) మాత్రం మహిల్ భాష మాట్లాడతారు. ఈ భాషను మాల్దీవుల్లో మాట్లాడతారు.
- లక్షద్వీప్‌లో ఒకే ఒక్క విమానాశ్రయం ఉంది. 1988లో అగత్తి అనే దీవుల్లో దీన్ని నిర్మించారు. కేరళలోని కొచ్చిన్ నుంచి లక్షద్వీప్‌కు విమానాలు వెళ్తాయి.
- మొత్తం కేవలం 32 చదరపు కిలోమీటర్లు మాత్రమే ఆవరించి ఉంది.
- పోర్చుగీసు నావికుడు వాస్కోడిగామా ఈ దీవుల మీదనే భారతదేశానికి వచ్చాడని చరిత్ర చెబుతోంది.


దారి కనుక్కోండి





6 తేడాలు గుర్తించండి

సరైన నీడ ఏది?





రంగులు వేయండి

డైలీ సుడోకు - 200

		1		2	4		7	
		6						5
		8		6				9
1	6						5	8
		5				3		
7	3						1	2
8				1		5		
5						2		
	1		7	3		9		

సుడోకు - 199 సమాధానం

5	9	3	6	1	4	7	2	8
8	4	2	5	7	3	1	6	9
6	7	1	9	2	8	3	5	4
7	5	9	4	6	2	8	1	3
2	1	6	8	3	9	5	4	7
4	3	8	1	5	7	6	9	2
1	2	4	7	8	6	9	3	5
9	8	5	3	4	1	2	7	6
3	6	7	2	9	5	4	8	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.